

'ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరి గొంతు వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉండాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50 సంపుటి: 16 సంచిక: 83

బుధవారం 14-6-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



భారత ప్రభుత్వం బెదిరించింది

ట్విట్టర్ ఖాతాలపై ఆంక్షలు విధించాలని ఆదేశించిందన్న డోర్సే. - 6లో




రేటు కార్డా? సేఫ్‌గార్డా?

యువత భవిష్యత్తు ఎవరిపై ఆధారపడాలి?: ప్రధాని మోదీ - 6లో

న్యూస్‌రీల్

వచ్చే నెలలో సీడబ్ల్యూసీకి కొత్త టీమ్!



సీడబ్ల్యూసీ పునర్వ్యవస్థీకరణపై కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే దృష్టి సారించారు. డిసెంబర్ లోనే తెలంగాణ సహా 5 రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతుండటం, మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలున్న దృష్ట్యా సీడబ్ల్యూసీ నియామకాలను పూర్తి చేసే కసరత్తులో పడ్డారు.

- వివరాలు 6లో

ఎంపీ అవినాశ్ జైలుపాలే మీ లక్ష్యమా?



వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్‌రెడ్డిని జైలుపాలు చేయడమే మీ లక్ష్యమా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం నర్రెడ్డి సునీతను ప్రశ్నించింది. ఈ వ్యవహారం చూస్తుంటే ఈగో క్లాషెస్‌లా ఉందని వ్యాఖ్యానించింది.

- వివరాలు 10లో

తెయూలో మరోసారి విజిలెన్స్ తనిఖీలు



తెలంగాణ యూనివర్సిటీలో వారం రోజుల్లోనే రెండోసారి విజిలెన్స్ విభాగం తనిఖీలు నిర్వహించింది. తెయూ వీసీ రవీందర్ గుప్తా నిధుల్లో అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 6న తొలిసారి ప్రభుత్వం చర్యలకు దిగింది.

- వివరాలు 5లో

మరో 17 బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలు

రాష్ట్రంలో కొత్తగా 17 బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలు మంజూరయ్యాయి. త్వరలోనే పరిపాలన అనుమతులు మంజూరవుతాయని, ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతుల ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి తెలిపారు.

- వివరాలు 5లో

హుషారు కోసం..

కార్యకర్తల్లో ఉత్సాహం పెంచేందుకు బీజేపీ యత్నాలు • రేపు అమిత్‌షా సభ.. లక్షకు మించి జనం వచ్చేలా ఏర్పాట్లు



రాజమౌళి నివాసానికి షా..!

గతంలో హైదరాబాద్‌కు వచ్చినపుడు ట్రిపుల్ ఆర్ చిత్ర బృందంతో ప్రత్యేకంగా సమావేశం కావాలని అమిత్‌షా భావించినా, షెడ్యూల్ మారి ఆలస్యంగా ఇక్కడకు చేరుకోవడంతో ఆ కార్యక్రమం రద్దయింది. కాగా గురువారం షా సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి నివాసానికి వెళ్లి ఆయనతో భేటీ కానున్నారు. సాయంత్రం ఖమ్మంలో సభకు ముందు భద్రాచలంలో శ్రీసీతారామచంద్ర స్వామిని ఆయన దర్శించుకోనున్నారు.

అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్ని పూరించేలా సభ ఉంటుందంటున్న నేతలు

ఎన్నికల కార్యాచరణతో పాటు పలు అంశాలపై హైదరాబాద్‌లో నేతలకు దిశానిర్దేశం

నోవాటెల్‌లో రాష్ట్ర కోర్ కమిటీతో భేటీ కానున్న బీజేపీ అగ్రనేత

రాష్ట్రంలో ఇటీవలి పరిణామాలు, పార్టీ కమిటీల్లో మార్పులపై స్పష్టత ఇచ్చే అవకాశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా కొద్ది నెలలు మాత్రమే సమయం ఉన్న నేపథ్యంలో.. ఈ నెల 15న ఖమ్మంలో నిర్వహించనున్న అమిత్ షా భారీ బహిరంగ సభ ద్వారా పార్టీ నేతలు, కార్యకర్తల్లో పూర్తిస్థాయిలో ఉత్సాహం నింపాలని బీజేపీ భావిస్తున్నట్టు సమాచారం. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నేపథ్యంలో శ్రేణుల్లో ఒకింత స్తబ్దత నెలకొందని, నేతలు కూడా డీలా పడ్డారనే అభిప్రాయం ఉంది. రాష్ట్రంలో ఇటీవలి పరిణామాలు, పార్టీ కమిటీల్లో మార్పులపై జరిగిన ప్రచారంతో కూడా కొంత గందరగోళం నెలకొందని భావిస్తున్న అమిత్‌షా, వీటన్నిటిపై కోర్ కమిటీలో స్పష్టత ఇవ్వడం ద్వారా క్యాడర్‌లో నూతనోత్తేజాన్ని నింపే అవకాశం ఉందని అంటున్నారు. సభ గురువారం సాయంత్రం అయినా, బుధవారం రాత్రికే ఆయన హైదరాబాద్ చేరుకోనున్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న 'మహా జనసంపర్క్ అభియాన్'లో భాగంగా వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారు. కాగా ఖమ్మం నగరంలో నిర్వహించనున్న బహిరంగ సభను బీజేపీ రాష్ట్ర నాయకత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. లక్షకు మించి ప్రజలు హాజరయ్యేలా సభను విజయవంతంగా నిర్వహించడం ద్వారా తమ బలాన్ని, బలగాన్ని చాటాలని భావిస్తోంది. ఖమ్మం నుంచే అమిత్‌షా అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్ని పూరించేలా సభ ఉంటుందని ముఖ్య నేతలు చెబుతున్నారు. ఈ మేరకు ముమ్మర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఎన్నికల కార్యాచరణపై దిశానిర్దేశం

ఖమ్మం సభతో పాటు పార్టీ నేతలతో ప్రత్యేకంగా భేటీ సందర్భంగా.. రాష్ట్ర పార్టీకి, ముఖ్య నాయకులు, కేడర్‌కు ఎన్నికల కార్యాచరణపై అమిత్‌షా దిశానిర్దేశం చేస్తారని పార్టీవర్గాల సమాచారం. గురువారం ఉదయం 10 గంటలకు

మిగతా 2వ పేజీలో ▶

రాష్ట్ర బీజేపీ సంస్థాగత విస్తరణ

- 125 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యుల నియామకం.. జాతీయ నాయకత్వ ఆమోదం తీసుకున్న సంజయ్ - 5లో

రెండో స్థానం కోసమే వారి పోటీ!

కాంగ్రెస్, బీజేపీల పరిస్థితి అంతే.. అధికారంలోకి వచ్చేది మేమే

కేసీఆర్ నాయకత్వంలో క్రమశిక్షణతో కలిసి కట్టుగా పనిచేస్తున్నాం



- బీజేపీ ఫెయిల్యూర్‌తోనే కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపు.. ఇక్కడ అలాంటి పరిస్థితి లేదు
- చిన్న పార్టీలతో మాకు మేలే తప్ప జరిగే నష్టమేమీ లేదు
- విపక్షాలు పథకం ప్రకారం పెయిడ్ బ్యాచ్‌తో ప్రభుత్వంపై బురద చల్లుతున్నాయని ఫైర్
- 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో మంత్రి హరీశ్‌రావు

- వివరాలు 2లో

నీట్‌లో మనోళ్లు టాప్ లేపారు

- ఆలిండియా టాపర్ ఏపీకి చెందిన బోరా వరుణ్ చక్రవర్తి
- తెలంగాణకు చెందిన రఘురామరెడ్డికి 15వ ర్యాంకు
- టాప్–50లో ఏడుగురు తెలుగువారే..
- నీట్‌లో దేశవ్యాప్తంగా 11.45 లక్షల మంది అర్హులు.. ఇందులో ఏపీవారు 42,836 మంది, తెలంగాణవారు 42,654 మంది
- గతేడాది కంటే పెరిగిన కటాఫ్ మార్కులు

14లో



వరుణ్ చక్రవర్తి (ఫస్ట్ ర్యాంకు)



రఘురాం రెడ్డి (15వ ర్యాంకు)

రైతుల చేతులకు సంకెళ్లు!

భువనగిరి పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు

రాజకీయ నేతలు, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధుల ఖండన



రీజనల్ రింగ్ రోడ్డు నిర్వాసిత రైతులను భువనగిరి కోర్టు నుంచి నల్లగొండ జైలుకు సంకెళ్లు వేసి తీసుకెళ్తున్న పోలీసులు

- ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని ఆందోళనలు చేపట్టిన రాయగిరి రైతులు
- మంత్రి జగదీశ్‌రెడ్డి కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో నలుగురి అరెస్టు
- మంగళవారం నల్లగొండ నుంచి కోర్టుకు తీసుకొచ్చే క్రమంలో బేడీలు
- కన్నీటి పర్యంతమైన రైతులు.. వెల్లువెత్తిన నిరసనలు
- సోమవారమే బెయిల్ మంజూరైనా ప్రక్రియలో ఆలస్యం.. మంగళవారం సాయంత్రం విడుదల

- వివరాలు 2లో

పరీక్ష మధ్యలో వెళ్లి ఉరేసుకుని..

- బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని దీపిక ఆత్మహత్య
- పరీక్ష హాల్ నుంచి బాత్రూంలోకి వెళ్లి బలవన్మరణం
- పరీక్షల ఒత్తిడే కారణమంటున్న వర్సిటీ వర్గాలు
- తమ కుమార్తెను సిబ్బంది వేధించారని దీపిక తండ్రి ఆరోపణ
- ట్రిపుల్‌ఐటీ వద్ద విద్యార్థులు, సంఘాలు, ప్రతిపక్షాల ఆందోళన
- ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్
- ఎవరూ లోనికి వెళ్లకుండా పోలీసు బందోబస్తు

3లో



హాస్టల్ పైనుంచి దూకేసిన విద్యార్థిని



- బాచుపల్లి ప్రైవేట్ జూనియర్ కాలేజీలో ఘటన
- ఆత్మహత్యా? ఇంకేమైనా జరిగిందా? అన్న కోణంలో దర్యాప్తు
- ఈ నెల 9నే కాలేజీలో చేరిన కామారెడ్డి బాలిక వంశిక - 3లో

ఫోన్‌లో చాటింగ్ చేసి.. ఉరేసుకుని..

- ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు స్నేహితులు
- లోన్‌యాప్‌ల వేధింపా? ప్రేమ విఫలమా?
- కారణాలపై ఆరా తీస్తున్న పోలీసులు

- వివరాలు 3లో

ఈసెట్‌లో 93 శాతం ఉత్తీర్ణత

పలు డిప్లొమా కోర్సులు పూర్తిచేసి, ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి గత నెలలో నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ ఈసెట్–2003) ఫలితాల ను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫె సర్ ఆర్.లింబాద్రి మంగళవారం విడు దల చేశారు. ఈ పరీక్షలో 20,988 మంది (93.07 శాతం) అర్హత సాధించారని వెల్లడించారు. - 5లో

ఇదండీ సంగతి



వీటి కన్నా మన వైరస్‌లే యమస్ట్రాంగ్.. వాటిని పెంచుకుందాం సార్!

క్లుప్తంగా...

వెనక్కి తీసుకోండి.. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు

ఓఆర్ఆర్ టెండర్ల విషయంలో హెచ్ఎండీఏ ఇచ్చిన లీగల్ నోటీసుకు రేవంత్ ఘాటు సమాధానం



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) టెండర్ల విషయంలో తనకు హెచ్ఎండీఏ ఇచ్చిన లీగల్ నోటీసులను వెంటనే వెనక్కు తీసుకోవాలని, లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలను ఎదుర్కోవాల్సి వస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు ఎ. రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. కీలక బాధ్యతల్లో ఉన్న ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ ప్రభుత్వ అధికారిగా నిబంధనలు పాటించకుండా పక్కా రాజకీయ నాయకుడిలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఓఆర్ఆర్ లీజు విషయంలో రేవంత్ చేసిన ఆరోపణలపై గత నెల 25న హెచ్ఎండీఏ పంపిన లీగల్ నోటీసుకు మంగళవారం ఆయన తన అడ్వొకేట్ ద్వారా సమాధానం పంపారు. ఓఆర్ఆర్ టెండర్ విషయంలో బేస్‌ప్రైస్ ఎంతో చెప్పాలని అర్వింద్‌కుమార్‌ను ఎన్నిసార్లు కోరినా స్పందన లేదని, ఓఆర్ఆర్ టెండర్ విలువను మదింపు చేసిన నివేదికను కూడా పబ్లిక్ డొమైన్‌లో పెట్టలేదని, ఇవన్నీ టెండర్ల ప్రక్రియలో ఏదో జరిగిందనే అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయని పేర్కొన్నారు. తనకు పంపిన లీగల్ నోటీసు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని, అధికార పార్టీ అక్రమాలను ప్రశ్నించినందుకే తనకు లీగల్ నోటీసు ఇచ్చారని, తనకు ఎన్ని నోటీసులిచ్చినా ప్రజల తరఫున పోరాడుతూనే ఉంటానని ఆ సమాధానంలో రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

నోటీసులు ఉపసంహరించుకోం..

ఎంపీ రేవంత్‌రెడ్డికి జారీ చేసిన లీగల్ నోటీసును ఉపసంహరించుకునే ప్రశ్నే లేదని హెచ్ఎండీఏ స్పష్టం చేసింది. రేవంత్‌రెడ్డి హెచ్ఎండీఏ అధికారుల పేర్లను ప్రస్తావిస్తూ సంస్థ పనితీరుపైన అపోహలను సృష్టించి, వారికి రాజకీయ ఉద్దేశ్యాలను ఆపాదించడం పట్ల హెచ్ఎండీఏ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది.

ప్రతి పేద కుటుంబానికి ఎకరా భూమి: ఆర్ఎస్పీ



అలంపూర్: బీఎస్పీ అధికారంలోకి వస్తే భూమి లేని ప్రతి పేద కుటుంబానికి ఎకరా భూమి ఇస్తామని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆయన చేపట్టిన బహుజన రాజ్యాధికార యాత్ర మంగళవారం జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా జల్లాపురంలో ఆర్ఎస్పీ మాట్లాడుతూ... రాష్ట్రం ఆవిర్భవించి పదేళ్లు కావస్తున్నా.. నడిగడ్డ ప్రజల కన్నీళ్లు తుడవడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారన్నారు. నాణ్యమైన విద్యను అడిగితే కేసీఆర్ బెల్టు షాపులకు అనుమతులు ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. గ్రామాల్లో పల్లె ప్రకృతి వనం, వైకుంఠధామాల పేరుతో పేదల అసైన్డ్, భూదాన భూములను లాక్కుంటున్నారని ఆరోపించారు. ఈ ప్రజా వ్యతిరేక ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. బీఎస్పీ అధికారంలోకి వస్తే ప్రతి మండలానికి ఒక అంతర్జాతీయ పాఠశాల, యువత కోసం రూ.10లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని చెప్పారు.

యథాతథ స్థితిలో బీఆర్ఎస్‌తో పొత్తు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా బీఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చామని, ఆ పొత్తు యథాతథ స్థితి లో ఉన్నట్లుగానే తాము భావిస్తున్నామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీజేపీని నిలువరించడంలో కాంగ్రెస్ కంటే సీఎం కేసీఆర్ బలంగా పోరాడతారనే నమ్మకంతోనే మునుగోడులో మద్దతిచ్చామన్నారు. ఎన్నికల్లో సీపీఐ, సీపీఎం రెండూ కలిసి ఉంటాయన్నారు. 'బీఆర్ఎస్‌తో తాము పొత్తు వద్దనుకోలేదని, అలాగే వారు కూడా అనలేదని' పేర్కొన్నారు. పొత్తుల విషయంపై త్వరలో నే స్పష్టత వస్తుందన్నారు. సీఎం అపాయింట్‌మెంట్ ఇచ్చినప్పటికీ తమ పార్టీ ముందుగా నిర్ణయించిన కార్యక్రమాల కారణంగా వెళ్లలేకపోయామని కూనంనేని వివరించారు.

వసూళ్ల కోసమే ధరణిపై రేవంత్ ఆరోపణలు

బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద

సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తన పదవి, వసూళ్ల కోసమే ధరణిపై లేని పోని ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఆరోపించారు. మంగళవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ ధరణిలో ఇప్పటివరకు 27 లక్షల లావాదేవీలు జరిగాయని తెలిపారు. ఎలాంటి అక్రమాలకు తావులేకుండా భూముల అమ్మకాలు, కొనుగోళ్లు జరుగుతున్నాయని, ఏవైనా తప్పులుంటే ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక ఆప్షన్ కూడా ఉందని వివరించారు. ధరణిపై ఆరోపణల గురించి కోర్టు మొట్టికాయలు వేసినా ఆయన తీరు మారలేదని ఎద్దేవాచేశారు. రేవంత్‌రెడ్డి చెప్పిన నెంబర్లలో 2006లోనే రిజిస్ట్రేషన్లు జరిగాయని, అప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉందని వెల్లడించారు. కాంగ్రెస్ హయాం నుంచి ఉన్న భూ సమస్యలెన్నో ధరణితో పరిష్కారం అయ్యాయని తెలిపారు. కర్ణాటక ఫలితాలు తెలంగాణలో రావడానికి ఇక్కడ సిద్దరామయ్య, డీకే శివకుమార్‌లు లేరని వివేకానంద వ్యాఖ్యానించారు.

రెండో స్థానం కోసమే వారి పోటీ!

కాంగ్రెస్, బీజేపీల పరిస్థితి అంతే.. అధికారంలోకి వచ్చేది మేమే: హరీశ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరోసారి అధికారంలోకి వచ్చే విషయంలో భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)కి పోటీలేదని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ రెండో స్థానం కోసం పోటీపడాల్సిందేనని.. ఇతర చిన్న పార్టీలతో బీఆర్ఎస్‌కు మేలు జరగడమే తప్ప నష్టం ఏమీ ఉండబోదని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ను ఎదుర్కొనే నాయకుడే లేడని.. 'కంటి ముందు అభ్యర్థి.. ఇంటి ముందు అభివృద్ధి' అనేదే వచ్చే ఎన్నికల్లో తమ నినాదమని వివరించారు. ప్రధాని మోదీ, అమిత్‌షా వంటి నేతలు గతంలోనూ ఎన్నో మార్లు రాష్ట్ర పర్యటనకు వచ్చారని.. తెలంగాణ మీద వారి ప్రభావం వీసమెత్తు కూడా ఉండదని వ్యాఖ్యానించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మంత్రి హరీశ్‌రావుతో 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ వివరాలు..

సాక్షి: ఉద్యమకారుడిగా, మంత్రిగా దశాబ్ది ఉత్సవాలపై మీ మనోగతం?

హరీశ్‌రావు: నీళ్లు, నిధులు, నియామకాలు అనే ట్యాగ్‌లైన్‌తో తెలంగాణ ఉద్యమం జరిగింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత ఈ మూడింటినీ సాధించాం. కరోనాతో రెండేళ్లు, కేంద్రం అనాలోచితంగా తీసుకున్న పెద్ద నోట్ల రద్దుతో ఏడాది పాటు, రాష్ట్రం ఏర్పడిన కొత్తలో అధికారుల బదిలీలు, ఆస్తుల పంపకాలతో ఆరు నెలలు సమయాన్ని కోల్పోయాం. అంటే తొమ్మిదేళ్లలో కేవలం ఐదున్నరేళ్లు మాత్రమే నికరంగా స్థిర పాలన అందించే అవకాశం ఏర్పడింది. ఇంత తక్కువ కాలంలోనే అద్భుత ప్రగతి సాధించాం. తెలంగాణ ప్రభుత్వ పథకాలు ఇతర రాష్ట్రాలకు దిశానిర్దేశం చేస్తున్నాయి. తెలంగాణ ఆచరిస్తుంటే.. దేశం అనుసరిస్తోంది. రైతుబంధు పథకాన్ని పశ్చిమ బెంగాల్ కృషక్ బంధు, ఒడిశా కాలియా పేరిట, ఏపీ వైఎస్సార్ రైతుభరోసా పేరిట అమలు చేస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణ మోడల్ అమలు కోసం మహారాష్ట్రలో ఏకంగా ఉద్యమమే జరుగుతోంది.

రాష్ట్రానికి మెడికల్ కాలేజీలు ఇచ్చామన్న బీజేపీ ప్రకటనలపై స్పందన

పరాయివాళ్లకు పుట్టిన పిల్లలను మా వాళ్లే అని ముద్దుపెట్టుకున్న రీతిలో మెడికల్ కాలేజీల విషయంలో కేంద్రం, బీజేపీ వ్యవహరిస్తున్నాయి. స్వయం ప్రతిపత్తి ఉన్న జాతీయ మెడికల్ కౌన్సిల్ ఇచ్చిన అనుమతులను కూడా వారి ఖాతాలో వేసుకుంటున్నారు. కాలేజీలు మంజూరు చేసి, భవనాలు, సిబ్బంది, మౌలిక వసతులు కల్పించింది మేం. కేంద్రం మంజూరు చేసిన 157 మెడికల్ కాలేజీల్లో తెలంగాణకు ఒక్కటీ ఇవ్వలేదు. అలా ఇచ్చి ఉంటే.. ఒక్కో కాలేజీకి రూ.100 కోట్ల చొప్పున తెలంగాణకు రూ.2,100 కోట్లు ఇవ్వాలి మరి.

విభజన హామీల అమలుపై మీ పోరాటం ఏమైంది?

నదీజలాల్లో వాటా సహా అన్ని విభజన హామీల అమలు కోసం మేం సుప్రీంకోర్టుదాకా వెళ్లాం. మా ఎంపీలు పార్లమెంటులో కొట్లాడుతూనే ఉన్నారు. తెలంగాణ న్యాయంగా రావాల్సిన హక్కుల విషయంలో కేంద్రం సవతి తల్లిలా వ్యవహరిస్తోంది. విభజన హామీల అమలును కేంద్రం పట్టించుకోకున్నా.. బీజేపీకి చెందిన కేంద్ర మంత్రి నోరెత్తడం లేదు.

రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు పోటీ ఎవరు?

రాష్ట్రంలో మరోమారు అధికారంలోకి వచ్చే విషయంలో మాకు పోటీ లేదు. కాంగ్రెస్, బీజేపీ రెండో స్థానం కోసం పోటీ పడాల్సిందే. మేం చేసిన అభివృద్ధిని చూసి ప్రజలు ఆదరిస్తారు. ప్రధాని మోదీ, అమిత్‌షా వంటి నేతలు గతంలోనూ ఎన్నోమార్లు రాష్ట్ర పర్యటనకు వచ్చారు. అవి తెలంగాణ మీద వీసమెత్తు ప్రభావం చూపలేదు. విభజన హామీలు నెరవేర్చకుండా, నిధులు ఇవ్వకుండా ఎన్నిమార్లు పర్యటించినా ప్రయోజనం ఉండదు. కాంగ్రెస్, బీజేపీ రెండంకెల సంఖ్యకు చేరుకుని ప్రతిపక్ష హోదా కోసం ప్రయత్నించాల్సిందే.

సామాజిక మాధ్యమాల్లో విమర్శలపై ఏమంటారు?

ప్రతిపక్షాలు ఒక పథకం ప్రకారం పెయిడ్ బ్యాచ్‌ను పెట్టి రాష్ట్ర ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లుతున్నాయి. కానీ మేం నిత్యం ప్రజల మధ్య ఉంటూ, అభివృద్ధి చేస్తూ, దానినే వివరించే ప్రయత్నం చేస్తున్నాం. ప్రతిపక్షాలకు బురద చల్లడం మినహా వేరే పనేదీ లేదు.

తెలంగాణలోనూ కర్ణాటక తరహా ఫలితాలు వస్తాయంటున్న కాంగ్రెస్ వ్యాఖ్యలపై స్పందన

కర్ణాటకలో బీజేపీ ఫెయిల్యూర్ వల్లే కాంగ్రెస్ గెలిచింది. కానీ తెలంగాణలో అలాంటి పరిస్థితి లేదు. కర్ణాటకలో లేని అభివృద్ధి, సంక్షేమం ఇక్కడ ప్రజల కళ్లముందు కనిపిస్తోంది. పారదర్శక విధానాలు, కేసీఆర్ వంటి సమర్థ నాయకుడు మాకు పెద్ద అండ. కర్ణాటక బీజేపీలో అంతర్గత కుమ్ములాటలు కూడా ఓటమికి కారణమయ్యాయి. కానీ ఇక్కడ మాకు ఒకే ఒక్క నాయకుడు కేసీఆర్. ఆయన నాయకత్వంలో మేమందరం క్రమశిక్షణతో పనిచేస్తున్నాం.

నీళ్లు, నిధులు, నియామకాల్లో మీ గణాంకాలు, ప్రకటనలను విపక్షాలు తప్పుపడుతున్నాయి కదా?

ఒకనాడు తెలంగాణ నేతలకు ఉద్యమం తప్ప పాలన చేతకాదని తూలనాడిన వారు ఇప్పుడు పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ, మెచ్చుకుంటున్నారు. అప్పట్లో తెలంగాణ నక్సలైట్ల రాజ్యం అవుతుందని, కర్ఫ్యూలు ఉంటాయని, కరెంటు ఉండదని ఎన్నో ప్రచారాలు చేశారు. కానీ కేసీఆర్ నాయకత్వంలో ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ వేగంగా అభివృద్ధి సాధించింది. ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా.. రాష్ట్రంలో పెరిగిన పంటల ఉత్పత్తి, తగ్గిన రైతు ఆత్మహత్యలే అభివృద్ధికి నిదర్శనం. విద్య, వైద్యం, విద్యుత్, రవాణా ఏ రంగాన్ని తీసుకున్నా తెలంగాణ జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉంది. పల్లె, పట్టణ ప్రగతిలో జాతీయ స్థాయిలో 38శాతం అవార్డులు తెలంగాణకు దక్కడమే అభివృద్ధికి నిదర్శనం. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశామనే విమర్శల్లో ఎంత మాత్రం నిజం లేదు. కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలు తెలంగాణ కంటే ఎక్కువ అప్పులు తీసుకున్నాయి.

రైతుల చేతులకు సంకెళ్లు!

- భువనగిరి పోలీసుల తీరుపై తీవ్ర విమర్శలు
- రాజకీయ నేతలు, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధుల ఖండన
- కన్నీటి పర్యంతమైన రైతులు.. వెల్లువెత్తిన నిరసనలు



నల్లగొండ జైలు నుంచి విడుదలైన రైతులు

సాక్షి, యాదాద్రి: రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) అలైన్‌మెంట్ మార్చాలని ఆందోళన చేసిన రైతులకు యాదాద్రి భువనగిరి పోలీసులు సంకెళ్లు వేయడం తీవ్ర వివాదానికి దారితీసింది. పోలీసుల తీరుపై రాజకీయ పార్టీల నేతలు, రైతు, ప్రజా సంఘాల ప్రతినిధులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నల్లగొండ జైల్లో ఉన్న రైతులను మంగళవారం భువనగిరి కోర్టులో హాజరుపర్చేందుకు తీసుకువచ్చే క్రమంలో వారి చేతులకు పోలీసులు సంకెళ్లు వేశారు. వాస్తవానికి ఆ రైతులకు సోమవారమే బెయిల్ వచ్చింది. అయినా పోలీసులు సంకెళ్లు వేసి తీసుకురావడంపై వారు కన్నీటిపర్యంతమయ్యారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి.

మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకోవడంతో..

భువనగిరి మండలం రాయిగిరి గ్రామ రైతులు ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ చాలా రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ రోడ్డుతో తాము భూములను పూర్తిగా కోల్పోతున్నామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో మే 30న భువనగిరి కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తుండగా.. అదే సమయంలో మంత్రి జగదీశ్‌రెడ్డి కలెక్టరేట్‌లో సమావేశం ముగించుకుని వెళ్తున్నారు. ధర్నా చేస్తున్న రైతులు మూకుమ్మడిగా వెళ్లి మంత్రి కాన్వాయ్‌ను అడ్డుకున్నారు. పోలీసులు వారిని చెదరగొట్టారు. అదే రోజు భువనగిరి రూరల్ పోలీసులు ఆరుగురు రైతులపై కేసు నమోదు చేశారు. రాత్రికల్లా గడ్డమీద మల్లేశ్ (ఏ1), పల్లెర్ల యాదగిరి (ఏ2), అవిశెట్టి నిఖిల్ (ఏ3), మల్లెపోయిన బాలు (ఏ4) అనే నలుగురు రైతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఏ5 తంగళ్లపల్లి రవికుమార్, ఏ6 గూడూరు నారాయణరెడ్డి (బీజేపీ నేత)లు పరారీలో ఉన్నట్టుగా చూపించారు. తొలుత భువనగిరి సబ్ జైలుకు తరలించిన నలుగురు రైతులను.. వారికి రాజకీయ నాయకుల పరామర్శలు అధికం కావడంతో శాంతిభద్రతల సమస్యను కారణంగా చూపుతూ 4న నల్లగొండ జైలుకు తరలించారు.

బెయిల్ ప్రక్రియ ఆలస్యం కావడంతో..

రిమాండ్‌లో ఉన్న నలుగురికి సోమవారం భువనగిరి జిల్లా కోర్టులో కండిషనల్ బెయిల్ మంజూరైంది. అయితే బెయిల్ ప్రక్రియలో జాప్యం కావడంతో వారి విడుదల ఆలస్యమైంది. అయితే సోమవారానికి 14 రోజుల రిమాండ్ పూర్తి కావడంతో మంగళవారం ఉదయమే భువనగిరి కోర్టులో హాజరుపర్చడానికి తీసుకువచ్చారు. కోర్టు ముందువరకు సంకెళ్లు వేసి రైతులను వాహనంలో తీసుకువచ్చిన పోలీసులు.. వారిని జడ్జి ముందు హాజరుపరిచి తిరిగి పోలీస్ వాహనంలో ఎక్కించుకునిపోయే క్రమంలోనూ బేడీలు వేయడంతో వివాదం తలెత్తింది. తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఇలావుండగా ఈ రైతులు మంగళవారం సాయంత్రం నల్లగొండ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు.

న్యాయం చేయమని ప్రాధేయపడితే సంకెళ్లు వేస్తారా?

నల్లగొండ క్రైం: న్యాయం చేయమని ప్రాధేయపడితే సంకెళ్లు వేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జైలు నుంచి విడుదల అయిన తర్వాత వారు మీడియాతో మాట్లాడారు. ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మార్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన ప్రజా ప్రతినిధులను అడిగినప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయారు. కాళేశ్వరం ప్రాజెక్టు కాల్వ కోసం, వరంగల్ రహదారి కోసం, హైటెన్షన్ విద్యుత్ లైన్ కోసం మూడు దశలుగా ఇప్పటికే తమ భూములు త్యాగం చేశామని, ఇప్పుడు మళ్లీ ఆర్ఆర్ఆర్‌కు భూములు ఇవ్వాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని చెప్పారు. ఉన్న కొద్దిపాటి భూమి కూడా పోతే తమ కుటుంబాల భవిష్యత్ అంధకారమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

కళ్లల్లో నీళ్లు తిరిగాయి: ఎంపీ కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: రైతులకు బేడీలు వేయడం చూసి తన కళ్లల్లో నీళ్లు తిరిగాయని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది రాష్ట్ర రైతాంగాన్ని అవమానపర్చడమేనని, అన్నం పెట్టే రైతులకు సంకెళ్లు వేయడం కేసీఆర్ నిరంకుశ పాలనకు నిదర్శనమని చెప్పారు.

దొంగలు, రౌడీల మాదిరిగా బేడీలు వేస్తారా?: బండి సంజయ్

రైతులకు బేడీలు వేసి కోర్టుకు తీసుకురావడంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారికి న్యాయం చేయాల్సింది పోయి దొంగలు, రౌడీల మాదిరిగా బేడీలు వేస్తారా? అని మండిపడ్డారు. కాగా రైతులేమైనా తీవ్రవాదులు, రేపిస్టులు, బందిపోట్లా? సంకెళ్లు వేసి తీసుకెళ్లడానికి.. అని బీజేపీ నేత గూడూరు నారాయణరెడ్డి కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలావుండగా రైతుల దగ్గర ఏకే 47 తుపాకులున్నాయని సంకెళ్లు వేశారా? అని కాంగ్రెస్ నేత వీహెచ్ ప్రశ్నించారు.

అప్పుడు వైఎస్సార్.. ఇప్పుడు కేసీఆర్

- సంక్షేమం అందించడంలో ఈ ఇద్దరూ భేష్: హోంమంత్రి మహమూద్ అలీ
- దానం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం



మహిళా సంక్షేమ దినోత్సవంలో మాట్లాడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ, ఎమ్మెల్యే దానం

హిమాయత్‌నగర్: పేద ప్రజలకు సంక్షేమం అందించడంలో ఆనాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, నేటి ముఖ్యమంత్రి కేసీఆర్ అని హోంమంత్రి మహమూద్ అలీ కొనియాడారు. వారిద్దరు ప్రవేశపెట్టిన ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రతి ఒక్కరూ అందుకున్నారని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే దానం నాగేందర్ అధ్యక్షతన మంగళవారం హైదర్‌గూడలో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మహమూద్ అలీ మాట్లాడుతూ.. దివంగత సీఎం వైఎస్సార్ మంచి లీడర్ అంటూ కొనియాడారు. అప్పట్లో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు ఆయన మహిళలకు పావలా వడ్డీ రుణాలను అందిస్తే..నేడు సీఎం కేసీఆర్ వడ్డీ లేని రుణాలను అందించి మహిళలకు మరింత దగ్గరయ్యారన్నారు. ఎమ్మెల్యే దానం మాట్లాడుతూ.. అందరి సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం కేసీఆర్‌ను మరొక్కసారి గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్క మహిళపై ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ హయాంలో మంత్రిగా ఉన్నప్పుడు కూడా తాను నియోజకవర్గంలో ఇంత అభివృద్ధి చేయలేకపోయానన్నారు. అనంతరం మహిళలందరికీ చీరలను పంపిణీ చేశారు.

నేటి నుంచి కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ


- రాష్ట్రవ్యాప్తంగా పథకం అమలుకు శ్రీకారం
- నిమ్స్‌లో ప్రారంభించనున్న కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: గర్భిణుల్లో పోషకాహార లోపం, రక్తహీనత లేకుండా కాపాడేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకాన్ని బుధవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయనున్నారు. హైదరాబాద్‌లోని నిమ్స్‌లో జరిగే కార్యక్రమంలో సీఎం కేసీఆర్ ఈ పథకానికి శ్రీకారం చుట్టనున్నారు. ఆరుగురు గర్భిణులకు ముఖ్యమంత్రి స్వయంగా కిట్లు అందిస్తారు. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పథకం మొదటి దశలో తొమ్మిది జిల్లాల్లో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జోగుళాంబ గద్వాల, కామారెడ్డి, కొమురంభీం, ఆసిఫాబాద్, ములుగు, నాగర్‌కర్నూల్, వికారాబాద్‌లో పంపిణీ ప్రారంభమైంది. మిగతా 24 జిల్లాల్లో పంపిణీ బుధవారం నుంచి ప్రారంభం కానుంది. ఈ కిట్లో మొత్తం 7 రకాల వస్తువులు ఉంటాయి. కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్, కిలో ఖర్జూర, మూడు ఐరన్ సిరప్ బాటిళ్లు, అర కిలో నెయ్యి, 200 గ్రాముల పల్లీపట్టి, ఒక కప్పు, ప్లాస్టిక్ బాస్కెట్ కలిపి కిట్ రూపంలో అందిస్తారు. రెండు, మూడో ఏఎన్సీ చెకప్‌ల సమయంలో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లను అందజేస్తారు. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 6.8 లక్షల మంది గర్భిణులకు ప్రయోజనం కలుగనుంది. ఇందుకోసం బడ్జెట్లో సీఎం కేసీఆర్ రూ. 250 కోట్లు కేటాయించారు.

కేసీఆర్‌ను బంగాళాఖాతంలో కలిపేయాలి

- అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది
- రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలు లేవు
- సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క



గుర్రంపోడు: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు లక్ష్యాలు నెరవేరకుండా అడ్డుగా ఉన్న కేసీఆర్‌ను, ఆయన ప్రభుత్వాన్ని బంగాళాఖాతంలో కలిపేస్తేనే ప్రజలకు మేలు జరుగుతుందని సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. 'నీళ్లు, నిధులు, నియామకాలు లేవు.. రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛ లేదు. ప్రశ్నిస్తే పోలీసు కేసులు, ప్రజలు భయంభయంగా బతకాల్సిన పరిస్థితులు ఉన్నాయి'అని ఆయన విమర్శించారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో మంగళవారం జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి మాట్లాడారు. ప్రజలు కనీసం ఆత్మగౌరవంతో జీవించలేని పరిస్థితులు గడీల, దొరల పాలనలో ఉన్నాయని, ఇవన్నీ తాను చేపట్టిన పాదయాత్రలో ప్రజలు చెబుతున్న గోస అని ఆయన చెప్పారు. ఇందుకోసమేనా ప్రజలు పోరాడి తెలంగాణ సాధించుకున్నది అని ప్రశ్నించారు. అధికారంలో ఉండి పదేళ్లు కావస్తున్నా ఎస్ఎల్‌బీసీ సొరంగమార్గం ఎందుకు పూర్తి చేయలేదని, గాడిదలు కాస్తున్నావా అని మంత్రి జగదీశ్‌రెడ్డిని ప్రశ్నిస్తే.. సాగర్ కాల్వలకు నీరిస్తున్నామని చెబుతున్నాడని అన్నారు. చంద్రబాబు హయాంలో ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌కు నిధులు ఇవ్వకపోతే రాజీనామా చేస్తానని బెదిరించానని చెబుతున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఇప్పుడు ఎందుకు రాజీనామా చేయరని ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయలేని మంత్రి జగదీశ్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డి జిల్లా ప్రజానీకానికి క్షమాపణలు చెప్పాలని, ముక్కు నేలకు రాసి జిల్లాను వదిలేసి పోవాలన్నారు.

ఏం సాధించారని దశాబ్ది ఉత్సవాలు

దశాబ్ది ఉత్సవాలు ఏం సాధించారని చేసుకోవాలని, ఏ ప్రాజెక్టు కట్టి నీళ్లిచ్చారని చేసుకోవాలని భట్టి ప్రశ్నించారు. నాగార్జునసాగర్ లాంటి పెద్ద ప్రాజెక్టులు కట్టించిన కాంగ్రెస్ నాయకులను గుర్తుచేసుకుని ప్రజలు పండుగ చేసుకోవాలని అన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్, రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు కుందూరు జయవీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బండి-కవిత ట్విట్టర్ వార్

మహిళా సంక్షేమంపై విమర్శలు, ప్రతి విమర్శలు



సాక్షి, హైదరాబాద్: మహిళా సంక్షేమంపై ట్విట్టర్ వేదికగా బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితల మధ్య ఓ మోస్తరు వార్ సాగింది. బీఆర్ఎస్ ప్రభుత్వం మహిళల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదంటూ సంజయ్ ట్విట్టర్‌లో దాడికి దిగారు. ఈ విమర్శలపై కవిత సైతం దీటుగా ఎదురుదాడి చేశారు.

'గవర్నర్‌కు దక్కదు గౌరవం. ఆడబిడ్డలకు లేదు అండ. గిరిజన మహిళలపై పోలీస్ గిరీ. బతుకమ్మను అవమానించినోడితో ఆలింగనం. ఇంటిబిడ్డకు మాత్రం బలగంతో అడ్డం నిలబడతవ్. అదిరింది కేసీఆర్ నీ మహిళా సంక్షేమం. సొంతపార్టీలో మహిళా నేతలపైనే అకృత్యాలకు పాల్పడే గులాబీ కీచకులపై మౌనం. ఆడబిడ్డను వేధించి, పీడించి ప్రాణాలు తీసుకునే స్థితికి చేరినా ఆ నేతలపై చర్యలు శూన్యం. పోడు భూముల కోసం పోరుబాట పట్టిన ఆడబిడ్డల చేతికి సంకెళ్లేసిన వైనం. పాయఖానాలు సైతం లేక ఆడకూతుళ్లు అవస్థలు పడుతుంటే స్పందించని నిర్లక్ష్యం. బాలింతలు మృతి చెందినా పరామర్శించని కర్కశత్వం. రాజకీయాల కోసం మహిళా బిల్లంటూ వీధులకెక్కి నాటకాలు చేస్తున్న తీరును తెలంగాణ మహిళాలోకం ఏనాడో పసిగట్టింది. గులాబీపార్టీ పనిపడుతుంది' అని బండి సంజయ్ ట్వీట్ చేశారు.

కాగా, ఈ ట్వీట్లపై కవిత తనదైన శైలిలో ఎదురుదాడి చేస్తూ, 'పార్లమెంట్ భవన ప్రారంభోత్సవంలో గిరిజన మహిళా రాష్ట్రపతికి దక్కదు గౌరవం. మహిళా రెజ్లర్లు ధర్నాలు చేస్తున్నా తప్పుచేసిన బీజేపీ ఎంపీపై చర్యలు ఉండవు. దేశరాజధాని నడివీధుల్లో ఆడబిడ్డలను రోడ్డు మీద ఈడ్చుకుంటూ తీసుకెళ్లిన వైనం. నినాదాలకే పరిమితమైన భేటీ బచావో...భేటీ పడావో...గ్యాస్ ధరలు పెంచి మహిళలకు కన్నీళ్లు తెప్పిస్తున్న దుస్థితి. మహిళల విద్య, వైద్యంపై పూర్తి నిర్లక్ష్యం. ఆడబిడ్డ తలుచుకుంది. ఇక మీ అడ్రస్ గల్లంతవుతుంది' అని విమర్శించారు.

పాలమూరు ప్రాజెక్టులపై చర్చకు సిద్ధమా?

తట్టెడు మట్టి మోయని కేసీఆర్ తానే జలకళ తెచ్చినట్టు గప్పాలు: షర్మిల ధ్వజం



సాక్షి, హైదరాబాద్: పాలమూరు ప్రాజెక్టుకు తట్టెడు మట్టి మోయని సీఎం కేసీఆర్.. తానే జలకళ తెచ్చినట్టు గప్పాలు కొట్టుకుంటున్నాడని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల విమర్శించారు. కష్టం ఒకరిదైతే.. ప్రచారం మరొకరిదనే సామెత ఆయనకు సరిపోతుందని ట్విట్టర్ వేదికగా వ్యాఖ్యానించారు. కేసీఆర్ చెబుతున్న 20 లక్షల ఎకరాలకు సాగునీళ్లు ఇచ్చే ప్రాజెక్టులకు నాడు మహానేత వైఎస్సార్ జలయజ్ఞం కింద వేసిన పునాదులేనని స్పష్టం చేశారు. పాలమూరు ప్రాజెక్టులపై సీఎం కేసీఆర్ బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. మూడేళ్లలో ప్రాజెక్ట్ పూర్తి అని చెప్పి కమీషన్లు దండుకున్నారని ఆరోపించారు. వైఎస్సార్ హయాంలో 20 లక్షల ఎకరాలకు సాగునీరు ఇస్తే.. పదేళ్ల పాలనలో ఒక్క ఎకరాకు అయినా అదనంగా సాగునీరు ఇచ్చారా అని ఆమె నిలదీశారు. 10 లక్షల ఎకరాలు అని చెప్పి 10 ఎకరాలు తడిపింది లేదని నిందించారు. మహానేత హయాంలో మైగ్రేషన్ వద్దని ఇరిగేషన్ చేస్తే.. నేడు ఇరిగేషన్ పక్కన ఎట్టి మైగ్రేషన్ వైపే మళ్లేలా కేసీఆర్ పాలన సాగుతోందని ధ్వజమెత్తారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు అయినా వలసలు ఆగలేదని వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై భట్టికి అవగాహన లేదు

టన్నెల్ ఆలస్యం అవుతుందనే పుట్టంగండికి శ్రీకారం: గుత్తా



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాజెక్టులపై సీఎల్పీ నేత భట్టి విక్రమార్కకు కనీస అవగాహన లేదని శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. తెలిసీ తెలియని వారు చెప్పిన సమాచారంతో బీఆర్ఎస్ ప్రభుత్వంపై, మంత్రి జగదీశ్‌రెడ్డిపై, తనపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. మంగళవారం నల్లగొండలోని క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 1984లో ఎన్టీ రామారావు ప్రభుత్వం శ్రీశైలం సొరంగం ప్రాజెక్టు, ఎలిమినేటి మాధవరెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుపై చర్చ వచ్చినప్పుడు టన్నెల్ ఆలస్యం అవుతుందని, ముందుగా పుట్టంగండి వద్ద ఎత్తిపోతలకు నిర్ణయం తీసుకున్నారన్నారు. 1989లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ పనులను పక్కన పెట్టిందని చెప్పారు. ఆ తరువాత చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ఓ కమిటీని నియమించి సొరంగం, ఎత్తిపోతలలో ఏది ముందు చేపట్టాలన్న దానిపై నివేదిక ఇవ్వాలని కోరిందని, సొరంగం తవ్వకం ఆలస్యం అవుతుందనే నిర్ణయానికి వచ్చి, ముందుగా ఎత్తిపోతల పథకం చేపట్టారన్నారు. 2005లో సొరంగం ప్రాజెక్టుకు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రభుత్వం శంకుస్థాపన చేసినా పర్యావరణ, అటవీ అనుమతులు, టీబీఎం సాంకేతిక సమస్యలు, వరద నీటి సమస్యలతోనే తవ్వకం పనులు ఆలస్యం అవుతున్నాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అధికారంలోకి వచ్చాక, ఔట్‌లెట్ పనుల్లో సాంకేతిక సమస్యలను పరిష్కరించుకుంటూ కొనసాగిస్తున్నారన్నారు. వాస్తవాలు ఇలా ఉంటే సొరంగం ప్రాజెక్టు పనులు బీఆర్ఎస్ వల్లే ఆలస్యం అవుతున్నాయని భట్టి అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.

హుషారు కోసం..

▶ మొదటి పేజీ తరువాయి

నోవాటెల్ హోటల్‌లో బీజేపీ రాష్ట్ర ముఖ్య నేతలతో కూడిన కోర్ కమిటీతో షా సమావేశమవుతారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, బీఆర్ఎస్ సర్కార్ వ్యవహరిస్తున్న తీరు, ఎన్నికల నేపథ్యంలో సీఎం కేసీఆర్ తీసుకుంటున్న నిర్ణయాలు, వివిధ వర్గాలను ఆకట్టుకునేందుకు అనుసరిస్తున్న పద్ధతులు, అదే సమయంలో బీజేపీ అంతర్గత వ్యవహారాలు, ముఖ్యనేతల మధ్య సమన్వయం, అధికార పార్టీని, ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌ను ఎదుర్కొనేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, ఇతర అంశాలపై చర్చించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. రాష్ట్ర పార్టీలో ఉత్సాహాన్ని నింపేలా పలు సూచనలు చేయడంతో పాటు కొన్ని స్పష్టమైన ఆదేశాలు కూడా ఇచ్చే అవకాశం ఉందని రాష్ట్ర నేతలు అంటున్నారు. ముఖ్యంగా ఇటీవల పార్టీలో అంతర్గతంగా చోటు చేసుకుంటున్న పరిణామాలు, నేతల మధ్య సమన్వయ లేమి, పార్టీ ప్రచార, మేనిఫెస్టో కమిటీల నియామకంపై ప్రచారం, నేతల మధ్య పని విభజన లాంటి అంశాలపై అమిత్‌షా స్పష్టతనివ్వనున్నట్టు తెలుస్తోంది. సంస్థాగతంగా, రాజకీయంగా ఎన్నికలకు ఎలా వెళ్లాలి? పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహ, ప్రతి వ్యూహాలపై దిశా నిర్దేశం చేస్తారని భావిస్తున్నారు. ఈ ఏడాది జరగనున్న తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జాతీయ, రాష్ట్ర స్థాయిలో బీజేపీకి కీలకమైనవి కావడంతో.. రాష్ట్ర ఎన్నికల సమరాంగణంలో దూకేందుకు వీలుగా కొన్ని మార్పులు చేయొచ్చని కూడా చెబుతున్నారు.

అమిత్ షా పర్యటన ఇలా..

- బుధవారం రాత్రి 10.30 నుంచి 12 గంటల మధ్య శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో దిగే అవకాశం
- వచ్చే సమయాన్ని బట్టి ముఖ్య నేతలతో సమాలోచనలకు అవకాశం
- గురువారం ఉదయం ముఖ్య నేతలు లేదా ప్రముఖులను కలుసుకునే అవకాశం
- 10-10.30 మధ్య నోవాటెల్‌లో రాష్ట్ర బీజేపీ కోర్ కమిటీతో భేటీ
- 11 గంటల ప్రాంతంలో ఒక పత్రికాధిపతితో ఆయన ఇంట్లో సమావేశం
- 11.45 నుంచి 12.15 వరకు రాజమౌళి నివాసంలో ఉంటారు
- మధ్యాహ్నం 12.45 నుంచి శంషాబాద్ జేడీ కన్వెన్షన్‌లో పూర్వ కార్యకర్తలు, సీనియర్ కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం.
- ఆ తర్వాత శంషాబాద్ నుంచి హెలికాప్టర్‌లో భద్రాచలానికి పయనం
- సాయంత్రం 4 నుంచి 4.40 వరకు భద్రాచలం రామాలయంలో పూజలు
- 5.40- 5.55 వరకు ఖమ్మంలో ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి
- సాయంత్రం 6-7 గంటల మధ్యలో బహిరంగ సభ
- 7.10 నుంచి 7.40 వరకు ఖమ్మం గెస్ట్‌హౌస్‌లో విశ్రాంతి
- రాత్రి 7.40కి ఖమ్మం నుంచి రోడ్డుమార్గాన విజయవాడకు..
- విజయవాడ నుంచి అర్ధరాత్రి 12 గంటలకు గుజరాత్‌కు..

అక్క ప్రేమించ లేదని తమ్ముడిని చంపేశాడు

కుమురంభీం జిల్లాలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..


ఉదయ్ కిరణ్ (ఫైల్)

తిర్యాణి: ఓ యువతి తనను ప్రేమించడం లేదని ఆమె తమ్ముడిని చంపేశాడో ప్రేమికుడు. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాణి మండలం ఉల్లిపిట్ట గ్రామంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఎస్సై రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దుర్గం అరుణబాయి–శంకర్ దంపతుల రెండో కుమార్తెను అదే గ్రామానికి చెందిన బోర్కెటు తరుణ్(23) ప్రేమించాలంటూ కొన్ని రోజులుగా వేధిస్తున్నాడు. తనకు అలాంటి ఉద్దేశం లేదని ఎన్నిసార్లు చెప్పినా వినకుండా వెంటపడే వాడు. ఈ క్రమంలో ఈనెల 1న ఇంట్లో ఎవరూ లేని సమయంలో యువతి ఇంటికి తరుణ్ తన మిత్రుడు నరుణ్‌తో కలిసి వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న యువతి తమ్ముడు ఉదయ్ కిరణ్(14)ను గొంతునులిమి చంపేశారు. ఉపాధి పనులకు వెళ్లి ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తమ కొడుకు చనిపోయి ఉన్నాడు. వడదెబ్బతో చనిపోయి ఉంటాడని భావించి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదు. కాగా, ఈనెల 12న ఓ వృద్ధురాలు ఎదుట నరుణ్, తరుణ్ గొడవ పడ్డారు. ఉదయ్‌కుమార్‌ను చంపితే ఇస్తానన్న డబ్బులు ఇవ్వడం లేదంటూ నరుణ్ మాట్లాడటంతో మృతుడి తల్లిదండ్రులకు తెలిసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఎస్సై రమేశ్ తన సిబ్బందితో బాలుడిని ఖననం చేసిన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికి తీయించారు. అక్కడే పోస్టుమార్టం నిర్వహించి తిరిగి ఖననం చేశారు.

ఇంటి పెద్ద మృతిని తట్టుకోలేక..

- ఉరి వేసుకుని తల్లి, ఇద్దరు కుమార్తెల ఆత్మహత్య
- హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి పరిధిలో ఘటన

కంటోన్మెంట్ (హైదరాబాద్): రెండు నెలల కింద ఇంటి పెద్ద అనారోగ్యంతో కన్నుమూశారు.. అది తట్టుకోలేని ఆయన భార్య, ఇద్దరు కుమార్తెలు ఆవేదనలో కూరుకుపోయారు.. ఆత్మహత్యాయత్నం చేశారు. హైదరాబాద్‌లోని బోయిన్‌పల్లి ప్రాంతంలో సోమవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. మంగళవారం ఉదయం ఈ విషయం బయటికిరావడంతో కలకలం చెలరేగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..

మానసికంగా కుంగిపోయి..

ఏపీలోని నాగాయలంక ప్రాంతానికి చెందిన సూర్యనారాయణ తన భార్య, ఇద్దరు కుమార్తెలతో కొన్నేళ్ల క్రితం హైదరాబాద్‌కు వలస వచ్చారు. ఓల్డ్ బోయిన్‌పల్లిలోని భవానీనగర్‌లో నివసిస్తున్నారు. గుండె, కిడ్నీ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న సూర్యనారాయణ ఐదేళ్లుగా ఇంటికే పరిమితమయ్యారు. చికిత్స పొందుతూ ఈ ఏడాది ఏప్రిల్ 4న మృతి చెందారు. ఆయన భార్య విజయలక్ష్మి (55), కుమార్తెలు చంద్రకళ (30), ఉమా సౌజన్య (29) ఇది తట్టుకోలేక మానసిక ఒత్తిడికి లోనయ్యారు. ఏప్రిల్‌లోనే ముగ్గురూ నిద్ర మాత్రలు, షుగర్ మందు అధిక డోసు తీసుకోవడం ద్వారా బలవన్మరణానికి యత్నించినా.. బంధువులు గుర్తించి ఆస్పత్రికి తరలించడంతో ప్రాణాలతో బయటపడ్డారు.

ముగ్గురూ మూడు చోట్ల ఉరేసుకుని..

ఈ కుటుంబానికి సమీప బంధువు సుధీర్ తరచూ వీరి ఇంటికి వస్తూ.. మానసిక ఆందోళన నుంచి బయటపడేసేందుకు ప్రయత్నిస్తూ వస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం సైతం వారి ఇంటికి వచ్చి మందులు ఇచ్చి వెళ్లిపోయాడు. తిరిగి మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో అక్కడికి వచ్చాడు. ఎన్నిసార్లు ఇంటి తలుపు తట్టినా తీయక పోవడం, ఫోన్లు స్విచాఫ్ రావడంతో పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు వెళ్లి తలుపులు తీసి చూడగా.. విజయలక్ష్మి వంట గదిలో, చంద్రకళ బెడ్‌రూమ్‌లో, ఉమా సౌజన్య హాల్‌లో ఉరి వేసుకుని కనిపించారు. చంద్రకళ ఎంబీఏ చదివి ఉద్యోగం చేస్తుండగా, ఉమా సౌజన్య దివ్యాంగురాలు.

ఫోన్‌లో చాటింగ్ చేసి.. ఉరేసుకుని..

ఆత్మహత్యకు పాల్పడిన ఇద్దరు స్నేహితులు


వినయ్


విశాల్

సదాశివపేట (సంగారెడ్డి): వారు ఇద్దరూ స్నేహితులు.. చాలాసేపు వాట్సాప్‌లో చాటింగ్ చేసుకున్నారు.. తర్వాత ఉన్నట్టుండి ఎవరి ఇంట్లో వారు ఉరి వేసుకున్నారు.. ఒకే ఊరిలో ఒకే ప్రాంతానికి చెందిన యువకులు ఇలా బలవన్మరణానికి పాల్పడటం కలకలం రేపుతోంది. దీనికి కారణం ఏమిటన్న చర్చ జరుగుతోంది.

ఒకే సమయంలో ఉరేసుకుని..

సదాశివపేట పట్టణంలోని పాతకేరికి చెందిన ఆరట్ల విశాల్ (23), యెన్నం వినయ్ (22) ఇద్దరూ స్నేహితులు. మంగళవారం మధ్యాహ్నం నుంచి వారు ఫోన్‌లో వాట్సాప్ చాటింగ్ చేసుకున్నారు. సుమారు 3 నుంచి 3.30 గంటల మధ్య ఎవరి ఇంట్లో వారు ఉరేసుకున్నారు. వీరిలో విశాల్ హైదరాబాద్ శివార్లలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సెకండియర్ చదువుతుండగా.. యెన్నం వినయ్ సదాశివపేటలోని ఓ వస్త్ర దుకాణంలో పనిచేస్తున్నాడు. వీరి ఆత్మహత్యలకు కారణాలేమిటనేది ఇంకా బయటికి రాలేదు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. మృతదేహాలను పోస్టుమార్టం కోసం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇద్దరు స్నేహితుల ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వీరి బలవన్మరణాల వెనుక ఫోన్ యాప్‌లలో లోన్ తీసుకొని వేధింపులకు గురవడం లేదా ప్రేమ విఫలమవడం వంటి కారణాలేమైనా ఉండి ఉంటాయని భావిస్తున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే పెద్దలకు చెప్పాలని, వేధింపులేమైనా ఎదురైతే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని..ఆత్మహత్యలకు పాల్పడవద్దని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

ఆత్మ'హత్య'ల కలకలం

చదువుల ఒత్తిడి.. పరీక్షల భయం.. తమవారిని కోల్పోయిన ఆవేదన.. స్నేహితుల మధ్య ఏదో అలజడి.. అంశం ఏదైతేనేం! ఆత్మహత్యలకు దారి తీశాయి. ఇలా ఒకరు ఇద్దరు కాదు.. ఒకే రోజు తెలంగాణలో ఏడుగురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. 16 ఏళ్ల విద్యార్థి నుంచి 55 ఏళ్ల మహిళదాకా ఈ జాబితాలో ఉన్నారు. ఇలా ఇటు ఆత్మహత్యలు కలకలం రేపితే.. అటు హత్యలు కలవరం రేపుతున్నాయి. తనను ప్రేమించలేదని ఓ అమ్మాయిపై ఆగ్రహం పెంచుకున్న యువకుడు ఆమె తమ్ముడిని గొంతు నులిమి చంపేస్తే.. మరోచోట ఓ వ్యక్తిని భార్య, కుమారుడే కలసి హత్య చేశారు.

హాస్టల్ పైనుంచి దూకేసిన విద్యార్థిని

బాచుపల్లి ప్రైవేట్ బాలికల జూనియర్ కళాశాలలో ఘటన

- ఆత్మహత్యా? ఇంకేమైనా జరిగిందా? అన్న కోణంలో దర్యాప్తు
- ఈ నెల 9నే కాలేజీలో చేరిన కామారెడ్డి బాలిక వంశిక
- తల్లిపై బెంగతో బలవన్మరణానికి పాల్పడిందనే అనుమానాలు


కాలేజీ ముందు ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థులు

నిజాంపేట్: హైదరాబాద్ బాచుపల్లిలోని నారాయణ బాలికల జూనియర్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని మంగళవారం అనుమానాస్పద స్థితిలో హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. బాచుపల్లి సీఐ సుమన్‌కుమార్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన రాగుల శాంతారావు కుమార్తె వంశిక (16) పదో తరగతి చదివింది. ఈ నెల 9వ తేదీ మధ్యాహ్నం నారాయణ కాలేజీలో ఎంపీసీ సూపర్ 60 బ్యాచ్‌లో చేరింది. చేరినప్పటి నుంచే తనను ఇంటికి పంపించాలని కాలేజీ నిర్వాహకులను కోరింది. హోమ్ సిక్ సెలవులు ఇవ్వగానే వెళ్లొచ్చని వారు సూచించడంతో తరగతులకు హాజరవుతోంది. మంగళవారం ఉదయం కూడా క్లాస్‌కు హాజరైంది. 7:45 గంటల ప్రాంతంలో తనకు వాంతులు వస్తున్నాయంటూ లెక్చరర్ దగ్గర పర్మిషన్ తీసుకుని రూంకు వెళ్లింది. అక్కడి నుంచి ఐదవ ఫ్లోర్ పైకి వెళ్లి వెనుక వైపు నుంచి కిందకు దూకింది. ఇది గమనించిన కొందరు కాలేజీ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు పోలీసులకు ఫోన్ చేసి చెప్పడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. క్లాస్ రూంలో విద్యార్థినులు, ప్రిన్సిపాల్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. వంశిక మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. వంశిక ఆత్మహత్య చేసుకుందా? చేసుకుంటే దానికి కారణాలేంటి ? ఇలా అన్ని కోణాల్లో నూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. విషయం తెలిసిన ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ విద్యార్థి సంఘాల ప్రతినిధులు కాలేజీ వద్దకు చేరుకుని విద్యార్థిని మృతికి గల కారణాలపై ఆరా తీశారు. వంశిక కుటుంబానికి తగిన న్యాయం చేయాలని ఏబీవీపీ నాయకుడు పవన్‌కుమార్ డిమాండ్ చేశారు.

తల్లిని వదిలి ఉండలేకేనా?: వంశిక తండ్రి శాంతారావు దుబాయ్‌లో ఉంటున్నారు. దీంతో వంశిక తన తల్లితో ఎక్కువ సన్నిహితంగా ఉండేది. కాలేజీలో చేరడం, అమ్మకు దూరంగా ఉండాల్సి రావడంతో బెంగకు గురై ఉండవచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు.

ఎంత పని జేస్తివి బిడ్డా !

మాచారెడ్డి: వంశిక ఆత్మహత్య గురించి తెలుసుకున్న ఆమె తల్లి సుమలత 'ఎంతపని జేస్తివి బిడ్డా..'అని గుండెలు బాదుకుంటూ విలపించింది. శాంతారావు, సుమలత దంపతులకు ఒక కూతురు (వంశిక), ఒక కొడుకు ఉన్నారు. పిల్లలకు మంచి చదువు చెప్పించాలని శాంతారావు దుబాయ్ వెళ్లాడు. ఈ క్రమంలోనే వంశికను ఇటీవల హైదరాబాద్‌లో కాలేజీలో చేర్పించారు. ఇంతలోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడింది. 15 ఏళ్లుగా కంటికి రెప్పలా చూసుకున్నానని, ఇలా తనకు దూరం అవుతుందని అనుకోలేదని ఆ తల్లి కన్నీరుమున్నీరవుతోంది. విషయం తెలిసిన శాంతారావు దుబాయ్ నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. కాగా, వంశిక చదువుతో పాటు ఆటపాటల్లోనూ చురుకైన విద్యార్థిని అని ఆమె చదువుకున్న ఆర్‌ఆర్ టాలెంట్ స్కూల్ ఉపాధ్యాయులు తెలిపారు.

పరీక్ష మధ్యలో వెళ్లి ఉరేసుకుని..

బాసర ట్రిపుల్‌ఐటీలో విద్యార్థిని దీపిక ఆత్మహత్య

- పరీక్ష హాల్ నుంచి బాత్రూంలోకి వెళ్లి బలవన్మరణం
- పరీక్షల ఒత్తిడే కారణమంటున్న వర్సిటీ వర్గాలు
- తమ కుమార్తెను వర్సిటీ సిబ్బంది వేధించారని దీపిక తండ్రి ఆరోపణ
- ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్/నిర్మల్ చైన్‌గేట్/భైంసా: పరీక్షలు రాస్తున్న విద్యార్థిని.. ఉన్నట్టుండి మధ్యలో లేచి వెళ్లిపోయింది.. అలాగని హాస్టల్ గదికి కాకుండా బాత్రూంలోకి వెళ్లింది.. అందులోని ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుంది. నిర్మల్ జిల్లా బాసరలోని ట్రిపుల్‌ఐటీలో మంగళవారం ఉదయం జరిగిన ఈ ఘటన కలకలం రేపుతోంది. పరీక్షల ఒత్తిడితోనే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్టు ట్రిపుల్ ఐటీ అధికారులు చెప్తున్నారు. అయితే పరీక్ష హాల్‌లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నారంటూ పలువురు విద్యార్థులను పరీక్ష సిబ్బంది, చీఫ్ వార్డెన్ మందలించారని.. దీనితో ఆందోళనకు లోనైన దీపిక బలవన్మరణానికి పాల్పడిందని విద్యార్థులు అంటున్నారు.

విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళన

సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం గొర్రెకల్ గ్రామానికి చెందిన వడ్ల దీపిక.. బాసర ఆర్జీయూకేటీలో పీయూసీ–1 చదువుతోంది. మంగళవారం ట్రిపుల్‌ఐటీలో జరిగిన పరీక్షకు హాజరైంది. అయితే మధ్యలోనే ఆమె పరీక్ష హాల్ నుంచి బయటికి వెళ్లిపోయింది. హాస్టల్ గదికి వెళ్లాల్సిన ఆమె.. పరీక్ష హాల్ సమీపంలో ఉన్న బాత్రూంలోకి వెళ్లింది. చాలాసేపైనా ఆమె బయటికి రాకపోవడం, పిలిచినా పలకకపోవడంతో అక్కడివారు వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు తలుపులు బద్దలుకొట్టి చూడగా.. దీపిక బాత్రూంలోని ఎగ్జాస్ట్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరివేసుకుని కనిపించింది. ఆమెను వెంటనే క్యాంపస్‌లోని హెల్త్ సెంటర్‌కు.. అక్కడి నుంచి భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో పోస్టుమార్టం నిమిత్తం విద్యార్థిని మృతదేహాన్ని నిర్మల్‌కు తరలించారు. దీనిపై ఆమె కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. అయితే విద్యార్థిని దీపిక ఆత్మహత్య విషయం చాలాసేపు బయటికి రాకుండా అధికారులు కట్టుదిట్టం చేశారు. ట్రిపుల్ ఐటీ ప్రధాన ద్వారం వద్ద పోలీసులను మోహరించారు. లోనికి ఎవరినీ అనుమతించలేదు. విషయం తెలుసుకున్న విద్యార్థి, ప్రజా సంఘాలు, ప్రతిపక్షాల నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు గేటు వద్ద ఆందోళనకు దిగారు. దీపిక ఆత్మహత్యపై అనుమానాలు ఉన్నాయని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

పరీక్షల ఒత్తిడి అంటున్న అధికారులు

పరీక్షల ఒత్తిడి కారణంగానే దీపిక ఆత్మహత్యకు పాల్పడినట్టు భావిస్తున్నామని ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ సతీశ్‌కుమార్ చెప్పారు. ట్రిపుల్‌ఐటీలో ముగ్గురు సభ్యులతో కౌన్సెలింగ్ డిపార్ట్‌మెంట్ ఉందని, కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నా మని తెలిపారు. అయినా ఈ ఘటన చోటుచేసుకోవడం బాధాకరమన్నారు. దీపిక ఆత్మహత్యకు సంబంధించి పూర్తి వివరాలు తేల్చేందుకు నలుగురు సభ్యులతో నిజ నిర్ధారణ కమిటీని ఏర్పాటు చేశామని వివరించారు.

నా బిడ్డను వేధించారు

ట్రిపుల్‌ఐటీ సిబ్బంది, అధికారులు తన బిడ్డను వేధించారని, లేనిపోని విషయాలు చెప్పి భయభ్రాంతులకు గురిచేశారని దీపిక తండ్రి వడ్ల వీరన్న ఆరోపించారు. ట్రిపుల్ ఐటీ అధికారులు కొన్ని రోజుల క్రితం తనను పిలిపించి ఆమె వాట్సాప్‌లో చాటింగ్‌లు చేస్తోందని ఆరోపించారని వివరించారు. తన బిడ్డను అడిగితే.. ట్రిపుల్‌ఐటీలో కొందరు తనపై కక్షగట్టి ఇలా చేశారంటూ కన్నీళ్లు పెట్టుకుందని తెలిపారు. ఈ విషయాన్ని వార్డెన్‌కు, ఉన్నతాధికారులకు వివరించేందుకు తాను ప్రయత్నించినా.. పట్టించుకోలేదన్నారు. తన బిడ్డకు కౌన్సెలింగ్ చేసి దారిలో పెడతానని రాసివ్వాలని ఒత్తిడి చేశారని.. లేకుంటే సీటు రద్దు చేసి ఇంటికి పంపుతామని బెదిరించారని ఆరోపించారు. ఆ తర్వాత కూడా పలుమార్లు దీపిక తమకు ఫోన్ చేసి సిబ్బంది అనేక రకాలుగా వేధిస్తున్నారంటూ ఆందోళన వ్యక్తం చేసిందని తెలిపారు.

పత్తాలేని ట్రిపుల్‌ఐటీ అధికారులు

దీపిక చనిపోయి కొన్ని గంటలు గడిచినా, రెండు ఆస్పత్రులకు మృతదేహాన్ని తరలించినా.. ట్రిపుల్‌ఐటీ అధికారులు, అధ్యాపకులెవరూ రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాసరకు సమీపంలోనే మెరుగైన వైద్యసేవలు అందే నిజామాబాద్ పట్టణం ఉండగా.. ఆమెను భైంసాకు ఎందుకు తరలించారని దీపిక బంధువులు, బీజేపీ నేతలు మండిపడ్డారు. ఆమె మృతికి వర్సిటీ అధికారులే బాధ్యత వహించాలన్నారు.

సమగ్ర విచారణ జరపాల్సిందే..

ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని దీపిక ఆత్మహత్యపై అనేక అనుమానాలు ఉన్నాయని, దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఏబీవీపీ వర్కింగ్ కమిటీ సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. ట్రిపుల్‌ఐటీలో విద్యార్థులపై వేధింపులను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. కాగా దీపిక ఆత్మహత్యకు ట్రిపుల్ ఐటీ అధికారులు కారణం చెప్పేంత వరకు ఆమె మృతదేహానికి పోస్టుమార్టం చేసేందుకు అంగీకరించేది లేదని తండ్రి వీరన్న తేల్చి చెప్పారు.

ఏడాదిలో ముగ్గురు

ఆర్జీయూకేటీలో సమస్యలను పరిష్కరించాలంటూ ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఆందోళనకు దిగి మంగళవారం నేటికి ఏడాది అవుతోంది. రెగ్యులర్ వీసీని నియమించాలని, అధ్యాపకుల సంఖ్యను పెంచాలని, ఇతర వర్సిటీలతో అనుసంధానం చేయాలని, కనీస సౌకర్యాలను మెరుగుపర్చాలని డిమాండ్ చేస్తూ ఎండనకా, వాననకా వారం పాటు ఉద్యమించారు. విద్యామంత్రి సబితా ఇంద్రారెడ్డి వర్సిటీకి వచ్చి హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. నాటి నుంచి ఇప్పటివరకు ట్రిపుల్‌ఐటీలో ముగ్గురు విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడటం కలకలం రేపుతోంది.

ఘటనపై కమిటీ వేశాం

ఎంతో భవిష్యత్తు ఉన్న విద్యార్థిని దీపిక ఆత్మహత్య చేసుకోవడం దురదృష్టకరం. ఈ ఘటన షాక్‌కు గురిచేసింది. ఇంజనీరింగ్ ఫలితాల విడుదల నేపథ్యంలోనే నేను హైదరాబాద్‌లో ఉన్నాను. అసలేం జరిగిందో పూర్తి వివరాలు తెలుసుకునేందుకు నలుగురు సభ్యులతో అంతర్గత నిజ నిర్ధారణ కమిటీ వేశాం. త్వరలోనే ఘటనకు కారణాలు తెలుస్తాయి. విద్యార్థులు ఒత్తిడికి గురి కావద్దు. – వెంకటరమణ, ఇన్‌చార్జి వీసీ, ఆర్జీయూకేటీ


అస్వస్థతకు గురైన దీపిక తండ్రి వీరన్న

బిడ్డ మార్చురీలో.. తండ్రి ఐసీయూలో..

దీపిక మృతిపై ట్రిపుల్‌ఐటీ అధికారులు ఆలస్యంగా సమాచారం ఇవ్వడంతో ఆమె తండ్రి వీరన్న.. మంగళవారం సాయంత్రం పొద్దుపోయాక నిర్మల్ జిల్లా ఆస్పత్రి వద్దకు చేరుకున్నారు. అప్పటికే పలువురు బంధువులు, బీజేపీ నేతలు కూడా ఆస్పత్రి వద్దకు వచ్చారు. పోలీసులు తండ్రిని తప్ప మరెవరినీ ఆస్పత్రిలోకి వెళ్లనివ్వలేదు. దీనితో బంధువులు, బీజేపీ నేతలకు పోలీసులకు వాగ్వాదం జరిగింది. ఆస్పత్రిలో బిడ్డ మృతదేహాన్ని ఉంచిన మార్చురీవైపు వెళ్తుండగానే వీరన్న ఛాతీలో నొప్పితో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీనితో వెంటనే ఆయనను ఆస్పత్రిలోని ఐసీయూకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వైపు మార్చురీలో బిడ్డ మృతదేహం ఉండగా.. అదే ఆస్పత్రి ఐసీయూలో తండ్రికి చికిత్స జరుగుతుండటం అందరినీ కన్నీరు పెట్టించింది.

భార్య సూత్రధారి.. కొడుకు పాత్రధారి

- వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భార్య..
- డ్రగ్స్‌కి బానిసైన తనను వేధిస్తున్నాడని కొడుకు..
- పక్కా ప్లాన్‌తోనే రఫీ హత్య
- విచారణలో విస్తుపోయే నిజాలు


నిందితుల వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

బూర్గంపాడు: వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడని భార్య, మాదక ద్రవ్యాలకు బానిసైన తనను నిత్యం వేధిస్తున్నాడని కొడుకు.. ఇద్దరూ పక్కాగా ప్లాన్ వేసి దారుణానికి పాల్పడ్డారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలం సారపాకలో నాలుగు రోజుల క్రితం సయ్యద్ రఫీ(38) హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు చేపట్టిన విచారణలో విస్తుపోయే నిజాలు వెలుగుచూశాయి. పాల్వంచ సీఐ నాగరాజు, బూర్గంపాడు ఎస్సై సంతోష్ తెలిపిన వివరాల ప్రకారం.. సారపాక మసీద్‌రోడ్‌లో నివాసముంటున్న సయ్యద్ రఫీ అలియాస్ జాఫర్ ఈనెల 10న తెల్లవారుజామున ఇంట్లోనే హత్యకు గురయ్యాడు. ఈ ఘటనలో ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు క్లూస్ టీమ్, పోలీసు జాగిలాల సాయంతో చేపట్టిన విచారణలో హత్యకు సంబంధించి కొన్ని క్లూస్ కనుగొన్నారు. రఫీ హత్యకు అతని కుమారుడు(15) కారణమని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అయితే మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు రఫీ భార్య జీనత్ పర్వీన్ పై కూడా పోలీసులు నిఘా పెట్టారు. విచారణలో రఫీ కుమారుడు వెల్లడించిన వివరాలతో జీనత్‌ను కూడా విచారణ చేశారు. తన వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉండటంతో అతనిని వదిలించుకునేందుకు పథకం ప్రకారమే హత్యకు పాల్పడినట్లు ఆమె అంగీకరించింది. మాదక ద్రవ్యాలకు అలవాటైన కొడుకును ఈ హత్యకు ఉసిగొల్పింది.

కాళ్లను తల్లి పట్టుకోగా.. కొడుకు తండ్రి తలపై సుత్తితో బలంగా కొట్టి..

రఫీ భార్య జీనత్ పర్వీన్‌కు బూర్గంపాడు మండలం నకిరిపేటకు చెందిన కొర్ర జంపన్నతో ఆరు నెలల క్రితం పరిచయమైంది. ఈ క్రమంలో వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. ఈ విషయాన్ని రఫీ గమనించి భార్యపై అనుమానం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలోనే ఇంట్లో గొడవలు ప్రారంభమయ్యాయి. రఫీని వదిలించుకుంటే తమకు అడ్డుండదని జంపన్న జీనత్‌కు సలహా ఇచ్చాడు. ఇందుకోసం మూడునెలల క్రితమే పథకం వేశారు. జంపన్న తీసుకొచ్చిన మత్తు మాత్రలను జ్యూస్‌లో కలిపి ఇచ్చారు. అయితే రఫీకి మత్తు ఎక్కకపోవడంతో ఆ ప్రయత్నం విఫలమైంది. కాగా, ఈ నెల 9న డ్యూటీ ముగించుకుని ఇంటికి వచ్చిన రఫీ.. గంజాయి మత్తులో ఉన్న కొడుకును తిట్టాడు. అందుకు అడ్డుపడిన భార్యతో పాటు కుమారుడిని కూడా రెండు దెబ్బలు కొట్టాడు. దీంతో ఆ రాత్రే రఫీని చంపాలని భార్య, కొడుకు పథకం వేశారు. గాఢ నిద్రలో ఉన్న రఫీ కాళ్లను జీనత్ గట్టిగా పట్టుకోగా, కొడుకు పెద్దసుత్తితో కొట్టి తలమొత్తం ఛిద్రం చేశాడు. దీంతో రఫీ అక్కడికక్కడే మృతిచెందాడు. హత్యకు ఉపయోగించిన సుత్తి, రక్తపు మరకలున్న బట్టలను నిందితుడు మోతె గ్రామ సమీపంలో దాచిపెట్టాడు. పోలీసు జాగిలాలు సుత్తిని, దుస్తులను గుర్తించాయి. నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు పంపుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

'భాటియా సార్' ఇక లేరు!



కన్నుమూసిన గ్రేహౌండ్స్ పితామహుడు భాటి

- 2011లో సేవలకు గుర్తుగా పద్మశ్రీ అవార్డు

సాక్షి, హైదరాబాద్: గ్రేహౌండ్స్ పితామహుడు, 'భాటియా సార్'గా సుపరిచితుడైన నారాయణ్ సింగ్ భాటి (93) మంగళవారం తెల్లవారుజామున 4.15 గంటలకు ప్రేమావతిపేటలోని గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రంలోని తన నివాసంలో కన్నుమూశారు. బుధవారం ఉదయం 9.30 గంటల నుంచి అక్కడి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్‌లో అధికారుల సందర్శనార్థం ఉంచనున్నారు. ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ మహా ప్రస్థానంలో అంత్యక్రియలకు పోలీసు విభాగం ఏర్పాట్లు చేస్తోంది. భాటి 33 ఏళ్లుగా గ్రేహౌండ్స్‌కు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. ఆయన సేవలకుగానూ 2011 జనవరిలో కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ అవార్డు అందించింది. జోధ్‌పూర్‌కు చెందిన భాటి ఎల్ఎల్‌బీ పూర్తి చేసి 1953లో పారా మిలటరీ బలగాల్లో ప్రవేశించారు. స్పెషల్ సర్వీస్ బ్యూరో డీఐజీగా 1989లో పదవీ విరమణ చేశారు.

ఎల్‌టీటీఈ యాక్టివిస్టులకు శిక్షకునిగా..

గతంలో భారత బలగాలు శ్రీలంకకు చెందిన ఎల్‌టీటీఈ యాక్టివిస్టులకు తమిళనాడులో రహస్య శిక్షణ ఇచ్చాయి. వారికి జంగిల్, గెరిల్లా వార్ ఫేర్‌లో భాటినే శిక్షణ ఇచ్చారన్నది అతి కొద్ది మందికి మాత్రమే తెలిసిన రహస్యం. భాటి 1989 మేలో పదవీ విరమణ చేయగా జూన్‌లో గ్రేహౌండ్స్ సృష్టికర్త, ఐపీఎస్ అధికారి కేఎస్ వ్యాస్ కోరిన మీదట కౌంటర్ ఇన్‌సర్జెన్సీ కన్సల్టెంట్‌గా వచ్చారు. ఆ ఏడాది అక్టోబర్ 2న గ్రేహౌండ్స్‌లో అడుగుపెట్టి మరుసటి రోజు నుంచే భాటి గ్రేహౌండ్స్ బలగాలకు శిక్షణ ఇవ్వడం ప్రారంభించారు. భాటి గ్రేహౌండ్స్‌కు శిక్షణ ఇవ్వడం ప్రారంభించిన ఆరేళ్లకు పూర్తిస్థాయి ఫలితాలు రావడం మొదలైంది. పదేళ్లకు (1999) ఆ విభాగం దేశంలోనే ఎదురు లేనిదిగా రూపొందింది. గ్రేహౌండ్స్ విభాగం చేపట్టే కూంబింగ్ ఆపరేషన్లకు ఉపకరించే మ్యాప్ రీడింగ్‌ను భాటినే ప్రవేశపెట్టారు.

'సాక్షి'కి మాత్రమే ప్రత్యేక ఇంటర్వ్యూ: భాటి ఏనాడూ మీడియా ముందుకు రాలేదు. 2011 జనవరి 25న ఈయనకు కేంద్రం పద్మశ్రీ అవార్డు ప్రకటించింది. ఆ సందర్భంలో 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు.

గొప్ప అధికారిని కోల్పోయాం: డీజీపీ


పద్మశ్రీ ఎస్ఎస్ భాటి మృతి తీరని లోటు అని, గొప్ప అధికారిని కోల్పోయామని డీజీపీ అంజనీకుమార్ సంతాపం ప్రకటించారు.


విపత్తునుంచి రక్షణకు మూడు పథకాలు

- హైదరాబాద్‌సహా 7 మెట్రో నగరాలకు రూ.2,500 కోట్లు
- అగ్నిమాపక సేవల ఆధునికీకరణకు రూ.5 వేల కోట్లు
- విపత్తు నిర్వహణ మంత్రుల సమావేశంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలో విపత్తు నిర్వహణకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం మూడు ప్రధాన పథకాలను ప్రకటించింది. అత్యధిక జనాభా ఉన్న హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, ముంబై, అహ్మదాబాద్, పుణే, కోల్‌కతా నగరాల్లో పట్టణ వరదల ప్రమాదాన్ని తగ్గించే ప్రాజెక్టుకు రూ.2,500 కోట్లు కేటాయించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అగ్నిమాపక సేవలను విస్తరించడంతో పాటు ఆధునీకరించే ప్రాజెక్టుకు రూ.5 వేల కోట్లు, 17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో కొండచరియల నివారణ కోసం జాతీయ ల్యాండ్‌స్లైడ్ రిస్క్ మిటిగేషన్ ప్రాజెక్టుకు రూ.825 కోట్లు కేటాయిస్తున్నట్లు కేంద్ర హోం, సహకార శాఖల మంత్రి అమిత్ షా తెలిపారు. విపత్తు వల్ల ఏ ఒక్కరి ప్రాణం పోవద్దన్న ప్రధాని మోదీ ఐదేళ్ల లక్ష్యంకోసం అన్ని రాష్ట్రాలు కృషి చేశాయని మంగళవారం ఢిల్లీలోని విజ్ఞాన్‌భవన్‌లో జరిగిన రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల విపత్తు నిర్వహణ మంత్రుల సమావేశంలో అమిత్ షా ప్రశంసించారు. కాగా గత తొమ్మిదేళ్లలో విపత్తు నిర్వహణలో కేంద్రం, రాష్ట్రాలు ఎన్నో మైలురాళ్లు సాధించినప్పటికీ ఎదురవుతున్న కొత్త విపత్తులను ఎదుర్కొనేందుకు రాష్ట్రాలు సిద్ధంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక వరదలకు గురయ్యే 13 ప్రధాన నదుల ఒడ్డున మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పు మంత్రిత్వ శాఖ సమర్థంగా వరదలను నియంత్రించిందని అమిత్ షా తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి


లక్ష్మణ్


రమేష్

ధర్పల్లి: విద్యుత్ షాక్‌తో ఇద్దరు మృతి చెందిన ఘటన నిజామాబాద్ జిల్లా ధర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రేకులపల్లిలో జరిగింది. ధర్పల్లి సీఐ సైదా, ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన గజలక్ష్మి లక్ష్మణ్ (55) తన పొలంలో బోరు మోటారు స్టార్టర్ వద్ద మరమ్మతులు చేయించేందుకు గ్రామ పంచాయతీలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేసే ధరావత్ రమేశ్ (35)ను మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో తీసుకొని వెళ్లాడు. మరమ్మతుల కోసం సబ్ స్టేషన్ నుండి ఎల్‌సీ తీసుకున్నారు. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్టార్టర్ డబ్బాలు మరమ్మతులు చేస్తున్నారు. ఇంతలో విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని మృతుల కుటుంబీకులు, గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. ఘటనా స్థలానికి ధర్పల్లి, సిరికొండ పోలీసులు చేరుకొని వారితో మాట్లాడారు. మృతుడు గజ్జల లక్ష్మణ్‌కు భార్య, నలుగురు పిల్లలు, ధరావత్ రమేష్‌కు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు.

'ఆర్‌ఆర్‌ఆర్' అత్యంత శక్తివంతమైన చిత్రం

రాయదుర్గం: భారతదేశ విశేషాలను ప్రపంచానికి చాటిచెప్పిన అత్యంత శక్తివంతమైన చిత్రంగా 'ఆర్‌ఆర్‌ఆర్'గుర్తింపు సాధించిందని హైదరాబాద్‌లోని బ్రిటిష్ డిప్యూటీ హై కమిషనర్ గారెత్ విన్ ఓవెన్ అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో జీ–20 యూనివర్సిటీ కనెక్ట్ కార్యక్రమంలో భాగంగా ఇన్‌స్ట్రక్షనల్ మీడియా(ఐఎంసీ) నిర్వహిస్తున్న మూడు రోజుల జీ–20 స్పెషల్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ఆయన మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఓవెన్ మాట్లాడుతూ చలన చిత్రాలు ప్రపంచానికి కిటికీల వంటివన్నారు. ఉర్దూ వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ.. అకడమిక్ కార్యకలాపాలతోపాటు జీవ వైవిధ్యం, క్యాంపస్ డెవలప్‌మెంట్ రంగాల్లో కృషి చేస్తున్నామన్నారు.

వాహనాల కాలుష్య పరీక్ష ఫీజు పెంపు

సాక్షి, హైదరాబాద్: వాహనాల కాలుష్య స్థాయిలను పరీక్షించి సర్టిఫికెట్లను అందించేందుకు చెల్లించే ఫీజులను రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచింది. ఏడేళ్లుగా ఒకే ఫీజు ఉందని, కాలుష్య పరీక్ష వాహనాల నిర్వహణ, సిబ్బంది జీతాలు పెరిగిన నేపథ్యంలో వాటి ధరలను సవరించాలంటూ నిర్వాహకుల కోరగా..ఆ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ధరలు పెంచుతూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పెంచిన ఫీజు ధరలు ఇలా ఉన్నాయి. పెట్రోల్‌తో నడిచే ద్విచక్రవాహనాలకు రూ.30 ఉండగా దాన్ని రూ.50కి, పెట్రోల్‌తో నడిచే మూడు చక్రాల(ఆటోరిక్షా) వాహనాలు, నాలుగు చక్రాల వాహనాలకు రూ.30 ఉండగా దాన్ని ఇప్పుడు విడదీసి మూడు చక్రాల వాహనాలకు రూ.60గా, పెట్రోల్ కార్లకు రూ.75గా మార్చారు. డీజిల్‌తో నడిచే నాలుగు చక్రాలు, అంతకంటే పెద్దవైన అన్ని రకాల వాహనాలకు ఇంతకాలం రూ.60 ఉండగా, దాన్ని రూ.100కు పెంచారు.

బీఆర్‌ఎస్‌లోకి మహారాష్ట్ర నేతలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రలోని ఔరంగాబాద్, నాగపూర్ ప్రాంతాలకు చెందిన పలువురు నేతలు, ప్రముఖులు భారత్ రాష్ట్ర సమితిలో చేరారు. ముఖ్యమంత్రి కేసీఆర్.. ఔరంగాబాద్ జిల్లా మాజీ జెడ్పీ చైర్మన్ వినోద్ తంబె, వంచిత్ బహుజన్ అఘాడీ పార్టీ నుంచీ యవత్మాల్ లోక్ సభ స్థానానికి పోటీ చేసిన ప్రవీణ్ పవార్‌కు గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వీరితోపాటు షుగర్ ఫ్యాక్టరీ మాజీ డైరెక్టర్ దత్తాత్రేయ కాంబ్లే, చావా సంఘటన్ మాజీ అధ్యక్షుడు విఠల్ దేశ్‌ముఖ్, నితిన్ భోంస్లే, జీవన్ భోంస్లే, గజానన్ చవాన్, శంకర్ గలేవాడ్, ఔరంగాబాద్ టౌన్ కార్పొరేటర్లు అఫ్జర్ అస్తర్ షేక్, సుభాస్ ఫజీరావ్, ఎన్సీపీ ఔరంగాబాద్ శాఖ సెక్రటరీ ఖాజా అక్బర్ షేక్, కాంగ్రెస్ తాలూకా అధ్యక్షుడు వినోద్ పాటిల్ తంబే, ఔరంగాబాద్ ఉపాధ్యక్షుడు బాలాసాహెబ్ పాటిల్, మాజీ నగర సేవక్ జమీల్ ఖాన్, ధన్గర్ సమాజ్ అధ్యక్షుడు బందు పార్థే సహా దాదాపు 30 మంది నాయకులు బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దాసోజు శ్రవణ్, హిమాన్షు తివారి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చిన్నయ్యపై చర్యలు తీసుకోండి

సీఎం కేసీఆర్‌కు బాధితురాలు శేజల్ వినతి

సాక్షి, న్యూఢిల్లీ: తనపై లైంగిక వేధింపులకు పాల్పడిన బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, ఆయనకు సహకరించిన పోలీసు అధికారులపై కేసు నమోదు చేయాలని బాధితురాలు శేజల్ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా మంగళవారం మహిళా సంక్షేమ దినోత్సవం జరుపుకుంటున్న సందర్భంగా ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి శేజల్ పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...సీఎం కేసీఆర్ మహిళా సంక్షేమం కోసం ఎన్నో చేస్తున్నారని, అయితే తమకు జరిగిన అన్యాయంపై పోరాడుతుంటే ఆయన స్పందించడం లేదని తనకు న్యాయం జరుగుతుందన్న నమ్మకం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పాలాభిషేకంతోనైనా సీఎం కేసీఆర్ తనకు న్యాయం చేయాలన్నారు.

'ఆదిపురుష్' టికెట్టు రూ. 50 పెంపునకు అనుమతి

ప్రత్యేక షోలతో 6 ఆటలకు సైతం అనుమతి

సాక్షి, హైదరాబాద్: రామాయణ కథను తెరకెక్కిస్తూ నిర్మించిన 'ఆదిపురుష్'సినిమా విడుదలయ్యే 16వ తేదీ నుంచి మూడు రోజుల పాటు టిక్కెట్ ధరలను రూ. 50 పెంచుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. రాష్ట్రంలోని అన్ని సింగిల్ స్క్రీన్ థియేటర్లకు ఇది వర్తిస్తుందని తెలిపింది. ఈ మేరకు ప్రభుత్వ హోంశాఖ ముఖ్య కార్యదర్శి జితేందర్ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 16వ తేదీ ఉదయం 4 గంటల నుంచి ప్రత్యేక షోలతో కూడిన ఆరు ఆటలతో సినిమాను నడిపించుకునేందుకు అన్ని రకాల థియేటర్లకు సడలింపు వర్తిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ఈ అనుమతులు కేవలం ఆదిపురుష్ సినిమాకు మాత్రమేనని స్పష్టం చేసింది.



"శరీరానికీ, మనసుకూ ఉమ్మడి ఆరోగ్య రహస్యం ఏమిటంటే, గతం గురించి చింతించకూడదు. భవిష్యత్తు గురించి ఆందోళన కూడదు. ఈ క్షణం వివేకంగా, మనఃపూర్తిగా జీవించాలి.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 14 జూన్ 2023

డేటా భారతంలో లీకుల భాగోతం

రకరకాల సందర్భాల్లో, డిజిటల్ వేదికల్లో మనం అందజేస్తున్న వ్యక్తిగత సమాచారం ఏ మేరకు సురక్షితం? చాలాకాలంగా వేధిస్తున్న ఈ ప్రశ్న సోమవారం మరోసారి ముందుకొచ్చింది. కోవిడ్ టీకాకరణకు డిజిటల్ బుకింగ్ సర్వీస్ వేదికైన ప్రభుత్వ పోర్టల్ 'కోవిన్' డేటాబేస్ నుంచి ప్రముఖుల వ్యక్తిగత డేటా సైతం టెలిగ్రామ్ యాప్‌లో దర్శనమిచ్చి, మనవాళ్ళ సమర్థతను వెక్కిరించింది. మలయాళ మీడియా 'ది ఫోర్త్' తన యూట్యూబ్ వీడియోలో చూపిన డేటా చోరీ వైనం దిగ్భ్రాంతికరం. అనేక వార్తాసంస్థలూ సదరు టెలిగ్రామ్ బాట్‌ను పరీక్షించి, లీక్ నిజమేనని నిర్ధారించాయి. ప్రభుత్వ సైబర్ భద్రతా సంస్థ 'ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్' దీనిపై విచారణ చేపట్టిందే తప్ప, కనీసం అప్రమత్తత జారీ చేయకపోవడం విచారకరం. ప్రభుత్వం అసలీ వార్తల్నే కొట్టిపారేయడం మరీ విడ్డూరం. కానీ, కోవిన్‌లోనే లభించే మైనర్లు, మేజర్ల సమాచారం ఈ లీకుల్లో ఉంది. ఇది అనుమానాల్ని పెంచుతోంది. సైబర్ సెక్యూరిటీ, డేటా చట్టాల తక్షణావసరాన్ని గుర్తు చేస్తోంది.

గతంలో 2018లోనే మన ఆధార్ డేటాబేస్ నుంచి భారీగా లీక్ జరిగినట్టు వార్తలొచ్చాయి. ఆ హ్యాకింగ్‌ను ప్రభుత్వం ఇప్పటి దాకా బాహాటంగా ప్రస్తావించ లేదు. 'కోవిన్' సంగతికే వస్తే, 2021 జూన్‌లోనూ 'కోవిన్' పోర్టల్ హ్యాకైంది. 15 కోట్ల మంది భారతీయుల డేటా అంగట్లో అమ్మకైంది. అప్పుడూ మన సర్కార్ అదేమీ లేదంది. ఇక గత ఏడాది జనవరిలోనూ ఇలాంటి వార్తలే వచ్చాయి. అప్పుడూ డేటాబేస్ 'సురక్షితంగా ఉంద'ని నేషనల్ హెల్త్ అథారిటీ వాదించింది. కానీ, అసలు గోప్యతా విధానమంటూ ఏదీ లేకుండానే 'కోవిన్' జనంలోకి వచ్చింది. చివరకు 2021లో ఢిల్లీ హైకోర్ట్ ఆదేశించాక, తప్పక విధాన ప్రకటన చేసింది. తాజా ఉదంతంలో 'కోవిన్' వేదిక నుంచి 'నేరుగా ఉల్లంఘన' జరగలేదని ప్రభుత్వం తెలివిగా జవాబిచ్చింది. గతంలో కోవిన్‌లో కాక వేరెక్కడో చోరీ అయిన సమాచారమే ఇదంటోంది. మరి ఒకప్పుడు ఇలాంటి చోరీలే జరగలేదన్న సర్కార్... ఇప్పుడు తాజా చోరీ సమాచారం పాతదే అంటోందంటే ఏది నిజం? ఏది అబద్ధం?

అసలీ వార్తలన్నీ 'ఆధారరహితం, తుంటరి చేష్టలు' అన్నది ఎప్పటి లానే సర్కారు వారి పాత పాట. ఒకవేళ అదే నిజమనుకున్నా, ప్రభుత్వ సంస్థల చేతుల్లోని డిజిటల్ డేటా భద్రత, సత్వరమే వ్యక్తిగత డేటా రక్షణ చట్టం అవసరమైతే ఉంది. తాజా రచ్చ మరోసారి మనకు చెబుతున్న పాఠం అదే. ఢిల్లీలోని వైద్యసంస్థ ఎయిమ్స్ గత 8 నెలల్లో రెండుసార్లు సైబర్ దాడులకు గురైన సంగతి అంత తేలిగ్గా మర్చిపోలేం. వ్యక్తిగత ఆరోగ్య వివరాలు, అలాగే ఆధార్, పాన్ కార్డ్, డ్రైవింగ్ లైసెన్స్ సమాచారం ఉన్న ఇతర పత్రాలకు మరింత భద్రత అవసరమని తాజా ఘటన అప్రమత్తం చేసింది.

'వందకోట్ల సార్లు యత్నించినా ఆధార్ భద్రతను ఛేదించడం అసాధ్యమంటూ 2018లో అప్పటి ఐటీ మంత్రి పార్లమెంట్ సాక్షిగా బల్లగుద్దారు. కానీ, మరిప్పుడు తాజా డేటా ఉల్లంఘనలో మొబైల్ నంబర్‌ను బట్టి ఆధార్ వివరాలు అంత కచ్చితంగా టెలిగ్రామ్ బాట్‌లో ఎలా వస్తున్నాయి? నిజానికి శరవేగంతో అన్నీ డిజిటలీకృతమవుతున్న ప్రపంచంలో కొత్త ముప్పు – వ్యక్తిగత డేటా లీకులు. అది ఇప్పుడు ప్రపంచమంతా ఉన్నదే. లక్షలాది రిటైల్ కస్టమర్లతో లావాదేవీలు నడిపే డొమినో ఇండియా నుంచి 18 కోట్ల మంది సమాచారం లీకు సహా అనేక పోర్టల్స్ నుంచి వ్యక్తిగత డేటా అంగట్లో సరుకు కావడం కొన్నేళ్ళుగా మన దేశంలో ఆనవాయితీ అయింది. 2020 నుంచి చూస్తే, అమెరికా, రష్యా, ఇరాన్‌ల తర్వాత ప్రపంచంలోనే అధికంగా 14 కోట్ల డేటా గోప్యత ఉల్లంఘనలు జరిగిన దేశం మనదే. ఇంత జరుగుతున్నా వ్యక్తిగత డేటా రక్షణపై దేశంలో ఇప్పటికీ సరైన చట్టం లేదు.

భారత్‌లో 2017లో డేటా గోప్యత బిల్లు తొలిసారిగా రూపుదిద్దుకున్నప్పటి నుంచి ఇప్పటికీ కొత్త చట్టం పనులు నత్తనడక నడుస్తున్నాయి. గడచిన వర్షాకాల సమావేశాల్లోనే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని అనుకున్నా, చివరకు దాన్ని పక్కన పడేసి, 2022 డిసెంబర్‌లో కొత్త ముసాయిదాను తెచ్చారు. అనేక విడతల సలహా సంప్రతింపులు జరిపినా, కొత్త బిల్లు ఇంకా పార్లమెంట్ మెట్లెక్కనే లేదు. కాగా, కేంద్రం త్వరలోనే ప్రతిపాదిత 'డిజిటల్ ఇండియా' చట్టాన్నీ, అలాగే సవరించిన 'డిజిటల్ డేటా పరిరక్షణ బిల్లు 2022'నూ పార్లమెంట్‌లో పెడుతుందని సమాచారం. అలాగే అన్ని రకాల ప్రభుత్వ డేటా నిల్వ, అందుబాటు, భద్రతా ప్రమాణాలకు ఉమ్మడి చట్రాన్నిచ్చే 'నేషనల్ డేటా గవర్నెన్స్ పాలసీ'ని ఖరారు చేస్తున్నామని అమాత్యుల మాట. భవిష్యత్తులో అవి ఊరట కావచ్చేమో.

అయితే, ఇకనైనా సంస్థలు తాము సేకరించిన వ్యక్తిగత డేటాను ఒక్కసారికే, సదరు నిర్ణీత ప్రయోజనానికే వాడుకొనేలా చట్టంలో కట్టుదిట్టాలు చేయడం కీలకం. సంస్థలపైనే బాధ్యత మోపాలి. అలాగే, డేటా చోరీ అనుమానం రాగానే సంభావ్య బాధితులందరికీ సదరు సంస్థలు సమాచారమివ్వడం తప్పనిసరి చేయాలి. దానివల్ల వారు వెంటనే పాస్‌వర్డ్‌లు మార్చుకొని, సురక్షితులయ్యే వీలుంటుంది. అయినా, ప్రభుత్వం చేతిలోని 'కోవిన్' లాంటి వాటి నుంచే డేటా లీకవుతూ పోతే పౌరులకిక ఏం నమ్మకం మిగులుతుంది? సమస్తం డిజిటలైన వేళ ఉల్లంఘనలు తప్పవనుకున్నా, నష్టాన్ని తగ్గించడం, డేటా గోప్యతకు చట్టబద్ధ రక్షణ కల్పించడం ప్రథమ కర్తవ్యం. ప్రభుత్వ కనీస కర్తవ్యం. లీకైన కోట్లాది ప్రజల డేటా నేరగాళ్ళ చేతిలో పడితే ఆర్థికంగా, సామాజికంగా చెలరేగే సంక్షోభం అనూహ్యం. అందుకే, ఈ లీకుల్ని కొట్టిపారేసే వైఖరి వదిలి, సర్కార్ కఠిన చర్యలకు దిగాలి. ప్రతిదానికీ పుట్టుపూర్వోత్తరాలన్నీ సేకరించే ధోరణి మాని, వీలైనంత వరకు అతి తక్కువ డేటానే సేకరించే పద్ధతి మేలంటున్న పౌరసమాజం మాటల్నీ పట్టించుకోవాలి.

క్రీడా జగతిలో మహిళల దుఃస్థితికి అద్దం

ఒక దశాబ్దం పాటు రెజ్లింగ్‌లో ఆధిపత్యం చలాయించిన రాజకీయ నాయకుడికి వ్యతిరేకంగా మహిళా మల్లయోధులు పోరాడుతున్నారు. బ్రిజ్ భూషణ్ సింగ్‌పై లైంగిక ఆరోపణలు కొత్తవి కావు. 2016లోనే అలాంటి కథనం పత్రికలో వచ్చింది. కానీ దాన్ని సద్దుమణిగేలా చేశారు. క్రీడలలో మహిళలపై లైంగిక వేధింపులు 'అసాధారణం కాదు' అనేది కలవరపరిచే వాస్తవం. భారతీయ క్రీడలను ఎంత బలహీనంగా మేనేజ్ చేస్తున్నారో దేశానికి తెలిసేలా చేయగలిగారు మన రెజ్లర్లు. ఇది బీజేపీతో ప్రారంభం కాలేదు, దీనితో ముగిసిపోదు. క్రీడా సమాఖ్యల నుండి రాజకీయ నాయకులను బయటకు పంపిస్తే తప్ప ప్రయోజనం ఉండదు. కేసును పోలీసులు ఎలా నిర్వహిస్తారు, బ్రిజ్‌భూషణ్‌కు ఏమవుతుంది అనేది క్రీడల్లోకి అడుగుపెడుతున్న అమ్మాయిలకు ఒక సంకేతంగా ఉంటుంది.

సందర్భం



బర్ఖా దత్

ఇలా చెప్పడం నాకు బాధగా ఉంది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పార్లమెంటేరియన్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా ధైర్యంగా నిరసన తెలుపుతున్న భారతదేశపు ప్రముఖ రెజ్లర్లు, ఇప్పుడు వెనుకకు నెట్టబడి ఉండవచ్చు.

వేధింపులు, అధికార దుర్వినియోగ ఆరోపణలతో ప్రజల్లోకి వెళ్లే మహిళలకు తరచుగా జరిగే విధంగానే వ్యవస్థ సంపూర్ణ శక్తి సాధారణంగా వారికి వ్యతిరేకంగా ప్రబలంగా ఉంటుంది. అది ఫిర్యాదుదారుల శక్తిని మించిపోతుంది.

దీనిపై స్పందించిన రెజ్లర్లు తాము తిరిగి ప్రాక్టీసుకు రావడాన్ని తమ లక్ష్యం నుంచి వెనక్కి తగ్గినట్లు చూడకూడదని చెప్పారు. వారు నిరంతర నిబద్ధతతో బలంగా నిలబడిన కారణంగానే వారికీ, ప్రభుత్వానికీ మధ్య ఇటీవలి రౌండ్ చర్చలకు దారితీసింది. కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ ఛార్జిషీట్ దాఖలుకు జూన్ 15ను డెడ్‌లైన్‌గా విధించారు. అలాగే రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (డబ్ల్యుఎఫ్ఐ) నిర్వహణ కోసం జూన్ 30 వరకు ఎన్నికలు నిర్వహించాలని గడువు విధించారు. ఈ నిర్దిష్ట ప్రతిపాదనలను స్వాగతించాలి. జంతర్ మంతర్‌లో నిరసన కార్యక్రమం జరిగినప్పుడు వారిని లాగిపడేయడం, దూరంగా తీసుకుపోవడానికి ప్రయత్నించడానికి సంబంధించిన ఫొటోలు వైరల్ అయిన తర్వాత, మల్లయోధుల పట్ల ప్రజల్లో ఏర్పడిన విస్తృత సానుభూతిని ప్రభుత్వం ఆలస్యంగా గుర్తించింది.

అయితే మరి తర్వాత ఏమి జరుగుతుందనే విషయంలో నేను ఎందుకు సంశయంగా ఉన్నాను?

ఆరుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికైన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై నాలుగు క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇందులో 'లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం' (పోక్సో)కి చెందిన దరఖాస్తు ఉన్నందున ఆయన్ని వెంటనే అరెస్టు చేయడానికి బలమైన చట్టపరమైన ఆధారం ఉంది. వేధింపులు, దుర్వినియోగం తోపాటు వేధింపులకు సంబంధించిన 12 విభిన్న సందర్భాలను వారి ప్రథమ సమాచార నివేదికల (ఎఫ్ఐఆర్‌లు)లో పేర్కొన్న ఏడుగురు ఫిర్యాదుదారులలో ఒకరు మైనర్. అయితే గత వారం రోజులుగా మైనర్ తండ్రి పరస్పర విరుద్ధమైన ప్రకటనలు చేస్తున్నారు. తన కుమార్తె పట్ల చెడుగా ప్రవర్తించాడని అనుకున్నందున తాను సింగ్ మీద తప్పుడు వేధింపు ఆరోపణలు చేసినట్లుగా ఆయన ఇప్పుడు చెబుతున్నారు. ఒత్తిడి, బెదిరింపుల పర్యవసానంలా కనిపిస్తున్న ఈ నిర్ణయాలను మార్చుకోవడం వల్ల (తన కుటుంబం భయంతో కొట్టుమిట్టాడుతోందని ఒక ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు), కేవలం తన కుమార్తె కేసును మాత్రమే కాకుండా, ప్రతి ఒక్కరి కేసునూ బలహీనపరిచే అవకాశం ఉంది. తన తొలి ఫిర్యాదులో, తన కూతురును ముందుకు రాకుండా చేసిన భయాన్ని తండ్రి ప్రస్తావించాడు. మరి ఈ రోజు కూడా అదే భయం ఆయన్ని ఆడిస్తోందా?



కలవరపరిచే వాస్తవాలు

వాస్తవం ఏమిటంటే, సీనియర్ స్పోర్ట్స్ జర్నలిస్ట్ చందర్ శేఖర్ లూథ్రా ఎత్తి చూపినట్లుగా, సింగ్‌పై దుర్వినియోగ ఆరోపణలు కొత్తవి కావు. అవి అంతకు ముందూ నమోదయ్యాయి. లూథ్రా నాతో మాట్లాడుతూ, 2016లో లక్నోలోని మహిళా శిబిరానికి హాజరైన ముగ్గురు యువ క్రీడాకారిణులు తమను బ్రిజ్‌భూషణ్ హోటల్ రూముకు రమ్మని పిలిచారని ఫిజియో థెరపిస్టుతో చెప్పినప్పుడు అలాంటి సంఘటన మొదటిసారి బయటపడిందని చెప్పారు. ''మేము నివేదించిన కథనాన్ని ఒక హిందీ వార్తాపత్రిక వాస్తవంగా ప్రచురించింది; కానీ అంతా సద్దుమణిగిపోయేలా చేశారు'' అని లూథ్రా చెప్పారు. మహిళా క్రీడాకారిణులకు బ్రిజ్ భూషణ్ వల్ల కలుగుతున్న వ్యథల గురించి ప్రభుత్వంలోని అధికారులకు కూడా తెలుసునని ఎఫ్ఐఆర్ ఆరోపించింది. ఆసియా ఛాంపియన్‌షిప్‌లో ఫొటో అవకాశం సందర్భంగా సింగ్ ''నా పిరుదులపై చేయి వేయడానికి ప్రయత్నించారు' అని ఒక ఫిర్యాదుదారు చేసిన ప్రకటనను అంతర్జాతీయ రిఫరీ జగ్బీర్ సింగ్ కూడా ధ్రువీకరించారని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' వార్తాపత్రిక నివేదించింది.

అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంతో ఉన్న సంబంధాల గురించి, ముఖ్యంగా గ్యాంగ్‌స్టర్లకు ఆశ్రయం కల్పించారనే ఆరోపణలపై బ్రిజ్ భూషణ్ సింగ్‌ను తాను విచారించినట్లు ఢిల్లీ మాజీ పోలీసు కమిషనర్ నీరజ్ కుమార్ నాతో చెప్పారు. చివరికి కోర్టులో కేసు వీగిపోయినప్పటికీ, సింగ్ నిర్దోషిగా విడుదలైనప్పటికీ, ''భూషణ్ ప్రమాదకరమైన వ్యక్తి'' అని నీరజ్ కుమార్ నాతో అన్నారు.

ఒకప్పుడు బోర్డ్ ఆఫ్ కంట్రోల్ ఫర్ క్రికెట్ ఇన్ ఇండియాకు సలహాదారుగా ఉన్న కుమార్, క్రీడలలో మహిళలపై లైంగిక వేధింపులు ''అసాధారణం కాదు'' అనే వాస్తవాన్ని నొక్కిచెప్పారు. యువ మహిళా క్రికెటర్లు, క్రికెటర్ల తల్లుల నుంచి లైంగిక అనుకూలతను ఆశించిన సెలెక్టర్లు, కోచ్‌ల గురించిన ఆరోపణలు కూడా తనకు తెలుసుననేంత వరకూ నీరజ్ వెళ్లిపోయారు. ఆయన మాటలు వింటున్నప్పుడు నాకు ఒళ్లు జలదరించింది.

భారతీయ క్రీడలను ఎంత బలహీనంగా మేనేజ్ చేస్తున్నారో తెలిసేలా రెజ్లర్లు దేశం దృష్టిని అటువైపుగా మళ్లించారు. ఇది బీజేపీతో ప్రారంభం కాలేదు, దీనితో ముగిసిపోదు. క్రీడా సమాఖ్యల నుండి రాజకీయ నాయకులను బయటకు పంపిస్తే తప్ప ప్రయోజనం ఉండదు. లేదంటే, రాజకీయ అధికారం, ఫెడరేషన్ల నియంత్రణ మధ్య ఉన్న దుష్ట సంబంధం ఎప్పటికీ విచ్ఛిన్నం కాదు.

మౌనమే నయమా?

కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ ఇండియా రెజ్లింగ్ ఫెడరేషన్‌ను ప్రక్షాళన చేస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇదంత సులభం కాదు. రెజ్లర్లు ఎత్తి చూపినట్లుగా, బ్రిజ్ భూషణ్‌కు ఫెడరేషన్‌పై గట్టి పట్టు ఉంది. ఆయన కుమారుడు కరణ్ భూషణ్ సింగ్ దాని ఉపాధ్యక్షుడు; ఆయన అల్లుడు ఆదిత్య ప్రతాప్ సింగ్ సంయుక్త కార్యదర్శి. రెజ్లింగ్ ఫెడరేషన్ మీద బ్రిజ్ భూషణ్ సింగ్ పరివార్ నిర్బంధం సమగ్రంలా కనబడుతోంది. గత వారాంతంలో ఆయన చేపట్టిన అయోధ్య ర్యాలీని రద్దు చేసినప్పటికీ, భారీగా జనానికి చేరువయ్యేలా తన ఉత్తరప్రదేశ్ నియోజకవర్గంలో పర్యటిస్తానని సింగ్ ప్రకటించారు.

అధికారానికి సంబంధించిన ఇలాంటి సంకేతాల మధ్య, మీరు ఫిర్యాదుదారుని కుటుంబం భయపడిందని నిందించగలరా? ప్రత్యేకించి బ్రిజ్ భూషణ్ సింగ్ లేదా ఆయనతో సంబంధం ఉన్నవారు... మిమ్మల్ని మీ కెరియర్‌లో పైకి తేగలిగి, అవసరమైతే తొక్కేయగలిగిన పక్షంలో. ఒక దశాబ్దం పాటు రెజ్లింగ్‌లో ఆధిపత్యం చలాయించిన రాజకీయ నాయకుడికి వ్యతిరేకంగా మహిళా క్రీడాకారులు పోరాడుతున్నారు. పోలీసులు ఈ కేసును ఎలా నిర్వహిస్తారు, బ్రిజ్ భూషణ్‌కు ఏమి జరుగుతుంది అనేది మనందరికీ ఒక సంకేతం; ముఖ్యంగా భారతీయ మహిళలు, అది పెద్దవాళ్లయినా, చిన్నవాళ్లయినా, ఇంకా ముఖ్యంగా ఇప్పుడే క్రీడల్లోకి అడుగుపెట్టిన బాలికలకు ఇది సూచనగా ఉంటుంది. ఈ విషయం గురించి మాట్లాడినందుకు ఇది వారు చెల్లించాల్సిన మూల్యం అని వాళ్ళు నమ్మాలని మనం కోరుకుందామా? మౌనం సురక్షితమని వారు భావించాలని మనం కోరుకుందామా?

వ్యాసకర్త ప్రముఖ పాత్రికేయురాలు
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

కోల్పోతున్న అవకాశం



హోటళ్లు, ఆతిథ్యం విషయంలో ఇండియా ప్రపంచంలోని అత్యుత్తమైన వాటితో పోటీ పడగలదు. ఓడించగలదు. అయినప్పటికీ ఇండియాకు చాలా చిన్న దేశాలైన ఇటలీ, స్పెయిన్ కంటే కూడా తక్కువ టూరిస్టులు వస్తుంటారు. టూరిజంలో తర్వాతి దశకు చేరగలిగే అవకాశం ఒకటి ఎదురుచూస్తోంది.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్

లేదంటే కుదరదు!



ట్విట్టర్ అనేది కేవలం ఒక సామాజిక మాధ్యమం. జాక్ డోర్సే (ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడు, మాజీ సీఈఓ) నేతృత్వంలో అది తనను తానో సార్వభౌమ దేశంలా భావించుకోవడం మొదలుపెట్టి, దాని కార్యక్రమాలు సాగుతున్న దేశ చట్టాలను అనుసరించాల్సిన అవసరం లేదనుకుంది. కానీ అలా నడవదు. ఇక్కడి చట్టాలను అనుసరించాల్సిందేనని చెప్పి భారత ప్రభుత్వం సరైన పనే చేసింది.

– సునంద వశిష్ట్, జర్నలిస్ట్

ఓవర్ రియాక్షన్



ట్విట్టర్‌ను సెన్సార్ చేయడానికి జరిగిన ప్రయత్నాల పట్ల జాక్ డోర్సే ప్రత్యేకంగా ఇండియాను మాత్రమే విమర్శించలేదు. యూఎస్ ప్రభుత్వం, ఇతరులను కూడా విమర్శించారు. కానీ బీజేపీ ప్రతినిధులు, వారి చీర్‌లీడర్ల లాంటి టీవీ యాంకర్లు ఎందుకు అంత కోపోద్రిక్తులవుతున్నారు? వాళ్లు ఇండియాను దయనీయంగా కనబడేట్టు చేస్తున్నారు.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

ఆ కోణమూ చూడాలి



భూమి తన చరిత్ర పొడవునా వేలాదిసార్లు తీవ్ర వాతావరణ మార్పులకు గురైంది. అసలు మనుషులే లేని కాలంలో వాతావరణ మార్పు ఎలా జరిగింది? లేకపోతే ఇప్పటి ప్రచారమంతా మరో కుంభకోణమా?

– అహ్మద్ మాలిక్, సర్జన్

ఆయనకూ భయమే



నేను పకోడీల్ని వేయిస్తున్నప్పుడు నేల మీదున్న బల్లిని గమనించాను. పనిలో చివరి దశలో ఉండి, అలా వదిలేసే వీలు లేక దాన్ని వెళ్లగొట్టమని నా భర్తను పిలిచాను. వంటగదిలో ఏనాడూ వేలుపెట్టని ఆ మనిషి నా చేతిలో ఉన్న జాలి గరిటెను తీసుకుని పకోడీల పని చూడటం మొదలుపెట్టాడు.

– ప్రేరణ, గృహిణి

ఆశయం ఆచరణలో వెలిగిన తరుణం

సందర్భం



డా॥ జి.రంజిత్ రెడ్డి

దశాబ్దం క్రితం దాకా తెలంగాణ.. ఓ కల. ఓ ఆశయం. ఓ ఉద్యమం. కానీ, ఇప్పుడది సాకారమైన స్వప్నం. తెలంగాణ సాధనే పరమావధిగా ఆవిర్భవించిన 'తెలంగాణ రాష్ట్ర సమితి' పార్టీ (ఇప్పుడు బీఆర్ఎస్) తెలంగాణలో తొలి, మలి ప్రభుత్వాలను ఏర్పాటు చేసి దశాబ్ది ఉత్సవాలను వైభవోపేతంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగా వైద్య, ఆరోగ్య శాఖలో సాధించిన ప్రగతిని నేడు (జూన్14న) తెలియజేస్తూ తెలంగాణ 'వైద్య, ఆరోగ్య దినోత్సవం'గా నిర్వహిస్తోంది ప్రభుత్వం. ఈ రోజే ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్స్ విస్తరణ పనులకు శ్రీకారం చుడుతున్నారు.

ప్రజల ఆరోగ్య సంరక్షణను మెరుగుపరిచే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగాల్లో విప్లవాత్మక కార్యక్రమాలనూ, పథకాలనూ చేపడుతోంది. బాలింతలు, మహిళలు, గర్భిణులు, శిశువులు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వంటివారి అవసరాలను తీర్చేందుకు ఆరోగ్య రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకుంటోంది. హైదరాబాద్ సహా వరంగల్‌లాంటి ముఖ్యపట్టణాల్లో సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్ల (టిమ్స్)ను నిర్మించి ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ వైద్యం అందించబోతున్నారు. హైదరాబాద్‌లోని 'నిమ్స్' హాస్పిటల్‌ను అదనంగా 2500 పడకలతో విస్తరించడంతో పాటు, వరంగల్‌ను అన్ని వైద్య సదుపాయాలు ఒకేచోట లభ్యమయ్యే విధంగా 'మెడికల్ హబ్'గా తీర్చిదిద్దుతున్నారు. నాణ్యమైన వైద్య సేవలు, వైద్య సదుపాయాల విస్తరణ, నిరంతర పర్యవేక్షణతో పాటు అనేక దీర్ఘకాలిక లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించుకొంది. 'కంటి వెలుగు' పథకం కింద మొదటి దశలో1 కోటి మందికి ఉచిత పరీక్షలు, 40 లక్షల మందికి కంటి అద్దాలు; రెండవ దశలో కోటికి పైగా ఉచిత కంటి పరీక్షలు, 29 లక్షల మందికి ఉచితంగా అద్దాల పంపిణీ చేసింది.

సంస్థాగత కానుపులను పెంచడం, మాతృ మరణాలు, శిశు మరణాలను తగ్గించడం లక్ష్యంగా కేసీఆర్ కిట్ కార్యక్రమాన్ని 2017 జూన్ 2న ప్రభుత్వం ప్రారంభించింది. ఇది ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలకు వర్తిస్తుంది. మగ బిడ్డకు రూ. 12 వేలు, ఆడ బిడ్డకు రూ. 13వేలు నగదు ఇస్తారు. యాంటినాటల్ చెకప్, టీకాకు చెందిన కీలక మైలురాళ్లకు అనుసంధానించబడిన నగదు భాగం నాలుగు వాయిదాలలో విడుదల చేస్తారు. పుట్టిన వెంటనే 14 యుటిలిటీ వస్తువులతో కూడిన కిట్ ఇస్తున్నారు.

గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ లోని పట్టణ పేదలకు నాణ్యమైన ఆరోగ్య సేవలను అందించడానికి 'బస్తీ దవాఖానా'ను ఏర్పరచారు. ఒక బస్తీ దవాఖానా 5,000–10,000 జనాభాకు సేవలను అందిస్తుంది. ఈ దవాఖానా మురికివాడలో ఉంటుంది. సంప్రదింపులు, వ్యాధి నిర్ధారణ, మందులు ఉచితంగా ఇవ్వడం వంటి సేవలు జీహెచ్ఎమ్‌సీలో 321 బస్తీ దవాఖానాలు అందిస్తున్నాయి. తెలంగాణ డయాగ్నొస్టిక్స్ హబ్ – స్పోక్ మోడల్ 2018లో ప్రారంభించారు. ప్రస్తుతం 20 హబ్‌లు పనిచేస్తున్నాయి. సెంట్రల్ హబ్‌లో 60 రకాల పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారు. మిగిలిన 13 జిల్లాల్లో కూడా ఇలాంటి హబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఆటో ఎనలైజర్లు, డిజిటల్ ఎక్స్‌–రేలు, అల్ట్రాసౌండ్ స్కాన్ మిషన్లు, 2డీ ఎకో, మామోగ్రామ్‌లు వంటి అత్యాధునిక రోగనిర్ధారణ పరికరాలు ఈ హబ్‌లలో ఉంచారు. గుండె, కిడ్నీ, ఊపిరితిత్తులు, క్యాన్సర్‌కు సంబంధించిన అన్ని పరీక్షలను ఇక్కడ నిర్వహిస్తున్నారు. ఆయుష్మాన్ భారత్, పీఎమ్‌జేఏవై, ఆరోగ్యశ్రీ కన్వర్జ్డ్ స్కీమ్ కోసం ఎంఓయూపై 18 మే 2021న సంతకం చేశారు. ఒక కుటుంబానికి సంవత్సరానికి గరిష్ఠ కవరేజీ పరిమితి రూ. 2 లక్షల నుంచి రూ. 5 లక్షలకు పెంచారు. ప్రస్తుతం ఉన్న ఆరోగ్యశ్రీ లబ్ధిదారులందరినీ కన్వర్జ్‌డ్ పథకం కిందకు తీసుకొచ్చారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, జర్నలిస్టులు... వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ నగదు రహిత చికిత్స అందించడానికి 'ఉద్యోగులు, జర్నలిస్ట్'ల ఆరోగ్య పథకం అమలు చేస్తున్నారు. ఔట్–పేషెంట్ చికిత్సలు వెల్‌నెస్ సెంటర్ల ద్వారా అందిస్తారు. ఇన్–పేషెంట్ చికిత్స ఎంప్యానెల్డ్ హాస్పిటల్స్ ద్వారా అందిస్తున్నారు. ఈ పథకం కింద 344 ఎంప్యానెల్ ఆసుపత్రులు ఉన్నాయి. వీటిలో ఇప్పటివరకు 12,04,654 మంది లబ్ధిదారులు నమోదు చేసుకున్నారు.



'అమ్మ ఒడి' పథకం కింద 300 వాహనాల్లో ఏఎన్‌సీ చెకప్‌లు, ప్రసవాల కోసం గర్భిణులను తరలిస్తున్నారు. '108 అంబులెన్స్'లు అత్యవసర పరిస్థితుల్లో రోగులను ఆసుపత్రులకు తరలించి రోజూ ఎంతోమంది ప్రాణాలను కాపాడుతున్నాయి. ప్రస్తుతం 424 అంబులెన్స్‌లు సేవలు అందిస్తున్నాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్తగా 298 అంబులెన్స్‌లు కొనుగోలు చేయగా 100 అంబులెన్స్‌లు విరాళాలుగా అందాయి. మొత్తం 398 పాత అంబులెన్స్‌లను మార్చారు. రాష్ట్రం ఏర్పడే నాటికి 700 ఎంబీబీఎస్ సీట్లతో 5 మెడికల్ కాలేజీలు ఉండగా, మరో 4 వైద్య కళాశాలలను జోడించారు. తరువాత ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య 1640కి చేరుకుంది. 2021లో కొత్తగా 1200 ఎంబీబీఎస్ సీట్లతో సంగారెడ్డి, మహబూబాబాద్, మంచిర్యాల, జగిత్యాల, వనపర్తి, కొత్తగూడెం, నాగర్‌కర్నూల్, రామగుండంలలో 8 మెడికల్ కాలేజీలు మంజూరయ్యాయి. అలాగే నిర్మల్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, జనగాం, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, సిరిసిల్ల, వికారాబాద్‌లలో 900 ఎంబీబీఎస్ సీట్ల ఇన్‌టేక్ కెపాసిటీతో మరో 9 మెడికల్ కాలేజీలు 2022లో మంజూరు చేశారు. రాష్ట్రం ఏర్పడే సమయంలో ఒకే ఒక్క మల్టీ డిసిప్లినరీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (నిమ్స్) ఉండేది. తర్వాత హైదరాబాద్‌లో 'తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్' (టిమ్స్) పేరుతో నాలుగు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ప్రభుత్వం మంజూరు చేసింది. వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఒకటి మంజూరైంది.

కోవిడ్‌కు ముందు రాష్ట్రంలో ఒక ఆర్టీపీసీఆర్ ల్యాబ్ ఉంది. ప్రస్తుతం, రాష్ట్రంలో 27 ల్యాబ్‌లు పనిచేస్తున్నాయి. నిమ్స్‌లో కోబాస్ 8800 మెషీన్‌ను ఏర్పాటు చేశారు, ఇది రోజుకు 4000 పరీక్షలు చేయగలదు. మరో 8 ల్యాబ్‌లు మంజూరు చేశారు. వీటితో ప్రతి జిల్లాకు కనీసం ఒక ఆర్టీపీసీఆర్ ల్యాబ్ ఉంటుంది.

స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రజలకు అన్ని రకాల వైద్య ఆరోగ్య సేవలను అందించడానికి ప్రభుత్వం అవిశ్రాంతంగా పనిచేస్తోంది. ప్రజలు ఆరోగ్యంగా ఉంటేనే రాష్ట్రమైనా, దేశమైనా బాగుపడేది. ఈ ఎరుకతోనే తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోంది.

వ్యాసకర్త ఎంపీ, చేవెళ్ల
(నేడు తెలంగాణ వైద్య, ఆరోగ్య దినోత్సవం)

రూపాలే వేరు



జ్యోతిర్మయం

ఒక పండుగ రోజున ఓ కుటుంబంలోని సభ్యులందరూ అభ్యంగన స్నానాలు చేసి, ఊళ్ళో ఉన్న దేవాలయాలకు వెళ్లారు. శివుడు, వెంకటేశ్వర స్వామి, రాముడు, అమ్మవారు, చివరిగా ఆ ఊరి గ్రామదేవతను కూడా దర్శించుకుని ఇంటికి వచ్చారు. ఆ రోజు వాళ్ళు ఒక అతిథిని భోజనానికి పిలిచారు.

పండుగ రోజు దేవాలయాలన్నీ రద్దీగా ఉండటంతో ఆ ఇంటి గృహిణి ఇంటికి వచ్చి, వంట మొదలు పెట్టడం ఆలస్యమైంది. అతిథి భోజనానికి ఒంటిగంటకు వచ్చాడు. గృహస్థు ఆయనను ఆహ్వానించి, వంట పూర్తవ్వ వస్తోందని వినయంగా చెప్పాడు. 'ఇంత ఆలస్యం ఎందుకయింద'ని అతిథి అడిగాడు. కుటుంబ పెద్ద 'మేం ఊళ్ళో దేవాలయాలన్నింటికీ వెళ్లాం. అక్కడ జనం ఎక్కువగా ఉండటం వల్ల వంట మొదలు పెట్టటం ఆలస్యం అయింద'ని చెప్పాడు.

వంట పూర్తయ్యాక ఆ ఇల్లాలు భోజనానికి లోపలికి రమ్మని పిలిచింది. గృహస్థు, అతిథికి కట్టుకోవడానికి పంచె ఇచ్చాడు. అతిథి 'ఇది ఉత్తరీయమా' అని అడిగాడు. గృహస్థు 'కాదు, పంచె' అన్నాడు. అతిథి దానిని భుజం మీద వేసుకుని 'ఇప్పుడు దీన్నేమంటారు?' అన్నాడు. 'ఉత్తరీయం' అన్నాడు గృహస్థు. అతిథి ఈ సారి దానిని తలకు చుట్టుకుని 'దీనిని ఇప్పుడేమంటారు?' అన్నాడు. 'తలపాగా' అన్నాడు గృహస్థు. దానినే అతిథి నడుముకు కట్టుకుని ఇప్పుడేమంటారు అని అడిగాడు. 'పంచె' అంటూ ఆయనెందుకిలా చేస్తున్నాడో అర్థం కాక ఆశ్చర్యంగా చూస్తున్నాడు గృహస్థు.

'వస్త్రం ఒక్కటే. ధరించిన తీరును బట్టి దానిని ఉత్తరీయం, తలపాగా, పంచె అంటున్నాం. అలాగే దైవం ఒక్కటే. రూపాలే వేరు. పురుష రూపం అయితే వెంకటేశ్వర స్వామి, రాముడు, మరో దేవుడు అంటాం. క్రోధ స్త్రీ రూపం అయితే కాళిక అంటాం. శాంత రూపం అయితే లలిత అంటాం. ఆయా రూపాలన్నీ ఆయా యుగాలలో దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ కోసం 'హరి' దాల్చిన అవతారాలే. రూపాలే వేరు. హరి ఒక్కడే. ఇన్ని రూపాలను పూజించనక్కరలేదు. మనసుకు నచ్చిన ఏ ఒక్క రూపాన్నో నమ్మి పూజిస్తే చాలు' అని చెప్పాడు అతిథి.

ఆ కుటుంబ సభ్యులందరినీ ఉద్దేశించి అతిథి చెప్పిన మాటలు మనందరికి కూడా వర్తిస్తాయి.

– డా॥ చెంగల్వ రామలక్ష్మి

గ్రహం అనుగ్రహం

శ్రీశోభకృత్‌నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం. తిథి బ.ఏకాదశి ఉ.10.18 వరకు, తదుపరి ద్వాదశి. నక్షత్రం అశ్విని ప.3.20 వరకు, తదుపరి భరణి. వర్జ్యం ప.11.26 నుండి 1.02 వరకు, తదుపరి రా.12.59 నుండి 1.29 వరకు. దుర్ముహూర్తం ప.11.33 నుండి 12.23 వరకు. అమృత ఘడియలు ఉ.8.20 నుండి 9.53 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

ట్రిపుల్ఐటీలో టీచర్-సహాయక ఆన్లైన్ కోర్సు

రాయదుర్గం: ట్రిపుల్ఐటీ హైదరాబాద్లోని ఐ హబ్ డేటా ఆధ్వర్యంలో యూజీ ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం 'ఫౌండేషన్స్ ఆఫ్ మోడ్రన్ మెషీన్ లర్నింగ్'పేరుతో టీచర్ సహాయక ఆన్లైన్ కోర్సును ప్రారంభించారు. ఆగస్టు నుంచి ప్రారంభమయ్యే కోర్సుకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కోర్సు వ్యవధి 50 వారాలు. తాజా టూల్స్, టెక్నిక్లను ఉపయోగించి వాస్తవ ప్రపంచ సమస్యలను విద్యార్థులు గుర్తించి, పరిష్కరించడానికి జ్ఞానం, పరిశోధనా సామర్థ్యాలను పెంపొందించుకునే లక్ష్యంతో ఈ ప్రోగ్రామ్ చేపట్టారు. ట్రిపుల్ఐటీ ప్రొఫెసర్లు సీవీ జవహర్, అనూప్ ఎం. నంబూద్రి, రవికిరణ్, నరేష్ మన్వానీ, వినీత్గాంధీ, అవినాష్ శర్మ, ఐహబ్ డేటా అధ్యాపకులు మోనాలిసా పాత్ర, సీకే రాజు బృందం విద్యార్థులకు మార్గదర్శకం చేస్తుంది.

తెయూలో మరోసారి విజిలెన్స్ తనిఖీలు


తెలంగాణ వర్సిటీలో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

తెయూ(డిచ్పల్లి): తెలంగాణ యూనివర్సిటీలో వారం రోజుల్లోనే రెండోసారి విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. తెయూ వీసీ ప్రొఫెసర్ డి రవీందర్ గుప్తా నిధుల్లో అక్రమాలు, అవినీతికి పాల్పడ్డారంటూ పాలకమండలి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ నెల 6న తొలిసారి ప్రభుత్వం చర్యలకు దిగింది. రామచంద్రాపురం యూనిట్ (ఉమ్మడి మెదక్, నిజామాబాద్ జిల్లాల పర్యవేక్షణ)కు చెందిన నలుగురు సభ్యులు మళ్లీ మంగళవారం ఉదయం 11 గంటలకు తెయూలో తనిఖీలు చేశారు. మొదట పరిపాలనా భవనం చేరుకున్న విజిలెన్స్ బృందం.. అకౌంట్, ఇంజనీరింగ్, ఎగ్జామినేషన్ బ్రాంచ్, ఏవో కార్యాలయం, ఎస్టాబ్లిష్మెంట్ సెక్షన్లలో సాయంత్రం 4.40 గంటల వరకు తనిఖీలు నిర్వహించింది. ఈసీ అనుమతి లేకుండా వీసీ చేసిన కొనుగోళ్లు, చెల్లింపులు, నిధుల దుబారా అంశాలపై ఆయా విభాగాల ఉద్యోగులను మరోసారి ప్రశ్నించి వివరాలు నమోదు చేసుకుంది. తొలిరోజు తమ వెంట తీసుకెళ్లిన ఫైళ్లు, కంప్యూటర్ హార్డ్ డిస్కులను క్షుణ్ణంగా పరిశీలించిన బృందం.. కొన్ని అంశాలపై మరింత విస్తృత సమాచారం కోసం మరోసారి వర్సిటీకి వచ్చినట్లు సమాచారం. అధికారుల తనిఖీల సమయంలో వీసీ రవీందర్, ఇన్చార్జి రిజిస్ట్రార్ కనకయ్య అందుబాటులో లేరు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి



జూలైలో పార్లమెంట్ ముట్టడి: ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, అందుకోసం పార్లమెంట్లో రాజ్యాంగ సవరణ బిల్లు పెట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కాచిగూడలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన బీసీ ఉద్యోగుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీసీ ఉద్యోగుల రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్ను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. జూలైలో జరిగే పార్లమెంట్ సమావేశాల సందర్భంగా వేలాది మంది ఉద్యోగులతో పార్లమెంట్ ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. దేశ జనాభాలో 56 శాతం జనాభా గల బీసీలు కులాల వారీగా విడిపోవడం వలన న్యాయమైన డిమాండ్లు సాధించలేకపోతున్నామని అన్నారు. పార్లమెంట్లో బీసీ బిల్లు పెట్టి చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకు బీసీల ఉద్యమం కొనసాగుతుందని ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కన్వీనర్గా ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ శ్రీనివాసులును నియమిస్తూ ఆర్.కృష్ణయ్య నియామక పత్రాన్ని అందజేశారు.

నేడు వడగాడ్పులు.. మోస్తరు వానలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బుధవారం ఆదిలాబాద్, ఖమ్మం, ములుగు, కొము్రంభీం, మంచిర్యాల, నల్లగొండ, కొత్తగూడెం, సూర్యాపేట, భూపాలపల్లి జిల్లాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. మరోవైపు కొన్ని జిల్లాల్లో బుధ, గురువారాల్లో రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల కల్పనే మోదీ సంకల్పం: కేంద్ర మంత్రి జి.కిషన్రెడ్డి



సాక్షి, హైదరాబాద్: దేశంలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలన్న ప్రధాని నరేంద్ర మోదీ సంకల్పానికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఇందుకోసం ప్రతినెలా రోజ్గార్ మేళా నిర్వహిస్తున్నామని, కార్యక్రమంలో ప్రధాని స్వయంగా పాల్గొని అభ్యర్థులతో ముచ్చటిస్తున్నారని అన్నారు. గగన్మహల్లోని పీవీఆర్ కన్వెన్షన్ సెంటర్లో మంగళవారం జరిగిన రోజ్గార్ మేళాలో వివిధ శాఖల్లో కేంద్ర ప్రభు త్వ ఉద్యోగాలు పొందిన 470 మంది అభ్యర్థులకు నియామక పత్రాలను కిషన్రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మేళాలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. అనంతరం మంత్రి కిషన్రెడ్డి మాట్లాడు తూ రోజ్గార్ మేళా ప్రారంభమయ్యాక ఇప్పటివరకు 4 లక్షల 30 వేల మందికిపైగా యువతకు నియామక పత్రాలు అందజేసినట్లు తెలిపారు. రోజ్గార్ మేళా ఉపాధి కల్పనకు ఉత్ప్రేరకంగా పని చేస్తుందని, యువతను దేశాభివృద్ధిలో భాగస్వామ్యం చేస్తూ సరైన అవకాశాలను అందిస్తుందన్నారు. దేశంలోని ప్రతి నగరం పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుతోందని, ఆత్మనిర్భర్ భారత్ కింద దేశం స్వావలంబన సాధిస్తోందన్నారు. ఈ సందర్భంగా 9 జాతీయ బ్యాంకులు, డీఆర్డీఓ, ఇండియన్ రైల్వే, డిఫెన్స్, హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ సహా 22 విభాగాల్లో అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు.

సైబర్ నేరాల దర్యాప్తునకు 'క్రైమ్ ఓఎస్'

- ప్రత్యేక సాఫ్ట్వేర్ రూపొందించిన హైదరాబాద్ సంస్థ
- ఇటీవల కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖకు ప్రజెంటేషన్
- దేశ వ్యాప్తంగా అమలుకు యోచిస్తున్న కేంద్ర ప్రభుత్వం

సాక్షి, సిటీబ్యూరో: నానాటికీ పెరిగిపోతున్న సైబర్ నేరాలు అటు దర్యాప్తు ఏజెన్సీలతో పాటు ఇటు సామాన్యులకు సవాల్ విసురుతున్నాయి. ఈ నేరాల్లో బాధితులు పోగొట్టుకున్న మొత్తంలో కనీసం 20 శాతం కూడా రికవరీ కావట్లేదు. ఫిర్యాదు చేయడంతో పాటు కేసుల దర్యాప్తులో జరుగుతున్న ఆలస్యం కూడా దీనికి కారణమే. బాధితులుగా మారిన వెంటనే ఫిర్యాదు చేయాలంటూ భారీ ఎత్తున ప్రచార, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనికోసం తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్సీఎస్బీ) ప్రతి నెలా మొదటి బుధవారం ప్రత్యేక కార్యక్రమం కూడా నిర్వహిస్తోంది. దర్యాప్తులో జరుగుతున్న జాప్యాన్ని నిరోధించడానికి హైదరాబాద్కు చెందిన సాఫ్ట్వేర్, సైబర్ నిపుణుడు రామ్ గణేష్ నిర్వహించే సంస్థ ప్రత్యేక ఆపరేటింగ్ సిస్టం రూపొందించింది. 'క్రైమ్ ఆపరేటింగ్ సిస్టం (ఓఎస్)' పేరుతో తయారు చేసిన ఈ సాఫ్ట్వేర్పై ఆయన సోమవారం కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖకు (ఎంహెచ్ఏ) ప్రజెంటేషన్ ఇచ్చి వచ్చారు. దేశంలోని అన్ని సైబర్ క్రైమ్ దర్యాప్తు విభాగాలూ దీన్ని వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ప్రస్తుతం సైబర్ నేరాల్లో 185 రకాలు ఉన్నట్లు టీఎస్సీఎస్బీ తేల్చింది. వీటినే సాంకేతికంగా సైబర్ క్రైమ్ మోడెస్ ఆపరెండీస్ అంటారు. ఇవన్నీ ఎస్సెమ్మెస్, ఈ-మెయిల్, ఫోన్ కాల్ వంటి ఎనిమిది రకాలైన మెథడ్స్ ద్వారా జరుగుతున్నట్లు గుర్తించారు. ప్రస్తుతం ఓ సైబర్ నేరం దర్యాప్తు పూర్తి చేయడానికి గరిష్టంగా 2 వేల పని గంటలు పడుతున్నాయి. ఈ లోపు నేరగాళ్లు దొరక్కుండా తప్పించుకోవడం, రికవరీలు దారుణంగా పడిపోవడం, ఆధారాలు ధ్వంసం కావడంతో శిక్షల శాతం తగ్గిపోవడం వంటివి జరుగుతున్నాయి. క్రైమ్ ఓఎస్ వ్యవస్థ అందుబాటులోకి వస్తే ఈ కాలం 250 గంటలకు తగ్గిపోతుంది. క్రైమ్ ఓఎస్ అమలైతే సైబర్ క్రైమ్ కేసుల దర్యాప్తు వేగవంతం కావడంతో పాటు దర్యాప్తు అధికారులపై ఒత్తిడి గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ స్టేట్ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీఎస్సీఎస్బీ) డైరెక్టర్, సైబరాబాద్ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర అన్నారు. ఈ విధానాన్ని దేశ వ్యాప్తంగా అమలు చేసే దిశలో కేంద్రం ఆలోచిస్తోందని పేర్కొన్నారు.

స్వరాష్ట్రంలో వైద్య విప్లవం: మంత్రి హరీశ్

సాక్షి, హైదరాబాద్: స్వరాష్ట్రంలో వైద్య ఆరోగ్య విప్లవం చోటు చేసుకుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్రావు అన్నారు. సీఎం కేసీఆర్ వైద్య ఆరోగ్యశాఖపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని ఎంతో బలోపేతం చేశారని చెప్పారు. ఫలితంగా ఉమ్మడి రాష్ట్రంలో కునారిల్లిన వైద్య ఆరోగ్య రంగం.. తొమ్మిదేళ్లలోనే దేశానికే ఆదర్శంగా ఎదిగిందని పేర్కొన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం ఆరోగ్య దినోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'తొమ్మిదేళ్లలో 21 కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేసుకోగలిగాం. 2014లో మొత్తం 2,950 ఎంబీబీఎస్ సీట్లు ఉంటే.. ఇప్పుడు 8,340 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చే స్థాయికి రాష్ట్రం ఎదిగింది. రాష్ట్రంలో ప్రతి లక్ష జనాభాకు 22 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. ఇందులో రాష్ట్రం దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. నిమ్స్లో అదనంగా 2,000 సూపర్ స్పెషాలిటీ పడకలతో భవనాలను నిర్మిస్తున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ బుధవారం వీటికి శంకుస్థాపన చేయనున్నారు' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

నేడు నిమ్స్ దశాబ్ది బ్లాక్కు సీఎం శంకుస్థాపన

లక్డీకాపూల్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని హైదరాబాద్ నిమ్స్లో నూతనంగా నిర్మించనున్న దశాబ్ది బ్లాక్ కొత్త భవనానికి (మొత్తం 4 బ్లాక్లు) బుధవారం ముఖ్యమంత్రి కేసీఆర్ భూమి పూజ చేయనున్నారు. 4 బ్లాక్లు పూర్తయితే ప్రస్తుతం ఉన్న 1,500 పడకలకు అదనంగా 2 వేల పడకలు అందుబాటులోకి రానున్నాయి. వీటిల్లో 120 ఓపీ గదులు, 1,200 ఆక్సిజన్ బెడ్లు, 500 ఐసీయూ పడకలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం వేర్వేరు చోట్ల ఉన్న ఆస్పత్రి 31 విభాగాలను ఒకేచోట కొత్త భవనాల్లోనే ఏర్పాటు చేసేలా అధికారులు ప్రణాళికలను రూపొందించారు.

ఈసెట్లో 93 శాతం ఉత్తీర్ణత

- ఫలితాలు విడుదల చేసిన ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి
- పురుషుల శాతమే ఎక్కువ, త్వరలో కౌన్సెలింగ్


పూర్ణ ఆకాంక్ష
ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్


అన్నం అక్షర
కంప్యూటర్ సైన్స్


అర్షియా జాస్మిన్
ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్


ఫణిశంకర్ అనిరుధ్
మెకానికల్ ఇంజనీరింగ్

సాక్షి, హైదరాబాద్: పలు డిప్లొమా కోర్సులు పూర్తిచేసి, ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశానికి గత నెలలో నిర్వహించిన ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్ ఈసెట్-2003) ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి మంగళవారం విడుదల చేశారు. ఈ పరీక్షలో 20,988 మంది (93.07 శాతం) అర్హత సాధించారని వెల్లడించారు. ఉత్తీర్ణత సాధించినవారిలో 14,415 మంది పురుషులు, 6,484 మంది మహిళలు ఉన్నారు. బీఎస్సీ (మ్యాథ్స్), కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఇనుస్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, మెకానికల్, మెటలర్జికల్, మైనింగ్, ఫార్మసీ బ్రాంచీల్లో 9 వేల సీట్లు ఉన్నా యని, వీటికి త్వరలో కౌన్సెలింగ్ చేపడతామని లింబాద్రి తెలిపారు. విలేకరుల సమావేశంలో ఈసెట్ కన్వీనర్ శ్రీరాం వెంకటేష్, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్, ఓయూ వీసీ డి.రవీందర్ పాల్గొన్నారు.

ప్రధాన బ్రాంచీల్లో టాపర్స్ వీరే...

పేరు	జిల్లా	మార్కులు
మెకానికల్ ఇంజనీరింగ్		
కొండూరు ఫణిశంకర్ అనిరుధ్	మేడ్చల్	171
బుద్దా ధనుష్ వర్షిత్	అనకాపల్లి (ఏపీ)	163
నౌగరి నవీన్	వరంగల్	149
డొంకెన సాద్విక్	పెద్దపల్లి	141
ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్		
అర్షియా జాస్మిన్	హనుమకొండ	163
పోలంపల్లి నిఖిల్	నిజామాబాద్	150
గుండేడి రామ్చరణ్	పెద్దపల్లి	141
కుచన సందీప్	వరంగల్	132
ఇ.శ్రీప్రియ	హైదరాబాద్	127
ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్		
పూర్ణ ఆకాంక్ష	జనగాం	163
అమ్మిరెడ్డి హితికా రెడ్డి	నల్లగొండ	157
జి సాయిబ రూపేష్	నల్లగొండ	154
వినిశెట్టి వరుణ్	వరంగల్	154
దుబ్బాక అమర్నాథ్	కరీంనగర్	152
కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్		
అన్నం అక్షర	సంగారెడ్డి	158
కొడెం రోహిత్	సిరిసిల్ల	157
వేలూరు యువరాజ్ రెడ్డి	సిద్దిపేట	154
జైని వరుణ్	నల్లగొండ	149
శేగూరి కార్తీక్ రాం	మేడ్చల్	149
సివిల్ ఇంజనీరింగ్		
మార్తా సాత్విక్	రంగారెడ్డి	161
ఎండీ రుక్సానా	వరంగల్	156
అల్లిమిల్ల సాయి కలకేశ్వరి	కరీంనగర్	151
అమ్మిరెడ్డి శివ రెడ్డి	నల్లగొండ	150
కడిపికొండ చరణ్ తేజారెడ్డి	హనుమకొండ	149

ఇక సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికల కాలపరిమితి రెండేళ్లే

- గతంలోనే నిర్ణయించిన సీఎల్సీ
- ఆగస్టు 3 లేదా 10న ఎన్నికలు
- ఈ నెల 24న విడుదల కానున్న షెడ్యూల్
- హైదరాబాద్లో జరిగిన సమావేశంలో నిర్ణయం


డిప్యూటీ సీఎల్సీతో సమావేశమైన కార్మిక సంఘాలు

సాక్షి, హైదరాబాద్/సింగరేణి/గోదావరిఖని(కొత్తగూడెం): ఇక రెండేళ్లు కాలపరిమితిగా సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు ఆగస్టులో జరగనున్నాయి. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్లో డిప్యూటీ లేబర్ కమిషనర్(సెంట్రల్) కార్యాలయంలో సింగరేణి యాజమాన్యం, 14 రిజిస్టర్డ్ కార్మిక సంఘాల నాయకులతో డీసీఎల్సీ డి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో త్రైపాక్షిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో కేంద్ర కార్మికశాఖ ఆదేశాల మేరకు రెండేళ్ల కాలపరిమితిగా సింగరేణి ఎన్నికలు నిర్వహించాలని చీఫ్ లేబర్ కమిషనర్ (సీఎల్సీ) నిర్ణయించగా..దీన్ని యాజమాన్యం పూర్తిగా వ్యతిరేకించింది. దీంతో కార్మిక సంఘాల ఒప్పందంతో తిరిగి నాలుగేళ్ల ఎన్నికల గడువు ఇవ్వాలని కోరుతూ సీఎల్సీకి డిప్యూటీ లేబర్ కమిషనర్ లేఖ రాయాలని తీర్మానించారు. చీఫ్ లేబర్ కమిషనర్ నుంచి నాలుగేళ్ల గడువు ఇవ్వగానే ఈ నెల 24న తిరిగి సమావేశమై ఆగస్టు 3 లేదా 10వ తేదీన ఎన్నికలు నిర్వహించాలని సూత్రప్రాయంగా నిర్ణయించారు. ఇందుకు సంబంధించి ఈనెల 24న మరోమారు సమావేశమై అదేరోజు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేయనున్నారు. అదేవిధంగా గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం బొగ్గు ఉత్పత్తి ప్రాంతాల్లో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికులకే కాక అన్ని విభాగాల కార్మికులకు బోనస్ చెల్లింపుతోపాటు ఈఎస్ఐ సౌకర్యం కూడా కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించింది. ఈ సమావేశంలో సింగరేణి యాజమాన్యం తరఫున డైరెక్టర్(పా) ఎన్.బలరామ్, జీఎం పర్సనల్(ఐఆర్పీఎం) ఏ.కుమార్రెడ్డి, ఏజీఎం పర్సనల్ కవితానాయుడు, పర్సనల్ మేనేజర్ చేతి అశోక్ కుమార్తో పాటు కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మరో 17 బీసీ గురుకుల డిగ్రీ కాలేజీలు

- త్వరలో పరిపాలనా పరమైన అనుమతులు..
- ఈ విద్యా సంవత్సరంలోనే తరగతులు ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా మరో 17 బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలు మంజూరయ్యాయి. ఈ బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలకు త్వరలోనే పరిపాలన అనుమతులు మంజూరవుతాయని, సీఎం కేసీఆర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఆదేశాల మేరకు ఈ విద్యా సంవత్సరం నుంచే తరగతుల ప్రారంభానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం తెలిపారు. గతేడాది 15 బీసీ గురుకుల డిగ్రీ కళాశాలలు ప్రారంభం కాగా, ఇప్పుడు మంజూరైన కళాశాలలతో ప్రతి జిల్లాకు ఓ గురుకుల డిగ్రీ కళాశాల ఈ విద్యాసంవత్సరం నుంచే అందుబాటులోకి వచ్చినట్లయింది.

బీసీలకు పెరిగిన విద్యావకాశాలు: మంత్రి గంగుల

రాష్ట్రంలో బీసీ విద్యార్థులకు డిగ్రీ స్థాయిలో జిల్లాకో గురుకుల కళాశాలను ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికి దక్కుతుందని ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఉన్న వర్గల్ కాలేజీకి అదనంగా 2022 – 23 విద్యా సంవత్సరంలో కొత్తగా 15 గురుకుల డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామని, ఇందులో రెండు వ్యవసాయ డిగ్రీ కాలేజీలున్నాయని ఆయన పేర్కొన్నారు. తాజాగా జిల్లాకొక డిగ్రీ కాలేజీకి ముఖ్యమంత్రి కేసీఆర్ అనుమతివ్వడంతో మరో 17 డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో గురుకుల విద్య అరకొరగా అందుతుండేదని, కేసీఆర్ ప్రభుత్వం ఉన్నతస్థాయి నాణ్యతా ప్రమాణాలతో ఇప్పుడు గురుకులాలను దశలవారీగా పెంచుతూ వచ్చిందని వివరించారు. ఇప్పుడు ఏకంగా 327 బీసీ గురుకులాలను ఏర్పాటు చేసిందన్నారు.

ఆర్టీసీకి మరో 'లక్కీ మండే'

రూ.20.80 కోట్ల ఆదాయంతో ఆల్టైం రికార్డు

సాక్షి, హైదరాబాద్: ఒకరోజు గరిష్ట ఆదాయం పొందటంలో ఆర్టీసీ ఆల్టైం రికార్డు సృష్టించింది. పూర్తిస్థాయిలో బస్సులు తిప్పటం, అధిక కిలోమీటర్ల మేర ట్రిప్పులు నడపడం, అధికారులు, సిబ్బంది ఫీల్డులో ఉంటూ ఆక్యుపెన్సీ రేషియో పెరిగేలా చేయటం.. తదితర చర్యలతో సోమవారాల్లో రికార్డు స్థాయి ఆదాయం పొందుతున్న ఆర్టీసీ సోమవారం (12వ తేదీ) రూ.20.80 కోట్ల ఆదాయాన్ని సొంతం చేసుకుంది. ఈనెల 5న పొందిన రూ.20.36 కోట్లే ఇప్పటి వరకు రికార్డుగా ఉంది.

టీ24 టికెట్ ధరలపై డిస్కౌంట్ తొలగింపు

ఇటీవల డిస్కౌంట్లు ప్రకటించిన టీ24 టికెట్ల వాస్తవ ధరలను ఆర్టీసీ పునరుద్ధరించింది. కొంత కాలంగా రూ.90గా ఉన్న అడల్ట్ టీ24 టికెట్ ధరను రూ.100కు, రూ.80గా ఉన్న వయో వృద్ధుల టికెట్ ధరను రూ.90కి పెంచుతున్నట్టు ప్రకటించింది. ఈ ధరలు జూలై 31 వరకు కొనసాగుతాయని పేర్కొంది.

మాజీ ఎమ్మెల్యే దయాకర్రెడ్డి కన్నుమూత

క్యాన్సర్తో చికిత్స పొందుతూ మృతి


దయాకర్రెడ్డి (ఫైల్)


దయాకర్రెడ్డి పాడె మోస్తున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

మక్తల్/చిన్నచింతకుంట/సాక్షి, హైదరాబాద్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మక్తల్ మాజీ ఎమ్మెల్యే కొత్తకోట దయాకర్రెడ్డి అనారోగ్యంతో మంగళవారం తెల్లవారుజామున మృతిచెందారు. కొన్ని నెలలుగా క్యాన్సర్తో బాధపడుతున్న ఆయన హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. మూడుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన దయాకర్రెడ్డి 1958 ఆగస్టు 18న మహబూబ్నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలం పర్కాపూర్లో జన్మించారు. డిగ్రీ వరకు చదువుకున్నారు. తెలుగుదేశం పార్టీలో చేరి అమరచింత నియోజకవర్గం నుంచి 1994, 1999 సంవత్సరాల్లో ఎమ్మెల్యేగా వరుసగా రెండుసార్లు గెలుపొందారు. 2004లో జరిగిన ఎన్నికల్లో ఓడిపోయారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ఆయన మక్తల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి గెలుపొందగా.. అదే సమయంలో ఆయన సతీమణి సీతాదయాకర్రెడ్డి దేవరకద్ర నియోజకవర్గం నుంచి గెలుపొందారు. ఎమ్మెల్యేలుగా గెలుపొంది అసెంబ్లీలో అడుగుపెట్టిన భార్యాభర్తలుగా సీత, దయాకర్రెడ్డి రికార్డు సృష్టించారు. 2014, 2018లో జరిగిన ఎన్నికల్లో పోటీచేసి ఓటమిని చవిచూశారు. ఎన్నికల్లో ఓడిపోయినా మక్తల్ నియోజకవర్గంలో ప్రజల మధ్యన ఉంటూ సమస్యలపై పోరాడేవారు. వచ్చే ఎన్నికల్లో ఏదైనా ప్రధాన రాజకీయ పార్టీలో చేరాలని ప్రయత్నాలు సాగిస్తున్న తరుణంలో ఆరోగ్యం విషమించి మంగళవారం తుదిశ్వాస విడిచారు.

పాడె మోసిన చంద్రబాబు

టీడీపీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబునాయుడు మంగళవారం సాయంత్రం పర్కపురం చేరుకుని, దయాకర్రెడ్డి పార్థివదేహానికి నివాళి అర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్, కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అంతిమయాత్రలో పాల్గొన్న చంద్రబాబు కాసేపు పాడె మోశారు. మంత్రి శ్రీనివాస్గౌడ్, ఎంపీ మన్నె శ్రీనివాస్రెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్రెడ్డి, చిట్టెం రామ్మోహన్రెడ్డి, బండ్ల కృష్ణమోహన్రెడ్డి, బీజేపీ నేతలు డీకే అరుణ, జితేందర్రెడ్డి తదితరులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. దయాకర్రెడ్డి మృతిపై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, మాజీ మంత్రి నాగం జనార్దనరెడ్డి, మాజీ ఎంపీ మల్లురవి సంతాపం తెలిపారు.



మహిళా, శిశు సంక్షేమానికి పెద్దపీట

మహిళా, శిశు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యమిస్తోందని మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా అంగన్వాడీలకు అత్యధిక వేతనాలు ఇస్తోందని గుర్తు చేశారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహమూద్ అలీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అత్యున్నత పదవుల్లో మహిళలకు పెద్దపీట వేసి మహిళా సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మంగళవారం రవీంద్ర భారతిలో మహిళా సంక్షేమ సంబరాలను ఘనంగా నిర్వహించారు. వివిధ రంగాల్లో రాణించిన పలువురు మహిళలను సత్కరించారు. కార్యక్రమంలో మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీతా లక్ష్మారెడ్డి, సీఎస్ శాంతికుమారి, సీఎం కార్యదర్శి స్మితా సబర్వాల్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. - గన్ఫౌండ్రీ

రాష్ట్ర బీజేపీ సంస్థాగత విస్తరణ

- 125 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యుల నియామకం
- జాతీయ నాయకత్వ ఆమోదం తీసుకున్న సంజయ్
- కిషన్రెడ్డి, ఇతర ముఖ్యనేతలను సంప్రదించాకే ముందుకు..
- అన్ని సామాజికవర్గాలు, భౌగోళిక ప్రాంతాలకు ప్రాతినిధ్యం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కీలక నిర్ణయాలతో దూకుడు ప్రదర్శిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని వర్గాలు, కులాలు, భౌగోళిక ప్రాంతాలకు ప్రాతినిధ్యం కల్పించేలా ఏకంగా 125 మంది రాష్ట్ర కార్యవర్గసభ్యులను నియమించడం ద్వారా రాష్ట్ర పార్టీని సంస్థాగతంగా విస్తరించారు. ఎన్నికలకు సంసిద్ధతలో భాగంగా చేపడుతున్న ఈ నియామకాలకు జాతీయ నాయకత్వ ఆమోదం కూడా సంజయ్ తీసుకున్నట్టు సమాచారం. ఇందుకోసం బండి పెద్ద కసరత్తే నిర్వహించారు. పార్టీపరంగా ఎన్నికల క్షేత్రంలో పనిచేసే టీమ్ ఏర్పాటులో భాగంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుల నియామకం చేపట్టారు. ఇందుకోసం కేంద్రమంత్రి కిషన్రెడ్డి మొదలు ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా.కె.లక్ష్మణ్, డీకే అరుణ, ఈటల రాజేందర్ తదితర ముఖ్య నేతలను సంప్రదించారు. జిల్లాలు, ప్రాంతాల వారీగా 125 పేర్లను ఖరారు చేశారు. ఇప్పటికే రాష్ట్ర కార్యవర్గంలో 80 మంది దాకా సభ్యులు ఉండగా తాజా నియామకాలతో ఇప్పుడు ఆ సంఖ్య రెండువందలు దాటింది.

జిల్లా కమిటీల్లోనూ మార్పులు!: గతంలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులుగా, బీఆర్ఎస్, కాంగ్రెస్ లాంటి పార్టీల్లో కీలకపదవుల్లో పనిచేసిన వారిని కూడా రాష్ట్ర కార్యవర్గసభ్యులుగా నియమించడంపై అసంతృప్తి వ్యక్తమౌతోంది. రాష్ట్ర ప్రధానకార్యదర్శిగా, జాతీయ బీసీ కమిషన్ సభ్యుడిగా పనిచేసిన టి.ఆచారి, బీఆర్ఎస్లో ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన తుల ఉమ, యువ తెలంగాణ పార్టీ అధ్యక్షుడిగా వ్యవహరించిన జిట్టా బాలకృష్ణారెడ్డి, కాంగ్రెస్ పార్టీలో కోశాధికారి, ఏఐసీసీ సభ్యుడిగానూ ఉన్న గూడూరు నారాయణరెడ్డి ఈ జాబితాలో ఉన్నారు. ఇక సంస్థాగతంగా పార్టీకి 38 జిల్లా కమిటీలు ఉండగా వాటిలోనూ మార్పులు చేసే అవకాశాలున్నట్టు సమాచారం. తదుపరి చర్యల్లో భాగంగా ఈ మార్పులు చేపట్టే అవకాశాలున్నాయి. రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం రాని నాయకులకు కూడా త్వరలో ఇతరత్రా అవకాశాలు కల్పించనున్నట్టు పార్టీవర్గాల ద్వారా తెలుస్తోంది. పాత.. కొత్త నాయకులు, ఇంకా ఎవరైనా సీనియర్ నేతలకు అవకాశం దొరకని పక్షంలో వారిని కూడా ఏదోలా సర్దుబాటు చేసేందుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిసింది. తొమ్మిదేళ్లలో మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలపై దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'మహా జనసంపర్క్ అభియాన్'లో భాగంగా రాష్ట్రంలో ఈ నెల 30వ తేదీ దాకా చేపడుతున్న వివిధ ప్రచార కార్యక్రమాలు ముగిశాక జూలై 1 నుంచి పార్టీ కార్యకలాపాలను ముమ్మరం చేయాలని బండి సంజయ్ నిర్ణయించారు.

క్లుప్తంగా...

కశ్మీర్‌లో భూకంపం.. ఉత్తరభారతంలో ప్రకంపనలు

దోడా/న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో మంగళవారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.4గా నమోదైంది. ప్రజలు భయభ్రాంతులకు గురై ఇళ్లనుంచి బయటకు పరుగులు తీశారు. కొన్ని భవనాలకు నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో దోడాకు 150 కిలో మీటర్ల దూరంలోని హిమాచల్‌ప్రదేశ్‌లోని చంబా, ఢిల్లీ, పంజాబ్, హరియాణాలతోపాటు పొరుగునే ఉన్న పాకిస్తాన్‌లోనూ ప్రకంపనలు సంభవించాయి. దోడాలో భూమికి ఆరు కిలో మీటర్ల లోతున భూకంప కేంద్రం ఉందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ(ఎన్‌సీఎస్)తెలిపింది. దోడాలోని భదేర్వాహ్ పట్టణంలోని కొన్ని భవనాలకు పగుళ్లు సంభవించాయి. జిల్లా ఆస్పత్రిలోని ఓ వార్డు పైకప్పు కూలి శిథిలాలు రోగులపై పడ్డాయి. దీంతో, వారిని అధికారులు అక్కడి నుంచి ఖాళీ చేయించారు.

బిహార్ మంత్రి ఆకస్మిక రాజీనామా

పట్నా: బిహార్ మంత్రి సంతోష్ సుమన్ పదవికి ఆకస్మికంగా రాజీనామా చేశారు. బిహార్ మాజీ ముఖ్యమంత్రి, హిందుస్తానీ ఆవామ్ మోర్చా(హెచ్ఏఎం) వ్యవస్థాపకుడు అయిన జితన్ రామ్ మాంఝి కొడుకే సంతోష్ సుమన్. సంతోష్ సుమన్ సీఎం నితీశ్ కుమార్ కేబినెట్‌లో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖను నిర్వహిస్తున్నారు. తమ పార్టీ హెచ్ఏఎంను అధికార జేడీయూలో విలీనం చేయాలంటూ ఒత్తిళ్లు ఎక్కువైనందునే వైదొలుగుతున్నట్లు సంతోష్ సుమన్ తెలిపారు. తన రాజీనామా లేఖను సీఎంకు పంపానన్నారు. సంతోష్ సుమన్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. హెచ్ఏఎంకు సంకీర్ణంలో ఇక చోటులేదని స్పష్టం చేసింది. అసెంబ్లీలో హెచ్ఏఎంకు నలుగురు సభ్యులున్నారు.

నైజీరియాలో ఘోర పడవ ప్రమాదం.. 100 మంది మృతి

అబుజా: నైజీరియాలోని క్వారా రాష్ట్రంలో నైగర్ నదిలో పడవ మునిగిన దుర్ఘటనలో సుమారు 100 మంది చనిపోయారు. నైగర్ రాష్ట్రంలోని ఓ గ్రామంలో సోమవారం జరిగిన వివాహ వేడుకలో పాల్గొని పడవలో తిరిగి వస్తుండగా తెల్లవారు జామున మూడు గంటల సమయంలో ఈ ఘోరం చోటుచేసుకుంది. ఉదయం వరకు ఈ ప్రమాదం విషయం ఎవరికీ తెలియలేదు. అనంతరం అధికారులు గాలింపు చేపట్టారు. ప్రమాదం నుంచి ఎవరూ బయట పడినట్లు సమాచారం లేదు.

జన విస్ఫోటనంతో దుర్బల భారత్!



- పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడానికి ప్రకృతి విధ్వంసం
- ఇతర దేశాలతో పోలిస్తే వాతావరణ మార్పుల ముప్పు అధికం
- హెచ్చరించిన పర్యావరణ నిపుణులు

వాతావరణ మార్పులు ప్రపంచ దేశాలకు పెను విపత్తుగా పరిణమిస్తున్నాయి. కొన్ని దేశాల్లో ఆకస్మిక వరదలు, అదే సమయంలో మరికొన్ని దేశాల్లో కరువులు.. ఇవన్నీ వాతావరణ మార్పుల ఫలితాలే. ఈ విపత్తు వల్ల ప్రపంచంలో దాదాపు అన్ని దేశాలకూ ముప్పు ఉన్నప్పటికీ భారత్‌కు మాత్రం ఇంకా ఎక్కువ ప్రమాదం పొంచి ఉందని, దేశంలోని అధిక జనాభాయే ఇందుకు కారణమని ఐక్యరాజ్యసమితి పర్యావరణ కార్యక్రమం(యూఎన్ఈపీ) కార్యనిర్వాహక డైరెక్టర్ ఎరిక్ సాల్హీమ్ స్పష్టం చేయడం గమనార్హం. వాతావరణ మార్పుల ప్రభావాలు ప్రపంచమంతటా కనిపిస్తున్నాయని చెప్పారు. అధిక జనాభా వల్ల భారత్ మరింత దుర్బల దేశంగా మారనుందని హెచ్చరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. వాతావరణ నిపుణులు ఏం చెబుతున్నారంటే..

- భూగోళం ఎదుర్కొంటున్న అన్ని రకాల పర్యావరణ సమస్యలు భారత్‌కు కూడా ఎదురవుతున్నాయి.
- భారత్‌లో ప్రధానంగా ఉత్తరాది రాష్ట్రాల్లోని పలు నగరాలు, పట్టణాలు ఇప్పటికే కాలుష్యంతో నిండిపోయాయి. దేశ రాజధాని ఢిల్లీలో కాలుష్య తీవ్రత గురించి తెలిసిందే.
- నానాటికీ పెరిగిపోతున్న జనాభా, తద్వారా మానవ కార్యకలాపాలు ఈ కాలుష్యానికి, విపత్కర పరిస్థితులకు కారణమవుతున్నాయి.
- వాతావరణ మార్పుల ముప్పు అమెరికాతో పోలిస్తే భారత్‌కు అధికంగా ఉంది.
- భారత్‌లో ప్రకృతి విధ్వంసం కొనసాగుతోంది. మానవ ఆవాసాలు, వ్యవసాయం కోసం అడవులను యథేచ్ఛగా నరికేస్తున్నారు. ప్రకృతి సమతుల్యతకు దోహదపడే జంతుజాలం నశిస్తోంది. జీవవైవిధ్యం క్రమంగా కనుమరుగవుతోంది.
- పెరుగుతున్న జనాభా అవసరాలు తీర్చడానికి ప్రకృతిని బలి చేయక తప్పడం లేదు. పరిమిత జనాభా కలిగిన దేశాలు, జనాభా పెరుగుదలను నియంత్రిస్తున్న దేశాల్లో ఇలాంటి పరిస్థితి పెద్దగా లేదు.
- భారత్‌లో జనాభా పెరుగుదలను నియంత్రిస్తే కాలుష్యాన్ని కట్టడి చేయవచ్చు. వాతావరణ మార్పులను కూడా నియంత్రించవచ్చు.
- భారత్ జనాభా 142 కోట్ల పైమాటే. జన విస్ఫోటనంతో ప్రపంచ కాలుష్య దేశాల జాబితాలో భారత్ మొదటి స్థానానికి చేరే రోజులు ఎంతో దూరంలో లేవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
- భూగోళంపై పర్యావరణాన్ని చక్కగా కాపాడుకుంటేనే మనుషులకు, జీవజాలానికి ఆవాసయోగ్యంగా ఉంటుంది. ఇందుకోసం ప్రపంచ దేశాలన్నీ పర్యావరణ పరిరక్షణపై తక్షణమే దృష్టి పెట్టాలి.
- చైనాలో 100 శాతం విద్యుదీకరణ దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. శిలాజ ఇంధనాలతో నడిచే వాహనాల స్థానంలో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరుగుతోంది. ఇతర దేశాల్లోనూ ఇలాంటి ప్రయత్నమే జరగాలని నిపుణులు సూచిస్తున్నారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

భారత ప్రభుత్వం బెదిరించింది

- రైతుల ఉద్యమ సమయంలో ట్విట్టర్ ఖాతాలను నిలిపివేయాలని ఆదేశించింది
- మాట వినకపోతే భారత్‌లో ట్విట్టర్‌ను మూసేస్తామని హెచ్చరించింది.
- ట్విట్టర్ మాజీ సీఈఓ జాక్ డోర్సే సంచలన ఆరోపణలు
- ఖండించిన పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ నేతలు
- డోర్సే పచ్చి అబద్ధాలు చెబుతున్నారని ఆగ్రహం
- డోర్సే ఆరోపణలపై మోదీ ప్రభుత్వం స్పందించాలని కాంగ్రెస్ డిమాండ్



న్యూఢిల్లీ: భారత్‌లో వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా 2020, 2021లో పెద్ద ఎత్తున రైతుల ఉద్యమం జరిగినప్పుడు ట్విట్టర్ ఖాతాలపై ఆంక్షలు విధించాలని కేంద్ర ప్రభుత్వం తమను ఆదేశించిందని, మాట వినకపోతే దేశంలో ట్విట్టర్‌ను మూసివేస్తామని హెచ్చరించిందని జాక్ డోర్సే సంచలన ఆరోపణలు చేశారు. ట్విట్టర్ సహ వ్యవస్థాపకుడైన జాక్ డోర్సే 2021లో ఆ సంస్థ సీఈఓ పదవి నుంచి తప్పుకున్నారు. ఖాతాలపై ఆంక్షలు విధించడంతోపాటు కొన్ని పోస్టులను తొలగించకపోతే సంస్థను మూసివేయడంతోపాటు ఉద్యోగుల ఇళ్లలో సోదాలు చేస్తామని భారత ప్రభుత్వం బెదిరించిందని, తమపై ఒత్తిడి తెచ్చిందని తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆయన చెప్పారు. తుర్కియే(టర్కీ), నైజీరియా ప్రభుత్వాల నుంచి కూడా తమకు బెదిరింపులు వచ్చాయని అన్నారు. చెప్పినట్లు చేయాలని అక్కడి ప్రభుత్వాలు తమపై ఒత్తిడి తెచ్చాయని పేర్కొన్నారు. భారత ప్రభుత్వంపై జాక్ డోర్సే చేసిన ఆరోపణలను కేంద్ర ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ మంగళవారం కొట్టిపారేశారు. డోర్సే పచ్చి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు. డోర్సే సీఈఓగా ఉన్న సమయంలో భారత ప్రభుత్వ చట్టాలకు అనుగుణంగా పనిచేసేందుకు ట్విట్టర్ యాజమాన్యం నిరాకరించిందని గుర్తుచేశారు. భారత ప్రభుత్వ చట్టాలు తమకు వర్తించవన్నట్లుగా వ్యవహరించిందని అన్నారు. ట్విట్టర్ సంస్థ నుంచి ఎవరూ జైలుకు వెళ్లలేదని, మన దేశంలో ట్విట్టర్‌ను మూసివేయలేదని చెప్పారు. తప్పులను కప్పిపుచ్చుకోవడానికే జాక్ డోర్సే పస లేని ఆరోపణలు చేస్తున్నారని రాజీవ్ చంద్రశేఖర్ ఆక్షేపించారు. జాక్ డోర్సే ఆరోపణలను కేంద్ర ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్, బీజేపీ సీనియర్ నేత, కేంద్ర ఐటీ శాఖ మాజీ మంత్రి రవి శంకర్ ప్రసాద్, బీజేపీ ఐటీ విభాగం నాయకుడు అమిత్ మాలవీయ తదితరులు ఖండించారు. దేశానికి వ్యతిరేకంగా కొందరు తప్పుడు ప్రచారం సాగిస్తున్నారని, అలాంటి వారి ఖాతాలపై చర్యలు తీసుకోవాలని అప్పట్లో ట్విట్టర్ యాజమాన్యానికి సూచించామని రవిశంకర్ ప్రసాద్ అన్నారు.

కేంద్రం సమాధానం చెప్పాలి: ఖర్గే

ట్విట్టర్ మాజీ సీఈఓ జాక్ డోర్సే చేసిన ఆరోపణలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే డిమాండ్ చేశారు. సోషల్ మీడియాను, జర్నలిస్టులను అణచివేయడం ప్రభుత్వం ఇకనైనా ఆపాలని అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని బలహీనపర్చేందుకు బీజేపీ పన్నుతున్న కుట్రలను కచ్చితంగా అడ్డుకుంటామని ఖర్గే తేల్చిచెప్పారు. డోర్సే ఆరోపణలపై మోదీ ప్రభుత్వం వెంటనే స్పందించాలని కాంగ్రెస్ సీనియర్ నేతలు జైరామ్ రమేశ్, రణదీప్ సూర్జేవాలా, కేసీ వేణుగోపాల్ తదితరులు డిమాండ్ చేశారు.

ట్విట్టర్ ఖాతాలను బ్లాక్ చేశారు: తికాయత్

వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు సాగిస్తున్న ఉద్యమాన్ని ప్రముఖంగా వెలుగులోకి తీసుకొచ్చిన ట్విట్టర్ ఖాతాలను అప్పట్లో ప్రభుత్వం నిలిపివేసిన సంగతి నిజమేనని, ఈ విషయం చిన్న పిల్లలకు కూడా తెలుసని భారతీయ కిసాన్ యూనియన్(బీకేయూ) నేత రాకేశ్ తికాయత్ చెప్పారు. ఖాతాలను బ్లాక్ చేసేలా ట్విట్టర్ యాజమాన్యంపై కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి తెచ్చిందని అన్నారు. రైతుల ఉద్యమం ప్రజల్లోకి వెళ్లకూడదన్నదే ప్రభుత్వ ఉద్దేశమని పేర్కొన్నారు. చాలా ట్విట్టర్ ఖాతాలు ఇప్పటికీ మూసివేసి ఉన్నాయని వివరించారు. అసమ్మతిని, వ్యతిరేకతను కేంద్రం సహించదని వ్యాఖ్యానించారు.

తమిళనాడు మంత్రి ఇంట్లో ఈడీ సోదాలు

సాక్షి, చెన్నై: తమిళనాడు విద్యుత్, ఎక్సైజ్ శాఖల మంత్రి సెంథిల్‌బాలాజీకి చెందిన పలుప్రాంతాల్లో మంగళవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోదాలు జరిపింది. చెన్నైలోని ఆయన నివాసాలు, కార్యాలయాలు, సచివాలయంలోని చాంబర్, కరూర్, కోయంబత్తూరు, ఈరోడ్‌లోని ఆయన సన్నిహితుల నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారికి సీఆర్‌పీఎఫ్, ఆర్‌పీఎఫ్ బలగాలు బందోబస్తు కల్పించారు. గత నెలలోనూ మంత్రి సెంథిల్ బాలాజీకి చెందిన 40 చోట్ల ఐటీ సోదాలు వారం రోజుల పాటు సాగిన విషయం తెలిసిందే. అయితే, సచివాలయంలో ఎలాంటి అనుమతులు పొందకుండా ఈడీ సోదాలు నిర్వహించడంపై డీఎంకే ప్రభుత్వం సీరియస్ అయింది. దీనిని సమాఖ్య వ్యవస్థకు తూట్లు పొడవటంగా సీఎం స్టాలిన్ అభివర్ణించారు. దీనిపై బుధవారం మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని తెలిపారు. 'రాజకీయంగా ఎదుర్కోలేని బీజేపీ, బెదిరింపు రాజకీయాలకు పాల్పడుతోంది. వీటికి మేం భయపడం. ఈ విషయం వారే గ్రహించే సమయం దగ్గరపడింది' అని ముఖ్యమంత్రి స్టాలిన్ ఒక ప్రకటనలో తెలిపారు. దివంగత సీఎం జయలలిత హయాంలో రవాణా శాఖ మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీపై లంచాలు తీసుకుని ఉద్యోగాలిచ్చినట్లు (క్యాష్ ఫర్ జాబ్స్) కుంభకోణం కేసు ఉంది. ఇందులో మనీలాండరింగ్ ఆరోపణలపై ఈడీ దర్యాప్తు చేస్తోంది.

వచ్చే నెలలో సీడబ్ల్యూసీకి కొత్త టీమ్!

- కసరత్తు చేస్తున్న ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే
- ఎన్నికల దృష్ట్యా తెలంగాణ నుంచి ఒకరికి చోటు దక్కే చాన్స్?

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీలో చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న పార్టీ అత్యున్నత నిర్ణయాధికార సంస్థ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) పునర్ వ్యవస్థీకరణపై పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే దృష్టి సారించారు. ఈ ఏడాది డిసెంబర్‌లోనే తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు జరుగుతుండటం, మరో ఏడాదిలో సార్వత్రిక ఎన్నికలు ఎదుర్కోవాల్సిన దృష్ట్యా సీడబ్ల్యూసీ నియామకాలను పూర్తి చేసే కసరత్తులో పడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జరిగిన పార్టీ మూడు రోజుల ప్లీనరీ సమావేశంలో, వర్కింగ్ కమిటీ సభ్యులందరినీ నామినేట్ చేసేందుకు పార్టీ అధ్యక్షుడికే పూర్తి అధికారం ఇవ్వాలని స్టీరింగ్ కమిటీ ఏకగ్రీవంగా నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా కుల, ప్రాంత, రిజర్వేషన్‌ల ప్రాతినిధ్యం ఆధారంగా సభ్యుల ఎంపికను మొదలుపెట్టినట్లు ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. రాయ్‌పూర్ ప్లీనరీలో తీసుకున్న నిర్ణయం మేరకు సీడబ్ల్యూసీలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, మహిళలు, 50 ఏళ్లలోపు యువకులకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయించిన నేపథ్యంలో వీటి ఆధారంగా ఇప్పటికే కొన్ని పేర్లను షార్ట్‌లిస్ట్ చేసినట్లు తెలుస్తోంది. రాహుల్‌గాంధీ అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాత ఈ లిస్ట్‌పై చర్చలు చేసి నెలలోగా తుది ప్రకటన చేస్తారని సమాచారం. ఇక సీడబ్ల్యూసీలోకి తెలుగు రాష్ట్రాల నుంచి ఎవరిని తీసుకుంటారనే దానిపై ఆసక్తి నెలకొంది. ఈ ఏడాది చివరన జరగనున్న ఎన్నికల దృష్ట్యా తెలంగాణ నుంచి ఒకరికి అవకాశం దక్కుతుందని ఏఐసీసీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీజేపీ పార్టీలో అత్యున్నత పార్లమెంటరీ బోర్డుతో పాటు, కేంద్ర ఎన్నికల కమిటీలో సీనియర్ నేత కె.లక్ష్మణ్‌కు ఆ పార్టీ అవకాశం ఇచ్చింది. మరోపక్క పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా డీకే అరుణ కొనసాగుతున్నారు. తెలంగాణ నేతలకు బీజేపీ ఇచ్చిన ప్రాధాన్యత మాదిరే రాష్ట్ర నేతలకు కాంగ్రెస్ హైకమాండ్ సీడబ్ల్యూసీలో ప్రాధాన్యమిస్తుందని భావిస్తున్నారు. ఒకవేళ చోటు కల్పించాలని నిర్ణయిస్తే షార్ట్‌లిస్ట్‌లో ఎంపీలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో పాటు మాజీ ఎంపీ వి.హనుమంతరావు పేర్లు ఉండే అవకాశం ఉందని తెలుస్తోంది. పదేళ్ల కింద తెలంగాణ నుంచి మాజీ పీసీసీ అధ్యక్షుడు కె.కేశవరావు సీడబ్ల్యూసీలో సభ్యునిగా ఉండగా, ఆ తర్వాత రాష్ట్రం నుంచి కొత్త సభ్యుడిగా ఎవరికి అవకాశం దక్కుతుందన్న దానిపై తీవ్ర ఆసక్తి నెలకొంది.

రేటు కార్డా? సేఫ్ గార్డా?

- యువత భవిష్యత్తు ఎవరిపై ఆధారపడాలి?
- అది దేశమే తేల్చుకుంటుంది
- ఉద్యోగ నియామకాల్లో అవినీతిని అంతం చేశాం
- ప్రధానమంత్రి మోదీ స్పష్టీకరణ
- రోజ్‌గార్ మేళాలో 70,000 మందికి నియామక పత్రాలు పంపిణీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిపక్షాలపై మరోసారి విరుచుకుపడ్డారు. కొన్ని రాష్ట్రాల్లో వారసత్వ పార్టీలు ఉద్యోగాల పేరిట 'రేటు కార్డుల'తో యువతను దోచుకుంటున్నాయని దుయ్యబట్టారు. తమ ప్రభుత్వం యువత ప్రయోజనాల పరిరక్షణ కోసం(సేఫ్‌గార్డ్) పని చేస్తోందని ఉద్ఘాటించారు. వారసత్వ పార్టీలా? లేక మంచి చేసే ప్రభుత్వమా? యువత భవిష్యత్తు ఎవరిపై ఆధారపడాలన్నది దేశమే తేల్చుకుంటుందని స్పష్టం చేశారు. ప్రధాని మోదీ మంగళవారం రోజ్‌గార్ మేళాలో పాల్గొన్నారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఉద్యోగాలు పొందిన 70,000 మందికి పైగా యువతీ యువకులకు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ.. ఇప్పటి విపక్షాలు గతంలో అధికారంలో ఉన్నప్పుడు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడ్డాయని పరోక్షంగా కాంగ్రెస్‌పై ధ్వజమెత్తారు. పథకాల పేరిట ప్రజాధనం దోచుకున్నాయని ఆరోపించారు. ఉద్యోగాల నియామకాల్లోనూ అవినీతి, అవకతవకలు జరిగాయన్నారు. రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో అవినీతి, ఆశ్రిత పక్షపాతాన్ని ప్రోత్సహించడం ద్వారా వారసత్వ పార్టీలు యువతను దగా చేస్తున్నాయని ఆక్షేపించారు. తమ ప్రభుత్వం వచ్చాక పూర్తి పారదర్శకంగా, అవినీతికి తావులేకుండా నియామకాలు చేపడుతున్నామని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించడంతో పాటు ప్రజా సాధికారతే లక్ష్యంగా కృషి చేస్తున్నామని వెల్లడించారు. గతంలో నియామక ప్రక్రియ పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పట్టేదని, ఇప్పుడు నెలల వ్యవధిలోనే పారదర్శకంగా పూర్తి చేస్తున్నామని గుర్తుచేశారు.

నిర్ణయాత్మకత.. మన గుర్తింపు

సమాజంలో విభజన తెచ్చేందుకు, ప్రజల మధ్య చిచ్చు పెట్టేందుకు కొన్ని పార్టీలు భాషను ఒక ఆయుధంగా వాడుకుంటున్నాయని ప్రధాని మోదీ విమర్శించారు. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాల్లో ఇలాంటి పెడపోకడలు కనిపిస్తున్నాయని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు బీజేపీని, హిందీ భాషను బూచిగా చూపిస్తూ పబ్బం గడుపుకొనేందుకు ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. పశ్చిమ బెంగాల్‌లో ప్రభుత్వ ఉద్యోగాలకు రేటు కార్డులు, కట్ మనీ వంటివి కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ రేటు కార్డులు యువత కలలను, సామర్థ్యాలను ఛిద్రం చేస్తున్నాయని చెప్పారు. ఉద్యోగాలు ఇప్పించినందుకు బదులుగా పేద రైతుల నుంచి భూములు తీసుకున్నందుకు ఆర్జేడీ నేత లాలూ ప్రసాద్ యాదవ్ క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్నారని గుర్తుచేశారు.

ఆర్థిక వ్యవస్థకు కొత్త ధీమా

దేశంలో ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో నూతన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు విస్తృతంగా అందుబాటులోకి వస్తున్నాయని ప్రధాని మోదీ వెల్లడించారు. ముద్రా యోజన, స్టార్టప్ ఇండియా, స్టాండప్ ఇండియా వంటి కార్యక్రమాలతో స్వయం ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతున్నాయని చెప్పారు. ఆర్థికంగా వేగంగా ముందుకు సాగుతున్నామని, మన దేశ ఆర్థిక వ్యవస్థకు గతంలో ఇలాంటి విశ్వాసం, ధీమా ఎన్నడూ లభించలేదన్నారు.

ట్రంప్ మళ్లీ అరెస్టు

మియామీ కోర్టులో హాజరు

మియామీ: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మంగళవారం మరోసారి కోర్టు ఎదుట హాజరయ్యారు. అధ్యక్ష పదవి నుంచి దిగిపోయాక అధికారిక రహస్యాలున్న పత్రాలను వెంట తీసుకెళ్లాడని అభియోగాలను ఎదుర్కొంటున్న ట్రంప్ మంగళవారం మియామీ ఫెడరల్ కోర్టుకు వచ్చారు. లాంఛనంగా అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో ట్రంప్‌ను హాజరు పరిచారు. ఫ్లోరిడాలోని తన ఎస్టేట్‌లో ట్రంప్ నిబంధనలకు విరుద్ధంగా అధికారిక రహస్య పత్రాలను దాచారని అభియోగాలు నమోదైన విషయం తెలిసిందే. ఈ కేసులో ట్రంప్ మొత్తం 37 అభియోగాలను ఎదుర్కొంటున్నారు.

జెలెన్‌స్కీ సొంత పట్టణంపై రష్యా క్షిపణి దాడులు

11 మంది మృతి, 28 మందికి గాయాలు



క్రివ్వి రిహ్‌లో ధ్వంసమైన అపార్టుమెంట్ భవనం

కీవ్: ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సొంత పట్టణమైన క్రివ్వి రిహ్‌పై సోమవారం రాత్రి రష్యా క్షిపణులతో విరుచుకుపడింది. ఒక అపార్ట్‌మెంట్ భవనం, గోదాముపై జరిగిన ఈ దాడుల్లో 11 మంది ప్రజలు చనిపోగా, మరో 28 మంది గాయపడ్డారు. రష్యా ఆక్రమణ మొదలైన 15 నెలల తర్వాత ఉక్రెయిన్ బలగాలు తీవ్ర ఎదురుదాడులు ప్రారంభించిన సమయంలో ఈ దాడి జరగడం గమనార్హం. క్షిపణులు సృష్టించిన విధ్వంసానికి సంబంధించిన ఫొటోలను అధ్యక్షుడు జెలెన్‌స్కీ టెలిగ్రామ్ చానల్‌లో ప్రసారం చేశారు. దాడుల అనంతరం సహాయక చర్యలను చేపట్టినట్లు నీప్రోపెట్రోవ్‌స్క్ ప్రాంత గవర్నర్ చెప్పారు. ఘటనపై రష్యా రక్షణ శాఖ స్పందించింది. ఉక్రెయిన్ సైనిక స్థావరాలు, పశ్చిమదేశాలు అందించిన ఆయుధాలు, మందుగుండు సామగ్రి డిపోలపై తాము దాడులు చేసినట్లు తెలిపింది. ఉక్రెయిన్‌లోని రెండో అతిపెద్ద నగరం ఖర్కీవ్‌పై షహీద్ డ్రోన్లతో రష్యా జరిపిన దాడుల్లో ఇద్దరు పౌరులు గాయపడ్డారని అధికారులు చెప్పారు. రాజధాని కీవ్‌పైనా రష్యా క్షిపణి దాడులు మంగళవారం కొనసాగాయని, అయితే, రక్షణ వ్యవస్థలు వాటిని గాలిలోనే అడ్డుకున్నాయని తెలిపారు. మొత్తం 14 క్షిపణుల్లో 10 క్షిపణులను, నాలుగు షహీద్ డ్రోన్లలో ఒకదానిని కూల్చేసినట్లు ఉక్రెయిన్ మిలటరీ ప్రకటించింది. అదేవిధంగా, జెపొరిఝియా, డొనెట్‌స్క్, లుహాన్‌స్క్ ప్రాంతాల్లో తిష్టవేసిన రష్యా బలగాలపై నాలుగు చోట్ల ఎదురుదాడి కొనసాగుతోందని తెలిపింది.

ప్రధాని మోదీతో జేక్ సలీవన్ భేటీ

న్యూఢిల్లీ: అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలీవన్ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సమావేశమయ్యారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం సలీవన్ మంగళవారం ఢిల్లీకి చేరుకున్నారు. అనంతరం మోదీతో సమావేశమై, భారత్–అమెరికా ద్వైపాక్షిక సంబంధాల ప్రగతిపై చర్చించారు. మోదీకి ఆహ్వానం పలికేందుకు తమ అధ్యక్షుడు జో బైడెన్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని సలీవన్ తెలిపారు. తన అమెరికా పర్యటన ఫలవంతం కావాలని ఆకాంక్షిస్తున్నానని, ఇరు దేశాల ప్రయోజనాలతో ముడిపడిన ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై బైడెన్‌తో చర్చిస్తానని మోదీ ఈ సందర్భంగా సలీవన్‌తో చెప్పారు.

21న మోదీకి బైడెన్ దంపతుల ప్రత్యేక విందు

వాషింగ్టన్: భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 21 నుంచి 24వ తేదీ దాకా.. నాలుగు రోజులపాటు అమెరికాలో పర్యటించనున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ దంపతులు ఈ నెల 21న మోదీకి ప్రత్యేక విందు ఇస్తారని, ఈ విందులో బైడెన్ కుటుంబ సభ్యులు మాత్రమే పాల్గొంటారని సమాచారం. 22న అధికారిక విందు జరుగుతుందని వైట్‌హౌస్ సీనియర్ అధికారి ఒకరు చెప్పారు. 22న విందు కంటే ముందు వైట్‌హౌస్ సౌత్ లాన్‌లో మోదీకి ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. అయితే, 21న మోదీకి ప్రత్యేక విందు ఎక్కడ ఇస్తారన్నది ఇంకా తెలియరాలేదు.

బిపర్‌జోయ్‌తో భారీ విధ్వంసం

- 15న సాయంత్రం తీరాన్ని దాటే అవకాశం
- 150 కిలోమీటర్ల వేగంతో గాలులు.. 25 సెంటీమీటర్ల కుంభవృష్టి కురియవచ్చు
- గుజరాత్‌లోని కచ్, ద్వారక, జామ్‌నగర్‌లకు ఐఎండీ హెచ్చరిక
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలిస్తున్న యంత్రాంగం



గాంధీధామ్‌లో ఏర్పాటు చేసిన తుపాను షెల్టర్

న్యూఢిల్లీ/అహ్మదాబాద్: అరేబియా సముద్రంలో కొనసాగుతున్న బిపర్‌జోయ్ తుపాను భారీ విధ్వంసాన్ని సృష్టించే ప్రమాదముందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఈ ప్రభావం గుజరాత్‌లోని కచ్, ద్వారక, జామ్‌నగర్ జిల్లాలపైనే ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. బిపర్‌జోయ్ మంగళవారం అత్యంత తీవ్ర స్థాయి నుంచి తీవ్రమైన తుపానుగా బలహీనపడిందని ఐఎండీ పేర్కొంది. ఇది గుజరాత్‌లోని సౌరాష్ట్ర, కచ్, మాండ్వి, జఖౌ పోర్టులతోపాటు పాకిస్తాన్‌లోని కరాచీ మధ్య ఈ నెల 15 సాయంత్రం తీరాన్ని తాకే అవకాశాలున్నాయని తెలిపింది. దీని ప్రభావంతో గంటకు 125 నుంచి 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని పేర్కొంది. 'కచ్, ద్వారక, జామ్‌నగర్, పోరుబందర్ జిల్లాల్లో ఈనెల 13– 15 తేదీల మధ్య అత్యంత భారీగా 20 నుంచి 25 సెంటీమీటర్ల మేర కుంభవృష్టి కురియవచ్చు. తీవ్ర ఉధృతితో కూడిన ఈదురు గాలులు, అతి భారీ వర్షాలు కచ్, ద్వారక, జామ్‌నగర్ జిల్లాల్లోని లోతట్టు ప్రాంతాలను వరదలు ముంచెత్తి, తీవ్ర నష్టం కలిగించవచ్చు'అని ఐఎండీ హెచ్చరించింది. 'రాజ్‌కోట్, మోర్బి, జునాగఢ్‌ల్లో కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముంది. ఈ ప్రాంతాల్లో ఈ నెల 15 వరకు గరిష్ఠంగా గంటకు 150 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయి. ఈ కారణంగా పంటలు, నివాసాలు, రహదారులు, విద్యుత్, సమాచార వ్యవస్థలు దెబ్బతింటాయి. సముద్రంలో ఆరు మీటర్ల ఎత్తు వరకు ఎగిసిపడే అలలు సౌరాష్ట్ర, కచ్ తీరాల్లోని లోతట్టు ప్రాంతాలను ముంచెత్తవచ్చు'అని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర మీడియాకు తెలిపారు. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున చమురు అన్వేషణ, నౌకల సంచారం, చేపల వేట వంటివాటిని ఈ నెల 16 వరకు నిలిపివేయాలని ఐఎండీ తెలిపింది. తీరాన్ని దాటిన తుపాను బలహీనపడి, తన గమనాన్ని దక్షిణ రాజస్తాన్ వైపు మార్చుకుంటుందని ఐఎండీ అంచనా వేసింది. దీని ప్రభావంతో ఈనెల 15–17 తేదీల్లో ఉత్తర గుజరాత్‌లో భారీ వర్షాలకు కురుస్తాయని తెలిపింది. అరేబియా సముద్రంలో ఈ సీజన్‌లో ఏర్పడిన మొట్టమొదటి తుపాను బిపర్‌జోయ్..సముద్ర జలాల అసాధారణ వేడి వల్లే ఎన్నడూ లేనంత సుదీర్ఘకాలం పాటు తుపాను కొనసాగిందని ఐఎండీ వివరించింది. ఈ నెల 6న ఏర్పడిన ఈ తుపాను మంగళవారం నాటికి 8 రోజుల 9 గంటలపాటు కొనసాగిందని తెలిపింది.

30 వేల మంది తరలింపు

బిపర్‌జోయ్ ప్రభావిత జిల్లాలకు చెందిన 30 వేల మందిని తాత్కాలిక షెల్టర్లలోకి తరలించినట్లు గుజరాత్ ప్రభుత్వం తెలిపింది.తుపాను సంబంధిత ఘటనల్లో ఇప్పటి వరకు ఒకరు చనిపోయినట్లు తెలిపింది. ముందు జాగ్రత్తగా మూడు రైళ్లను రద్దు చేయడంతోపాటు 55 రైళ్ల ప్రయాణ మార్గాన్ని కుదించినట్లు పశ్చిమ రైల్వే తెలిపింది. సముద్రంలో ఓ ఆయిల్ రిగ్‌పై పనిచేస్తున్న 50 మంది సిబ్బందిని సోమవారం రాత్రి బయటకు తీసుకువచ్చారు. కాండ్లా పోర్టును మూసివేశారు. అక్కడ పనిచేసే 3 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. మన్సుఖ్ మాండవీయ సహా ఐదుగురు కేంద్ర మంత్రులు సహాయక చర్యలను సమన్వయం చేస్తున్నారు.

రాహుల్ ట్రక్కు జర్నీ..ఈసారి అమెరికాలో!



న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ట్రక్కులో సవారీ చేశారు. తాజాగా అమెరికాలో ట్రక్కులో ప్రయాణించిన ఆయన భారతీయ అమెరికన్ డ్రైవర్లతో ముచ్చటించారు. వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఇటీవలి అమెరికా పర్యటన సమయంలో రాహుల్ గాంధీ..వాషింగ్టన్ నుంచి న్యూయార్క్ వరకు 190 కిలోమీటర్ల మేర ట్రక్కులో ప్రయాణించారు. ఈ జర్నీలో ట్రక్కు డ్రైవర్ తల్జిందర్ సింగ్ వికీ గిల్, సహ డ్రైవర్ రంజీత్ సింగ్ బనిపాల్‌లను వేతనాలు, సౌకర్యాలు, వృత్తి పరంగా భారతీయ అమెరికన్ ట్రక్కు డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి హోటల్‌లో భోజనం చేశారని కాంగ్రెస్ పార్టీ తాజాగా తెలిపింది. రాహుల్ గత నెలలో ఢిల్లీ నుంచి చండీగఢ్ వరకు ట్రక్కు ప్రయాణం చేశారు. ఆ సమయంలో ట్రక్కు డ్రైవర్ల సమస్యలను తెలుసుకున్న విషయాన్ని గుర్తు చేసింది. అమెరికాలో డ్రైవర్ల భద్రత, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకునే ట్రక్కులను రూపొందిస్తారని రాహుల్ గాంధీ తెలిపారు. ఇలాంటివి ఏర్పాట్లు భారత్‌లో ఉండవని రాహుల్ చెప్పారు. భారత్‌లో డ్రైవర్లు అరకొర జీతాలు, సౌకర్యాలతో ఇబ్బందులు పడుతుండగా, అమెరికాలో సరిపోను వేతనాలు, గౌరవప్రదమైన జీవితం ఉంటుందని రాహుల్ తెలుసుకున్నారు. మన రవాణా వ్యవస్థకు ఎంతో కీలకమైన ట్రక్కు డ్రైవర్లకు గౌరవప్రదమైన జీవితం కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారని కాంగ్రెస్ తెలిపింది.

సాక్షి కరీంనగర్

బుధవారం । 14 । జూన్ । 2023

రక్తం ఇవ్వు.. ఎప్పుడూ ఇస్తుండు..

రక్తదాన శిబిరాలలో రక్తదానం చేయండి!
దోమలను మీ రక్తాన్ని పీల్చుకోనివ్వకండి.
మీ రక్తంతో రోగులు శ్వాస పీల్చుకోనివ్వండి!
ఎంత దానం చేసినా.. తరగని ఆస్తి రక్తం.
ఆపదలో ఉన్న వారికి అదే అమృతం!
రక్తదానం నిలబెట్టును ప్రాణం.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం. ఇచ్చేది కొంతైనా నిండు జీవితాన్ని నిలబెట్టే సంజీవని. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే రక్తదాతలు దొరక్కపోతే.. పరిస్థితి ఊహించుకోండి. రక్తం ఇవ్వు. ఇప్పుడే ఇవ్వు. ఎప్పుడూ ఇస్తుండు.. ప్రాణాలు నిలుపుతుండు. బుధవారం 'ప్రపంచ రక్తదాతల దినోత్సవం' సందర్భంగా ప్రత్యేక కథనం...

– వివరాలు 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
40.0/28.0

జిల్లాలో ఎండ తీవ్రత కొనసాగుతుంది. వడగాలులు వీస్తాయి. ఉక్కపోత తీవ్రంగా ఉంటుంది. రాత్రిపూట కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. వర్షం కురిసే అవకాశం స్వల్పంగా ఉంది.

తీగలగుట్టపల్లి ఆర్వోబీకి మోక్షం!

- టెండర్లు ఖరారు కావడంతో చిగురించిన ఆశలు
- గతంలో సేతుబంధన్ కింద రూ.126 కోట్లు విడుదల
- 4.5 ఎకరాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం
- ఆర్వోబీపై బీఆర్ఎస్–బీజేపీ మాటల యుద్ధం



రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ జామ్

సాక్షిప్రతినిధి, కరీంనగర్: ఏళ్ల తరబడిగా నగరవాసులు ఎదురు చూస్తున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ)కి ఎట్టకేలకు మోక్షం లభించింది. సేతు బంధన్ ప్రాజెక్టు కింద కరీంనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న లెవెల్‌క్రాసింగ్ వద్ద నిర్మించనున్న ఆర్వోబీకి కేంద్రం రూ.126 కోట్లు గత నవంబరులో మంజూరు చేసింది. కేంద్రంతో ఓ ఒప్పందంలో భాగంగా దీని నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ చేపట్టనుంది. టెండర్లు ముగిశాయని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ ప్రకటించడంతో బ్రిడ్జి పనులు ప్రారంభమవుతాయన్న ఆశ నగరవాసుల్లో కలిగింది. మంచిర్యాల–ఆదిలాబాద్–కరీంనగర్–హైదరాబాద్ మార్గంలో నిత్యం ప్రయాణించే వేలాది వాహనాలు, ప్రయాణికులకు ఇకపై రోడ్లపై నిరీక్షించే బాధలు తప్పనున్నాయి.

రూ.126 కోట్లతో..

వాస్తవానికి ఇక్కడ ఆర్వోబీ నిర్మించాలని గత టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ ఎంపీగా ఉన్న బి.వినోద్ కేంద్రానికి పలుమార్లు లేఖలు రాశారు. దక్షిణ మధ్య రైల్వేకు కరీంనగర్, ఉప్పల్, బిజిగిరిషరీఫ్ వద్ద ఆర్వోబీల కోసం ప్రతిపాదనలు పంపారు. స్పందించిన కేంద్రం బ్రిడ్జి నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు చేసింది. దీంతో ఎంపీ బండి సంజయ్ అనుచరులు సంబరాలు చేసుకున్నారు. ఇటీవల కేంద్రం సేతుబంధన్ ప్రాజెక్టు కింద ఆర్వోబీ కోసం రూ.126 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ బాధ్యతలు మాత్రం రాష్ట్ర ప్రభుత్వం చూసుకుంటుందని సమాచారం.

రెండు భారీ పిల్లర్లు..

కరీంనగర్–చొప్పదండి మార్గంలో కొత్తపల్లి–మనోహరాబాద్ మార్గంలో లెవెల్ క్రాసింగ్–18 వద్ద ఆర్వోబీని నిర్మించనున్నారు. ఈ వంతెన నిర్మాణానికి మొత్తం 4.66 ఎకరాల భూమి అవసరం. అందులో 4.085 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం సేకరిస్తుండగా.. మిగిలిన 0.550 ఎకరాల భూమిని రైల్వేశాఖ సమకూరుస్తుంది. పెద్దపల్లి–నిజామాబాద్, కొత్తపల్లి మనోహరాబాద్ మార్గంలో ఉన్న లెవల్ క్రాసింగ్ వద్ద ఈ రైల్వేలైన్‌కు ఇరువైపులా.. రెండు భారీ పిల్లర్లు నిర్మించనున్నారు. దానిపైన స్టీల్‌బేరింగులు, బ్రిడ్జి డెక్‌లను కూర్చోబెడతారు. వంతెనపై రోడ్డు మధ్యలో డివైడర్, దానికి ఇరువైపులా 12 మీటర్ల (సుమారు 40 ఫీట్లు) వెడల్పుతో రోడ్లు నిర్మిస్తారు. వంతెనను ఇటు కరీంనగర్, అటు చొప్పదండి వైపు అప్రోచ్ రోడ్లు కలుపుతాయి. వీటికింద గోడౌన్లు కూడా ఏర్పాటు చేసే వీలుందని సమాచారం.

మారిన డిజైన్..?

తాజాగా బ్రిడ్జి ప్రతిపాదనలు మారినట్లు తెలుస్తోంది. గతంలో స్థానిక పాదచారులు, ద్విచక్ర వాహనదారులకు వీలుగా ఉండేలా ఫ్లెటోవర్‌కు ఇరువైపులా రెండు రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)లు కూడా నిర్మించాలని అనుకున్నారు. కానీ... ఫ్లెటోవర్ కారణంగా రెండువైపులా భూసేకరణ చేయాల్సి రావడం, రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న వారు ఉపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో వారి వినతి మేరకు ఆర్‌యూబీల ప్రతిపాదనను రాష్ట్ర ప్రభుత్వం విరమించుకున్నట్లు తెలిసింది. ఈ విషయంలో బీజేపీ–బీఆర్ఎస్‌లు కత్తులు దూసుకుంటున్నాయి. తమ ఘనత వల్ల ప్రాజెక్టు వచ్చిందంటే.. తమ ఘనత అంటూ సవాళ్లు ప్రతిసవాళ్లు విసురుకుంటున్నారు.

తప్పనున్న ట్రాఫిక్ కష్టాలు

2020కి ముందు నగరంలో రైల్వేస్టేషన్ వద్ద ఇప్పటిస్థాయిలో ట్రాఫిక్ జామ్‌లు ఉండేవి కావు. కానీ.. కరోనా సమయం నుంచి జిల్లాలో గ్రానైట్, కోల్, మొక్కజొన్న, వరి తదితర ఉత్పత్తులకు భారీగా ఎగుమతి అవుతున్నాయి. రైల్వేశాఖ కూడా పెద్దపల్లి–కరీంనగర్–నిజామాబాద్ రూట్లో గూడ్స్ రైళ్ల ఫ్రీక్వెన్సీని డిమాండ్‌కు తగినట్లు భారీగా పెంచింది. ఫలితంగా గతంలో రోజుకు మూడునాలుగు సార్లు పడే రైల్వేగేటు.. ఇపుడు పదికి పెరిగింది. ఈ రూట్లో రైళ్ల ఫ్రీక్వెన్సీ పెరగడం, మరోవైపు నగరంలో పెరుగుతున్న జనాభా, వాహనాలు రైల్వేగేటు దాటాల్సి రావడంతో ట్రాఫిక్ కష్టాలు పెరిగాయి. ముఖ్యంగా మెడికల్ హబ్‌గా ఉన్న కరీంనగర్‌కు ఆదిలాబాద్, మంచిర్యాల, జగిత్యాల జిల్లాల నుంచి రోగులు.. అత్యవసరంగా వచ్చే అంబులెన్స్‌లు రైల్వేగేటు పడిన ప్రతీసారీ ఆగిపోతున్నాయి. బ్రిడ్జి పనులు మొదలైతే.. ఇకపై అన్ని చిక్కులు వీడుతాయని నగరవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

స్మార్ట్‌సిటీ.. లెస్ క్వాలిటీ

- నాణ్యతా లోపం
- విపరీత జాప్యం
- పర్యవేక్షణ కరువు
- ఇష్టారీతిన పనులు



హౌసింగ్‌బోర్డుకాలనీ పార్క్ వద్ద టైల్స్ పరిస్థితి

కరీంనగర్ కార్పొరేషన్: అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్మార్ట్ సిటీ పనుల్లో క్వాలిటీ కొరవడింది. పనుల నాణ్యతపై నగరవాసులే కాకుండా ప్రతిపక్షాలు, అధికారపక్ష నేతలూ ఆరోపణలు చేస్తున్నారు. ఒకేరోజు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్‌కుమార్, బీఆర్ఎస్ నేత, సివిల్‌సప్లై కార్పొరేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ స్మార్ట్ సిటీ వర్క్స్‌పై చేసిన వ్యాఖ్యలు పనుల తీరుకు అద్దం పడుతున్నాయి. సుమారు రూ.1000 కోట్లతో చేపడుతున్న పనులు తుదిదశకు చేరుకుంటున్నాయి. ఇప్పటికే సుమారు రూ.257 కోట్ల పనులు పూర్తికాగా, రూ.651 కోట్ల పనులు ప్రగతిలో ఉన్నాయి. మరో రూ.26.50 కోట్లు టెండర్ దశలో ఉండగా, రూ.2.50 కోట్లు టెండర్ కావాల్సి ఉన్నాయి.



పనుల్లో నాణ్యత ఉండడం లేదు. విపరీతమైన జాప్యం జరుగుతోంది. ప్రజల ఫిర్యాదులు పరిగణనలోకి తీసుకోవాలి. సమస్యలు పరిష్కరించాలి. ఇలా చేస్తే ఎలా? అధికారులు స్పందించాలి.
– బండి సంజయ్, కరీంనగర్ ఎంపీ



స్మార్ట్ సిటీ పనుల్లో నాణ్యతపై మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌కు వందల దరఖాస్తులు ఇచ్చినా పట్టించుకోలేదు. స్మార్ట్ సిటీపై ఎందుకీ నిర్లక్ష్యం. కాంట్రాక్టర్‌తో లాలూచీ వ్యవహారం బయటపెడుతాం. – రవీందర్ సింగ్, సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్

నాణ్యతపై అనుమానాలు

స్మార్ట్ సిటీ పనుల్లో నాణ్యతపై మొదటి నుంచి అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ కింద చేపడుతున్న పనులు కూడా సాధారణ పనులకన్నా అధ్వానంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తూనే ఉన్నాయి. ముందుగా పూర్తయిన కలెక్టరేట్ రోడ్డు కూడా ఒక్క వర్షం వరదకే తేలిపోయింది. మళ్లీ మరమ్మతులు చేయాల్సి వచ్చింది. ఇటీవల తిరుమలనగర్‌లో డ్రైనేజీ నిర్మాణ దశలోనే కూలిపోయింది. సీసీ రోడ్లు, డ్రైనేజీ శ్లాబ్‌ల నిర్మాణ అనంతరం అక్కడక్కడా పగుళ్లు చూపాయి. ఇవి భవిష్యత్‌లో మరింత దెబ్బతినే అవకాశం ఉంది. ఇక ఫుట్‌పాత్‌లు, టైల్స్ నిర్మాణాల్లో పూర్తిగా నాణ్యత లోపించిందనే చెప్పవచ్చు. మెటీరియల్ సరిగా వేయకుండానే పైపైన టైల్స్ వేస్తుండడంతో కొద్దిరోజులకే అది కుంగిపోయి టైల్స్ ఊడిపోతున్నాయి. అక్కడక్కడా మరమ్మతులు చేస్తున్నా.. పరిస్థితి మళ్లీ మొదటికొచ్చే అవకాశం ఉంది. వర్షాకాలంలో పరిస్థితి మరింత దిగజారనుంది. డ్రైనేజీల నిర్మాణంలోనూ నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కొన్ని ప్రాంతాల్లో ఆయా వీధుల్లోని డ్రైనేజీలకు లింక్ కూడా కలపకుండా నిర్మాణాలు పూర్తిచేశారు.



క్యూరింగ్ లేకపోవడంతో క్రాక్స్ వచ్చిన డ్రైనేజీ

పత్తాలేని పర్యవేక్షణ

స్మార్ట్ సిటీ పనుల పర్యవేక్షణపై అధికారులు పూర్తిగా చేతులెత్తేశారు. పనులు చేపట్టిన మొదట్లో ఎస్‌ఈ స్థాయి అధికారి కూడా క్షేత్రస్థాయిలో పరిశీలనకు వచ్చేది. నిబంధనలకు అనుగుణంగా డ్రైనేజీ లేకపోతే, కూల్చివేసి తిరిగి నిర్మించిన సందర్భాలూ ఉన్నాయి. కారణమేంటో కాని రానురాను అధికారుల పరిశీలన కూడా లేకుండా పోయింది. ఆ తర్వాత పనులను పట్టించుకునే వాళ్లే కరువయ్యారు. ఫలితంగా కాంట్రాక్టర్, సూపర్‌వైజర్ల ఇష్టారాజ్యంగా మారింది. కార్మికులు చేసిందే పనిగా మారింది. దీంతో నాణ్యత, నిబంధనలు ప్రశ్నార్థకంగా మారాయి.

విపరీత జాప్యం

స్మార్ట్ సిటీ పనులు కొనసాగుతున్న ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రికిరాత్రే రోడ్లు తవ్వుతుండడం, మట్టికుప్పలు పోస్తుండడం...నెలల తరబడి అలానే ఉండడంతో ఆయా కాలనీల వాసులు ఇండ్లల్లోకి వెళ్లడం ఇబ్బందిగా మారింది. డ్రైనేజీల కోసం రోడ్లు తవ్వి సంవత్సరం పాటు అలానే ఉంచిన పరిస్థితులు కూడా నగరంలో ఉన్నాయి. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సూచికలు ఏర్పాటు చేయాలనే నిబంధనలు పాటించడంలేదు. ఉన్నతాధికారులు స్మార్ట్ సిటీ పనుల నాణ్యత, జాప్యంపై పూర్తి స్థాయిలో దృష్టి సారిస్తే తప్ప గాడినపడే అవకాశం లేదు.



పైపై సిమెంట్ పూతలు

నాణ్యత పాటించకపోతే చర్యలు

నగరంలో జరుగుతున్న స్మార్ట్ సిటీ పనుల్లో నాణ్యత పాటించకపోతే చర్యలు తీసుకుంటాం. పనుల్లో నాణ్యతా లోపం సాధారణంగా ఉండదు. ప్రాజెక్ట్ కన్సల్టెన్సీ వాళ్లు ఎప్పటికప్పుడు పరిశీలిస్తుంటారు. వాళ్లతో పాటు నగరపాలకసంస్థ అధికారులు కూడా పర్యవేక్షిస్తున్నారు. ఎక్కడైనా లోపం ఉంటే సరిచేస్తున్నాం.
– సేవా ఇస్లావత్, కమిషనర్, నగరపాలకసంస్థ

సాక్షి ఫొటోలు

స్మార్ట్ సిటీ ప్రాజెక్ట్ కింద నగరంలో చేపట్టిన పనులు

పూర్తయిన పనులు

ప్రాజెక్ట్ పేరు	వ్యయం రూ.కోట్లల్లో...
స్మార్ట్ రోడ్ల అభివృద్ధి (ప్యాకేజీ1)	112.97
స్మార్ట్ రోడ్ల అభివృద్ధి (ప్యాకేజీ2)	118.00
అంబేద్కర్ స్టేడియం స్పోర్ట్స్‌కాంప్లెక్స్	16.00
ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు (హనుమాన్‌రోడ్, సుభాష్‌నగర్)	1.00
నాఖాచౌరస్తా, ఐబీసర్కిల్ జంక్షన్ల అభివృద్ధి	0.37
సర్కస్‌గ్రౌండ్ విహార ప్రాంతం	3.95
ఎస్‌డబ్ల్యూఎం షెడ్ నిర్మాణం	1.43
సర్కస్ గ్రౌండ్ నిర్వహణ (సంవత్సరం)	0.20
కమాన్ జంక్షన్ పురోగతి	0.23
స్కాడా సిస్టమ్	0.96
ఈపీడీఎం ఫ్లోరింగ్ సర్కస్ గ్రౌండ్	0.37
రోడ్డు సూచికలు	1.25
రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ సిస్టమ్	0.08
మొత్తం	256.94 కోట్లు

టెండర్ స్టేజీలో ఉన్నవి

సమీకృత మున్సిపల్ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్	రూ.25.00 కోట్లు
మల్టీపర్పస్ స్కూల్ ఫ్లోరింగ్	రూ.1.50 కోట్లు
మొత్తం	రూ.26.50 కోట్లు

టెండర్ కావాల్సినవి

మల్టీపర్పస్ స్కూల్ స్కల్పచర్ వర్క్	రూ.0.50 కోట్లు
డిజిటల్ ఇంటి నెంబర్లు	రూ.2.00 కోట్లు
మొత్తం	రూ.2.50 కోట్లు

అభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిది

- కలెక్టర్ ఆర్వీ కర్ణన్
- ఆరోగ్య లక్ష్మితో పౌష్టికాహారం
- మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు
- ఘనంగా మహిళా సంక్షేమ దినోత్సవం



కలెక్టర్ ఆర్వీ కర్ణన్‌కు కేక్ తినిపిస్తున్న కార్పొరేషన్ డెప్యూటీ మేయర్ స్వరూపరాణి

కరీంనగర్: సంక్షేమ పథకాలు, అభివృద్ధిలో మహిళల పాత్ర ఎనలేనిదని కలెక్టర్ ఆర్వీ కర్ణన్ అన్నారు. మంగళవారం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లాకేంద్రంలోని గోపికృష్ణ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన మహిళా సంక్షేమ దినోత్సవంలో కలెక్టర్ ఆర్వీ.కర్ణన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలోకి తీసుకువెళ్లడంతో పాటు వాటిని విజయవంతం చేయడంలో మహిళలు ప్రధానపాత్ర పోషిస్తున్నారని తెలిపారు. తెలంగాణ ఆవిర్భావం నుంచి జిల్లాలోని 172 అంగన్‌వాడీల్లో ఆరోగ్య లమి పథకం ద్వారా గర్భిణులు, బాలింతలకు ప్రతీరోజు పోషకాహారం అందించడం జరుగుతోందని తెలిపారు. మహిళలు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆరోగ్యమహిళా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి ఎనిమిది రకాలవ్యాధులకు వైద్య సేవలు అందించడం జరుగుతోందని వివరించారు. మార్కెట్ కమిటీలోనూ రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతోందని అన్నారు. 2014–15 నుంచి 2023వరకు 15,900 మంది స్వయంసహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలోనే ప్రప్రథమంగా జిల్లాలో మహిళా లైబ్రరీని ఏర్పాటు చేయడానికి బీసీ సంక్షేమ, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ నిర్ణయించారని, దీనిని జిల్లాలోని మహిళా సంఘ భవనంలో ఏర్పాటు చేసి రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈనెల 20న ప్రారంభించనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి కరీంనగర్ నియోజకవర్గంలోని 762స్వశక్తి సంఘాలకు బ్యాంకులింకేజీ ద్వారా రూ.66,99,29,000 చెక్కును, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ద్వారా కరీంనగర్ నియోజకవర్గంలోని 29 స్వయం సహాయ సంఘాలకు రూ.3,30,00,000 చెక్కు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి, ఉత్తమసేవలు అందించిన 20మంది మహిళా ఉద్యోగులను సత్కరించారు. డిప్యూటీ మేయర్ చల్లా స్వరూపరాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, కరీంనగర్ ఆర్డీవో ఆనంద్‌కుమార్, సీడబ్ల్యూసీ చైర్మన్ ధనలక్ష్మి, జిల్లా మార్కెటింగ్ అధికారి పద్మావతి, సఖి వన్‌స్టాప్ లీగల్ కౌన్సిలర్ సంధ్యారాణి, మహిళాడిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పాఠశాలలను ప్రారంభానికి సిద్ధం చేయాలి



కరీంనగర్: జిల్లాలో మనఊరు– మనబడి కార్యక్రమం ద్వారా పాఠశాలల పునరుద్ధరణ పనులు పూర్తిచేసి ప్రారంభానికి సిద్ధం చేయాలని స్థానికసంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఈనెల 20న నిర్వహించనున్న విద్యాదినోత్సవ కార్యక్రమ ఏర్పాట్లపై సమీక్షించారు. దశాబ్ది ఉత్సవాలలో భాగంగా ఈనెల 20న నిర్వహించనున్న విద్యాదినోత్సవం సందర్భంగా పాఠశాలలను పూలతో తీర్చిదిద్దాలని ఆదేశించారు. మనఊరు–మనబడి పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. డీఈవో జనార్దన్‌రావు, పంచాయితీరాజ్ ఈఈలు, ఎంఈవోలు, ఏఈలు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కనీస సామర్థ్యాలు ఉండాలి



సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రస్తుతకాలంలో ప్రతి విద్యార్థికి భాషలో నైపుణ్యం, గణితంలో చతుర్విధ ప్రక్రియలు తప్పకుండా రావాలని డీఈవో సీహెచ్.జనార్దన్‌రావు సూచించారు. మంగళవారం స్థానిక కార్ఖానగడ్డలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులతో సమావేశమై పాఠశాల ప్రగతిపై సమీక్ష నిర్వహించారు. పాత భవనాన్ని కూల్చడానికి ఇంజనీరింగ్ విభాగ అధికారులతో మాట్లాడారు. కేవలం తరగతి గది నైపుణ్యాలే కాకుండా విద్యార్థులకు ఏఏ రంగాల్లో ఆసక్తి ఉందో వాటిపై దృష్టి సారించే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతీ 15రోజులకు ఒకసారి బడికి రాని విద్యార్థుల ఇంటికి వెళ్లి వారిని పాఠశాలకు వచ్చే విధంగా కృషి చేయాలని సూచించారు. జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ కర్ర అశోక్‌రెడ్డి, తదితరులు వెంట ఉన్నారు.

ఎంసీహెచ్‌లో నార్మల్ డెలివరీ.. 4 కిలోల శిశువు జననం



కరీంనగర్‌టౌన్: కరీంనగర్‌లోని మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో మంగళవారం సాధారణ ప్రసవం ద్వారా ఓ మహిళ 4కిలోల బరువున్న మగ శిశువుకు జన్మనిచ్చింది. రాజన్నసిరిసిల్ల జిల్లా బోయిన్‌పల్లి మండలానికి చెందిన మౌనిక సోమవారం ఎంసీహెచ్‌సీలో చేరింది. పురిటి నొప్పులు రావడంతో సాధారణ ప్రసవం చేశారు. నాలుగు కిలోల బరువున్న శిశువు జన్మించింది. ఇలాంటి కాన్పు సాధారణ ప్రసవం ద్వారా అరుదుగా జరుగుతుందని వైద్యులు తెలిపారు. డాక్టర్ నిఖత్ పర్వీన్, ఆశా జ్యోతి, మిడ్‌వైఫ్ రమ్యశ్రీ, కల్పన ప్రసవం చేశారు. వీరిని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్ కృష్ణ ప్రసాద్, ఆర్ఎంవో డాక్టర్ జ్యోతి, నవీన అభినందించారు.

ఇంటర్ సప్లిమెంటరీకి 308 మంది గైర్హాజరు

కరీంనగర్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు మంగళవారం 308మంది గైర్హాజరైనట్లు డీఐఈవో రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరం జనరల్, వొకేషనల్ విభాగాల్లో 4028 మంది విద్యార్థులకుగాను 243 మంది గైర్హాజరు కాగా 3785 మంది పరీక్ష రాశారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం జనరల్, వొకేషనల్ విభాగాల్లో 465 మంది విద్యార్థులకు గాను 65 మంది గైర్హాజరు కాగా 400 మంది పరీక్ష రాశారని డీఐఈవో పేర్కొన్నారు.

బీజేపీ చౌకబారు రాజకీయాలు మానుకోవాలి

- మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా, ఎంపీగా నాలుగేళ్లల్లో కేంద్రం నుంచి నయా పైసా తీసుకరాలేని బండి సంజయ్ ఎన్నికల సమీపిస్తున్న వేళ స్మార్ట్‌సిటీ పనులు పరిశీలన అంటూ ప్రజలను మభ్యపెట్టే విధంగా వ్యవహరించడం విడ్డూరంగా ఉందని మేయర్ వై.సునీల్‌రావు ఫైర్ అయ్యారు. మంగళవారం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో మాట్లాడుతూ ఎంపీ సంజయ్ ఇన్నాళ్లకు స్మార్ట్ సిటీ అభివృద్ధి పనులు వీక్షించినందుకు సంతోషం అన్నారు. కళ్లముందు జరుగుతున్న పనులు చూసి అబద్ధాలు, అసత్యాలు ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. స్మార్ట్‌సిటీ హోదా దక్కిన నగరాలతో పోల్చితే కరీంనగర్ శరవేగంగా అభివృద్ధి చెందిందన్నారు. నిధుల కేటాయింపుల్లో బీజేపీ కార్పొరేటర్లపై వివక్షత చూపుతున్నారని ఎంపీ సంజయ్ ఆరోపించడం తగదని సూచించారు. ఎంపీ బండి సంజయ్ ఎంపీ కోటా నిధులను కేవలం బీజేపీ కార్పొరేటర్లకు మాత్రమే కేటాయించారని ఇది వివక్షత కాదా అని ప్రశ్నించారు. స్మార్ట్‌సిటీలో జరుగుతున్న అభివృద్ధిని అడ్డుకునే కుట్రలు మానుకోవాలని హెచ్చరించారు. మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ వినోద్ కుమార్ చొరవతోనే నగరం అభివృద్ధి చెందుతోందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లు గందె మాధవి, భూమాగౌడ్, జంగిలి సాగర్, తుల రాజేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్ వై.సునీల్‌రావు

మీరు జాప్యం చేసి మాపై నిందలా?

- కరీంనగర్ ఆర్వోబీ నిర్మాణ వ్యయమంతా కేంద్రానిదే
- వెంటనే పనులు ప్రారంభించి నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలి
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్

కరీంనగర్‌టౌన్: కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని తీగలగుట్టపల్లి సమీపంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణానికి సంబంధించి టెండర్లు ఖరారైన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఘనతగా చెప్పుకుంటూ బీఆర్ఎస్ నేతలు సీఎంకు పాలాభిషేకం చేస్తూ సంబురాలు చేసుకోవడంపట్ల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్ తప్పుపట్టారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్వోబీకి కేంద్రం ఆమోదం తెలిపి ఏడునెలలైనా ఇంతవరకు ఎందుకు టెండర్ ఖరారు చేయలేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణానికయ్యే మొత్తం వ్యయం రూ.126.74 కోట్లను కేంద్రమే చెల్లించేందుకు అంగీకరించిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. ఆర్వోబీ నిర్మాణ పనులను ప్రారంభించి తొందరగా పూర్తి చేయాలని అనేకమార్లు తాను ప్రభుత్వానికి లేఖ రాసిన విషయం వాస్తవం కాదా? జాప్యాన్ని నిరసిస్తూ బీజేపీ నాయకులు ధర్నాలు, ఆందోళనలు చేసింది నిజం కాదా? అని అన్నారు. సొమ్ము కేంద్రానిదైతే... సోకు బీఆర్ఎస్ నేతలదే... అన్నట్లుగా బీఆర్ఎస్ నేతలు ప్రచారం చేసుకుంటూ పాలాభిషేకాలు చేసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా... ఆర్వోబీ నిర్మాణం విషయంలో జరుగుతున్న జాప్యానికి తామే కారణమంటూ ముక్కు నేలకు రాసి కరీంనగర్ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

గోపాల్‌రావుపేటలో అగ్ని ప్రమాదం



రామడుగు(చొప్పదండి): మండలంలోని గోపాల్‌రావుపేట శివారులోని పంటపొలాల్లో మంగళవారం మధ్యాహ్నం మంటలు అంటుకున్నాయి. గ్రామస్తులు వాటర్‌ట్యాంక్ తీసుకొచ్చి, మంటలు ఆర్పివేశారు.

ఘనపూర్‌లో..

సైదాపూర్(హుస్నాబాద్): మండలంలోని ఘనపూర్‌లో మంగళవారం రైతుల వ్యవసాయ క్షేత్రాల్లో జరిగిన అగ్ని ప్రమాదంలో గడ్డివాములు, కరెంట్ మోటార్లు కాలిపోయాయి. వరి కొయ్యలు కాల్చడానికి అంటించిన నిప్పు చెలరేగి వ్యవసాయ పంట పొలాల్లో మంటలు విస్తరించాయి. పలువురి రైతుల గడ్డివాములు, కరెంట్ మోటార్లు కాలిపోయాయి. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పివేశారు.

ఉద్యోగాలకు దరఖాస్తులు

రామడుగు: రామడుగు మోడల్‌స్కూల్‌లో అవర్లీ బేస్డ్ విధానంతో పలు ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం అర్హత కలిగిన వారు దరఖాస్తులు చేసుకోవాలని మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వనజ ఒక ప్రకటనలో కోరారు. టీజీటీ, తెలుగు, హిందీ,ఇంగ్లిష్, పీజీటీ, తెలుగు, ఎకనామిక్స్ ఫ్యాకల్టీకి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హత కలిగినవారు ఈ నెల 15న రామడుగు మోడల్ స్కూల్‌లో ఉదయం పది గంటలకు డెమోక్లాస్‌కు హాజరు కావాలని తెలిపారు.

యువతి అదృశ్యం

గన్నేరువరం: మండలంలోని గుండ్లపల్లి గ్రామానికి చెందిన బండి లత(24) అదృశ్యమైనట్లు ఎస్సై మామిడాల సురేందర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. లత సోమవారం రాత్రి కుటుంబసభ్యులతో ఇంట్లోనే నిద్రించింది. తెల్లవారుజామున చూసేసరికి ఇంట్లో కనపడలేదు. గ్రామంతో, సమీపంగా గ్రామాల్లో గాలింపు చేపట్టామని, దూరప్రాంతాల్లోని బంధువుల వద్ద సైతం ఆరా తీశామని, ఎక్కడ ఆచూకీ లభ్యం కాలేదని తండ్రి సమ్మయ్య మంగళవారం చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఏడు రోజుల జైలు

కరీంనగర్‌క్రైం: మద్యం సేవించి వాహనాలు నడిపిన ఏడుగురిని మంగళవారం కోర్టులో హాజరుపరిచారు. ఒకరికి ఏడు రోజుల జైలుశిక్ష విధించారు. అధిక మోతాదులో మద్యం సేవించిన వరంగల్‌కు చెందిన నున్సవాత్‌కు ఏడు రోజుల జైలు, మిగితా ఆరుగురికి రూ.7500 జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది.

భగత్‌నగర్‌లో రెండిళ్లలో చోరీ

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో మంగళవారం తాళం వేసిఉన్న రెండిళ్లలో చోరీ జరిగింది. టూటౌన్ పోలీసుల వివరాల ప్రకారం భగత్‌నగర్‌లోని పవన్ సంకల్ప రెసిడెన్సీలో ఎల్ఐసీ ఉద్యోగి నారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు వేణుకుమార్ ఫ్లాట్లకు తాళం వేసి విధులకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. సాయంత్రం నాలుగు గంటలకు నారాయణ, వేణుకుమార్ తమఇళ్లకు వచ్చి చూసేసరికి తాళం పగలగొట్టి ఉండడంతో పాటు ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉన్నాయి.కొంత బంగారం, నగదు కనిపించలేదు. పోలీసులకు సమాచారమందించగా టూటౌన్ ఎస్సై శ్రీనివాస్, ఫింగర్‌ప్రింట్, క్లూస్ టీంబృందాలు పలు ఆధారాలు సేకరించారు. సీసీ కెమెరాలు పరిశీలించి నిందితులను పట్టుకునే పనిలో నిమగ్నమయ్యారు. నగదు, బంగారం ఎంత పోయిందనేది మంగళవారం రాత్రి వరకు తెలియరాలేదు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రక్తమిద్దాం.. ప్రాణం నిలుపుదాం





కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రిలో రక్తదానం చేస్తున్న దాతలు

- ఒక యూనిట్ రక్తంతో నలుగురికి ప్రాణం పోయొచ్చు
- నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం

జగిత్యాల/సిరిసిల్లటౌన్/కోల్‌సిటీ(రామగుండం)/కరీంనగర్‌టౌన్/కరీంనగర్‌రూరల్/పెద్దపల్లిరూరల్: దాత ఇచ్చిన ఒక యూనిట్ రక్తం నలుగురికి ప్రాణం పోస్తుంది. రక్తదానం బాధితులకు, దాతలకు మధ్య బంధాలను ఏర్పాటు చేస్తుంది. అకస్మాత్తుగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు లేదా అనారోగ్యానికి గురైనప్పుడు రక్తం అవసరం ఉంటుంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పలువురు దాతలు ఒక్క ఫోన్‌కాల్‌తో స్పందించి, రక్తదానం చేస్తున్నారు. యువతలో దీనిపై అవగాహన వచ్చింది. వాట్సాప్ గ్రూపుల్లో యాక్టివ్‌గా ఉంటూ ఎవరికి రక్తం అవసరమైనా వెళ్లి, ఇస్తున్నారు. బాధితుల ప్రాణాలు కాపాడుతున్నారు. కారల్ ల్యాండ్ స్టీనర్ అనే జీవ శాస్త్రవేత్త మానవ రక్తకణాలను కనుగొన్నందుకు గాను వైద్య శాస్త్రంలో 1930లో నోబెల్ బహుమతి లభించింది. ఆయన జయంతి గుర్తింపుగా రక్తం విలువను ప్రజలకు తెలియజేసేందుకు ఏటా జూన్ 14న ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ సందర్భంగా కథనం.

35 రోజులు భద్రపరచవచ్చు

ఒక మనిషి నుంచి రక్తాన్ని సేకరించి, 35 రోజుల వరకు భద్రపరచవచ్చు. ఆ తర్వాత అది పని చేయదు. కాగా, నాలుగు రకాల బ్యాగులను ఉపయోగించి, రక్తాన్ని సేకరించాల్సి ఉంటుంది. అనంతరం దాన్ని సింగిల్, డబుల్, ట్రిపుల్, క్వాడ్రిపుల్ బ్యాగులుగా విభజించి, భద్రపరుస్తుంటారు. అప్పుడు దాదాపు 120 రోజుల వరకు నిలువ చేయడానికి ఆస్కారం ఉంటుందని రక్తనిధి ప్రతినిధులు తెలిపారు.

వీరు రక్తదానం చేయొచ్చు

- 18 నుంచి 60 ఏళ్లలోపు వయసు, 45 కిలోల ఎక్కువ బరువుండి, రక్తంలో 12.5 గ్రాముల హిమోగ్లోబిన్ కంటే ఎక్కువ ఉన్నవారెవరైనా రక్తదానం చేయవచ్చని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.
- హెచ్ఐవీ, సిఫిలిస్, హెపటైటిస్–బి, సి, బ్లడ్ కేన్సర్, హైబీపీ, క్షయ, మూర్ఛ, మత్తు పదార్థాలకు బానిసలైన వారు రక్తదానం చేయడానికి అనర్హులు. టాటూ వేసుకున్నవారు కూడా చేయొద్దు.
- రక్తదానం చేసి, 90 రోజులు దాటినవారు మళ్లీ చేయొచ్చు.

2 వేల మందితో వాట్సాప్ గ్రూప్



కరీంనగర్ మండలంలోని బొమ్మకల్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు మంచికట్ల శ్రీనివాస్ 2 వేల మంది రక్తదాతలతో వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశారు. ఆపదలో ఉన్నవాళ్లకు సకాలంలో రక్తదానం చేయించి, ఆదుకుంటున్నాడు. 2012లో స్నేహితులతో కలిసి స్పందన యువసేన అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన ఇప్పటివరకు 17 సార్లు రక్తదానం చేశా.

సిరిసిల్ల బ్లడ్‌బ్యాంకులో వసతులు

రాజన్నసిరిసిల్ల జిల్లా ఆస్పత్రిలోని బ్లడ్‌బ్యాంకులో రక్తదాతల కోసం మంత్రి కేటీఆర్ సహకారంతో సకల వసతులు కల్పించారు. అన్ని రోజుల్లో దాతల నుంచి రక్తం సేకరిస్తున్నారు. ఈ బ్లడ్‌బ్యాంకు ఆధ్వర్యంలో ఇప్పటివరకు 112 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. వీటిల్లో 6,774 మంది దాతలు రక్తదానం చేశారు. జిల్లాలోని రెడ్‌క్రాస్, రెడ్‌డ్రాప్, లయన్స్ క్లబ్ తదితర స్వచ్ఛంద సంస్థలు రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నాయి.

పెద్దపల్లి జిల్లాలో..

దశాబ్ది ఉత్సవాల సందర్భంగా బుధవారం పెద్దపల్లి, మంథని ప్రభుత్వ ఆస్పత్రుల్లో, ఎన్టీపీసీలోని ధన్వంతరి ఆస్పత్రిలో రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు రెడ్‌క్రాస్ సొసైటీ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ కావేటి రాజ్‌గోపాల్ తెలిపారు.

జగిత్యాల జిల్లాలో శిబిరాలు

జగిత్యాల జిల్లాలో జగిత్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో ఒకటి, ప్రైవేటుగా నాలుగు(జగిత్యాలలో 3, మెట్‌పల్లిలో 1) రక్తనిధి కేంద్రాలున్నాయి. సర్కారు దవాఖానాలో ఉచితంగానే పేషెంట్స్‌కు అత్యవసరంగా రక్తం అందజేస్తారు. అంతేకాకుండా ఇక్కడి నుంచి మెట్‌పల్లి, కోరుట్ల, ధర్మపురి ఆస్పత్రులకు సైతం పంపిస్తుంటారు.

నేడు రాజ్‌భవన్‌లో 54వ సారి..



రక్తదానం చేస్తున్న రాజయ్య

పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేటకు చెందిన కొండేటి రాజయ్య ఇప్పటివరకు 53 సార్లు రక్తదానం చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో 54వ సారి రక్తదానం చేయనున్నట్లు తెలిపారు. అక్కడే గవర్నర్ తమిళిసై చేతులమీదుగా ఆయన అవార్డు అందుకోనున్నారు.

3 వేల యూనిట్లు చేయించా



నేను పదేళ్లలో 48 సార్లు ప్లేట్‌లెట్స్, రక్తదానం చేశా. అత్యవసర పరిస్థితుల్లో ఎవరైనా ఫోన్ చేస్తే స్పందిస్తున్న. మా మిత్రులతో ఇప్పటివరకు 3 వేల యూనిట్లు రక్తదానం చేయించాను. సినీహీరో చిరంజీవి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న.

– గాలిపెల్లి కుమార్, బొమ్మకల్, కరీంనగర్

రక్తనిధికి పంపిస్తున్నం



సిరిసిల్ల పట్టణానికి చెందిన మా స్నేహితులతో కలిసి రెడ్ డ్రాప్ అనే సామాజిక సేవా సంస్థను నడిపిస్తున్నాం. ఇప్పటివరకు వందల మంది సభ్యులతో వేలాది మందికి రక్తదానం చేయించాం. రక్తదాన శిబిరాల ద్వారా రక్తాన్ని రక్తనిధి కేంద్రానికి పంపిస్తున్నం. రక్తం అవసరమున్నవారు 98859 75566 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలి.

– అస్లాం, రెడ్ డ్రాప్ ఫౌండేషన్ ప్రతినిధి, సిరిసిల్ల

ఎంతోమందిని కాపాడిన



అత్యవసర సమయాల్లో బాధితులకు రక్తదానం చేయాలి. నేను ఇప్పటివరకు 63 సార్లు చేసి, ఎంతోమంది ప్రాణాలు కాపాడిన. రక్తదాన దినోత్సవం సందర్భంగా బుధవారం గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న.

– తుమ్మనపల్లి బాలకృష్ణ, జగిత్యాల

ఆరోగ్యంగా ఉంటాం



రక్తదానం చేయడం వల్ల మనం ఆరోగ్యంగా ఉంటామన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి. రక్తదానం చేస్తే ఇతరులకు సాయం చేశామన్న సంతృప్తి ఉంటుంది. యువత స్వచ్ఛందంగా ముందుకు రావాలి.

– కావేటి రాజ్‌గోపాల్, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కన్వీనర్, పెద్దపల్లి

అపోహలు, భయం వద్దు



రక్తదానం చేయడంలో అపోహలు, భయం వద్దు. 20 నుంచి 60 ఏళ్ల వయసున్న ఆరోగ్యవంతులు, ప్రతీ మూడు నెలలకోసారి రక్తం ఇవ్వవచ్చు. ప్రజలను చైతన్యవంతులను చేయడానికి స్వచ్ఛంద సంస్థలు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

– డాక్టర్ బి.అమూల్ కుమార్, పాథాలజిస్టు, అసిస్టెంట్ ప్రొఫెసర్, గోదావరిఖని

ముందుచూపుతో మరో పదేళ్ల అభివృద్ధి

- ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న వినోద్‌కుమార్

మానకొండూర్: వచ్చే పదేళ్లు తెలంగాణ అభివృద్ధి కోసం ఏం చేయాలో పక్కా ప్రణాళికతో ముందుచూపుతో వెళ్తున్నామని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మానకొండూర్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో మహిళా సంక్షేమ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొనగా వారిని శాలువాలతో సత్కరించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న వినోద్‌కుమార్, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అనేక పథకాలు చేపట్టిందని తెలిపారు. విద్యార్థులకు కోసం గురుకులాలు, కస్తురిబా గాంధీ, మోడల్ స్కూళ్లను ప్రవేశపెట్టామని, ప్రస్తుతం డిగ్రీ వరకూ స్థానికంగా చదివే అవకాశం ఉందని వివరించారు. మానకొండూర్ నియోజకవర్గానికి రూ.కోట్ల నిధులు తెచ్చి అభివృద్ధి చేశామని గుర్తుచేశారు. కల్యాణలక్ష్మి కింద రూ.వందకోట్లకు పైగా చెల్లించడం జరిగిందని, పుట్టినబిడ్డ బాగుండాలని న్యూట్రిషన్‌ఫుడ్ అందజేయడం జరుగుతోందని పేర్కొన్నారు. తాముచేసిన అభివృద్ధిని గుర్తుచేస్తూ, తమ గ్రామాలకు ప్రతిపక్ష నాయకులు వచ్చినప్పుడు నిలదీయాలని సూచించారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వంలో మహిళలు సంతోషంగా ఉన్నారని, రానున్న రోజుల్లో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, మానకొండూర్ జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, లింగాల శ్రీనివాస్‌రెడ్డి, సిద్దం వేణు, ఎంపీపీ ముద్దసాని సులోచన, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఎంపీటీసీ కవిత, సులోచన, ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు, సీడీపీవో సబిత, ఏపీఎం నిరంజన్ సంతోశ్ పాల్గొన్నారు.

మహిళా సంక్షేమానికి కృషి

హుజూరాబాద్: మహిళల సంక్షేమానికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు.పట్టణంలోని సాయిరూప గార్డెన్‌లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల వేడుకలు నిర్వహించారు. 16మంది గర్భిణులకు సీమంతం చేశారు. బాలికలు అన్ని రంగాల్లో ముందుకు వెళ్తున్నారని తెలిపారు. గతంలో 200 వసతి గృహాలు ఉంటే బీఆర్ఎస్ హయాంలో 1000కి పెరిగాయని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ పాడికౌశిక్‌రెడ్డి హుజూరాబాద్ అభివృద్ధికి రూ.100కోట్లు మంజూరు చేయాలని కోరితే రూ.238 కోట్లు ఇచ్చారని గుర్తుచేశారు. అనంతరం మహిళా సంఘాలకు రూ.1.19 కోట్ల రుణాల చెక్కు అందించారు. అడిషనల్ కలెక్టర్ గరిమా అగర్వాల్, జెడ్పీ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, ఆర్డీవో బి.హరిసింగ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, తదితరులు పాల్గొన్నారు.

నగరంలో అబార్షన్ కలకలం

- క్లినిక్‌లో గొడవకు దిగిన వివాహిత అత్తామామలు
- గతంలో ఓసారి సదరు క్లినిక్‌ను మూసేసిన అధికారులు



దాడికి పాల్పడుతున్న మహిళ

కరీంనగర్‌టౌన్: గర్భంతో ఉన్న తన కోడలుకు క్లినిక్ నిర్వాహకురాలు అబార్షన్ చేసిందంటూ అత్తామామలు ఆసుపత్రిలో గొడవకు దిగి, దాడిచేసిన ఘటన మంగళవారం కరీంనగర్‌లో కలకలం రేపింది. వివరాల్లోకెళితే... పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బంజేరుపల్లికి చెందిన ఓ వివాహిత జ్యోతినగర్‌లోని ఓ క్లినిక్‌కు రాగా అత్తామామలు సైతం ఆమెను వెతుక్కుంటూ అక్కడికి చేరుకొని తన కోడలు గర్భం తీయించుకుందని గొడవకు దిగారు. నిర్వాహకురాలితో పాటు కోడలి తల్లిపై కూడా ఆగ్రహం వ్యక్తం చేసి, దాడికి పాల్పడ్డారు. అయితే తనకు రక్తస్రావం అవుతుంటే చికిత్స చేయించుకునేందుకు వచ్చాను తప్ప.. అబార్షన్ చేయించుకోలేదని కోడలు చెప్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు జ్యోతినగర్ క్లినిక్ వెళ్లి ఇరు వర్గాలను అదుపులోకి తీసుకున్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు విచారణ చేపట్టారు.

గతంలోనూ ఇలాంటి ఘటనలు

సదరు క్లినిక్‌పై 2019 నవంబర్ 7న వైద్యారోగ్యశాఖ అధికారులు దాడి చేసి అబార్షన్లు జరుగుతున్న విషయంపై ఆరా తీయగా, పలు ఆసక్తికర విషయాలు బయటపడ్డాయి.నిర్వాహకురాలిపై కేసు నమోదు చేసి, క్లినిక్‌ను మూసివేశారు. తాజాగా మంగళవారం జరిగిన ఈ ఘటనతో మళ్లీ ఆ క్లినిక్‌లో విచ్చలవిడిగా అబార్షన్లు జరుగుతున్నాయని తెలుస్తోంది. ట్రీట్‌మెంట్ చేయించుకునేందుకు నగరంలో ప్రముఖ గైనకాలజిస్టులు ఉన్నప్పటికీ ధర్మారం మండలం నుంచి ప్రత్యేకంగా పేషెంట్ జ్యోతినగర్‌లో ఉన్న సాధారణ క్లినిక్‌కు వెళ్లడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మూడిళ్లలో విషాదం

- చొప్పదండి ప్రమాదంలో మూడుకు చేరిన మృతులు
- చికిత్స పొందుతూ మరో యువకుడి మృతి
- అశ్రునయనాల మధ్య అంత్యక్రియలు
- మృతులంతా ఇంటికి ఏకైక కుమారులే



సాయి చరణ్ (ఫైల్)

చొప్పదండి: పట్టణంలోని సాయిబాబా గుడి చౌరస్తాలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. రెండు బైక్‌లు ఢీకొన్న సంఘటనలో సోమవారం ఇద్దరు యువకులు మృతి చెందిన విషయం తెలిసిందే. కరీంనగర్ ఆస్పత్రిలో పాలకుర్తి సాయిచరణ్‌గౌడ్ మంగళవారం మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన వల్లెపు సంపత్ చికిత్స పొందుతున్నాడు.

మృతులంతా ఒక్క కొడుకులే

చొప్పదండికి చెందిన భీమనాతిని శ్రీనివాస్ కిరాణా దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతడికి కుమార్తె, కొడుకు నవీన్ ఉన్నారు. సోమవారం బైక్ ప్రమాదంలో నవీన్ చనిపోయాడు. కాట్నపల్లికి చెందిన గొర్ల కాపరి వేల్పుల కొమురయ్యకు కొడుకు మహేశ్, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఒక కూతురు వివాహం చేశాడు. ఒక్కగానొక్క కొడుకు మహేశ్ బైక్ ప్రమాదంలో మృతి చెందాడు. కాట్నపల్లికి చెందిన పాలకుర్తి సత్తయ్యకు కొడుకు సాయిచరణ్ గౌడ్, కుమార్తె ఉన్నాడు. ఇటీవలే పదోతరగతి ఉత్తీర్ణుడైన చరణ్ బైక్ వెనుక కూర్చొని ప్రయాణిస్తుండగా ప్రమాదంలో మరణించాడు. తన కుమారుడు ప్రయాణిస్తున్న బైక్‌ను ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొనడంతో మృతి చెందాడని భీమనాతిని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేంద్ర చారి తెలిపారు.

స్థానికంగానే గంజాయి..

చొప్పదండి పట్టణంలో గంజాయి సేవిస్తున్న యువకుల సంఖ్య గత రెండేళ్లుగా పెరుగుతూ వస్తోందని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల పలు సంఘటనలు జరిగినా గంజాయిని అరికట్టాల్సిన సంబంధిత ప్రభుత్వశాఖలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయని విమర్శలు వస్తున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే గంజాయితో పాటు, పట్టణ శివారులోని రహస్య ప్రాంతాల్లో గంజాయి మొక్కల పెంపకం జరుగుతోందని, వాటిని నిర్మూలించకపోవడంతో గంజాయి వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విస్తరించిందని స్థానికులు వాపోతున్నారు.

ప్రభుత్వమే బాధ్యత వహించాలి

చొప్పదండిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకుల మృతికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు సింగిరెడ్డి క్రిష్టారెడ్డి డిమాండ్ చేశారు. గంజాయికి అడ్డగా కరీంనగర్ జిల్లా మారిందని, దీనికి ప్రభుత్వ పెద్దల ప్రోత్సాహమే కారణమని, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌ను తక్షణమే సస్పెండ్ చేయాలని ఆయన కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాలు తేడా లేకుండా రాష్ట్రంలో గంజాయి మత్తు జోగుతోందని, స్మగ్లర్‌లు బాహాటంగా వాట్సప్ గ్రూపులు ఏర్పాటు చేసి సరఫరా చేస్తున్నా చర్యలు తీసుకోక పోవడం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఎక్సైజ్ అధికారులు బెల్ట్ షాపుల్లో మామూళ్లు వసూలు చేసుకోవడం తప్ప గంజాయి నిర్మూలనకు చర్యలు తీసుకోవడం లేదని ఈ సందర్భంగా విమర్శించారు.

వినియోగదారుల మన్ననలు పొందండి

- క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి
- ఇబ్బంది పెడితే చర్యలు తప్పవు
- ఫోరం సేవలను సద్వినియోగం చేసుకోవాలి
- విద్యుత్ వినియోగదారుల ఫోరం చైర్మన్ సత్యనారాయణ



వినతిపత్రం ఇస్తున్న వినియోగదారులు

కొత్తపల్లి(కరీంనగర్): విద్యుత్ వినియోగదారుల మన్ననలు పొందేలా సిబ్బంది విధులు నిర్వహించాలని విద్యుత్ వినయోగదారుల ఫోరం(సీజీఆర్ఎఫ్) చైర్మన్ పి.సత్యనారాయణగౌడ్ పిలుపునిచ్చారు. వినియోగదారులతో అమర్యాదగా ప్రవర్తించడం, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కరీంనగర్‌లోని టీఎస్ఎన్పీడీసీఎల్ ఏడీఈ–1 కార్యాలయ ఆవరణలో మంగళవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సమస్య పరిష్కారవేదిక సదస్సుకు హాజరైన ఆయన వినియోగదారుల నుంచి విద్యుత్ సంబంధిత వినతులు స్వీకరించి, వాటిపై ఉద్యోగుల నుంచి వివరణ ఇప్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ఫోరం పరిధిలోని పది జిల్లాల్లో మూడేళ్ల కాలంలో 1100 ఫిర్యాదులు వస్తే, 1070 పరిష్కరించి రాష్ట్రంలోనే వరంగల్‌ఫోరం అగ్రస్థానంలో ఉందని, ఇందుకు గాను టీఎస్ఈఆర్సీ చైర్మన్ శ్రీరంగారావు ప్రశంసించడం సంతోషంగా ఉందన్నారు. పౌరసేవా పత్రం ప్రకారం సమస్యలు పరిష్కరించకుండా విద్యుత్ ఉద్యోగులు ఇబ్బందులకు గురిచేస్తే వెంటనే ఫోరంకు ఉత్తరం ద్వారా గాని వాట్సప్(9440811299, 8333923840, 9491307004), ఇ మెయిల్ ద్వారా గాని సంప్రదిస్తే పరిష్కారమార్గం చూపుతామని స్పష్టం చేశారు. జేఎల్ఎం నుంచి ఫోర్‌మెన్ వరకు క్షేత్రస్థాయిలో విధులు సక్రమంగా నిర్వహిస్తే సమస్యలు ఉత్పన్నం కావన్నారు. వ్యవసాయ సర్వీసులతో ఇంటి సర్వీసుకు లింక్ చేయడం సరికాదని, రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. కరీంనగర్‌లో ఒక్క పెండింగ్ కేసు లేకుండా చర్యలు చేపట్టిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఫోరం సభ్యులు కె.తిరుమల్‌రావు, ఎన్.నరేందర్, ఆర్.చరణ్‌దాస్, ఎస్ఈ వడ్లకొండ గంగాధర్,డీఈ రాజం, ఎస్ఏవో రాజేశం, ఏడీఈలు ఎస్.నరేందర్, ఎస్.సుధీర్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళా ఉద్యోగులకు సన్మానం



మహిళలను సన్మానిస్తున్న సర్పంచ్

కరీంనగర్‌రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళా సంక్షేమ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లో గ్రామ సర్పంచ్ రుద్ర భారతి ఆధ్వర్యంలో మహిళా ఉద్యోగులను సన్మానించారు. అంగన్‌వాడీ టీచర్ తుమ్మ స్వరూప, ఆశా కార్యకర్త దాసరి వసంత, వీఆర్‌ఏ జటంటి అరుణ, సీఏ మునీశ్వరీ, గ్రామైఖ్య సంఘం అధ్యక్షురాలు మల్లీశ్వరీ, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా రామక్క, వార్డు సభ్యులు స్వప్న, విజయ, అంజమ్మ, రజిత తదితరులను శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి కిరణ్‌రావు, ఉప సర్పంచ్ జటంగి కుమార్, వార్డుసభ్యులు శంకర్, హన్మంతు, వెంకన్న, మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి



మాట్లాడుతున్న తిరుపతి

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయకుండా కాలయాపన చేస్తూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తోందని, తక్షణమే ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేస్తామని గత రెండు, మూడేళ్లనుంచి కాలయాపన చేస్తోందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేవని అన్నారు. కొన్నిచోట్ల విద్యార్థులకు అనుగుణంగా ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. ఉన్న ఉపాధ్యాయులు సమయపాలన పాటించడం లేదని అన్నారు. మండల విద్యాధికారులు ప్రభుత్వ స్కూళ్లను తనిఖీలు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులపోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు జి.శివరాజ్, అజయ్, మహేందర్, బన్నీ ,యుగంధర్ ,రాజేందర్ పాల్గొన్నారు.

'లక్ష ఆర్థిక సాయం నిబంధనలు సవరించాలి'

విద్యానగర్(కరీంనగర్): కులవృత్తుల వారికి ప్రభుత్వం ప్రకటించిన లక్ష రూపాయల ఆర్థిక సహాయంలో పొందుపర్చిన నిబంధనలు సవరించాలని తెలంగాణా నాయీ బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జంపాల నర్సయ్య, సింగిరాల వెంకటస్వామిలు డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కులవృత్తి చేసుకునే వారి 55ఏళ్ల వయోపరిమితిని 65ఏళ్లకు పెంచాలని, రూ.లక్ష సాయాన్ని రూ.10 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణ శివారు ఒడ్డెరకాలనీ సమీపంలో కరీంనగర్–జగిత్యాల ప్రధాన రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలయ్యాయి. వెలిచాల గ్రామానికి చెందిన వీర్ల శ్రవణ్ తన కారులో కరీంనగర్ వైపు వస్తూ ముందుగా వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. దీంతో కారు పల్టీలు కొట్టడంతో శ్రవణ్‌కు గాయాలు కాగా ఎలిగేడు మండలం బురహాన్‌పేటకు చెందిన ద్విచక్ర వాహనదారుడు కురికాల్య అనిల్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. గంగాధర మండలం కురిక్యాలలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ హాల్ టికెట్ తీసుకొని వస్తుండగా ఈ ఘటన జరగడం కుటుంబసభ్యులను ఆందోళనకు గురిచేసింది. ఈ ఘటనపై దర్యాప్తు చేయనున్నట్లు కొత్తపల్లి ఎస్సై బి.ఎల్లయ్యగౌడ్ తెలిపారు.

'రెడ్డి' కార్యవర్గం నియామకం

కొత్తపల్లి(కరీంనగర్): ఆర్‌బీవీఆర్‌ఆర్ రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్యవర్గంలో పలువురిని నియమిస్తూ మంగళవారం ఆ సంఘం అధ్యక్షుడు నరహరి జగ్గారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. రెడ్డి సంక్షేమ సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉపాధ్యక్షుడిగా పెండ్యాల రాంరెడ్డి, రేకులపెల్లి రవీందర్‌రెడ్డి, ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా కంటారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, న్యాలకొండ ప్రసన్న కుమార్ రెడ్డి, శంకర్‌రెడ్డి, రావుల కిరణ్‌రెడ్డి, చెరుకు సువర్ణను నియమించారు. జిల్లా సంఘం సలహా సభ్యుడు నరహరి సాయిరెడ్డి, జిల్లా కోశాధికారి కాసర్ల మధుకర్ రెడ్డి, జిల్లా సంయుక్త కార్యదర్శి దారం జగన్నాథరెడ్డి, కార్యవర్గ సభ్యుడు చింతల శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా నాయకుడు లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్ఠ పూజలు



కొత్తపల్లి: కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్‌లో స్వయంభు శ్రీ లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి, నవగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం విశ్వక్సేనారాధాన మూర్తి, కుంభారాధన మూర్తి, కుంభారాదన ద్వార తోరణ, ధ్వజకుంభారాదన సుదర్శన శ్రీలక్ష్మీనరసింహ మూలమంత్ర హవనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ వైభవంగా నిర్వహించారు. పూజల్లో ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ దంపతులు, పూజారులు సత్యవర్ధన్, భానువర్ధన్, సంతోశ్, అనిల్, భక్తులు పాల్గొన్నా రు. బుధవారం శ్రీలక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి విగ్రహ, నవగ్రహ ప్రతిష్ఠాపనతో పూజలు ముగియనున్నాయి.

కళాశాలలో దశాబ్ది ఉత్సవాలు



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరులోని సాంఘిక సంక్షేమ మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో మంగళవారం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీడీవో జగన్మోహన్‌రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం విద్యార్థులు మానవహారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాలపై లఘుచిత్రాలు, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీహరి, వైస్ ప్రిన్సిపాల్ సమత, ఏసీవో సుష్మ, స్టాఫ్ సెక్రటరీ రోజారమణి, ఎన్ఎస్ఎస్ పీవో లావణ్య, లైబ్రేరియన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో 33కేవీ కొత్త విద్యుత్ లైన్ల పనులు చేపడుతున్నందున బుధవారం ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటన్నర వరకు 11కేవీ ఇండస్ట్రియల్/పద్మనగర్ ఫీడర్ పరిధిలోని పద్మనగర్, ఇండస్ట్రియల్ ఏరియా, ప్రగతినగర్, సాయిబాబా ఆలయం ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

అటకెక్కిన ఫాగింగ్ యంత్రాలు

- పంచాయతీల్లో పడకేసిన ఫాగింగ్
- దోమలతో గ్రామస్తుల తిప్పలు
- మరమ్మతులు చేయక మిషన్లు నిరుపయోగం
- నిధుల కొరతతో చేతులెత్తేసిన సర్పంచులు



దుర్శేడ్ పంచాయతీలో నిరుపయోగంగా ఉన్న ఫాగింగ్ మిషన్

కరీంనగర్‌రూరల్: గ్రామపంచాయతీల్లో దోమల నివారణ కోసం కొనుగోలు చేసిన ఫాగింగ్ యంత్రాలు అటకెక్కాయి. గ్రామాల్లో దోమల నియంత్రణకు గతంలో పంచాయతీ నిధులతో ఫాగింగ్ యంత్రాలను కొనుగోలు చేశారు. అయితే నిర్వహణకు నిధుల కొరత, మరమ్మతులకు సాంకేతిక సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో పలు గ్రామపంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు నిరుపయోగంగా మారాయి. నాసిరకం యంత్రాలను పంపిణీ చేసిన సదరు డీలరుపై ఓ పంచాయతీ కార్యదర్శి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రూ.70వేలకు ఫాగింగ్ మిషన్

కరీంనగర్ మండలంలోని 17గ్రామపంచాయతీలకు రెండేళ్ల క్రితం రూ. 70వేల చొప్పున వెచ్చించి ఫాగింగ్ యంత్రాలను అధికారులు కొనుగోలు చేసి పంపిణీ చేశారు. పెట్రోల్, డీజిల్ వినియోగించి గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది ఫాగింగ్ చేసేవారు. గ్రామానికి మొత్తం ఫాగింగ్ చేయాలంటే సుమారు రూ.4వేల వరకు ఖర్చవుతోంది. కొంత కాలం వరకు బాగానే పనిచేసిన ఫాగింగ్ యంత్రాలు తర్వాత మొరాయించాయి. సదరు కంపెనీ డీలరు పలుమార్లు మరమ్మతు చేసినప్పటికీ యంత్రాలు సరిగ్గా పనిచేయకపోవడంతో పలువురు సర్పంచులు వాటిని పక్కనపెట్టారు. నాణ్యతలేని ఫాగింగ్ మిషన్లను పంపిణీ చేశారంటూ కొందరు సర్పంచులు సదరు డీలరు, అధికారులను అడిగితే పట్టించుకోలేదు. చివరకు నాసిరకం మిషన్ ఇచ్చిన డీలరుపై చర్యలు తీసుకోవాలని దుర్శేడ్ పంచాయతీ కార్యదర్శి ఆర్నెళ్ల క్రితం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

వెంటాడుతున్న నిధుల కొరత

పంచాయతీల్లో నిధుల కొరత వెంటాడుతోంది. కొన్ని నెలలుగా బిల్లుల చెల్లింపు ప్రక్రియ నిలిచిపోవడంతో సర్పంచులు, అధికారులు ఫాగింగ్ యంత్రాలను మరమ్మతు చేయించేందుకు ముందుకు రావడం లేదు. యంత్రాల నిర్వహణ, ఫాగింగ్ చేయించడం భారంగా మారిందని సర్పంచులు వాపోతున్నారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనుల కోసం తెచ్చిన అప్పులు ఇంకా తీరలేదని, ఈ పరిస్థితుల్లో ఇంకా ఫాగింగ్ ఎక్కడ చేస్తామని కొందరు సర్పంచులు అంటున్నారు. పలు గ్రామాల్లో ఐదారు నెలల నుంచి ఫాగింగ్ చేయకపోవడంతో దోమలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాదాపుగా అన్ని గ్రామాల్లో మూడు నెలల నుంచి ఫాగింగ్ చేయడంలేదు.

చర్యలు తీసుకుంటాం

రెండు, మూడు భారీ వర్షాలు పడిన తర్వాత అన్ని గ్రామాల్లో ఫాగింగ్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం. వేసవికాలంలో దోమల సమస్య పెద్దగా లేకపోవడంతో ఫాగింగ్ చేయలేదు. చెడిపోయిన యంత్రాలను మరమ్మతు చేయించి వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు చేపడుతాం.

– సీహెచ్. జగన్మోహన్‌రెడ్డి, ఎంపీడీవో, కరీంనగర్‌రూరల్

సాక్షి ఎఫెక్ట్
మురుగునీటిని తొలగించారు



కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్ పాత బస్టాండ్ వద్ద నాలుగు లేన్ల రహదారిపై పారుతున్న మురుగునీటితో ఇబ్బందులపై మంగళవారం 'రోడ్డుపై మురికి నీరు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన చిత్రకథకు ఆర్అండ్‌బీ అధికారులు స్పందించారు. మురుగునీటిని తొలగించి శుభ్రపర్చారు. దీంతో గ్రామస్తులు, స్థానికులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

విట్స్‌లో 'కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ'పై వర్క్‌షాప్



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రావు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ బైపాస్‌లోని విట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో అల్ట్రా టెక్ సిమెంట్ కంపెనీ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించనున్న కన్‌స్ట్రక్షన్ టెక్నాలజీ వర్క్‌షాప్‌ను మంగళవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కంపెనీ రీజినల్ హెడ్ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ రాబోయే రోజుల్లో యువ సివిల్ ఇంజినీర్లు పెద్ద ఎత్తైన నిర్మాణాలు చేపట్టేందుకు వర్క్‌షాప్‌లు దోహదపడుతాయని తెలిపారు. నిర్మాణరంగం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. ప్రిన్సిపాల్ డి.మురళీ మాట్లాడుతూ యువ ఇంజినీర్లు ఆధునాతన శైలిని అవలంభించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అదనపు డైరెక్టర్ గోవిందరావు, ఏవో సుధాకర్‌రావు, హెచ్‌వోడీ హలీమ్, యూనస్, డీన్ ప్రదీప్‌కుమార్, కంపెనీ ప్రతినిధి నారాయణశెట్టి తదితరులు పాల్గొన్నారు.

'పట్టణ ప్రగతి'ని విజయవంతం చేయాలి

- మేయర్ యాదగిరి సునీల్‌రావు



కార్యాలయ ఆవరణలో జరుగుతున్న పనులు పరిశీలిస్తున్న మేయర్

కరీంనగర్‌కార్పొరేషన్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 16న నిర్వహించనున్న పట్టణ ప్రగతి దినోత్సవంను విజయవంతం చేయాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కార్యాలయంలో జాతీయ పతాకావిష్కరణ, రంగోలితో కార్యక్రమాన్ని ప్రారంభించి, మానవహారం చేపట్టి పద్మనాయక కల్యాణమండపం వరకు ర్యాలీ చేపడుతామని తెలిపారు. మంత్రి గంగుల కమలాకర్ చేతుల మీదుగా పారిశుధ్య వాహనాలు, యంత్రాలతో ర్యాలీ ప్రారంభించి అంబేడ్కర్ స్టేడియం నుంచి కలెక్టరేట్ మీదుగా తెలంగాణ చౌక్, కరీంనగర్ సర్క్యూట్ రెస్ట్ హౌస్ చౌరస్తా, కోర్టు చౌరస్తా, మంచిర్యాల చౌరస్తా, నాఖా చౌరస్తా, కాపువాడ నుంచి కమాన్ చౌరస్తా వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం పద్మనాయక కల్యాణ మండపంలో సభ నిర్వహించి పట్టణ ప్రగతి నివేదికను ప్రదర్శిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన ఉత్తమ కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది, పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానిస్తామన్నారు. 19వ తేదీన హరితోత్సవం సందర్భంగా పద్మనగర్ బుల్ సెమన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పట్టణ ప్రగతి వనాల వద్ద వేడుకలు జరుపుతామని తెలిపారు. 21న జిల్లాకు వస్తున్న పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా మోడ్రన్ గ్రంథాలయ భవనం, కాశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణాలకు శంకుస్థాపన, ఆధునికీకరించిన పాత సమావేశ మందిరం, పౌర సేవా కేంద్ర భవన ప్రారంభం ఉంటాయని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ ద్వారా ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సిగ్నలింగ్ సిస్టమ్, పబ్లిక్ అడ్రసింగ్, ట్రాఫిక్ వాయిలేషన్, ప్రజలకు ఫ్రీ వైఫైని అందుబాటులోకి తెస్తామన్నారు. పట్టణ ప్రగతి, హరితోత్సవం, రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటనల ఏర్పాట్లు పగడ్బందీగా చేయాలని సూచించారు. అనంతరం కార్యాలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ స్వరూపరాణి హరిశంకర్, కమిషనర్ సేవా ఇస్లావత్, అదనపు కమిషనర్ స్వరూపరాణి, డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్, ఈఈ మహేందర్, కిష్టప్ప, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్, పారిశుధ్య అధికారులు, స్మార్ట్ సిటీ అధికారులు పాల్గొన్నారు.

ధరణితో రైతులకు లాభం ఏమిటీ?

విద్యానగర్: ధరణి గురించి ప్రతిసభలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ దాని ద్వారా ప్రజలకు ఏమి ఒరిగిందో చెప్పాలని ప్రజామిత్ర డెమోక్రటిక్ ఫ్రంట్ అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు తాము అధికారంలోకి వస్తే ధరణి వ్య వస్థను రద్దు చేస్తామని, ముఖ్యమంత్రి ఏమో ధరణి వ్యవస్థ రద్దవుతే రైతుబంధు, రైతు బీమా రాదని ప్రజ లను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. 2018లో రైతుబంధు పథకాన్ని ప్రారంభించినప్పుడు ధరణి వ్యవస్థ లేదని, 2018 నుంచి 2022వరకు రైతుబంధు నిధులు ప్రతిరైతు ఖాతాల్లో జమ అయిన విషయాన్ని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. క్రమబద్ధీకరణ విషయంలో గతరెండు నెలల క్రితం కరీంనగర్ మండలం ఖాజీపూర్ గ్రామానికి చెందిన మల్లయ్య అనే రైతు ఆత్మహత్య చేసుకున్నాడని, మరో రైతు సాక్షాత్తు కరీంనగర్ కలెక్టర్ కార్యాలయంలోనే ఆత్మహత్య ప్రయత్నం చేసిన విషయాన్ని ఈ సందర్భంగా వెల్లడించారు. రైతులను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తున్న ధరణిలోని లోపాలను నెలరోజుల్లోపు సవరించకుంటే కరీంనగర్ నుంచే ప్రజాఉద్యమం ప్రారంభిస్తామని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

పరామర్శ



మల్లమ్మ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న వినోద్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్ సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్ తల్లి మల్లమ్మ ఇటీవల మృతి చెందగా మంగళవారం రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ పరామర్శించారు. మల్లమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గతనెలలో చెర్లభూత్కూర్‌లో వేదిక కూలడంతో కాలికి గాయమైన జెడ్పీటీసీ పురుమల్ల లలితను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు ర్యాకం మోహన్, దాది సుధాకర్, మెండి చంద్రశేఖర్, కాల్వ మల్లేశం, అశోక్ తదితరులున్నారు.

18 నుంచి దుర్గాభవానీ ఆలయంలో శాఖాంబరీ ఉత్సవాలు



ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరిస్తున్న మహేశ్వరశర్మ

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మండలం నగునూర్‌లోని దుర్గాభవానీ ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా ఈనెల 18 నుంచి జూలై 3 వరకు శాఖాంబరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మాధికారి, వేదపండితులు పురాణం మహేశ్వరశర్మ తెలిపారు. మంగళవారం ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆలయంలో ఆవిష్కరించి మాట్లాడారు. 18న అమావాస్య సందర్భంగా అమ్మవారికి ఫలపంచామృతాభిషేకం, విశేష పూజలు, ధ్వజారోహణం జరుగుతుందని అన్నారు. ఈ ఉత్సవాల్లో రోజుకొక్క కూరగాయలతో అమ్మవారికి అలంకరిస్తారని తెలిపారు. 19న పూదీన మాలలతో అలంకరణ, 20న కలశస్థాపన, దొండకాయల మాలలతో అలంకరణ, 21న కరివేపాకు, 22న వంకాయ, 23, నమ్మకాయ, 24న కాకరకాయ, 25న క్యారెట్, 26న ఆలుగడ్డలు, కరివేపాకు, 27న చామగడ్డ, 28న అలుచింత, 29న గోరు చిక్కుడుకాయ, 30న గుండు దోసకాయ, జూలై 1న క్యాప్సికమ్, 2న బెండకాయ మాలలతో అలంకరిస్తారని వివరించారు. ఉత్సవాల చివరి రోజూ 3న అమ్మవారికి 54 కూరగాయలతో విశేష అలంకరణ, గురుపౌర్ణమి సందర్భంగా వ్యాసపూజ, చండీ హోమం, మహాపూర్ణాహుతి, సాయంత్రం పౌర్ణమి పూజ, పల్లకిసేవ, సహస్రదీపాలంకరణ, ఉయ్యాల సేవ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. ఈ ఉత్సవాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

సన్మానం



సప్తగిరికాలనీ(కరీంనగర్): ఇటీవల నూతనంగా ఎన్నికైన టీఎన్జీవో సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సంగం లక్ష్మణ్‌రావులను మంగళవారం నాయీబ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు నీలం మొండయ్య, జంపాల సంపత్, కంది వెంకటేశ్, నిమ్మకంటి రమేశ్, శ్రీనివాస్, బిక్షపతి, శ్రీనివాస్, రమేశ్, లక్ష్మణ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

మహిళ సంక్షేమ దినోత్సవం



బోనంతో అంగన్‌వాడీ టీచర్, ఆయాలు

కరీంనగర్: రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహిళ సంక్షేమ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోతిరాంపూర్ సెక్టార్‌లో బోనాలు తయారు చేశారు. బోనంలో బెల్లపు అన్నం ఉంచి బోనానికి అమ్మవారిని అలకరించి మన సంప్రదాయం ప్రకారంగా బోనం ఎత్తుకొని మహిళ సంక్షేమ దినోత్సవంలో పాల్గొని బోనం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కె.స్వరూప, కె.శ్యామల, పి.సరిత, టి.పద్మ, ఆయాలు హేమలత, నాగలక్ష్మి, సరిత, సుందరవ్వ తదితరులు పాల్గొన్నారు.

కమాన్‌పూర్ మాజీ సర్పంచ్ మృతి



రామయ్య(ఫైల్)

కొత్తపల్లి: కొత్తపల్లి మండలం కమాన్‌పూర్ గ్రామ మాజీ సర్పంచ్ బోనాల రామయ్య అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. మాజీ సర్పంచ్ మృతికి గ్రామ సర్పంచ్ జినుక సంపత్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, గ్రామస్తులు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

'కొత్తకోట' మృతికి సంతాపం

విద్యానగర్(కరీంనగర్): శాసనసభ మాజీ సభ్యుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కొత్తకోట దయాకర్‌రెడ్డి మృతికి తెలుగుదేశం పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు వంచ శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి దామెర సత్యం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. పార్టీకి దయాకర్‌రెడ్డి అందించిన సేవలను కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సమాచారం

నేడు సాహితీగౌతమి భవనానికి భూమిపూజ

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని ఐటీ టవర్ ప్రక్కన నిర్మించనున్న జిల్లా సాహితీసంస్థల సమాఖ్య సాహితీ గౌతమి భవనానికి బుధవారం భూమిపూజ జరుపనున్నట్లు అధ్యక్షుడు నంది శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ భూమిపూజకు మంత్రి గంగుల కమలాకర్, మేయర్ సునీల్ రావు, కలెక్టర్ ఆర్వీ కర్ణన్ హాజరవుతున్నారని అన్నారు. కవులు, రచయితలు, వివిధ సాహితీ సంస్థల బాధ్యులు, సాహిత్యాభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

23న వేంకటేశ్వరాలయ హుండీల ఆదాయం లెక్కింపు

కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్‌రోడ్డు వేంకటేశ్వరాలయ హుండీల ఆదాయాన్ని ఈనెల 23న ఉదయం 10 గంటలకు లెక్కించనున్నట్లు ఈవో ఉడుదల వెంకన్న ఒక ప్రకటనలో తెలిపారు. లెక్కింపునకు సిబ్బంది విధిగా హాజరు కావాలని, ఔత్సాహిక భక్తులు కూడా హాజరుకావచ్చునని పేర్కొన్నారు.

గురుకుల కొలువుల

దరఖాస్తులో సవరణకు అవకాశం

- పోస్టుల వారీగా సవరణకు తేదీలను ప్రకటించిన టీఆర్ఈఐఆర్బీ
- సవరణకు అవకాశం ఒక్కసారి మాత్రమేనని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించిన దరఖాస్తుల్లో వివరాల సవరణకు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు(టీఆర్ఈఐఆర్బీ) అవకాశం కల్పించింది. ఐదు గురుకుల సొసైటీల పరిధిలో 9 వేలకు పైబడి ఉద్యోగాలకుగాను టీఆర్ఈఐఆర్బీ గత నెల 27వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించిన సంగతి తెలిసిందే. అయితే అభ్యర్థులు సమర్పించిన ఆన్లైన్ దరఖాస్తుల్లో అక్కడక్కడా తప్పులు దొర్లడంతో పాటు వన్ టైమ్ రిజిస్ట్రేషన్(ఓటీఆర్) సమయంలోనూ పొరపాట్లు జరిగినట్లు టీఆర్ఈఐఆర్బీకి పెద్ద సంఖ్యలో వినతులు వచ్చాయి. దీంతో దరఖాస్తులో సవరణకు అవకాశం కల్పించింది. ఈమేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పోస్టు కేటగిరీ వారీగా సవరణ తేదీలను అందులో పేర్కొంది. సగటున ఒక్కో పోస్టుకు సంబంధించిన దరఖాస్తు సవరణకు 5 రోజుల గడువు ఇచ్చింది.

ఎడిట్ అవకాశం ఒక్కసారే...

గురుకుల కొలువుల దరఖాస్తు సవరణకు ఒక్కసారి మాత్రమే అవకాశం కల్పిస్తున్నట్లు తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు స్పష్టం చేసింది. ఒకసారి సవరణ చేసుకున్న అభ్యర్థికి మరోసారి సవరణకు అవకాశం ఉండదని వివరించింది. ఇప్పటికే ప్రింట్ తీసుకున్న దరఖాస్తు ఫారాన్ని పరిశీలించి పొరపాట్లు ఎక్కడ దొర్లాయో గుర్తించి ఆమేరకు సవరణ చేసుకోవాల్సి ఉంటుంది. సవరణ చేసుకునే అభ్యర్థి ముందుగా గురుకుల బోర్డు వెబ్సైట్లో లాగిన్ కావాల్సి ఉంటుంది. ఉన్నత విద్యకు సంబంధించిన వివరాలు, సొసైటీ ప్రిఫరెన్సెస్, ఎగ్జామ్ సెంటర్ ప్రిఫరెన్స్ తదితర వివరాల సవరణకు అప్లికేషన్ కరెక్షన్ టాబ్ ద్వారా ఎడిట్ చేసుకోవాలి. అభ్యర్థి బేసిక్ డీటైల్స్, ఇతర వివరాలు, చిరునామా, ఫొటో, సంతకం, తదితరాల సవరణ, అప్డేషన్కు మాడిఫై వన్టైమ్ రిజిస్ట్రేషన్ దగ్గర క్లిక్ చేయాలి. సవరణ తర్వాత పీడీఎఫ్ దరఖాస్తు ఫారాన్ని డౌన్లోడ్ చేసుకుని ప్రింట్ తీసుకోవాలి.

పోస్టు కేటగిరీల వారీగా సవరణ తేదీలు

- జూనియర్ కాలేజీల్లో జూనియర్ లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్ పోస్టులతో పాటు స్కూళ్లలో పోస్ట్గ్రాడ్యుయేట్ టీచర్(పీజీటీ) : ఈనెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు.
- డిగ్రీ కాలేజీల్లో లెక్చరర్, ఫిజికల్ డైరెక్టర్, లైబ్రేరియన్, పాఠశాలల్లో లైబ్రేరియన్, ఫిజికల్ డైరెక్టర్, డ్రాయింగ్/ఆర్ట్ టీచర్, క్రాఫ్ట్ ఇన్స్ట్రక్టర్/క్రాఫ్ట్ టీచర్, మ్యూజిక్ టీచర్ : ఈనెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు
- ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్(టీజీటీ): 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు

మీ చిరునవ్వుల్లో సకల సంతోషాలు

ఈ ప్రభుత్వం మీదే.. ఉద్యోగికి మంచి చేయాలన్నదే నా తపన: ఏపీ సీఎం జగన్

కేబినెట్ నిర్ణయాలపై హర్షం వ్యక్తం చేస్తూ ఏపీ సీఎంను కలిసిన ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, అమరావతి: ఉద్యోగులు సంతోషంగా ఉంటే డెలివరీ మెకానిజం బాగుంటుందని, తద్వారా ప్రజలు సంతోషంగా ఉంటారని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి పేర్కొన్నారు. కొందరు రాజకీయ కారణాలతో చెప్పే అంశాలను ఉద్యోగులు విశ్వసించనక్కరలేదని, నా మనసు ఎప్పుడూ మీకు మంచి చేయడం కోసమే ఉంటుందని, అన్నింటినీ పరిష్కరిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నెల 7వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో కొత్తగా జీపీఎస్ తీసుకురావడం, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, ప్రభుత్వంలో ఏపీవీవీపీ విలీనం, 12వ పీఆర్సీ ఏర్పాటు సహా ఉద్యోగులకు సంబంధించి తీసుకున్న పలు నిర్ణయాలపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపాయి.



ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డిని సత్కరిస్తున్న ఉద్యోగ సంఘాల నాయకులు

ఈమేరకు ఏపీ జేఏసీ అమరావతితో సహా పలు ఉద్యోగ సంఘాల నేతలు మంగళవారం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్తో సమావేశమయ్యారు. ''ఉద్యోగులను సంతోషంగా ఉంచేందుకు నా తరపు నుంచి ప్రతి కార్యక్రమాన్ని మనసా, వాచా, కర్మణా చిత్తశుద్ధితో నిర్వర్తిస్తున్నా. ఈ విషయాన్ని ఎప్పుడూ దృష్టిలో ఉంచుకోవాలని కోరుతున్నా..'' అని ఉద్యోగ సంఘాల నేతలతో సీఎం జగన్ అన్నారు.

మేము ప్రభుత్వానికి వ్యతిరేకం కాదు

ఏపీ ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని రాష్ట్ర సీఎం వైఎస్ జగన్కి తెలియజేశామని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద ఉద్యోగ నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించినందుకు సీఎం జగన్ను కలిసి ధన్యవాదాలు తెలిపామన్నారు. 47 అంశాలపై సీఎస్కు తాము లేఖ ఇస్తే 36 అంశాల పరిష్కారానికి చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇందుకు సీఎం జగన్కు ధన్యవాదాలు తెలిపామని చెప్పారు. సోషల్ మీడియాలో ఉద్యోగ సంఘాలపై పలువురు వ్యతిరేకంగా పలు రకాల చర్చ నడుపుతున్నారని, ప్రభుత్వానికి ఉద్యోగులను దూరం చేసేందుకే పలు రాజకీయ పార్టీలు ఈ చర్చ నడుపుతున్నాయని తెలిపారు.



ఓబీసీ మహాసంఘ్ మెగా కన్వెన్షన్కు ఏపీ సీఎంకు ఆహ్వానం

సాక్షి, అమరావతి: రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ ప్రతినిధులు మంగళవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ను కలిశారు. ఆగస్టు 7న తిరుపతిలోని ఎస్వీ స్టేడియంలో నిర్వహించనున్న 8వ జాతీయ మెగా కన్వెన్షన్లో పాల్గొనాలని కోరుతూ ఆహ్వానపత్రిక అందజేశారు. సీఎం జగన్ను కలిసిన వారిలో ఆలిండియా బ్యాక్వర్డ్ క్లాస్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జస్టిస్ వి.ఈశ్వరయ్య, రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ నాయకులు డాక్టర్ బాబారావు తైవాడే, సచిన్ రాజుర్కర్, జాజుల శ్రీనివాస్గౌడ్, కేశన శంకరరావుతో పాటు మంత్రి జోగి రమేశ్ కూడా ఉన్నారు. అనంతరం జస్టిస్ వి.ఈశ్వరయ్య మాట్లాడుతూ తిరుపతిలో నిర్వహించే సభకు ఆహ్వానించగా.. సీఎం సానుకూలంగా స్పందించారని చెప్పారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని పార్లమెంటులో ప్రైవేటు బిల్లుపెట్టిన ఘనత వైఎస్సార్సీపీకే దక్కుతుందన్నారు.

ఎంపీ అవినాశ్ జైలు పాలే మీ లక్ష్యమా?

- సునీతకు సుప్రీంకోర్టు ప్రశ్న
- ఎందుకీ ఈగో క్లాషెస్?
- ప్రతివాది మీ కజినే కదా?
- అంత అత్యవసరం ఏముంది? వెకేషన్ బెంచ్కు ఎందుకు?
- ఇప్పుడీ పిటిషన్ను కొట్టివేస్తే సీనియర్ న్యాయవాదికి ఇబ్బందే
- సీబీఐకి నోటీసులివ్వలేం.. విచారణ 19కి వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్ వివేకా హత్య కేసులో ఎంపీ అవినాశ్రెడ్డిని జైలుపాలు చేయడమే మీ లక్ష్యమా? అని సుప్రీంకోర్టు ధర్మాసనం నర్రెడ్డి సునీతను ప్రశ్నించింది. ఈ వ్యవహారం చూస్తుంటే ఈగో క్లాషెస్లా ఉందని వ్యాఖ్యానించింది. తొందరపడి వ్యక్తిగత వాదనల ద్వారా నష్టపోతారేమో చూసుకోవాలని హితవు పలికింది. పిటిషనర్ సునీత విజ్ఞప్తి మేరకు తదుపరి విచారణను ఈ నెల 19వ తేదీకి వాయిదా వేస్తూ అదనపు డాక్యుమెంట్లు అందచేసేందుకు అనుమతించింది. ఎంపీ వైఎస్ అవినాశ్రెడ్డి ముందస్తు బెయిల్ను రద్దు చేయాలంటూ నర్రెడ్డి సునీత దాఖలు చేసిన పిటిషన్ను సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ విక్రమ్నాథ్, జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లాలతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారించింది. అయితే సుప్రీం వెకేషన్ బెంచ్ సీనియర్ న్యాయవాదులను అనుమతించకపోవడంతో పిటిషనర్ సునీత తన వాదనలు తానే వినిపించడం ప్రారంభించారు. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఆమెకు సహకరించేందుకు ధర్మాసనం అనుమతించింది. తాను పిటిషనర్నని, తన తండ్రి హత్యకు గురయ్యారని సునీత చెబుతుండగా.. ఆ విషయాల్లోకి తాము వెళ్లడం లేదని, వెకేషన్లో ఎందుకు వచ్చారని ధర్మాసనం ప్రశ్నించింది. 'ఈ కేసులో జూన్ 30 కల్లా దర్యాప్తు పూర్తి చేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఛార్జిషీట్ ముందే ఫైల్ చేయాల్సి ఉంది. ఏ – 8 (అవినాశ్) భారీ కుట్ర చేసిన ప్రధాన వ్యక్తుల్లో ఒకరు. సీబీఐ దర్యాప్తునకు సహకరించడంలేదు. ముందస్తు బెయిలు పొందడం వల్ల కస్టోడియల్ ఇంటరాగేషన్ కుదరడం లేదు. ముందస్తు బెయిలు ఎందుకు ఇచ్చారో కారణాలు తెలియడం లేదు'' అని సునీత పేర్కొన్నారు. ఈ సమయంలో జస్టిస్ విక్రమ్నాథ్ జోక్యం చేసుకుంటూ 'దీంట్లో అంతగా అత్యవసరమైన పరిస్థితి ఏముంది? వెకేషన్ బెంచ్కు రావాల్సిన అవసరం ఉందా?' అని ప్రశ్నించారు.

సీబీఐ చూసుకుంటుంది..

'ఒక వ్యక్తిని అరెస్టు చేయాలో లేదో దర్యాప్తు సంస్థ చూసుకుంటుంది. ఎవరిని, ఎప్పుడు అరెస్టు చేయాలో ఎవరిని కస్టోడియల్ ఇంటరాగేషన్ చేయాలో సీబీఐకు తెలుసు. విచారణకు సహకరిస్తున్నారా లేదా అనేది కూడా సీబీఐ చూసుకుంటుంది. మీరెందుకు జోక్యం చేసుకుంటారు? ఈ కేసులో పలు సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయి. మీకెందుకు ఈగో క్లాషెస్? అతడిని (ఎంపీ అవినాశ్) జైలుపాలు చేయాలన్న లక్ష్యమా? ఆవిధంగా చూడొద్దు. ఈ తరహా ప్రొసీడింగ్స్ ఎందుకు?'' అని జస్టిస్ అమానుల్లా వ్యాఖ్యానించారు.



ఇప్పుడీ పిటిషన్ను కొట్టివేస్తే..

ఎంపీ అవినాశ్రెడ్డి ఇతర నిందితులతో కలసి సాక్షులను ప్రభావితం చేస్తున్నారని సునీత ఆరోపించారు. ఈ సమయంలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ అవినాశ్రెడ్డి సీబీఐ దర్యాప్తునకు సహకరిస్తున్నప్పుడు కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరం ఏముందని ప్రశ్నించింది. ''మీకో సలహా ఇస్తాం. మీరు వ్యక్తిగతంగా వాదిస్తున్నారు. చట్టంపై అవగాహన లేమితో వాదనలో అంతగా ప్రావీణ్యం లేకపోవచ్చు. మేం ఇప్పుడు ఈ పిటిషన్ను కొట్టివేస్తే సీనియర్ న్యాయవాదికి ఇబ్బంది అవుతుంది. అందుకే సెలవుల తర్వాత విచారణ జాబితాలోకి చేరుస్తాం'' అని సునీతనుద్దేశించి ధర్మాసనం పేర్కొంది. సీబీఐ దర్యాప్తు ఈ నెల 30 కల్లా పూర్తి కావాలని సుప్రీంకోర్టు ఆదేశాలు ఉన్నాయని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఈ సమయంలో పేర్కొన్నారు. వాదనలకు సీనియర్ న్యాయవాదులను అనుమతించడం లేదన్న విషయాన్ని గుర్తు చేస్తూ తమకు ఇబ్బంది కలగ చేయవద్దని ఈ సందర్భంగా ధర్మాసనం సూచించింది. తాము ఇప్పుడు వాదనలకు అనుమతిస్తే మరో నలుగురు సీనియర్ న్యాయవాదులు తమను వివక్షకు గురి చేశారని ఆరోపించే అవకాశం ఉందని పేర్కొంది. తాము అనుమతించకపోయినప్పటికీ మీరు వాదనలు చేస్తున్నారంటూ లూథ్రాను ఉద్దేశించి ధర్మాసనం వ్యాఖ్యానించింది. సుప్రీంకోర్టులో మరో బెంచ్ నిర్దేశించిన డెడ్లైన్ను తాము మార్చలేమని స్పష్టం చేసింది.

గడువు నిర్దేశించాక ఎలా మారుస్తాం?

సీబీఐకు నోటీసులిచ్చి విచారణకు హాజరు కావాల్సిందిగా ఆదేశించాలని ధర్మాసనాన్ని సునీత కోరారు. అయితే ఇప్పటికే మరో బెంచ్ జూన్ 30వ తేదీ అని గడువు నిర్దేశించిన తరువాత తాము ఎలా మారుస్తామని ధర్మాసనం ప్రశ్నించింది. ఒకవేళ ఇప్పుడు తాము జోక్యం చేసుకుంటే మొత్తం అంతా మారిపోతుందని వ్యాఖ్యానించింది. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వాలని సునీత మరోసారి అభ్యర్థించడంతో ధర్మాసనం స్పందిస్తూ.. ''ఎందుకు సీబీఐ రావాలని కోరుతున్నారు? రావాలో వద్దో సీబీఐ నిర్ణయించుకుంటుంది. ప్రతివాది సహకరించకుంటే, కస్టోడియల్ ఇంటరాగేషన్ అవసరమైతే, హైకోర్టు ఆదేశాలు సరికాకుంటే సీబీఐ తనకు తానే వస్తుంది. అందుకే చెబుతున్నాం. జూలై 3న కోర్టుకు రండి. మీ న్యాయవాది వాదిస్తారు' అని ధర్మాసనం సూచించింది.

న్యాయవాది వాదించడమే సబబు..

హైకోర్టు ఆదేశాలు నిష్ప్రయోజనమని ఈ అంశానికి సంబంధించి మరో కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిందని సునీత పేర్కొనడంతో అందుకే తాము సెలవుల తర్వాత రావాలని సలహా ఇస్తున్నామని ధర్మాసనం తెలిపింది. ప్రతివాది అవినాశ్ మీ కజినా? అని ధర్మాసనం పదేపదే సునీతను ప్రశ్నించగా... అవునని తన రెండో కజిన్ అని సునీత సమాధానమిచ్చారు. అయితే పిటిషనర్ తరపున న్యాయవాది వాదించడమే సబబని, ఇందులో సాంకేతిక అంశాలు ముడిపడి ఉన్నాయని ధర్మాసనం అభిప్రాయపడింది. కాగా సునీత పిటిషన్ను బుధవారం విచారణ జాబితాలో చేర్చాలని, అడ్వొకేట్ ఆన్రికార్డ్స్ హాజరవుతారని లూథ్రా న్యాయస్థానానికి విజ్ఞప్తి చేశారు. అయితే సీబీఐకి నోటీసులు ఇవ్వడంలో తాము జోక్యం చేసుకోబోమని, పిటిషనర్ విజ్ఞప్తి మేరకు ఈ నెల 19న విచారణ జాబితాలో చేర్చాలంటూ రిజిస్ట్రీకి ధర్మాసనం ఆదేశాలిచ్చింది.

ఏసీబీకి చిక్కిన వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు

- డెప్యూటీ డీఎంహెచ్వో కారు అద్దె బిల్లుకు డబ్బుల డిమాండ్
- ఏసీబీని ఆశ్రయించిన బాధితుడు
- రూ.10 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన ముగ్గురు



సూపరింటెండెంట్ షఫియొద్దీన్



సీనియర్ అకౌంటెంట్ దీపిక



అకౌంటెంట్ రాజనర్సు



డీఎంహెచ్వో కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో అవినీతి ఉద్యోగులను ఏసీబీ అధికారులు మంగళవారం రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్(ఎన్హెచ్ఎం)లో సీనియర్ అసిస్టెంట్గా పనిచేసిన షఫియొద్దీన్, అందులోనే ఔట్సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న సీనియర్ అకౌంటెంట్ దీపిక, అకౌంటెంట్ రాజనర్సు రూ.10 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మంచిర్యాల డెప్యూటీ డీఎంహెచ్వోకు కారును అద్దెకు పెట్టిన బెల్లంపల్లికి చెందిన రాంసాగర్కు బిల్లు రూ.1,96,020 వరకు రావాల్సి ఉంది. బిల్లు ఇవ్వడానికి వీరు రూ.10 వేలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో నెల క్రితం సీనియర్ అసిస్టెంట్ షఫియొద్దీన్ రామగుండం మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్గా పదోన్నతిపై వెళ్లాడు. దీంతో రాంసాగర్ సీనియర్ అకౌంటెంట్ దీపిక వద్దకు వెళ్లి షఫియొద్దీన్ బదిలీపై వెళ్లాడు కదా, డబ్బులు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నించాడు. దీంతో ఆమె ఫోన్లో షఫియొద్దీన్ను సంప్రదించింది. డబ్బులు ఇవ్వాలని అతను చెప్పడంతో బాధితుడు ఏసీబీ అధికారులకు సమాచారం ఇచ్చాడు.

డబ్బులతో డీఎంహెచ్వో కార్యాలయానికి..

ఏసీబీ అధికారుల సూచన మేరకు రాంసాగర్ రూ.10 వేలను ఇచ్చేందుకు మంగళవారం డీఎంహెచ్వో కార్యాలయంకు వెళ్లాడు. దీపికకు డబ్బులు ఇచ్చేందుకు ప్రయత్నించగా, దీపిక బిజీగా ఉండడంతో, అక్కడే పనిచేసే మరో అకౌంటెంట్ రాజనర్సును బయటకు పంపించింది. అతను రూ.10 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్హ్యాండెడ్గా పట్టుకున్నారు. ఇద్దరు అకౌంటెంట్లను అదుపులోకి తీసుకుని విచారణ చేయగా, రామగుండం మెడికల్ కళాశాలలో సూపరింటెండెంట్గా పనిచేస్తున్న షఫియొద్దీన్నే డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. దీంతో షఫీయొద్దీన్ను విచారణ కోసం మంచిర్యాల డీఎంహెచ్వో కార్యాలయానికి తీసుకువచ్చారు. విచారణలో లంచం తీసుకోవాలని షఫియొద్దీన్ చెప్పినట్లు తేలింది. ఈమేరకు అకౌంటెంట్లు దీపిక, రాజనర్సు డబ్బులు తీసుకున్నట్లు నిర్ధారించారు. విచారణ అనంతరం ముగ్గురిని అరెస్ట్ చేశారు. కరీంనగర్ ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని ఏసీబీ డీఎస్పీ భద్రయ్య తెలిపారు. దాడిలో ఏసీబీ ఇన్స్పెక్టర్లు రవీందర్, తిరుపతి, సునీల్కుమార్, జాన్రెడ్డి పాల్గొన్నారు. 14న జిల్లావ్యాప్తంగా మూడు నియోజకవర్గ కేంద్రాల్లో వైద్య ఆరోగ్య దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా, ఒకరోజు ముందు లంచావతారులు ఏసీబీకి చిక్కడం చర్చనీయాంశమైంది.

త్వరలో సింగరేణి 'గుర్తింపు' ఎన్నికలు

- ఈ నెల 24న షెడ్యూల్ విడుదల



డెప్యూటీ సీఎల్సీతో చర్చిస్తున్న కార్మిక సంఘాల నేతలు

శ్రీరాంపూర్: సింగరేణిలో 7వ గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ ఈనెల 24న విడుదల కానుంది. హైదరాబాద్లోని డెప్యూటీ సీఎల్సీ, రిటర్నింగ్ అధికారి శ్రీనివాసులు సమక్షంలో కార్మిక సంఘాలు, యాజమాన్యం మధ్య ఎన్నికలపై మంగళవారం సమావేశం జరిగింది. కార్మిక సంఘాల నాయకులు, కంపెనీ అధికారులు ఎన్నికలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఇప్పటికే ఎన్నికలు చాలా ఆలస్యం అయ్యాయని, జాప్యం చేయకుండా సత్వరమే నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. దీనిపై డెప్యూటీ సీఎల్సీ స్పందిస్తూ ఈనెల 24న మరోసారి సమావేశమై సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తామని తెలిపారని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వి.సీతారామయ్య, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి మంద నరసింహారావు తెలిపారు. సమావేశంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు ఎన్నికలు జరిగే వరకు అన్ని సంఘాలను సమానంగా గుర్తించాలని, దీనిపై కంపెనీ అధికారులకు లేఖలు రాయాలని రిటర్నింగ్ అధికారిని కోరారు. ఇందుకు డెప్యూటీ సీఎల్సీ సానుకూలంగా స్పందించినట్లు నేతలు తెలిపారు. సింగరేణి ఎన్నికల కాలపరిమితిపై కూడా సంఘాలు తమ అభిప్రాయాన్ని వెల్లడించాయి. టీబీజీకేఎస్తోపాటు ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, హెచ్ఎంఎస్, బీఎంఎస్ నేతలు నాలుగు సంవత్సరాలకు ఒకసారి ఎన్నికల నిర్వహించాలని కోరగా, సీఐటీయూ మిగతా సంఘాలు రెండేళ్లకే ఎన్నికల నిర్వహించాలని కోరాయి. కంపెనీ అధికారులు కూడా నాలుగు సంవత్సరాలకే ఎన్నికలు నిర్వహిస్తామని, రెండేళ్లకు ఒప్పుకోమన్నారు. దీనిపై డెప్యూటీ సీఎల్సీ స్పందిస్తూ సెంట్రల్ చీఫ్ లేబర్ కమిషనర్కు లేఖ రాస్తానని తెలిపారు. మెజారిటీ కార్మిక సంఘాలు, కంపెనీ అభిప్రాయం మేరకు గుర్తింపు సంఘం కాలపరిమితి నాలుగేళ్లుగానే ఉండే అవకాశం ఎక్కువగా ఉంది. గతంలో కుదిరిన ఒప్పందం ప్రకారం కాంట్రాక్ట్ కార్మికులకు బోనస్ చెల్లింపు, నర్సరీ కార్మికులకు కనీస వేతనాలు, కాంట్రాక్టు కార్మికుల కుటుంబ సభ్యులకు ఈఎస్ఐ హాస్పిటల్లో వైద్యం ఇప్పించేలా కంపెనీ ఉత్తర్వులు ఇచ్చేలా ఆదేశాలివ్వాలని సీఎల్సీని కోరినట్లు సీతారామయ్య తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో పలువురు సీఐల బదిలీలు

కరీంనగర్క్రైం/జగిత్యాలక్రైం: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పలువురు సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కె.సృజన్రెడ్డిని కరీంనగర్ టాస్క్ఫోర్స్ నుంచి సీఎస్బీకి, వెంకటనర్సయ్యను కరీంనగర్ సీఎస్బీ నుంచి టాస్క్ఫోర్స్కు, దామోదర్రెడ్డిని త్రీటౌన్ నుంచి కరీంనగర్ సీసీఆర్బీకి, ఎస్.రాజేశ్ను ఐజీకి రిపోర్టు చేయాలని ఆదేశాలు జారీఅయ్యాయి. జలోత్ సరిలాల్ను జగిత్యాల వీఆర్ నుంచి కరీంనగర్ టాస్క్ఫోర్స్కు, గుర్రం తి రుమల్ను కరీంనగర్ ట్రాఫిక్ నుంచి సీఎస్బీకి, కట్ల రవీందర్ను పీసీఆర్ కరీంనగర్ నుంచి కరీంనగర్ ట్రాఫిక్కు, ఈ.నాగార్జునరావును కరీంనగర్ ట్రాఫిక్ నుంచి ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. పి.విజ్ఞాన్రావును కరీంనగర్ రూరల్ నుంచి పీసీఆర్ కరీంనగర్కు, ఏ.ఇంద్రసేన రెడ్డిని సుల్తానాబాద్ నుంచి తిమ్మాపూర్సర్కిల్కు, పర్శ రమేశ్ను తిమ్మాపూర్ సర్కిల్ నుంచి కరీంనగర్ ట్రాఫిక్కు, ఎస్.సతీశ్కుమార్ను సీఐడీ నుంచి తాండూర్సర్కిల్కు, కె.జగదీశ్ను తాండూర్ నుంచి సుల్తానాబాద్ సర్కిల్కు, కె.రామచందర్రావును జగిత్యాల టౌన్ నుంచి కరీంనగర్ టూటౌన్కు, టి.లక్ష్మీబాబును కరీంనగర్ టూటౌన్ నుంచి మెదక్ జిల్లా రామయంపేట సర్కిల్కు బదిలీ చేశారు. ఏ.ప్రదీప్కుమార్ను పెద్దపల్లి నుంచి కరీంనగర్రూరల్ సర్కిల్కు, వి.శ్రీనివాస్ను రామగుండం సీఎస్బీ నుంచి కరీంనగర్ త్రీటౌన్కు, బురుగుల సంతోష్ను సీఎస్బీ కరీంనగర్ నుంచి హుజూ రాబాద్ రూరల్కు, బి.జనార్దన్ను హుజూరాబాద్ రూరల్ నుంచి ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలన్నారు. బిల్లా కోటేశ్వర్ను ధర్మపురి సర్కిల్ నుంచి మల్యాల సర్కిల్కు, డి.రమణమూర్తిని మల్యాల సర్కిల్ నుండి ధర్మపురికి, బొంతల సత్యనారాయణను సీఎస్బీ రామగుండం నుంచి రామగుండం ట్రాఫిక్కు, బి.అనిల్ను పెద్దపల్లి ట్రాఫిక్ నుంచి పెద్దపల్లిసర్కిల్కు, జె.సురేశ్ జమ్మికుంట రూరల్ సర్కిల్ నుంచి ఆసిఫాబాద్కు బదిలీ చేశారు.

ముగిసిన రైఫిల్ షూటింగ్ శిక్షణ



సర్టిఫికెట్లు ప్రదానం చేసిన డీవైఎస్వో రాజవీరు



రైఫిల్ షూటింగ్ శిక్షణలో చిన్నారులు

కరీంనగర్స్పోర్ట్స్: కరీంనగర్లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో వారం రోజులుగా జిల్లా రైఫిల్ షూటింగ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ శిబిరం మంగళవారం ముగిసింది. ముగింపు రోజు చిన్నారులకు 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా క్రీడాశాఖ అధికారి కీర్తి రాజవీరు సర్టిఫికెట్లు, పతకాలు అందజేశారు.సంఘం అధ్యక్షుడు రాజేందర్రావు, ఉపాధ్యక్షులు రత్నాకర్, ప్రసాద్, కే.రవి పాల్గొన్నారు.

మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యేల పెన్షన్ రద్దు చేయాలి

- భారత్సురక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్యాదవ్

శంకరపట్నం: మాజీ ఎంపీ, ఎమ్మెల్యేల పెన్షన్ రద్దు చేయాలని భారత్ సురక్ష సమితి రాష్ట్ర అధ్యక్షుడు అశోక్యాదవ్ అన్నారు. శంకరపట్నం మండలం లింగాపూర్లో మంగళవారం మాట్లాడుతూ.. పార్టీ ఫిరాయింపుదారుల శాసనసభ, పార్లమెంట్ సభ్యత్వాలు రద్దు చేయాలని సూచించారు. ఉద్యమాలకు వ్యతిరేకంగా పనిచేసిన వారే మంత్రులుగా కొనసాగుతున్నారని ఆరోపించారు. దివంగత ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించి ఈనెల 25నాటికి 49ఏళ్లు పూర్తవుతాయని, ఎమర్జెన్సీ అంశాన్ని పాఠ్యపుస్తకాల్లో చేర్చాలని సూచించారు. నేరచరిత్ర, అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు పార్టీ టికెట్లు ఇవ్వకూడదని అన్నారు. ఈ సమావేశంలో వీరారెడ్డి, శ్యాంప్రసాద్, రాజమొగిళి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్యాదవ్

17న కెడెట్ జూడో జట్ల ఎంపిక

కరీంనగర్స్పోర్ట్స్: కరీంనగర్ జిల్లా జూడో సంఘం ఆధ్వర్యంలో ఈనెల 17న కరీంనగర్ మంకమ్మతోటలోని సాయిమానేరు పాఠశాలలోని జూడో అకాడమీలో జిల్లాస్థాయి కెడెట్ బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా జూడో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కడారి అనంత రెడ్డి, గసిరెడ్డి జనార్దన్ రెడ్డి తెలిపారు. కెడెట్ బాలురు 50 కేజీ, 55 , 60, 66, 73, 81, 90 కేజీల్లోపు, 90 కేజీలపై, బాలికలు 40కేజీ, 44, 48, 52, 57, 63, 70కేజీల్లోపు, 70 కేజీలపై విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు 2006, 2007, 2008 సంవత్సరాల్లో పుట్టిన వారు ఉండాలన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో రాణించిన వారికి ఈనెల 20, 21వ తేదీల్లో వరంగల్లో జరిగే ఎనిమిదో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల వారు అదేరోజు మధ్యాహ్నం ఒంటిగంట వరకు రిపోర్టు చేయాలని, వివరాలకు సెల్ నెంబర్: 9949830494లో సంప్రదించాలని సూచించారు.

నేడు బాలుర బాక్సింగ్ జట్టు ఎంపిక

కరీంనగర్స్పోర్ట్స్: జిల్లా బాక్సింగ్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం కరీంనగర్లోని అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడిజిల్లా జూనియర్స్ బాలుర జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు జి. సత్యనారాయణ, కొత్తకొండ సంపత్ కుమార్ తెలిపారు. జిల్లాస్థాయి పోటీల్లో రాణించిన వారికి ఈ నెల 17, 18 తేదీల్లో హైదరాబాద్లో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని వివరించారు. క్రీడాకారులు 2007 జనవరి నుంచి 2008 డిసెంబర్ 31లోపు పుట్టిన వారు అర్హులన్నారు. ఆధార్, పదో తరగతి మెమో, ఎంట్రీ ఫీజుతో ఉదయం 8 గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని.. పూర్తి వివరాలకు సెల్ నంబర్: 9100668474కు కాల్చేయాలని సూచించారు.

నేడు వరల్డ్ బ్లడ్ డోనార్ డే

రక్తపు బొట్టు... ప్రాణాన్ని నిలబెడుతుంది.
ఆ రక్తం సమయానికి అందకపోతే...
ప్రాణాన్ని నిలపగలిగే డాక్టర్ కూడా అచేతనం కావాల్సిందే.
శిబి చక్రవర్తిలా దేహాన్ని కోసి ఇవ్వాల్సిన పనిలేదు.
కొంత రక్తాన్ని పంచి మరొక ప్రాణాన్ని నిలబెట్టవచ్చు.
రక్తదానానికి మగవాళ్లతోపాటు మహిళలూ ముందుకొస్తున్నారు.
మహిళలు రక్తదానం చేయరాదనే అపోహను తుడిచేస్తున్నారు.
రక్తదానం చేస్తూ... సమాజాన్ని చైతన్యవంతం చేస్తూ ఉన్న
ఓ మెడికో... ఓ సోషల్ యాక్టివిస్టల పరిచయం ఇది.



నాన్న మాట...

యాభై సార్లు రక్తదానం చేయాలనే సంకల్పం కూడా మా నాన్న చెప్పిన మాటే. రక్తదానం చేయగలిగింది ఇరవై నుంచి అరవై ఏళ్ల మధ్య లోనే. అరవై తర్వాత రక్తదానం చేయడానికి ఆరోగ్యరీత్యా నిబంధనలు ఒప్పుకోవు. వీటికి తోడు ఆడవాళ్లకు ప్రసవాలు, పిల్లల పెంపకంలో మరో పదేళ్లు గడిచిపోతాయి. 35 నుంచి విధిగా రక్తదానం చేస్తూ యాభై సార్లు రక్తం ఇవ్వాలనే నియమాన్ని పెట్టుకోవాలనేవారు. ఆ లక్ష్యంతోనే యాభై రక్తదానాలు పూర్తి చేశాను. ఆ తర్వాత మా అమ్మకోసం మా తమ్ముడితోపాటు నేనూ రక్తం ఇచ్చాను కానీ దానిని ఈ లెక్కలో చెప్ప కోను. అమ్మరుణం ఏమిచ్చినా తీరేది కాదు.

– గొట్టిపాటి నిర్మలమ్మ, రక్తదాత

ప్రాణం నిలిపే రక్తపు బొట్టు

మా పుట్టిల్లు నెల్లూరు నగరం (ఆంధ్రప్రదేశ్). మా చిన్నాన్న జయరామనాయుడు డాక్టర్. 'రక్తం అంది ఉంటే ప్రాణాన్ని కాపాడగలిగేవాళ్లం' అని అనేకసార్లు ఆవేదన చెందేవారు. ఇంట్లో అందరినీ రక్తదానం పట్ల చైతన్యవంతం చేశారాయన. దాంతో మా నాన్న నెల్లూరులో రెడ్‌క్రాస్, బ్లడ్‌బ్యాంకు స్థాపించారు. ఇంట్లో అందరం రక్తదానం చేశాం. అలా నేను తొలిసారి బ్లడ్ డొనేట్ చేసినప్పటికి నా వయసు 20.

మామగారి ప్రోత్సాహం

పెళ్లికి ముందు నెల్లూరులో మొదలైన రక్తదాన ఉద్యమాన్ని పెళ్లయి అత్తగారింటికి నెల్లూరు జిల్లా, కావలి పట్టణానికి వెళ్లిన తర్వాత కూడా కొనసాగించాను. నలభై ఏళ్ల కిందట కావలి రక్తదాతల్లో మహిళలు దాదాపు పదిహేను మంది ఉండేవారు. రెడ్‌క్రాస్ సమావేశాలు మా ఇంట్లోనే జరిగేవి. అనేక క్యాంపులు కూడా నిర్వహించేవాళ్లం. కాలేజ్ స్టూడెంట్స్ ఉత్సాహంగా ముందుకు వచ్చేవాళ్లు. కానీ అలా ముందుకొచ్చిన అమ్మాయిల్లో బ్లడ్ తగినంత ఉంటే కదా! వందమంది ఆడపిల్లలు వస్తే రక్తదానం చేయగలిగిన ఎలిజిబులిటీ ఉన్న వాళ్లు ఆరేడుకు మించేవాళ్లు కాదు. అండర్ వెయిట్, హిమోగ్లోబిన్ శాతం తగినంత లేకపోవడం ఎక్కువగా కనిపించేది. అరుదైన గ్రూపుల వాళ్ల నుంచి కూడా బ్లడ్ క్యాంపుల్లో సేకరించేవాళ్లం కాదు. వాళ్లకు పరీక్షలు చేసి లిస్ట్ తయారు చేసుకుని ఎమర్జెన్సీ కండిషన్‌లో పిలుస్తామని చెప్పేవాళ్లం.

అప్పట్లో బ్యాంకుల్లేవు

నా వయసు 63. ఈ వయసులో కూడా ఇంత చురుగ్గా, ఆరోగ్యంగా ఉండగలుగుతున్నానంటే అందుకు రక్తదానమే కారణం. ఇప్పుడు బ్లడ్ డొనేషన్‌కు సౌకర్యాలు బాగున్నాయి. కానీ మొదట్లో బ్యాంకులు ఉండేవి కాదు. మా మామగారు మాజీ ఎమ్మెల్యే సుబ్బానాయుడు ప్రోత్సాహంతో మా బంధువులు ముందుకొచ్చి కావలి హాస్పిటల్‌లో రక్తదానం కోసం ఒక గది కట్టించారు. యాక్సిడెంట్ కేస్ రాగానే హాస్పిటల్ నుంచి మాకు ఫోన్ వచ్చేది. అప్పటికప్పుడు మా డోనర్స్‌లో పేషెంట్ బ్లడ్ గ్రూపుతో మ్యాచ్ అయ్యే డోనర్ ఎవరు అందుబాటులో ఉంటే వాళ్లు వెళ్లి రక్తం ఇచ్చేవాళ్లం. బ్లడ్ డోనర్స్ అంతా ఆరోగ్యంగా, అంటువ్యాధుల పట్ల విచక్షణతో ఉండాలి. చిన్నపాటి అనారోగ్యాలు వచ్చినా నిర్లక్ష్యం చేయకుండా పరీక్షలన్నీ చేయించుకుని రక్తదానం చేయడానికి సిద్ధంగా ఉండాలి. అవసరాన్ని బట్టి ఏడాదికి మూడు–నాలుగుసార్లు ఇచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. మా అమ్మాయి దగ్గరకు యూఎస్‌కి వెళ్లినప్పుడు అక్కడ కూడా ఓ సారి బ్లడ్ డొనేట్ చేశాను. అది అత్యవసర స్థితి కాదు, కేవలం యూఎస్‌లోనూ రక్తమిచ్చాననే సరదా కోసం చేసిన పని. మొత్తానికి అరవై ఏళ్లు నిండేలోపు యాభై సార్లు రక్తం ఇచ్చి మా నాన్న మాటను నెగ్గించాను. ఈ క్రమంలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన మహిళగా గుర్తింపు వచ్చింది.

గవర్నర్ అభినందించారు

అప్పటి గవర్నర్ రంగరాజన్, ఆయన సతీమణి హరిప్రియా రంగరాజన్ దంపతులు 2000వ సంవత్సరంలో కావలికి వచ్చారు. ఆమె రెడ్‌క్రాస్‌లో చురుకైన సభ్యురాలు కూడా. రాజ్‌భవన్‌లో జరిగిన రెడ్‌క్రాస్ కార్యక్రమాల్లో కూడా నేను పాల్గొన్నాను. నన్ను కావలిలో చూసి 'ఈ పురస్కారం అందుకుంటున్న నిర్మలవి నువ్వేనా' అని ఆత్మీయంగా పలకరించారు. మహిళలకు మార్గదర్శి అంటూ గవర్నర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ జ్ఞాపకాలన్నీ నా మనసులో ఉన్నాయి కానీ జ్ఞాపికలుగా దాచుకోవాలనే ఆలోచన కూడా ఉండేది కాదు. నా జీవితం అంతా ఎదురీతలోనే గడిచింది. ఆ ఎదురీతల్లో ఇవేవీ ప్రాధాన్యతాంశాలుగా కనిపించలేదప్పట్లో. మొత్తానికి మా చిన్నాన్న, నాన్న, మామగారు అందరూ బ్లడ్ డొనేషన్ పట్ల చైతన్యవంతంగా ఉండడంతో నాకు ఇంత కాలం ఈ సర్వీస్‌లో కొనసాగడం సాధ్యమైంది. ఇది నాకు సంతోషాన్నిచ్చే కార్యక్రమం కావడంతో ఇంట్లో ఎవరూ అడ్డుచెప్పేవాళ్లు కాదు'' అని తన రక్తదాన ప్రస్థానాన్ని వివరించారు సోషల్ యాక్టివిస్ట్ నిర్మలమ్మ.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

రక్తదానం చేద్దాం!

– శృతి కోట, రక్తదాత, వైద్యవిద్యార్థిని



నేను పద్దెనిమిదేళ్ల వయసు నుంచి బ్లడ్ డొనేట్ చేస్తున్నాను. నా హిమోగ్లోబిన్ శాతాన్ని పరీక్షించుకుంటూ మూడు – నాలుగు నెలలకోసారి ఇచ్చేటట్లు చూసుకుంటున్నాను. ఈ మధ్య హెపటైటిస్ వ్యాక్సిన్ కారణంగా కొంత విరామం వచ్చింది.

మా నాన్న సంపత్‌కుమార్ బ్లడ్ డోనర్ కావడంతో నాకు చిన్నప్పటి నుంచి ఆసక్తి ఉండేది. రక్తదానానికి మహిళలు, మగవాళ్లు అనే తేడా పాటించక్కర్లేదు. అయితే భారతీయ మహిళల్లో రక్తహీనత ఎక్కువ మందిలో ఉంటోంది కాబట్టి కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకుంటూ రక్తదానం చేయవచ్చు. హిమోగ్లోబిన్ పన్నెండు శాతానికి తగ్గకూడదు. డయాబెటిస్, పీసీఓడీ, థైరాయిడ్ సమస్యలతోపాటు లాస్ట్ పీరియడ్‌లో రక్తస్రావం స్థాయిలను దృష్టిలో ఉంచుకుని రక్తదానం చేయవచ్చు. పాలిచ్చే తల్లులు రక్తదానం చేయకూడదు. మెనోపాజ్ దశలో ఉన్న వాళ్లు డాక్టర్ సూచన మేరకు ఇవ్వవచ్చు. ఇక మహిళలు, మగవాళ్లు అందరూ రక్తదానం చేయడానికి ముందు చెక్‌లిస్ట్ ప్రకారం అన్ని పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు ధ్రువీకరించుకోవాలి. ఎయిడ్స్, హెపటైటిస్, మలేరియా, సమీప గతంలో ఏవైనా ఇన్‌ఫెక్షన్‌లకు గురవడం, వ్యాక్సిన్‌లు వేయించుకోవడం, ఇతర అనారోగ్య సమస్యలకు మందులు వాడుతూ ఉండడం వంటి కండిషన్స్‌కు స్క్రీనింగ్ జరిగిన తర్వాత మాత్రమే రక్తాన్ని సేకరిస్తారు. రక్తం ఇవ్వాలనే ఉత్సాహం ఉన్నప్పటికీ తమ దేహ సామర్థ్యాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. బ్లడ్ డోనార్స్ మంచి ఆహారం, తగినంత నీరు తీసుకోవడంతో పాటు, క్రమం తప్పకుండా వ్యాయామం కూడా చేస్తుండాలి. రక్తదానం చేస్తుంటే ఎప్పటికప్పుడు కొత్త కణాలు పుట్టుకొస్తూ దేహం ఆరోగ్యంగా ఉంటుంది.

'రక్తాన్ని ఇవ్వండి, ప్రాణాన్ని కాపాడండి' అనేదే మెడికోగా నా సందేశం. ప్రమాదంలో గాయపడిన తొలి గంటను గోల్డెన్ అవర్ అంటాం. ఆ గంటలో వైద్య చికిత్స జరగడం ఎంత అవసరమో వైద్యానికి రక్తం అందుబాటులో ఉండడమూ అంతే అవసరం.



తల్లితో ఇన్షా

న్యూస్ మేకర్

నిరాశ పారిపోయింది

పెల్లెట్ గన్‌లో నుంచి పెల్లెట్స్ గంటకి 1100 కి.మీ వేగంతో ఇన్షా రెండు కళ్లలోకి దూసుకెళ్లాయి. అప్పుడా అమ్మాయి 9 చదువుతోంది. 2016లో కశ్మీర్‌లో గుంపును అదుపు చేయడానికి వాడిన పెల్లెట్ గన్స్ అమాయకులకు కూడా శాపంగా మారాయి. ఇన్షా ఓడిపోలేదు. నిరాశ పడలేదు. అంచెలంచెలుగా శ్రమ చేసి చదువుకుంది. మొన్న సీనియర్ ఇంటర్ పరీక్షలలో 500కి 315 మార్కులు సాధించింది. 'నేను ఐ.ఏ.ఎస్ అవుతాను. అంధులకు ఆత్మవిశ్వాసం ఇస్తాను' అంటోంది. అంధులేంటి... ఓటమి భయంతో ఉన్నవారందరూ ఆత్మవిశ్వాసం పొందగలరు ఇన్షాను చూస్తే.

2016.

దక్షిణ కశ్మీర్‌లోని షోపియన్ ప్రాంతంలో సెడో అనే చిన్న పల్లె. వేసవి కాలం. అల్లర్లు చెలరేగాయి. భద్రతా దళాలు వారిని అదుపు చేయడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి. ఇంట్లో మొదటి అంతస్తు కిటికీలో నుంచి ఏం జరుగుతున్నదో చూద్దామని 16 ఏళ్ల ఇన్షా ముష్టాక్ కిటికీ తెరిచింది. ఆ తర్వాత ఏమైంది అర్థం కాలేదు. క్షణపాటులో ఆమె రెండు కళ్ల నుంచి రక్తం ధారాళంగా తీసింది. విపరీతమైన నొప్పితో ఇన్షా ఆర్తనాదాలు చేసింది. 2016, 2017... రెండు సంవత్సరాల పాటు భద్రతాదళాలు కశ్మీర్‌లో ప్రయోగించిన పెల్లెట్ గన్స్ వల్ల శాశ్వతంగా అంధులైన వారు 139 మంది. వారిలో ఇన్షా ఒకమ్మాయి.

విఫలమైన డాక్టర్లు

పెల్లెట్లు కళ్లల్లోకి దూసుకెళ్లగానే ఇన్షా చూపు పోయింది. కాని మానవీయ సంస్థలు, ప్రభుత్వం కూడా ఇన్షా చికిత్స కోసం ముందుకు వచ్చింది. ఢిల్లీ ఎయిమ్స్‌లో డాక్టర్లు కూడా ప్రయత్నించి ఆమెకు ఎప్పటికీ చూపు రాదని తేల్చారు. పెల్లెట్లు జీవితాంతం శరీరంలో ఉండిపోతాయి. అవి చాలా ప్రమాదం. 'అయితే అంతకన్నా ప్రమాదం నిరాశలో కూరుకుపోవడం అని నాకు తెలుసు. నేను చదువుకోవాలనుకున్నాను. నా కంటే ముందు మా అమ్మ అఫ్రోజా, డ్రైవర్‌గా జీవితం గడిపే మా నాన్న ముష్టాక్ అహ్మద్ లోన్ నేను చదువుకోవాలని భావించారు. మరో రెండేళ్ల తర్వాత ఒక లేఖకుని సహాయంతో నేను టెన్త్ పాసయ్యాను' అని తెలిపింది ఇన్షా.



ఇన్షా

బ్రెయిలీ నేర్చుకుని...

అయితే ఇంటర్ మాత్రం బ్రెయిలీ నేర్చుకుని పరీక్షలు రాసి పాసవ్వాలని నిశ్చయించుకుంది ఇన్షా. ఇందు కోసం శ్రీనగర్‌లోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో జాయిన్ అయ్యింది. ఇంటర్‌తో పాటు కంప్యూటర్ కోర్సు, ఇంగ్లిష్ స్పీకింగ్ కోర్సు కూడా నేర్చుకుంది. బ్రెయిలీ ద్వారా పాఠాలు నేర్చుకుని పరీక్షలు రాయడం చాలా కష్టమయ్యేది. అయినా సరే ఇన్షా ఆగలేదు. 2011లో ఫస్ట్ ఇయర్ ఇంటర్ పూర్తి చేసింది. ఈ సంవత్సరం సెకండ్ ఇయర్ ఇంటర్ ఏ గ్రేడ్‌లో పాసయ్యింది. 'చదువు ఒక్కటే నాకు స్వేచ్ఛ, స్వతంత్రం ఇవ్వగలదు. అది నాకు తెలుసు. ఐ.ఏ.ఎస్ చేయాలనుకుంటున్నాను. అంధులకు మన దేశంలో తగినన్ని ప్రత్యేకమైన స్కూల్స్ లేవు. ఆ విషయంలో నేను కృషి చేస్తాను' అని తెలిపింది ఇన్షా.

సానుభూతి ఇష్టపడదు

ఇంటర్ పాసయ్యిందని తెలిశాక ఆమె తల్లిదండ్రులు ఉద్వేగంతో కన్నీరు కార్చారు. తండ్రి, తల్లి తమ కూతురి పట్టుదలకు గర్వపడ్డారు. ఇన్షా కూడా తన విజయంతో సంతోషంగా ఉంది. జమ్ము కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, హోమ్ మినిస్ట్రీ అధికారులు ఆమెను మెచ్చుకున్నారు. మంచి కాలేజీలో చదువు కొనసాగడానికి హామీలు దొరికాయి. ఉత్సాహపరిచే వాళ్లను తప్ప సానుభూతి చూపించేవాళ్లను ఇన్షా ఇష్టపడదు. 'నేను అందరితో సమానంగా జీవించగలను. నాకు సానుభూతి చూపకండి. వీలైతే నా ప్రయాణంలో తోడు నిలవండి' అంటోందామె.

కాళ్లు లేకపోయినా రెక్కలున్నాయ్!



నేహా

ప్రమాదంలో కాలు పోగొట్టుకొని, తల్లిదండ్రులకు భారమై, లోకమంతా శూన్యంలా అనిపించిన రోజుల నుంచి తేరుకొని, అహ్మదాబాద్‌లో 'ఆంప్ టీ నేహా' పేరుతో టీ స్టాల్ ప్రారంభించి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తోంది నేహా. మోటివేషనల్ స్పీకర్‌గానూ తన జీవన అనుభవాలను చెబుతోంది. ఆంప్ టీ కి దేశవ్యాప్త గుర్తింపు తేవడానికి కృషి చేస్తోంది. ఓడిపోయిన రోజుల నుంచి ఒంటికాలితో గెలవడానికి చేస్తున్న ప్రయత్నాలను ఏ మాత్రం వెనకడుగు వేయకుండా వివరిస్తుంది నేహా.

''మాది ఉమ్మడి కుటుంబం. అమ్మ,నాన్న, ఇద్దరు అన్నదమ్ములు. నాన్న ఎలక్ట్రీషియన్‌గా పనిచేసేవాడు. గుజరాత్‌లోని భవానీ నగర్‌లో పుట్టి పెరిగాను. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కాలేజీ చదువు మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది. ఓ చిన్న ప్రైమరీ స్కూల్లో టీచర్‌గా ఉద్యోగం వెతుక్కొని, కొన్నాళ్లు గడిపాను. చిన్నప్పటి నుంచి చదువుతో పాటు డ్యాన్స్ అంటే చాలా ఇష్టం ఉండేది. కానీ, ఇంటి ఆర్థిక పరిస్థితుల కారణంగా కాలక్రమంలో అన్ని ఇష్టాలను వదులుకుంటూ రావాల్సి వచ్చింది. ఇలాగే ఉంటే నా కలల రెక్కలు విప్పుకోలేననిపించింది. ఉద్యోగంతో పాటు కాలేజీలో చదువుకోవడానికి అడ్మిషన్ తీసుకున్నాను. ఉదయం టీచర్‌గా చేస్తూ, సాయంత్రం కాలేజీలో చదువుకునేదాన్ని. స్కూల్లో పాఠాలు చెబుతూనే నా బలహీనతల గురించి కూడా తెలుసుకున్నాను. నేను ముందుకు వెళ్లాలంటే నా బలహీనతలపై పనిచేయడం నేర్చుకోవాలి అని అనుకున్నాను. కొంత కాలం అంతా బాగానే జరిగింది. కానీ, కాలంతో పాటు డబ్బు అవసరం కూడా పెరగడం మొదలైంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమించడానికి అహ్మదాబాద్ వెళ్లాలని నిర్ణయించుకున్నాను. 2012లో అహ్మదాబాద్ వచ్చి, కాల్‌సెంటర్‌లో పనిచేశాను. ఎన్నో ప్రయత్నాల తర్వాత మళ్లీ టీచర్ జాబ్ సంపాదించుకున్నాను. ఎక్కువ మొత్తంలోనే నెల జీతం వచ్చేది.

కల చెరిపిన ప్రమాదం

అంతా బాగుంది అనుకున్న సమయంలో రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాను. ట్రీట్‌మెంట్ తీసుకోవడంలో జాప్యం కావడంతో కాలు తీసేయాల్సి వచ్చింది. దాంతో తీవ్ర నిరాశతో డిప్రెషన్‌కు గురయ్యాను. దీని నుంచి కోలుకోవడానికి చాలా కాలం పట్టింది. కృత్రిమ కాలు ఏర్పాటయ్యాక నాలో మళ్లీ ఆశలు చిగురించాయి.

స్నేహితుల సహకారంతో..

ధైర్యం తెచ్చుకొని, ముందున్న జీవితం గురించి ఆలోచించాను. టీ అంటే నాకు చాలా ఇష్టం. దీంతో మా ఇంట్లో వాళ్లకి ఓ కేఫ్ తెరుస్తానని చెప్పాను. కానీ, నా ట్రీట్‌మెంట్‌కి అప్పటికే చాలా ఖర్చయింది. షాప్ అద్దెకు తీసుకునేంత డబ్బు నా దగ్గర లేదు. మా బంధువులు ఎవరూ సపోర్ట్ ఇచ్చేవారు లేరు. కానీ, నా స్నేహితుల సహకారంతో టీ స్టాల్ ప్రారంభించాను. టీ స్టాల్‌కు షార్ట్ మీదనే వెళ్లేదాన్ని. చాలా మంది నా డ్రెస్ గురించి కూడా తిట్టేవారు. 'కాలు లేదు, పైగా నలుగురు తిరిగే చోట ఇలా షార్ట్స్ వేసుకొని తిరుగుతావా? బుద్ధిలేదా' అనేవారు. ఈ వెక్కిరింపులు బాధ కలిగించేవి. కానీ, నాకు నేను బలంగా ఉన్నాను అని తెలుసు. వాస్తవికతను అంగీకరించాను. నేను ధరించిన డ్రెస్ నాకేమీ ఎబ్బెట్టుగా లేదు. పైగా అందరూ అంతగా తిట్టుకోవాల్సిన అవసరమూ లేదు. నా పని ద్వారానే సమాధానం చెబుతాను అనుకునేదాన్ని.

టీ స్టాల్ వైరల్

'కాళ్లు లేకపోయినా రెక్కలున్నాయి' అని నాకు నేనే చెప్పుకుంటూ 'ఆంప్ టీ నేహా' పేరుతో టీ స్టాల్ నడపడం మొదలుపెట్టాను. విజయం సాధిస్తానని కచ్చితంగా తెలుసు. కానీ, ప్రజల నుండి ఇంత ప్రేమను పొందుతానని తెలియదు. కేవలం పది రోజులలో నా టీ స్టాల్ వద్ద జనం గుమిగూడటం ప్రారంభించారు. ఫుడ్ బ్లాగర్లు నా గురించి రాసి, ప్రచారం చేశారు. నా టీ స్టాల్‌ను బ్రాండ్‌గా మార్చాలని పోరాడుతున్న వీడియో ఒకటి తెగ వైరల్ అయ్యింది. కొద్ది రోజుల తర్వాత కొందరు అధికారులు నా స్టాల్ దగ్గరకు వచ్చి, ఇది అక్రమమని, తొలగిస్తామన్నారు. నేను వారితో చాలా పోరాడాను. ఎవరో తీసిన ఆ వీడియో కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఎంతోమంది తమ ప్రేమతో నాకు మద్దతు తెలిపారు. ఇక నేను వెనక్కి తిరిగి చూసుకునే అవసరం లేకుండా పోయింది. 'ఆంప్ టీ నేహా'ని మంచి బ్రాండ్‌గా మార్చి నాలాంటివారికి ఓ మార్గం చూపాలన్న నా కలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నాను' అని చెబుతోంది నేహా.



టీ తయారుచేస్తున్న నేహా

కిచెన్‌టిప్

మిగిలిపోయిన చపాతీ, బ్రెడ్‌స్లైసులు గట్టిగా అయిపోయి తినడానికి పనికిరావు. వీటిని ప్లేటులో పెట్టి, ఈ ప్లేటులోనే అరగ్లాసు నీటిని కూడా ఉంచి, మైక్రోవేవ్‌లో పదినిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల నీళ్లు ఆవిరిగా మారి చపాతి, బ్రెడ్‌స్లైసులు మెత్తబడి, అప్పుడే చేసిన వాటిలా తాజాగా ఉండి, తినడానికి పనికొస్తాయి.



యూత్ ప్లస్

**యువతరంలో చాలామంది...
తమ క్రియేటివ్ స్కిల్స్‌ను అభిరుచికి మాత్రమే పరిమితం చేసుకోవడం లేదు.
ధైర్యంగా ఒక అడుగు ముందుకు వేసి ఆసక్తి, అభిరుచులనే కెరీర్ ఛాయిస్‌గా తీసుకుంటున్నారు.
కాపీరైటర్ కావాలనే కల కూడా అందులో ఒకటి.
'మేకిట్ సింపుల్. మేకిట్ మెమొరబుల్'
'రైట్ విథౌట్ ఫియర్. ఎడిట్ విథౌట్ మెర్సీ'... లాంటి మాటలను గుండెలో పెట్టుకొని తమ కలల తీరం వైపు కదులుతున్నారు...**

కమ్మని కాఫీలాంటి కళ



పశ్చిమ బెంగాల్‌లోని చిన్న పట్టణం నుంచి తన కలల తీరమైన ముంబైకి వచ్చింది అనూష బోస్. మాస్ కమ్యూనికేషన్‌లో పట్టా పుచ్చుకున్న అనూష ఒక అడ్వర్‌టైజింగ్ కంపెనీలో చేరింది. జింగిల్స్, డైలాగులు రాయడంలో తనదైన శైలిని సృష్టించుకుంది. మూడురోజుల్లో రాసే టైమ్ దొరికినా కేవలం 30 సెకండ్లలో మాత్రమే రాసే అవకాశం ఉన్నా... ఎక్కడా తడబాటు ఉండకూడదనేది తన ఫిలాసఫీ. 'ఇండస్ట్రీలో నేను కూడా ఒకరిని అనుకోవడం కాదు. మనలోని ప్రత్యేకత గురించి ఇండస్ట్రీ మాట్లాడుకునేలా క్రియేటివిటీకి సానబట్టాలి' అంటుంది సీనియర్ కాపీ రైటర్ అయిన అనూష బోస్.

ట్రైనీ కాపీరైటర్‌గా తన ప్రయాణాన్ని మొదలుపెట్టింది ముంబైకి చెందిన ఆకృతి బన్సాల్. చిన్నప్పటి నుంచి తనకు టీవీలో వచ్చే యాడ్స్ అంటే ఇష్టం. ఆ ఇష్టమే తనని అడ్వర్‌టైజింగ్ ఫీల్డ్‌కు తీసుకువచ్చింది. అది ఏ వ్యాపారానికి సంబంధించినది అనేదానికంటే ఆ యాడ్ వెనుక ఉన్న ఐడియా తనకు బాగా నచ్చేది. 'హోం సైన్స్' చదువుకున్న ఆకృతికి 'ఎడ్వర్‌టైజింగ్ అండ్ పబ్లిక్‌రిలేషన్' ఒక సబ్జెక్ట్‌గా ఉండేది. ఆ సబ్జెక్ట్ ఇష్టంగా చదువుకున్న తరువాత 'ఈ రంగంలో నేను ప్రయత్నించవచ్చు' అనుకుంది. ఫీల్డ్‌కు వచ్చిన తరువాత ప్రతిరోజు, ప్రతి డెడ్‌లైన్‌ను ఒక సవాల్‌గా స్వీకరించింది.

'చాలెంజ్ ఉన్నప్పుడే మజా ఉంటుంది' అంటుంది ఆకృతి బన్సాల్. మరి ఆమె భవిష్యత్ లక్ష్యం ఏమిటి?

'ప్రతిష్ఠాత్మకమైన ఎడ్వర్‌టైజింగ్ అవార్డ్ తీసుకోవాలి లేదా నా తల్లిదండ్రులు రోడ్డు ప్రయాణం చేస్తున్నప్పుడు వారికి నచ్చిన యాడ్ హోర్డింగ్ నేను రాసినదై ఉండాలి' అంటుంది ఆకృతి బన్సాల్.

రాధిక నాగ్‌పాల్ టీనేజ్ నుంచి పుస్తకాల పురుగు. భాషలోని సొగసు అంటే ఇష్టం. రాధిక జర్నలిజం కోర్స్ చేసింది. అందులో ఒక సబ్జెక్ట్ అయిన ఎడ్వర్‌టైజింగ్ తనకు బాగా నచ్చింది.

రాధిక ఇప్పుడు 'సోషియోవాష్'లో సీనియర్ కాపీ రైటర్.


'యాడ్ ఏజెన్సీలో పనిగంటలు అంటూ ఉండవు. కాలంతో పరుగెత్తాల్సిందే. బ్రాండ్‌ను అర్థం చేసుకోవడంతో పాటు క్లయింట్ ఆశిస్తున్నది ఏమిటి? ఆడియెన్స్‌ను వేగంగా ఎలా చేరుకోవాలి? అనే దానిపై అవగాహన ఉండాలి. మనం చెప్పదల్చుకున్నది సింగిల్ లైన్‌లోనే క్యాచీగా చెప్పగలగాలి' అంటుంది రాధిక.

'విస్తృతంగా చదవాలి. గత అనుభవాల నుంచి రెఫరెన్స్ తీసుకోవడానికి ఎంతో ఉంది' అనేది ఔత్సాహిక కాపీరైటర్‌లకు రాధిక ఇచ్చే సలహా. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన అంజు న్యూస్‌పేపర్లలో వచ్చే ఎడ్వర్‌టైజింగ్‌లను ఫైల్ చేస్తుంటుంది. ఆమె ఎన్నోసార్లు చదివిన పుస్తకం క్లాడ్ సీ.హాప్‌కిన్స్ రాసిన సైంటిఫిక్ ఎడ్వర్‌టైజింగ్ (1923). ఈ పుస్తకంలోని సరళమైన భాష అంటే అంజుకు ఇష్టం. 'జస్ట్ సేల్స్‌మన్‌షిప్' 'ఆఫర్ సర్వీస్' 'హెడ్ లైన్స్' 'బీయింగ్ స్పెసిఫిక్' 'ఆర్ట్ ఇన్ ఎడ్వర్‌టైజింగ్' 'టెల్ యువర్ ఫుల్‌స్టోరీ' 'ఇన్‌ఫర్‌మేషన్' 'స్ట్రాటజీ' 'నెగెటివ్ రైటింగ్'... మొదలైన చాప్టర్ల గురించి అనర్గళంగా మాట్లాడగలదు.

అంజు భవిష్యత్ లక్ష్యం 'కాపీ రైటర్' అనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు!

వీరు కూడా...

ప్రముఖ సినీ నటి రాశీఖన్నా న్యూ ఢిల్లీ. లేడీ శ్రీరామ్ కాలేజీ స్టూడెంట్. కాలేజీ రోజుల నుంచి చదవడం రాయడం అంటే ఇష్టం. కాపీరైటర్ కావాలనేది తన కల. కలను నిజం చేసుకోవడానికి ముంబైకి వెళ్లింది. అయితే సినిమాల్లో అవకాశాలు రావడంతో తన రూట్ మారింది. కాపీరైటర్ కాబోయి యాక్టర్ అయిందన్నమాట! సినిమారంగంలో ఉన్నప్పటికీ గుడ్ కాపీరైటింగ్ కోసం వెదుకుతుంది. బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్ కాలేజీ చదువు పూర్తికాగానే ఒక యాడ్ ఏజెన్సీలో కాపీరైటర్‌గా కెరీర్ మొదలుపెట్టాడు. ఇప్పటికీ చిన్న చిన్న రచనలు చేస్తుంటాడు.



రణ్‌వీర్‌సింగ్



రాశీఖన్నా

మన ప్రత్యేకతే మన శక్తి



ఇండస్ట్రీలో నేను కూడా ఒకరిని అనుకోవడం కాదు. మనలోని ప్రత్యేకత గురించి ఇండస్ట్రీ మాట్లాడుకునేలా క్రియేటివిటీకి సాన పట్టాలి.

– ఆకృతి బన్సాల్, కాపీ రైటర్

ఒక ఐడియా... వెయ్యి ఏనుగుల బలం



ఒక ఐడియా స్ట్రైక్ అయ్యేవరకు మనసులో భయంగా ఉంటుంది. తళుక్కుమని ఒక ఐడియా మెరిసిందా...ఇక అంతే. వెయ్యి ఏనుగుల బలం దరి చేరుతుంది! క్రియేటివ్ బ్లాక్స్ రాకుండా ఉండడానికి పుస్తకాలు చదువుతాను. నచ్చిన పుస్తకాలు మళ్లీ చదువుతాను.

– రాధిక నాగ్‌పాల్, సీనియర్ కాపీ రైటర్



అమెరికాలో శిక్షణకు మీరాబాయి చాను

ఆసియా క్రీడల సన్నాహాల్లో భాగంగా భారత స్టార్ మహిళా వెయిట్‌లిఫ్టర్లు మీరాబాయి చాను, బింద్యారాణి దేవి అమెరికాలో శిక్షణ తీసుకోనున్నారు. ఈ మేరకు వీరిద్దరికయ్యే ఖర్చులను కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ భరిస్తుంది. 65 రోజులపాటు సెయింట్ లూయిస్‌లో మీరాబాయి, బింద్యారాణి శిక్షణ తీసుకుంటారు. వీరిద్దరి వెంట చీఫ్ కోచ్ విజయ్ శర్మ, ఫిజియోథెరపిస్ట్ తస్నీమ్ వెళతారు. మీరాబాయి టోక్యో ఒలింపిక్స్‌లో, బింద్యారాణి 2022 కామన్వెల్త్ గేమ్స్‌లో రజత పతకాలు గెలిచారు.



భారత రెజ్లర్లకు పది పతకాలు

ఆసియా అండర్-17 రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత రెజ్లర్లు పది పతకాలతో అదరగొట్టారు. కిర్గిస్తాన్‌లో జరిగిన ఈ టోర్నీలో భారత్ టీమ్ విభాగంలో రన్నరప్‌గా నిలిచింది. అంకుశ్ (55 కేజీలు) స్వర్ణ పతకం సాధించాడు. ధన్‌రాజ్ (45 కేజీలు), రూపేశ్ (48 కేజీలు), రోహిత్ (51 కేజీలు), సౌరభ్ యాదవ్ (80 కేజీలు) రజత పతకాలు నెగ్గారు. తుషార్ (60 కేజీలు), సౌరభ్ (65 కేజీలు), నరేందర్ (71 కేజీలు), వినయ్ (92 కేజీలు), జస్‌పూరణ్ (110 కేజీలు) కాంస్య పతకాలు సాధించారు.

క్వార్టర్స్‌లో బోపన్న జోడీ



స్టుట్‌గార్ట్ (జర్మనీ): బాస్ ఓపెన్ ఏటీపీ-250 టెన్నిస్ టోర్నమెంట్‌లో రోహన్ బోపన్న (భారత్)-మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న-ఎబ్డెన్ ద్వయం 6-0, 6-3తో రొమైన్ అర్నియోడో (మొనాకో)-గ్రెగొరి బరెరే (ఫ్రాన్స్) జోడీపై విజయం సాధించింది. కేవలం 40 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో బోపన్న, ఎబ్డెన్ ఆరు ఏస్‌లు సంధించడంతోపాటు ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశారు.

భారత్ ఘనవిజయం

చెన్నై: ప్రపంచకప్ స్క్వాష్ మిక్స్‌డ్ టీమ్ టోర్నమెంట్‌లో భారత్ భారీ విజయంతో బోణీ కొట్టింది. హాంకాంగ్ జట్టుతో మంగళవారం జరిగిన పూల్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 4-0తో గెలిచింది. తొలి మ్యాచ్‌లో అభయ్ సింగ్ 7-2, 7-3, 7-6తో చుంగ్ యాట్ లాంగ్‌ను ఓడించగా... రెండో మ్యాచ్‌లో జోష్నా చినప్ప 7-1, 7-5, 7-6తో హేలీ ఫుంగ్‌పై నెగ్గడంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌లో సౌరవ్ ఘోషాల్ 5-7, 7-2, 7-5, 7-1తో టు యు లింగ్‌పై గెలవడంతో భారత విజయం ఖరారైంది. చివరిదైన నాలుగో మ్యాచ్‌లో తన్వీ ఖన్నా 5-7, 6-7, 7-1, 7-4, 7-3తో సె యె లామ్ టోబీపై నెగ్గడంతో భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. నేడు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో భారత్ ఆడుతుంది. తొలి రోజు జరిగిన ఇతర మ్యాచ్‌ల్లో ఈజిప్ట్ 4-0తో ఆస్ట్రేలియాపై, జపాన్ 3-1తో దక్షిణాఫ్రికాపై గెలిచాయి.


జోష్నా

సింధు శుభారంభం

- 38 నిమిషాల్లో ఇండోనేసియా ప్లేయర్ మరిస్కాపై గెలుపు
- ప్రణయ్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి
- గాయత్రి-ట్రెసా జాలీ జోడీకి నిరాశ




జకార్తా: థాయ్‌లాండ్ ఓపెన్, సింగపూర్ ఓపెన్ టోర్నీలలో తొలి రౌండ్‌లోనే ఇంటిదారి పట్టిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధు... ప్రతిష్టాత్మక ఇండోనేసియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-1000 టోర్నీలో మాత్రం తొలి రౌండ్ అడ్డంకిని దాటింది. ఇండోనేసియా క్రీడాకారిణి, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా టున్‌జుంగ్‌పై సింధు వరుస గేముల్లో గెలిచింది. మంగళవారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 14వ ర్యాంకర్ సింధు 21-19, 21-15తో మరిస్కాను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. 38 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధుకు తొలి గేమ్‌లో గట్టిపోటీ లభించింది. ఆధిక్యం పలుమార్లు ఇద్దరితో దోబూచులాడింది. అయితే కీలకదశలో సింధు పైచేయి సాధించి తొలి గేమ్‌ను సొంతం చేసుకుంది. రెండో గేమ్ ఆరంభంలోనూ ఇద్దరూ ప్రతి పాయింట్‌కు హోరాహోరీగా పోరాడారు. సింధు స్కోరు 7-6 వద్ద మూడు పాయింట్లు నెగ్గి 10-6తో ముందంజ వేసింది. ఆ తర్వాత ఒక పాయింట్ కోల్పోయిన సింధు మళ్లీ చెలరేగి ఈసారి వరుసగా ఆరు పాయింట్లు గెలుపొంది 16-7తో ఆధిక్యంలోకి వెళ్లింది. అనంతరం ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని సింధు విజయాన్ని ఖరారు చేసుకుంది. ఈ ఏడాది మరిస్కా చేతిలో స్పెయిన్ మాస్టర్స్, మలేసియా మాస్టర్స్ టోర్నీలలో ఓడిపోయిన సింధు ఆమెను ఈ సీజన్‌లో తొలిసారి ఓడించడం గమనార్హం. ప్రిక్వార్టర్ ఫైనల్లో సింధుకు అగ్ని పరీక్ష ఎదురుకానుంది. ప్రపంచ మూడో ర్యాంకర్ తై జు యింగ్ (చైనీస్ తైపీ)తో సింధు తలపడనుంది. తై జు యింగ్‌తో ముఖాముఖి రికార్డులో సింధు 5-18తో వెనుకబడి ఉంది. 2019 ప్రపంచ చాంపియన్‌షిప్‌లో చివరిసారి తై జు యింగ్‌ను ఓడించిన సింధు ఆ తర్వాత ఈ చైనీస్ తైపీ ప్లేయర్‌తో ఆడిన ఎనిమిది వరుస మ్యాచ్‌ల్లో ఓడిపోయింది.

పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్, ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ హెచ్‌ఎస్ ప్రణయ్ కూడా ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో ప్రణయ్ 50 నిమిషాల్లో 21-16, 21-14తో కెంటా నిషిమోటో (జపాన్)పై గెలుపొందాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్)తో ప్రణయ్ ఆడతాడు. ముఖాముఖి రికార్డులో ప్రణయ్, అంగుస్ 5-5తో సమఉజ్జీగా ఉన్నారు.

సాత్విక్ జోడీ ముందంజ

డబుల్స్‌లో భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్ విభాగంలో పుల్లెల గాయత్రి-ట్రెసా జాలీ జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించగా... పురుషుల డబుల్స్ విభాగంలో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ప్రపంచ 16వ ర్యాంక్ జంట గాయత్రి-ట్రెసా జాలీ 22-20, 12-21, 16-21తో ప్రపంచ 18వ ర్యాంక్ జోడీ రిన్ ఇవనాగ-కి నకనిషి (జపాన్) చేతిలో పోరాడి ఓడిపోయింది. క్రిస్టో పొపోవ్-తోమా పొపోవ్ (ఫ్రాన్స్)లతో జరిగిన మ్యాచ్‌లో సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి తొలి గేమ్‌ను 21-12తో నెగ్గి రెండో గేమ్‌లో 11-7తో ఆధిక్యంలో ఉన్న దశలో పొపోవ్ బ్రదర్స్ గాయం కారణంగా వైదొలిగారు. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో ధ్రువ్ కపిల-ఎంఆర్ అర్జున్ (భారత్) ద్వయం 21-12, 6-21, 20-22తో ఎనిమిదో సీడ్ ఒన్ యె సిన్-తియో ఈ యి (మలేసియా) జోడీ చేతిలో ఓడిపోయింది.

రణ్‌ధావా రాజీనామా



న్యూఢిల్లీ: భారత అథ్లెటిక్స్ సమాఖ్య (ఏఎఫ్ఐ) సెలెక్షన్ కమిటీ చైర్మన్ పదవికి గుర్‌బచన్ సింగ్ రణ్‌ధావా రాజీనామా చేశారు. గత 18 ఏళ్లుగా ఆయన ఈ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వయసు భారం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు 84 ఏళ్ల రణ్‌ధావా వివరించారు. 1962 ఆసియా క్రీడల్లో డెకాథ్లాన్‌లో స్వర్ణ పతకం నెగ్గిన రణ్‌ధావా, 1964 టోక్యో ఒలింపిక్స్‌లో 110 మీటర్ల హర్డిల్స్‌లో ఐదో స్థానంలో నిలిచారు. 'వయసు పైబడటంతో వందశాతం నా బాధ్యతలు నిర్వహించలేకపోతున్నాను. అందుకే నా పదవికి రాజీనామా చేస్తున్నాను. భారత అథ్లెటిక్స్‌కు మంచి రోజులు వచ్చాయి. నీరజ్ చోప్రా రూపంలో మనకూ ఒక ఒలింపిక్ చాంపియన్ లభించాడు' అని రణ్‌ధావా పేర్కొన్నారు. 1964 టోక్యో ఒలింపిక్స్‌లో భారత బృందానికి పతాకధారిగా వ్యవహరించిన రణ్‌ధావాకు 1961లో 'అర్జున అవార్డు'... 2015లో 'పద్మశ్రీ' పురస్కారం లభించాయి.

శ్రేయాంక 3-1-2-5

- భారత స్పిన్నర్ మాయాజాలం
- 9 వికెట్లతో టీమిండియా విజయం
- ఆసియా మహిళల ఎమర్జింగ్ కప్ టోర్నీ



మోంగ్‌కాక్ (హాంకాంగ్): ఆసియా మహిళల ఎమర్జింగ్ కప్ అండర్-23 టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో భారత 'ఎ' జట్టు శుభారంభం చేసింది. శ్వేత సెహ్రావత్ కెప్టెన్సీలోని భారత జట్టు గ్రూప్ 'ఎ' తొలి లీగ్ మ్యాచ్‌లో తొమ్మిది వికెట్ల తేడాతో హాంకాంగ్‌పై ఘనవిజయం సాధించింది. టాస్ గెలిచిన భారత్ ఫీల్డింగ్ ఎంచుకోగా... తొలుత బ్యాటింగ్‌కు దిగిన హాంకాంగ్‌ను భారత ఆఫ్ స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ దెబ్బ తీసింది. శ్రేయాంక మాయాజాలానికి హాంకాంగ్ 14 ఓవర్లలో 34 పరుగులకే కుప్పకూలింది. బెంగళూరుకు చెందిన 20 ఏళ్ల శ్రేయాంక 3 ఓవర్లు వేసి 2 పరుగులు ఇచ్చి 5 వికెట్లు పడగొట్టింది. శ్రేయాంక వేసిన మూడు ఓవర్లలో ఒక మెయిడిన్ ఓవర్ కూడా ఉండటం విశేషం. హాంకాంగ్ జట్టులో ఓపెనర్ మరికో హిల్ (19 బంతుల్లో 14; 2 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. మిగత బ్యాటర్లెవరూ రెండంకెల స్కోరు దాటలేకపోయారు. నలుగురు బ్యాటర్లు ఖాతా తెరువలేదు. భారత స్పిన్నర్లలో మన్నత్ కశ్యప్ (2/2), పార్శవి చోప్రా (2/12) కూడా రాణించారు. అనంతరం భారత జట్టు 5.2 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 38 పరుగులు చేసి గెలిచింది. ఓపెనర్ శ్వేత సెహ్రావత్ (2) తక్కువ స్కోరుకే అవుటవ్వగా... హైదరాబాద్ అమ్మాయి గొంగడి త్రిష (13 బంతుల్లో 19 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్), ఉమా చెత్రీ (15 బంతుల్లో 16 నాటౌట్; 2 ఫోర్లు) మిగతా పనిని పూర్తి చేశారు. గురువారం జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో నేపాల్‌తో భారత్ ఆడుతుంది.

హారికకు ఆరో స్థానం



సెయింట్ లూయిస్ (అమెరికా): కెయిన్స్ కప్ అంతర్జాతీయ మహిళల చెస్ టోర్నమెంట్‌లో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఆరో స్థానంలో నిలిచింది. తొమ్మిది మంది అగ్రశ్రేణి క్రీడాకారిణుల మధ్య ఎనిమిది రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో హారిక మూడున్నర పాయింట్లు స్కోరు చేసింది. ఒకగేమ్‌లో నెగ్గిన హారిక, రెండు గేముల్లో ఓడిపోయి, మిగతా ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకుంది. బెలా ఖొటెనాష్‌విలి (జార్జియా)తో జరిగిన చివరి రౌండ్ గేమ్‌ను హారిక 35 ఎత్తుల్లో 'డ్రా'గా ముగించింది. అమెరికాకు చెందిన అనా జటోన్‌స్కీ ఆరు పాయింట్లతో చాంపియన్‌గా నిలిచింది. ఈ టోర్నీ పది మంది క్రీడాకారిణులతో మొదలైనా నాలుగో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్ కోనేరు హంపి అస్వస్థత కారణంగా వైదొలిగింది. దాంతో హంపితో జరిగిన నాలుగు రౌండ్ల ఫలితాలను నిర్వాహకులు రద్దు చేసి తొమ్మిది మందితో టోర్నీని కొనసాగించారు. అలెగ్జాండ్రా కొస్టెనిక్ (స్విట్జర్లాండ్; 5 పాయింట్లు) రన్నరప్‌గా నిలువగా... బెలా ఖొటెనాష్‌విలి మూడో స్థానంలో, ఇరీనా క్రష్ (అమెరికా) నాలుగో స్థానంలో, నానా జాగ్‌నిడ్జె (జార్జియా) ఐదో స్థానంలో నిలిచారు. విజేత అనా జటోన్‌స్కీకి 45 వేల డాలర్లు (రూ. 37 లక్షలు), ఆరో ర్యాంకర్ హారికకు 10 వేల డాలర్లు (రూ. 8 లక్షల 22 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

వచ్చే నెల 6న భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు

న్యూఢిల్లీ: భారత రెజ్లింగ్ సమాఖ్య ఎన్నికలు జూలై 6వ తేదీన నిర్వహిస్తారు. అదే రోజున ఎన్నికల ఫలితాలను ప్రకటిస్తారు. ఈ మేరకు భారత ఒలింపిక్ సంఘం నియమించిన ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ మహేశ్ మిట్టల్ కుమార్ మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈనెల 23 నుంచి 25 వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. 28న వాటిని పరిశీలిస్తారు. జూలై 2న ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు.

సినిమా

ముల్లోక వీరుడు


చిరంజీవి

చిరంజీవి హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'భోళా శంకర్' ఆగస్టులో విడుదల కానుంది. ఈ చిత్రం తర్వాత చిరంజీవి హీరోగా 'బింబిసార' ఫేమ్ వశిష్ఠ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుందని వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. త్వరలోనే ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందట. ఈ చిత్రానికి 'ముల్లోక వీరుడు' అనే టైటిల్‌ను పరిశీలిస్తున్నారని భోగట్టా. అంతే కాదు.. ఈ చిత్రంలో ఆరుగురు కథానాయికలు ఉంటారని, ఊహాత్మక స్వర్గం నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. ఈ విషయాలపై అధికారిక సమాచారం అందాల్సి ఉంది. మరోవైపు దర్శకుడు కల్యాణ్ కృష్ణ కథకు చిరంజీవి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారని, త్వరలోనే ఈ సినిమా సెట్స్‌పైకి వెళ్లనుందని టాక్.

నా ప్రపంచాన్ని అర్థం చేసుకున్నాడు

- తమన్నా


విజయ్ వర్మ

నటుడు విజయ్ వర్మ, హీరోయిన్ తమన్నా ప్రేమలో ఉన్నారంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. ఈ విషయం గురించి ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడారు. ''కో యాక్టర్‌తో కలిసి యాక్ట్ చేసినంత మాత్రాన అతనిపై ఆకర్షణ ఏర్పడుతుందంటే నేను నమ్మను. అలా అనుకుంటే నేను చాలామంది యాక్టర్స్‌తో కలిసి స్క్రీన్ షేర్ చేసుకున్నాను. ఏదైనా మనం వ్యక్తిగతంగా ఫీలవ్వాలి. మన మనసుకు అనిపించాలి. ఇక విజయ్ వర్మతో నా బాండింగ్ చాలా సహజంగా మొదలైంది. ఇలాంటి వ్యక్తి కోసమే నేను ఎదురుచూశాను. జీవితంలో చాలా సాధించిన నాలాంటి వారికి ప్రతిదానికీ చాలా కష్టపడాలనే ఫీలింగ్ ఉంటుంది. అలాగే ఒక వ్యక్తి కోసం భారతీయ స్త్రీలు తమ జీవితం మొత్తం మార్చుకోవాలనే ఒక ఆలోచన ఉంటుంది. జీవిత భాగస్వామిని పొందాలంటే అతను ఉన్న చోటుకి వెళ్లాలి.. లేదా అతన్ని అర్థం చేసుకుని అందుకు తగ్గట్టుగా మసులుకోవాలి. కానీ నేను నాదైన ప్రపంచాన్ని సృష్టించుకున్నాను. నేనేం చేయకుండానే ఆ ప్రపంచాన్ని అర్థం చేసుకున్న వ్యక్తి (విజయ్ వర్మను ఉద్దేశించి).. చాలా కేర్ తీసుకునే వ్యక్తి. అతను ఉన్న చోటు నాకు ఆనందంగా ఉంటుంది'' అని చెప్పుకొచ్చారు తమన్నా. దీంతో విజయ్ వర్మతో ప్రేమను తమన్నా పరోక్షంగా కన్ఫార్మ్ చేశారని నెటిజన్లు అంటున్నారు. ఇక తమన్నా నటించిన లేటెస్ట్ వెబ్ ఆంథాలజీ 'లస్ట్ స్టోరీస్ 2'లో విజయ్ వర్మ నటించారు. ఈ ఆంథాలజీ షూటింగ్ సమయంలోనే విజయ్, తమన్నా ప్రేమలో పడి ఉంటారనే ఊహాగానాలు ఉన్నాయి.


తమన్నా

మంగళవారం పూర్తి


పాయల్ రాజ్‌పుత్

'ఆర్‌ఎక్స్ 100' వంటి హిట్ మూవీ తర్వాత అజయ్ భూపతి దర్శకత్వంలో పాయల్ రాజ్‌పుత్ నటించిన చిత్రం 'మంగళవారం'. స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. ఈ సందర్భంగా అజయ్ భూపతి మాట్లాడుతూ- ''గ్రామీణ నేపథ్యంలో యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. ఈ సినిమాలో మొత్తం 30 పాత్రలు ఉండగా, ప్రతి పాత్రకు ప్రాముఖ్యం ఉంటుంది'' అన్నారు. స్వాతి రెడ్డి గునుపాటి మాట్లాడుతూ-''ఇప్పటివరకు రానటువంటి కొత్త జానర్ కథతో 'మంగళవారం'ఉంటుంది. ఈ సినిమా షూటింగ్ 99 రోజులు చేస్తే.. అందులో 51 రోజులు రాత్రి వేళల్లో చిత్రీకరణ చేశాం. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రూపొందిన ఈ చిత్రం విడుదల తేదీ, ఇతర వివరాలు త్వరలో వెల్లడిస్తాం'' అన్నారు.

మనుచరిత్ర పెద్ద హిట్ అవుతుంది

- హీరో విశ్వక్ సేన్


శివ కందుకూరి, మేఘా ఆకాష్, విశ్వక్ సేన్

''లవ్, యాక్షన్ నా ఫేవరెట్ జోనర్. 'మనుచరిత్ర' అదే జానర్‌లో రూపొందినట్లు ట్రైలర్ చూస్తే తెలుస్తోంది. మంచి నటీనటులు, సాంకేతిక నిపుణులు పని చేసిన ఈ సినిమా కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుంది'' అని హీరో విశ్వక్ సేన్ అన్నారు. శివ కందుకూరి హీరోగా, మేఘా ఆకాష్, ప్రియా వడ్లమాని, ప్రగతి శ్రీవాత్సవ్ కథానాయికలుగా నటించిన చిత్రం 'మనుచరిత్ర'. భరత్ పెదగాని దర్శకత్వంలో ఎన్. శ్రీనివాస రెడ్డి నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న శ్రీ విజయ ఫిల్మ్స్ ద్వారా విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్‌ని విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ- ''రాజ్ కందుకూరిగారికి శివ ఎంతో.. నేనూ అంతే. శివ సినిమా హిట్ అయితే నా సినిమా హిట్ అయినంత ఆనందపడతాను'' అన్నారు. ''మా సినిమా ఎవర్నీ నిరాశ పరచదు'' అన్నారు శివ కందుకూరి. ''మా సినిమాకి ప్రేక్షకుల ఆదరణ కావాలి'' అన్నారు భరత్. ''మనుచరిత్ర'ని థియేటర్‌లో చూసి మమ్మల్ని ప్రోత్సహించాలి'' అన్నారు మేఘా ఆకాష్. ''మీ అందరికీ ఈ సినిమా నచ్చుతుంది'' అన్నారు నిర్మాత రాజ్ కందుకూరి.

విజయ్‌కి జోడీగా..?


మృణాల్

'సీతారామం' సినిమాలో మంచి నటనను కనబరిచి తెలుగు ప్రేక్షకులకు బాగా దగ్గరయ్యారు బాలీవుడ్ హీరోయిన్ మృణాల్ ఠాకూర్. దీంతో ఈ బ్యూటీకి తెలుగులో వరుస అవకాశాలు లభిస్తున్నాయి. ప్రస్తుతం నాని హీరోగా నటిస్తున్న 'హాయ్ నాన్న' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రంలో హీరోయిన్‌గా చేస్తున్నారు మృణాల్. తాజాగా విజయ్ దేవరకొండతో మృణాల్ ఠాకూర్ జోడి కట్టనున్నట్లు ఫిల్మ్‌నగర్ టాక్. 'గీత గోవిందం' (2018) సినిమా తర్వాత హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హీరోయిన్ పాత్రకు మృణాల్ ఠాకూర్‌ను చిత్ర యూనిట్ సంప్రదించిందని టాక్.

పాన్ వరల్డ్ సినిమాలు నిర్మిస్తాం

- నిర్మాత టీజీ విశ్వప్రసాద్



''సినిమా అనేది ఓ ప్రయాణం. ఈ ప్రయాణంలో విజయాలు, అపజయాలు ఉంటాయి. అయితే అపజయాలు వచ్చినప్పుడు అవి పునరావృతం కాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో నేర్చుకుంటున్నాం'' అన్నారు నిర్మాత టీజీ విశ్వప్రసాద్. రామాయణం ఆధారంగా రూపొందిన తాజా పౌరాణిక చిత్రం 'ఆది పురుష్'. ఈ చిత్రంలో రాముడిగా ప్రభాస్, సీతగా కృతీ సనన్, లక్ష్మణుడిగా సన్నీ సింగ్, హనుమంతుడిగా దేవదత్తా, రావణుడిగా సైఫ్ అలీఖాన్ నటించారు. భూషణ్ కుమార్, క్రిషణ్‌కుమార్, ఓమ్ రౌత్, ప్రసాద్ సుతార్, రాజేష్ నాయర్, వంశీ, ప్రమోద్‌లు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 16న విడుదల కానుంది. కాగా తెలుగు సినిమా రిలీజ్ హక్కులను పీపుల్ మీడియా ఫ్యాక్టరీ అధినేత టీజీ విశ్వప్రసాద్ దక్కించుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన విలేకర్ల సమావేశంలో టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ- ''ఆదిపురుష్'ను తెలుగులో విడుదల చేయమని ప్రభాస్‌గారు చెప్పలేదు. అయితే ఈ అవకాశం గురించి ఆయనతో చర్చించిన తర్వాతే 'ఆదిపురుష్'ని తెలుగులో విడుదల చేస్తున్నాం. తెలుగు హక్కులను జీఎస్టీతో కలిపి రూ. 185 కోట్ల రూపాయలకు తీసుకున్నాం. టీ- సిరీస్ నిర్మాణ సంస్థ పాన్ ఇండియా సినిమాలను ప్రొడ్యూస్ చేస్తోంది. టీ సిరీస్ ప్రొడక్షన్‌లో ప్రభాస్ హీరోగా రానున్న మరో సినిమా 'స్పిరిట్'ని కూడా మేమే తెలుగులో విడుదల చేస్తాం. ఇక 'ఆదిపురుష్' సినిమా తెలుగు బుకింగ్స్ బుధవారం ఉదయం నుంచి ఓపెన్ అవుతాయి. ఓ సినిమా టికెట్ ధర పెంపుదల విషయం గురించి ప్రభుత్వాలతో చర్చించడం మాకిదే తొలిసారి. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు పాజిటివ్‌గానే స్పందించాయి. ఏపీ సీఎం జగన్‌గారు అప్రూవ్ చేశారు. 'ఆదిపురుష్' సినిమా టికెట్ ధరలను యాభై రూపాయలు పెంచుకునే అనుమతులు రెండు తెలుగురాష్ట్రాల్లో లభించాయి. అయితే ఇది సింగిల్ స్క్రీన్స్‌లో మాత్రమే. మా నిర్మాణ సంస్థలో త్వరితగతిన వంద సినిమాలను పూర్తి చేయాలన్నది మేం రీసెంట్‌గా సెట్ చేసుకున్న గోల్. మా బ్యానర్‌లో పాతిక చిత్రాలు రావడానికి ఐదేళ్లకు పైనే పట్టింది. కానీ మా 50వ సినిమా మైలురాయిని వచ్చే ఏడాదే చేరుకోబోతున్నాం. నాలుగైదు సినిమాల షూటింగ్స్ పూర్తయ్యాయి. పదిహేను సినిమాలు సెట్స్‌పై ఉన్నాయి. థియేటర్స్ బిజినెస్‌కు తోడు ఓటీటీ రైట్స్ బిజినెస్ కూడా ఉపయోగపడుతోంది. అందుకే మేం ఎక్కువ సినిమాలు చేయగలుగుతున్నాం. మా బ్యానర్‌లో వచ్చిన పాన్ ఇండియా మూవీ 'కార్తికేయ 2' తర్వాత మరిన్ని పాన్ ఇండియా ప్రాజెక్ట్స్ రాబోతున్నాయి. పాన్ వరల్డ్ స్థాయిలో సినిమాలను నిర్మించాలనేది మా లక్ష్యం. రాబోయే రెండు మూడేళ్లలో మేం హాలీవుడ్‌లో కూడా సినిమాలు నిర్మిస్తాం'' అని అన్నారు.

జూలైలో బేబీ


ఆనంద్ దేవరకొండ, వైష్ణవి

ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'బేబీ'. సాయి రాజేష్ దర్శకత్వంలో ఎస్‌కేఎన్ ఈ సినిమాను నిర్మించారు. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని జూలై రెండోవారంలో విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఓ వాస్తవ ఘటన ఆధారంగా రూపొందించిన ఈ చిత్రానికి సహనిర్మాత: ధీరజ్ మొగిలినేని, సంగీతం: విజయ్ బుల్గానిన్, కెమెరా: బాల్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: దాసరి వెంకట సతీష్.

బాలరాజు చిందులు


సోహైల్, రామ్‌గోపాల్ వర్మ

''తాగుదాం.. తాగి ఊగుదాం..' అంటూ చిందేస్తున్నారు సోహైల్. శ్రీ కోనేటి దర్శకత్వంలో సోహైల్ హీరోగా, మేఘా లేఖ హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'బూట్‌కట్ బాలరాజు'. గ్లోబల్ ఫిల్మ్స్- కథ వేరుంటది బ్యానర్స్‌పై ఎండీ పాషా నిర్మిస్తున్నారు. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన 'బూట్‌కట్ బాలరాజు'లోని 'తాగుదాం.. తాగి ఊగుదాం..' పాటని దర్శకుడు రామ్ గోపాల్ వర్మ విడుదల చేసి, అభినందనలు తెలిపారు. అఫ్రోజ్ అలీ సాహిత్యం అందించిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్, సాయి మాధవ్ పాడారు.

స్నేహం.. ప్రేమ


జెన్నీఫర్, సూర్య

సూర్య శ్రీనివాస్, శివ బొద్దురాజు, జెన్నీఫర్ ఇమ్మాన్యుయేల్ ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ఎవోల్' (ఎ లవ్‌స్టోరీ ఇన్ రివర్స్). స్వీయదర్శకత్వంలో రామ్ యోగి వెలగపూడి రూపొందించారు. ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దర్శక-నిర్మాత రామ్‌యోగి మాట్లాడుతూ- ''ఇద్దరు స్నేహితుల మధ్య అనుబంధం నేపథ్యంలో క్రైమ్ థ్రిల్లర్‌గా రూపొందించిన చిత్రం ఇది. త్వరలో ఫస్ట్ లుక్, టీజర్‌ను విడుదల చేస్తాం'' అని అన్నారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	418	63,177
నిఫ్టీ ▲	115	18,716

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (పొద్దు రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,576	▲	114
డోజోన్స్	34,259	▲	193
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,595	▲	24
డాక్స్	16,231	▲	133
షాంఘై	3,234	▼	5
నికాయ్	33,019	▲	585

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో) ముంబై		
బంగారం (99.9 స్వచ్ఛత)		
59,856	▼	65
బంగారం (99.5 స్వచ్ఛత)		
59616	▼	66
వెండి (కిలో)		
73,169	▼	263



ఫోర్బ్స్ భారీ కంపెనీల్లో రిలయన్స్

- గ్లోబల్ 2000 లిస్టులో 45వ ర్యాంకు
- 8 స్థానాలు అప్
- జాబితాలో 55 దేశీ సంస్థలు

న్యూఢిల్లీ: దేశీ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్ తాజాగా భారీ అంతర్జాతీయ సంస్థల జాబితాలో మరింత పై స్థానానికి చేరింది. 2023 సంవత్సరానికి గాను ఫోర్బ్స్ మ్యాగజైన్ రూపొందించిన గ్లోబల్ 2000 కంపెనీల లిస్టులో 8 స్థానాలు ఎగబాకి 45వ ర్యాంకు దక్కించుకుంది. జర్మనీకి చెందిన బీఎండబ్ల్యూ గ్రూప్, స్విట్జర్లాండ్ దిగ్గజం నెస్లే, చైనా సంస్థ ఆలీబాబా గ్రూప్ మొదలైన వాటిని కూడా అధిగమించింది. 109.43 బిలియన్ డాలర్ల ఆదాయం, 8.3 బిలియన్ డాలర్ల లాభాలు నమోదు చేయడంతో రిలయన్స్ ర్యాంకు మెరుగుపడింది. టాప్ 100 జాబితాలో రిలయన్స్‌తో పాటు ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) 77వ స్థానంలో నిల్చింది. 2000 కంపెనీల లిస్టులో మొత్తం మీద 55 భారతీయ సంస్థలు.. ర్యాంకులను దక్కించుకున్నాయి. హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో దెబ్బతిన్నప్పటికీ అదానీ గ్రూప్‌నకు చెందిన 3 సంస్థలు లిస్టులో నిల్చాయి. అదానీ ఎంటర్‌ప్రైజెస్ (1,062), అదానీ పవర్ (1,488), అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్స్ (1,598 ర్యాంకు) వీటిలో ఉన్నాయి. అమ్మకాలు, లాభాలు, అసెట్‌లు, మార్కెట్ విలువ అంశాల ప్రాతిపదికన ఫోర్బ్స్ ఈ ర్యాంకులు ఇచ్చింది.

జేపీమోర్గాన్ టాప్..


ఫోర్బ్స్ లిస్టులో 3.7 లక్షల కోట్ల డాలర్ల అసెట్స్‌తో జేపీమోర్గాన్ అగ్రస్థానం దక్కించుకుంది. సౌదీ చమురు సంస్థ ఆరామ్‌కో 2వ స్థానంలో, చైనాకు చెందిన మూడు భారీ ప్రభుత్వ రంగ బ్యాంకులు వరుసగా తర్వాత స్థానాల్లో ఉన్నాయి. గతేడాది టాప్ ర్యాంకులో ఉన్న బెర్క్‌షైర్ హాథ్‌వే ఈసారి 338వ స్థానానికి పడిపోయింది. పెట్టుబడుల పోర్ట్‌ఫోలియో నష్టాల్లో ఉండటమే ఇందుకు కారణం. ఈ ఏడాది మే 5 నాటికి అందుబాటులో ఉన్న గత 12 నెలల గణాంకాల ప్రకారం ఫోర్బ్స్ ఈ లిస్టును రూపొందించింది. జాబితాలోని కంపెనీల మొత్తం విక్రయాలు 50.8 లక్షల కోట్ల డాలర్లుగా, లాభాలు 4.4 లక్షల కోట్ల డాలర్లుగా, అసెట్స్ 231 లక్షల కోట్ల డాలర్లుగా ఉన్నాయి. 58 దేశాలకు చెందిన లిస్టెడ్ కంపెనీలకు చోటు దక్కింది. 611 కంపెనీలతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా 346 సంస్థలతో చైనా రెండో స్థానంలో ఉంది.

ఆరు నెలల గరిష్టానికి మార్కెట్

మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాలు... • ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూలతలు • 418 పాయింట్ల లాభంతో 63,177కు సెన్సెక్స్ • 115 పాయింట్లు పెరిగి 18,716 కు నిఫ్టీ

ముంబై: మెరుగైన స్థూల ఆర్థిక గణాంకాల నమోదుతో పాటు అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో దేశీయ మార్కెట్ ఆరు నెలల గరిష్టానికి చేరుకుంది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ షేర్లు ఒకటిన్నర శాతం రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. సెన్సెక్స్ 54 పాయింట్లు పెరిగి 62,779 వద్ద, నిఫ్టీ 30 లాభంతో 18,632 వద్ద మొదలయ్యాయి. సానుకూలంగా ట్రేడింగ్‌ను ప్రారంభించిన సూచీలు రోజంతా లాభాల్లోనే కదలాడాయి. మిడ్ సెషన్ తర్వాత కీలక రంగాల్లో కొనుగోళ్లు మరింత పెరిగాయి. ఫలితంగా ఒక దశలో సెన్సెక్స్ 425 పాయింట్లు పెరిగి 63,177 వద్ద, నిఫ్టీ 127 పాయింట్లు బలపడి 18,729 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఆఖరికి సెన్సెక్స్ 418 పాయింట్ల లాభంతో 63,177 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 115 పాయింట్లు పెరిగి 18,716 వద్ద నిలిచింది. ఇరు సూచీలకు ఈ ముగింపు ఆరునెలల కనిష్ఠ స్థాయి కావడం విశేషం. రియల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్, టెలీ కమ్యూనికేషన్, ఎఫ్ఎంసీజీ, హెల్త్‌కేర్, మెటల్, షేర్లకు డిమాండ్ లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.17%, 0.82 శాతం చొప్పున పెరిగాయి. ఆటో షేర్లు మాత్రమే నష్టాలను చవిచూశాయి. అంతర్జాతీయంగా బ్యారెల్ క్రూడాయిల్ ధర 3 డాలర్లు దిగిరావడంతో బర్గర్ పెయింట్స్, కన్సాయ్ నెరోలాక్, ఏషియన్ పెయింట్స్ షేర్లు 4-2% శాతం బలపడ్డాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,678 కోట్ల షేర్లను కొన్నారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ. 203 కోట్ల షేర్లను విక్రయించారు. డాలర్ మారకంలో రూపాయి ఐదు పైసలు బలపడి 82.38 స్థాయి వద్ద స్థిరపడింది. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లను యథాతథంగా కొనసాగించవచ్చనే ఆశలతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

> సెన్సెక్స్ అరశాతానికి పైగా లాభపడటంతో మంగళవారం ఒక్కరోజే ఇన్వెస్టర్లు రూ. 2.09 లక్షల కోట్లను ఆర్జించారు. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ. 290 లక్షల కోట్లకు చేరింది.



సెన్సెక్స్ జీవిత కాల గరిష్టం 63,583 స్థాయిని పరీక్షించే వీలుంది.
-దీపక్ జెసానీ, మార్కెట్ నిపుణులు

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
14-6-2023	
విశాఖ	515-00
చిత్తూరు	573-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480-00
విజయవాడ	480-00
రిటైల్ ధర (డజను)	72.00
13-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

ఎంఆర్‌ఎఫ్ @ రూ. 1 లక్ష

- ఆరు అంకెల ధర తాకిన తొలి దేశీ షేరు
- ఇంట్రాడేలో రూ. 1,00,300; రూ. 99,950 వద్ద క్లోజింగ్



దేశీ టైర్ల దిగ్గజం ఎంఆర్‌ఎఫ్ షేరు కొత్త రికార్డు సృష్టించింది. రూ. 1 లక్ష మార్కును అధిగమించిన తొలి షేరుగా ఘనత దక్కించుకుంది. మంగళవారం బీఎస్ఈలో 52 వారాల గరిష్టం రూ. 1,00,300 స్థాయిని తాకింది. చివరికి క్రితం ముగింపుతో పోలిస్తే 1.02% లాభంతో రూ. 99,950.65 వద్ద క్లోజయ్యింది. ఎన్ఎస్ఈలో ఇంట్రాడేలో రూ. 1,00,439.95ని తాకి చివరికి 0.94% లాభంతో రూ. 99,900 వద్ద ముగిసింది. స్టాక్ ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 12.89% పెరిగింది.

బెలూన్ల కంపెనీగా ప్రారంభం.. మరింత సమాచారం 'సాక్షి ప్లస్'లో...

బంగారం ఈటీఎఫ్‌ల జోరు

మే నాటికి రూ. 23 వేల కోట్ల పైకి పెట్టుబడులు



న్యూఢిల్లీ: అనిశ్చిత సమయాల్లో సురక్షిత పెట్టుబడి సాధనమైన గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్ (గోల్డ్ ఈటీఎఫ్) మే నెలలో నికర పెట్టుబడులను ఆకర్షించాయి. ఇన్వెస్టర్లు ఏప్రిల్ నెలలో రూ.124 కోట్లను బంగారం ఈటీఎఫ్‌లలో నికరంగా పెట్టుబడి పెట్టగా, మే నెలలో 20 శాతం తక్కువగా, రూ.103 కోట్లను ఇన్వెస్ట్ చేశారు. దీనితో బంగారం ఈటీఎఫ్‌ల నిర్వహణలో మొత్తం ఇన్వెస్టర్ల పెట్టుబడుల విలువ మే చివరికి రూ.23,128 కోట్లుగా ఉంది. ఏప్రిల్ చివరికి ఇది రూ.22,950 కోట్లు కావడం గమనార్హం. కాగా, అంతకుముందు నెల మార్చిలో (2023)లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి ఇన్వెస్టర్లు రూ.266 కోట్లను ఉపసంహరించుకున్నారు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫీ) ఈ గణాంకాలు విడుదల చేసింది. మే నెలలో బంగారం ఈటీఎఫ్‌ల్లోకి పెట్టుబడులు తగ్గడం అన్నది లాభాల స్వీకరణ వల్లేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సెంట్రల్ బ్యాంకులు తదుపరి వడ్డీ రేట్ల పెంపును నిలిపివేయడంతో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపించి ఉండవచ్చని భావిస్తున్నారు.

డైరెక్ట్ ప్లాన్ల విషయంలో ఇన్వెస్టర్లకు రక్షణ

- నూతన కార్యాచరణను ప్రకటించిన సెబీ



న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ డైరెక్ట్ ప్లాన్లలో పెట్టుబడులు పెట్టే ఇన్వెస్టర్ల ప్రయోజనాలను పరిరక్షించేందుకు సెబీ కీలక నిర్ణయం తీసుకుంది. డైరెక్ట్ ప్లాన్లలో పెట్టుబడులకు వీలు కల్పించే డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లకు నూతన నియంత్రణపరమైన కార్యాచరణను ప్రకటించింది. ఇది సెప్టెంబర్ 1 నుంచి అమల్లోకి వస్తుందని సెబీ ప్రకటించింది. మ్యూచువల్ ఫండ్స్‌లో రెగ్యులర్ ప్లాన్, డైరెక్ట్ ప్లాన్ అని రెండు రకాలు ఉంటాయి. డైరెక్ట్ ప్లాన్లలో మధ్యవర్తుల ప్రమేయం ఉండదు. దీంతో రెగ్యులర్ ప్లాన్లతో పోలిస్తే డైరెక్ట్ ప్లాన్లలో ఎక్స్‌పెన్స్ రేషియో తక్కువగా ఉంటుంది. దీనివల్ల రెగ్యులర్ ప్లాన్లతో పోలిస్తే, డైరెక్ట్ ప్లాన్లలో దీర్ఘకాలంలో అధిక రాబడులు పొందొచ్చు. ఫలితంగా డైరెక్ట్ ప్లాన్ల పట్ల ఇన్వెస్టర్లు ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో జెరోదా తదితర స్టాక్ బ్రోకర్లతోపాటు, పేటీఎం మనీ తదితర ఎన్నో డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు వీటిని ఇన్వెస్టర్లకు ఆఫర్ చేస్తున్నాయి. ఈ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఎవరైనా డైరెక్ట్ ప్లాన్లలో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఆయా సంస్థలకు క్లయింట్లు కానక్కర్లేదు. ఇలా తమ క్లయింట్లు కాని వారికి కూడా మ్యూచువల్ ఫండ్స్ పథకాల డైరెక్ట్ ప్లాన్లలో కొనుగోళ్లు, అమ్మకాల లావాదేవీలకు వీలు కల్పించే సంస్థలకు జవాబుదారీ ఉండాలని సెబీ భావించి ఈ దిశగా నిబంధనలను ప్రకటించింది. ఇప్పటి వరకు క్లయింట్లు కాని వారికి సేవల విషయంలో నియంత్రణ లేదు.

భవిత

టీఎస్‌పీఎస్సీ గ్రూప్-1 స్టడీమెటీరియల్, సిలబస్, ప్రీవియస్ పేపర్స్, మోడల్ పేపర్స్, గైడెన్స్, బిట్‌బ్యాంక్, కరెంట్ అఫైర్స్, ఆన్‌లైన్ టెస్టులు మొదలైన వాటి కోసం www.sakshieducation.com చూడొచ్చు.

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకులాల్లో 113 సబ్జెక్ట్ అసోసియేట్ పోస్టులు

తెలంగాణ సాంఘిక, గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాల (టీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)ల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంటర్మీడియట్‌తోపాటు ఐఐటీ-జేఈఈ(మెయిన్స్/అడ్వాన్స్‌డ్), నీట్ శిక్షణ ఇస్తున్న సీనియర్ ఫ్యాకల్టీకి సహాయంగా పార్ట్ టైం సబ్జెక్ట్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 113

» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** మ్యాథ్స్-22, ఫిజిక్స్-24, కెమిస్ట్రీ-21, బోటనీ-21, జువాలజీ-25.

» **అర్హత:** మొదటి శ్రేణిలో పీజీ, బీఈడీ. జేఈఈ మెయిన్స్/అడ్వాన్స్‌డ్, నీట్, ఎంసెట్ శిక్షణకు సంబంధించి బోధించడంలో అనుభవం ఉండాలి.

» **వేతనం:** నెలకు రూ.32,500 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, డెమో, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 15.06.2023. » **రాతపరీక్ష తేది:** 25.06.2023.

» **డెమో/ఇంటర్వ్యూ తేది:** 30.06.2023. »**వెబ్‌సైట్:** www.tswreis.ac.in

బీఈఎల్, బెంగళూరులో 205 ఇంజనీర్ పోస్టులు

బెంగళూరులోని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్(బీఈఎల్).. ఇంజనీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 205

» **పోస్టుల వివరాలు:** ట్రెయినీ ఇంజనీర్-191, ప్రాజెక్ట్ ఇంజనీర్-14.

» **విభాగాలు:** సమాచారం సాంకేతికత/సమాచారం సైన్స్/ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ -కమ్యూనికేషన్/ఎలక్ట్రానిక్స్-టెలికమ్యూనికేషన్/టెలికమ్యూనికేషన్/కమ్యూనికేషన్/మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్/ఇన్‌స్ట్రుమెంటేషన్ తదితరాలు.

అర్హత

» **ట్రెయినీ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంజనీరింగ్ బీఎస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.

» **వేతనం:** నెలకు రూ.40,000 చెల్లిస్తారు.

» **ప్రాజెక్ట్ ఇంజనీర్:** సంబంధిత స్పెషలైజేషన్‌ను అనుసరించి ఇంజనీరింగ్ బీఎస్సీ/బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** 32 ఏళ్లు మించకూడదు.

» **వేతనం:** నెలకు రూ.30,000 చెల్లిస్తారు.

» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 24.06.2023.

» **వెబ్‌సైట్:** www.bel-india.in

దక్షిణ మధ్య రైల్వే, సికింద్రాబాద్‌లో 35 జూనియర్ టెక్నికల్ అసోసియేట్ పోస్టులు

సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వే కాంట్రాక్ట్ ప్రాతిపదికన జూనియర్ టెక్నికల్ అసోసియేట్ (వర్క్స్/డ్రాయింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 35 » **విభాగాలు:** సివిల్ ఇంజనీరింగ్/ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ అండ్ సిగ్నల్ టెలికమ్యూనికేషన్.

» **అర్హత:** డిప్లొమా, బీఎస్సీ, ఇంజనీరింగ్‌లో డిగ్రీ(ఐటీ/సీఎస్/కంప్యూటర్ ఇంజనీరింగ్/సివిల్/మెకానికల్/ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్)ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 18 నుంచి 33 ఏళ్ల మధ్య ఉండాలి.

» **ఎంపిక విధానం:** విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, పర్సనాలిటీ టెస్ట్/ఇంటెలిజెన్స్ ఆధారంగా ఎంపికచేస్తారు.

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.

» **దరఖాస్తులకు చివరితేది:** 30.06.2023.

» **వెబ్‌సైట్:** scr.indianrailways.gov.in

ఐఐటీల్లో సీఎస్‌ఈ క్రేజ్

ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఐఐటీల్లో ప్రవేశాలకు ఈ ఏడాది జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షను 4వ తేదీన నిర్వహించారు. ఐఐటీ గువహటి ప్రొవిజనల్ కీని కూడా విడుదల చేసింది. 18వ తేదీన ఫలితాలు వెల్లడించే అవకాశముంది. ఈ నేపథ్యంలో.. జేఈఈ అడ్వాన్స్‌డ్-2023 పరీక్ష తీరుతెన్నులు, కటాఫ్ అంచనా, ఐఐటీల్లో అందుబాటులో ఉన్న కోర్సులు, బ్రాంచ్‌లు, ప్రవేశ విధానంపై ప్రత్యేక కథనం..

» కటాఫ్ 80గా ఉంటుందనే అంచనా
» 19 నుంచి ఐఐటీలు, నిట్‌ల్లో జోసా కౌన్సెలింగ్
» మొత్తం 49 బ్రాంచ్‌లు.. 16,598 సీట్లు

అడ్వాన్స్‌డ్ పరీక్ష రెండు పేపర్లుగా.. ఒక్కో పేపర్‌లో 51 ప్రశ్నలు అడిగారు. ప్రతి పేపర్‌లోనూ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీల నుంచి 17 చొప్పున ప్రశ్నలు వచ్చాయి. ఒక్కో పేపర్‌కు 180 మార్కులు లెక్కన రెండు పేపర్లను కలిపి మొత్తం 360 మార్కులకు పరీక్ష నిర్వహించారు.

క్లిష్టంగా మ్యాథమెటిక్స్

రెండు పేపర్లలోనూ మ్యాథమెటిక్స్ విభాగం ప్రశ్నలు క్లిష్టంగా ఉన్నాయని.. విద్యార్థులు, సబ్జెక్ట్ నిపుణులు పేర్కొంటున్నారు. ట్రిగ్నోమెట్రిక్ ఈక్వేషన్స్, హార్మోనిక్ ప్రోగ్రెషన్స్, వెక్టార్స్, ప్రాబబిలిటీ, ఎలిప్స్, మ్యాట్రిసెస్, ఫంక్షన్స్ నుంచి అడిగిన ప్రశ్నలు కొంత సులభంగా ఉన్నా.. 3-డి జామెట్రీ, కానిక్ సెక్షన్స్ విభాగం ప్రశ్నలు చాలా క్లిష్టంగా ఉన్నట్లు చెబుతున్నారు. పేపర్-2లో కో-ఆర్డినేట్ జామెట్రీ, కాలిక్యులస్‌ల నుంచి ఎక్కువ ప్రశ్నలు అడిగారని.. హైపర్ బోలా, పెర్ముటేషన్స్ అండ్ కాంబినేషన్స్, డెఫినిట్ ఇంటిగ్రేషన్ విభాగాల నుంచి డైరెక్ట్ కొశ్చన్స్ అడిగినా.. అవి సుదీర్ఘ సమాధానం ఇవ్వాల్సిన విధంగా ఉండటంతో విద్యార్థులు ఇబ్బంది పడినట్లు తెలుస్తోంది.

ఫిజిక్స్.. ఓ మోస్తరు క్లిష్టత

ఫిజిక్స్‌లో ప్రశ్నలు ఓ మోస్తరు క్లిష్టతతో ఉన్నట్లు విద్యార్థులు చెబుతున్నారు. కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు ఎక్కువగా కనిపించాయి. ఎలక్ట్రిసిటీ, రొటేషనల్ మోషన్, కైనమాటిక్స్, వర్క్ పవర్ అండ్ ఎనర్జీ, థర్మోడైనమిక్స్, సర్ఫేస్ టెన్షన్‌ల నుంచి అడిగిన ప్రశ్నలు రెండు, మూడు కాన్సెప్ట్‌ల కలయికతో.. సుదీర్ఘంగా ఉన్నట్లు నిపుణులు చెబుతున్నారు.

కెమిస్ట్రీ.. ఊరట

కెమిస్ట్రీలో ప్రశ్నలు కొంత సులభంగా ఉన్నట్లుగా పేర్కొంటున్నారు. ఫిజికల్ కెమిస్ట్రీ నుంచి మోల్ కాన్సెప్ట్,ఎలక్ట్రో కెమిస్ట్రీ, సర్ఫేస్ కెమిస్ట్రీ, థర్మో డైనమిక్స్, కెమికల్ కైనటిక్స్ విభాగాల్లో ప్రశ్నలు అడిగారు. ఆర్గానిక్ కెమిస్ట్రీలో కాన్సెప్ట్ బేస్డ్ ప్రశ్నలు, ఇనార్గానిక్ కెమిస్ట్రీలో రియాక్షన్ బేస్డ్ ప్రశ్నలు ఎదురయ్యాయి.

కటాఫ్ 80 మార్కులు

మొత్తం 360 మార్కులకు నిర్వహించిన అడ్వాన్స్‌డ్‌లో.. కటాఫ్ మార్కులు 80గా ఉంటాయని నిపుణుల అంచనా. ఈ మార్కులు 60కు పరిమితమైనా ఆశ్చర్యపోనక్కర్లేదని చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే పరీక్ష కొంత సులభంగా ఉండడంతో కటాఫ్ మార్కులు పెరిగే అవకాశముంది. గత ఏడాది జనరల్ కేటగిరీ కటాఫ్ 55 మార్కులు మాత్రమే.

ఐఐటీల్లో 16,598 సీట్లు

అడ్వాన్స్‌డ్ స్కోర్ ఆధారంగా 23 ఐఐటీల్లో మొత్తం 16,598 సీట్లలో ప్రవేశం లభిస్తుంది. వీటిలో విద్యార్థులు ఎంతో క్రేజీగా భావించే కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ వంటి ఎవర్ గ్రీన్ బ్రాంచ్‌లతో పాటు.. బయో సైన్సెస్ అండ్ బయో ఇంజనీరింగ్, బయోటెక్ అండ్ బయోకెమ్ ఇంజనీరింగ్, బయో ఇంజనీరింగ్ వంటి వైద్య అనుబంధ బ్రాంచ్‌లు ఉండడం విశేషం. వీటితో పాటు ఇటీవల మార్కెట్ ట్రెండ్, జాబ్ మార్కెట్ స్కిల్స్‌కు అనుగుణంగా.. డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఏఐ-ఎంఎల్ వంటి బ్రాంచ్‌లను ప్రవేశపెట్టారు. అంతేకాకుండా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్‌లోనూ డేటా సైన్స్ మేజర్‌గా కొత్త ప్రోగ్రామ్ అందుబాటులోకి వచ్చింది. అదే విధంగా అయిదేళ్ల డ్యూయల్ డిగ్రీ(బీటెక్+ఎంటెక్) ప్రోగ్రామ్‌లు కూడా ఉన్నాయి.

సీఎస్‌ఈకే తొలి ప్రాధాన్యం

గత కొన్నేళ్లుగా అడ్వాన్స్‌డ్ ర్యాంకర్ల తొలి ప్రాథమ్యంగా కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ నిలుస్తోంది. గత ఏడాది ఐఐటీ-ముంబైలో క్లోజింగ్ ర్యాంకు 62గా ఉండగా.. ఐఐటీ-ఢిల్లీలో 102గా, ఐఐటీ-చెన్నైలో 175గా, ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 303, ఐఐటీ-రూర్కీలో 413, ఐఐటీ-హైదరాబాద్‌లో 608గా నమోదయ్యాయి. మిగతా ఐఐటీల్లో ఓపెన్ కేటగిరీలో 2000లోపు ర్యాంకుతోనే సీఎస్‌ఈ సీట్లు భర్తీకావడం ఈ బ్రాంచ్‌కున్న క్రేజ్‌కు నిదర్శనంగా చెప్పొచ్చు.

ప్రాధాన్యం వీటికే

కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ తర్వాత ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్ ఇంజనీరింగ్‌లు విద్యార్థుల ప్రాథమ్యాలుగా నిలుస్తున్నాయి. గత ఏడాది ఆరు రౌండ్లలో నిర్వహించిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో.. విద్యార్థుల ఆప్షన్లను పరిశీలిస్తే ఈ నాలుగు బ్రాంచ్‌లే ముందంజలో నిలిచినట్లు స్పష్టమవుతోంది. వీటిలో ఓపెన్ కేటగిరీలో చివరి రౌండ్‌లో తొమ్మిది వేలలోపు క్లోజింగ్ ర్యాంకు నమోదైంది.

ఏఐ కోర్సులకూ క్రేజ్

- జాబ్ మార్కెట్ అవసరాలు, లేటెస్ట్ టెక్నాలజీని దృష్టిలో పెట్టుకుని పలు ఐఐటీలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా సైన్స్ అనుబంధ ప్రోగ్రామ్‌లను కూడా ప్రారంభించాయి. వీటిలోనూ క్లోజింగ్ ర్యాంకు గరిష్ఠంగా రెండు వేల లోపు నమోదవుతోంది.
- **డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్:** ఐఐటీ రూర్కీలో 822, గువహటిలో 951, భిలాయ్‌లో 5744గా ఓపెన్ కేటగిరీ క్లోజింగ్ ర్యాంకులు ఉన్నాయి.
- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్:** ఐఐటీ హైదరాబాద్‌లోనే ఉన్న ఈ ప్రోగ్రామ్‌లో క్లోజింగ్ ర్యాంకు 840గా నమోదైంది.
- **డేటా సైన్స్ అండ్ ఇంజనీరింగ్:** ఐఐటీ మండిలో 3974, పాలక్కాడ్‌లో 6502గా క్లోజింగ్ ర్యాంకులు ఉన్నాయి.
- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ డేటా సైన్స్:** జోథ్‌పూర్‌లో 3257గా, పాట్నాలో 3702గా క్లోజింగ్ ర్యాంకులు నిలిచాయి.

కెరీర్ అవకాశాలు

- సీఎస్‌ఈ బ్రాంచ్‌తో బీటెక్ పట్టా అందుకుంటే..జాబ్ గ్యారెంటీ అనే అభిప్రాయం నెలకొంది. ఐఐటీల క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్స్‌లో సీఎస్‌ఈ విద్యార్థులకు సగటున రూ.35 లక్షల వేతనం లభిస్తోంది.
- సీఎస్‌ఈ తర్వాత ఎలక్ట్రానిక్స్‌కు జాబ్ మార్కెట్లో అధిక డిమాండ్ కనిపిస్తోంది. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, 5జీ టెక్నాలజీస్ కారణంగా..ఈసీఈ, ఎలక్ట్రికల్ విద్యార్థులకు డిమాండ్ పెరుగుతోంది. వీరికి కూడా సగటున రూ.30 లక్షల వార్షిక వేతనం లభిస్తోంది. మెకానికల్, సివిల్ వంటి బ్రాంచ్‌ల వారికి కూడా ఐఐటీల్లో ఆకర్షణీయ వేతనంతో ఆఫర్స్ లభిస్తున్నాయి.

జోసా కౌన్సెలింగ్



ఇంజనీరింగ్ స్పెషల్

ఐఐటీల్లో సీట్ల కేటాయింపు కోసం జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ(జోసా) ఆధ్వర్యంలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ఛాయిస్ ఫిల్లింగ్‌లో ఇన్‌స్టిట్యూట్స్, ఇంజనీరింగ్ బ్రాంచ్‌ల ప్రాథమ్యాలను వరుస క్రమంలో పేర్కొనాలి. తదుపరి దశలో అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాలు, ఆయా ఇన్‌స్టిట్యూట్స్, బ్రాంచ్‌లలో అందుబాటులో ఉన్న సీట్ల ఆధారంగా ఆన్‌లైన్‌లోనే సీట్ అలాట్‌మెంట్ జరుగుతుంది. సీట్ అలాట్‌మెంట్ పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో నిర్దేశిత ఫీజు చెల్లించి.. సంబంధిత ఇన్‌స్టిట్యూట్‌లో సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరవడంతోపాటు జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాల్సి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ ఉత్తీర్ణులు ఐఐటీలు, నిట్‌లు తదితర ఇన్‌స్టిట్యూట్‌లను తమ ప్రాథమ్యాలుగా ఎంచుకోవచ్చు.

ఆరు రౌండ్లలో కౌన్సెలింగ్

- జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ నిర్వహించే ఆన్‌లైన్ కౌన్సెలింగ్ మొత్తం ఆరు రౌండ్లలో జరుగుతుంది. ఇప్పటి వరకు ఉన్న సమాచారం ప్రకారం- జోసా-2023 కౌన్సెలింగ్ ప్రక్రియ జూన్ 19న ప్రారంభం కానుంది. అభ్యర్థులు అయిదో రౌండ్ వరకు కౌన్సెలింగ్‌లో పాల్గొని స్లైడింగ్ ప్రక్రియకు హాజరవ్వచ్చు.
- **జూన్19:**జోసా వెబ్‌సైట్‌లో అభ్యర్థుల రిజిస్ట్రేషన్,ఛాయిస్ ఫిల్లింగ్ ప్రక్రియ ప్రారంభం.
- **జూన్ 25:** మాక్ సీట్ అలొకేషన్(సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-1 విడుదల. (జూన్ 24 రాత్రి 8గంటల వరకు అభ్యర్థులు పేర్కొన్న ప్రాథమ్యాల ఆధారంగా దీన్ని విడుదల చేస్తారు).
- **జూన్ 27:** మాక్ సీట్ అలొకేషన్(సీట్ల కేటాయింపు నమూనా జాబితా)-2 విడుదల. (జూన్ 26 సాయంత్రం అయిదు గంటల వరకు పేర్కొన్న ప్రాథ్యమాల ఆధారంగా వెల్లడించనున్నారు).
- **జూన్ 28:** ఛాయిస్ ఫిల్లింగ్, క్యాండిడేట్ రిజిస్ట్రేషన్ చివరి తేదీ.
- **జూన్ 29:** వివరాల పునస్సమీక్ష, పరిశీలన.
- **జూన్30:**మొదటి రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూన్ 30-జూలై 4:** మొదటి రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిపోర్టింగ్ చేయాలి. అదే విధంగా యాక్సెప్టెన్స్ ఫీజును చెల్లించాలి. నిర్దేశిత డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలి.
- **జూలై 6:** రెండో దశ సీట్ల కేటాయింపు.
- **జూలై 6-10:** రెండో రౌండ్‌లో సీట్లు పొందిన విద్యార్థులు ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ల అప్‌లోడ్.
- **జూలై 7-11:** రెండో రౌండ్‌లో పొందిన సీటు విషయంలో ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి విరమించుకునే అవకాశం.
- **జూలై 12:**మూడో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 12-14:** మూడో రౌండ్ సీట్ల కేటాయింపునకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 13-15:** మూడో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ ప్రక్రియ నుంచి ఉపసంహరణ.
- **జూలై 16:**నాలుగో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 16-19:** నాలుగో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు పేమెంట్, డాక్యుమెంట్ అప్‌లోడ్.
- **జూలై 18-20:** నాలుగో రౌండ్ తర్వాత సీటు ఉపసంహరణ లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 21:**అయిదో రౌండ్ సీట్ల కేటాయింపు.
- **జూలై 21-24:** అయిదో రౌండ్‌కు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, డాక్యుమెంట్ అప్‌లోడ్, ఫీజు పేమెంట్.
- **జూలై 21-25:** అయిదో రౌండ్ తర్వాత సీటు విత్‌డ్రా లేదా కౌన్సెలింగ్ నుంచి ఉపసంహరణ అవకాశం.
- **జూలై 26:** ఆరో రౌండ్(చివరి రౌండ్) సీట్ల కేటాయింపు.
- **జూలై 26-28:** ఆరో రౌండ్‌లో పొందిన సీటుకు సంబంధించి ఆన్‌లైన్ రిపోర్టింగ్, ఫీజు చెల్లింపు.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://josaa.nic.in

నీట్‌లో టాప్ లేపిన తెలుగు విద్యార్థులు

- ఆలిండియా టాపర్ ఏపీకి చెందిన బోరా వరుణ్ చక్రవర్తి
- తెలంగాణకు చెందిన రఘురామరెడ్డికి 15వ ర్యాంకు
- టాప్–50లో ఏడుగురు తెలుగువారే
- నీట్‌లో దేశవ్యాప్తంగా 11.45 లక్షల మంది అర్హులు

సాక్షి, హైదరాబాద్/సాక్షి, అమరావతి: దేశవ్యాప్తంగా వైద్య కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన 'నీట్' పరీక్షల్లో తెలుగు విద్యార్థులు టాప్ లేపారు. జాతీయ స్థాయిలో ఫస్ట్ ర్యాంకుతోపాటు టాప్–50లో ఏడు ర్యాంకులను ఏపీ, తెలంగాణ విద్యార్థులే కైవసం చేసుకున్నారు. ఏపీకి చెందిన బోరా వరుణ్ చక్రవర్తి 720 మార్కులకు 720 సాధించి ఆలిండియా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచాడు. తమిళనాడుకు చెందిన ప్రభంజన్ కూడా 720 మార్కులతో మొదటి ర్యాంకును పంచుకున్నాడు. ఇక తెలంగాణ నుంచి కంచాని జయంత్ రఘురామరెడ్డికి 15వ ర్యాంకు, ఏపీకి చెందిన వైఎల్ ప్రవర్ధన్‌రెడ్డి 25వ ర్యాంకు (ఈడబ్ల్యూఎస్ విభాగంలో దేశంలోనే తొలి స్థానం), వి.హర్షిల్ సాయి 35వ ర్యాంకు, కె.యశశ్రీ 40వ (ఎస్సీ విభాగంలో రెండో స్థానం), కల్వకుంట్ల ప్రణతిరెడ్డి 45వ ర్యాంకు, తెలంగాణకు చెందిన బోడెద్దుల జాగృతి 49వ ర్యాంకు (మహిళల కేటగిరీలో పదో స్థానం) సాధించారు. ఇక ఆలిండియా 119వ ర్యాంకు సాధించిన ఏపీ విద్యార్థి ఎం.జ్యోతిలాల్ చావన్ ఎస్టీ విభాగంలో దేశంలో టాప్ ర్యాంకు కొల్లగొట్టాడు. తెలంగాణకు చెందిన లక్ష్మీ రష్మిత గండికోట 52వ ర్యాంకు (మహిళల కేటగిరీలో 12వ ర్యాంకు) సాధించింది.

జాతీయ స్థాయిలో 56.21 శాతం అర్హత

నీట్ యూజీ–2023 ఫలితాలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) మంగళవారం రాత్రి విడుదల చేసింది. దేశవ్యాప్తంగా 20,38,596 మంది పరీక్ష రాయగా.. 11,45,976 మంది (56.21 శాతం) అర్హత సాధించారు. ఇందులో ఏపీ నుంచి 42,836, తెలంగాణ నుంచి 42,654 మంది ఉన్నారు. నీట్ ఫలితాల్లో తమిళనాడుకు చెందిన కౌస్తవ్ బౌరి 3వ, పంజాబ్‌కు చెందిన ప్రాంజల్ అగర్వాల్ 4వ, కర్ణాటకకు చెందిన ధ్రువ్ అద్వానీ 5వ ర్యాంకు సాధించారు. ఈసారి పేపర్ కఠినంగా ఉన్నా కటాఫ్ మార్కులు పెరిగాయని నిపుణులు చెప్తున్నారు. గతేడాది అన్ రిజర్వ్‌డ్, ఈడబ్ల్యూఎస్ కటాఫ్ మార్కులు 117 కాగా.. ఈసారి 137కు పెరిగాయి. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ పీహెచ్, ఎస్సీ పీహెచ్‌ల కటాఫ్ మార్కులు గతేడాది 93 కాగా.. ఈసారి 107కు పెరిగాయి.

వారంలో రాష్ట్రస్థాయి ర్యాంకులు

ఆలిండియా కోటాలోని 15 శాతం సీట్లతోపాటు కేంద్ర, డీమ్డ్ యూనివర్సిటీలు, ఈఎస్ఐసీ, ఏఎఫ్ఎంసీ, బీహెచ్‌యూ, ఏఎంయూ మెడికల్ కాలేజీల్లో సీట్లకు డైరెక్టర్ జనరల్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్(డీజీహెచ్ఎస్) కౌన్సెలింగ్ నిర్వహిస్తుందని ఎన్‌టీఏ స్పష్టం చేసింది. డీజీసీఏ సూచనల మేరకు అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. మిగతా 85శాతం సీట్లకు రాష్ట్రాల స్థాయిలో భర్తీ చేపడతారు. వారం రోజుల్లో నీట్ తెలంగాణ రాష్ట్ర స్థాయి ర్యాంకులను ప్రకటిస్తామని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రంలో ఈ ఏడాది కొత్తగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో కలిపి మొత్తంగా 8,340 ఎంబీబీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్టు తెలిపాయి.

మార్కులు అవే అయినా.. ర్యాంకులు తగ్గి..

తెలుగు విద్యార్థులకు టాప్ ర్యాంకర్లతో సమానంగా మార్కులు వచ్చినా, పలు అంశాలతో తక్కువ ర్యాంకులను కేటాయించారు. జాతీయస్థాయిలో నాలుగో ర్యాంకర్ మార్కులు 715కాగా.. 15వ ర్యాంకు సాధించిన రఘురామరెడ్డి మార్కులు కూడా 715 కావడం గమనార్హం. అలాగే జాతీయస్థాయి 27వ ర్యాంకర్ నుంచి 49వ ర్యాంకర్ జాగృతి వరకు అందరికీ 710 మార్కులే.

ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేస్తా..

మాది ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా తోటాడా గ్రామం. నాన్న, అమ్మ ఇద్దరూ టీచర్లే. జాతీయ స్థాయిలో టాపర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చదువుతా.

– బోర వరుణ్ చక్రవర్తి, 1వ ర్యాంకర్

అమ్మానాన్నల ప్రోత్సాహంతో..

ప్రతిష్టాత్మకమైన ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ చేయాలని అనుకుంటున్నాను. మాది అనంతపురం జిల్లా తాడిపత్రి. అమ్మానాన్న ఇద్దరూ వైద్యులే. ఇప్పుడు నేనూ వైద్యుడిని కాబోతుండటం సంతోషంగా ఉంది.

– రఘురామరెడ్డి, 15వ ర్యాంకర్

డాక్టర్ కావాలన్నది కోరిక



నేను డాక్టర్ కావాలని పదో తరగతిలో ఉన్నప్పుడే అనుకున్నాను. అదే లక్ష్యంతో కష్టపడ్డాను. మా నాన్న అమెరికాలో ఇంజనీర్. తల్లిదండ్రులు ఇచ్చిన స్వేచ్ఛ, ప్రోత్సాహంతోనే మంచి ర్యాంకు సాధించా.

– జాగృతి, 49వ ర్యాంకర్

పైకప్పు నిర్మాణం చేపట్టండి

రాంపురం హైస్కూల్ హెచ్‌ఎంకు డీఈఓ ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

మరిపెడ రూరల్: మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం రాంపురం హైస్కూల్ తరగతి గదుల పైకప్పు రేకులు లేచిపోయి మొండిగోడలు దర్శనమిస్తున్న పరిస్థితిపై 'సాక్షి' ప్రధాన సంచికలో మంగళవారం ఫొటో వార్త ప్రచురితమైంది. దీనిపై జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు స్పందించారు. హైస్కూల్ హెచ్‌ఎం జయపాల్‌రెడ్డి, సీఆర్‌పీ దోమల సత్యశ్రీనివాస్‌కు ఫోన్ చేసి గ్రామ పంచాయతీ సహకారంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలపై వేలాడుతున్న చెట్టుకొమ్మలను వెంటనే తొలగించి, గోడలపై రేకుల కప్పు నిర్మించి, విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఆదేశించారు.

నీట్ ఆలిండియా టాపర్ శ్రీ చైతన్య

సాక్షి, హైదరాబాద్: నీట్–2023 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థి ఆలిండియా టాపర్‌గా నిలిచాడు. బోరా వరుణ్ చక్రవర్తి 720కి 720 మార్కులతో ఓపెన్ కేటగిరీలో ఆలిండియా ఫస్ట్‌ర్యాంక్‌ను విద్యార్థి సాధించాడు. ఇంకా 715 మార్కులతో 9వ ర్యాంకు ఎస్.వరుణ్, 17వ ర్యాంకర్ కంచని రఘురామరెడ్డి 715 మార్కులతో సత్తా చాటినట్లు శ్రీ చైతన్య యాజమాన్యం ఒక ప్రకటనలో వెల్లడిచింది. ఓపెన్ కేటగిరీలో ఆలిండియా ఫస్ట్‌ర్యాంక్‌తో పాటు 1,1,1,2,3,3,5,7,9 ర్యాంకులను ఒక్క శ్రీచైతన్యనే సాధించిందని, ఎస్టీ కేటగిరీలో 3వ ర్యాంక్, ఎస్సీ కేటగిరీలో 7వ ర్యాంకులు హైదరాబాద్‌లోని నారాయణగూడ శ్రీ చైతన్య సొంతం చేసుకున్నట్లు పేర్కొంది.

నీట్ ఫలితాల్లో నారాయణ విజయ పరంపర

నీట్–2023 ఆలిండియా ఆల్ కేటగిరీలలో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. 4వ ర్యాంక్‌తో శశాంక్ సిన్హా సరికొత్త రికార్డు నమోదు చేసినట్లు నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు పి.శరణి నారాయణ, డా.పి.సింధూర నారాయణ ఒక ప్రకటనలో వెల్లడించారు. ఆలిండియా అన్ని కేటగిరీల్లో 4, 7, 8, 8, 11, 12, 12, 19, 20, 24, 27, 31, 35, 37, 38, 47, 51, 51, 52, 53, 55, 57, 62, 69, 79, 93 వంటి 100లోపు 27 ర్యాంకులు సాధించి రికార్డ్ సృష్టించి ఆలిండియా అగ్రగామిగా నిలిచిందని పేర్కొన్నారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు అధ్యాపక బృందానికి పి.శరణి అభినందనలు తెలిపారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.